ఈనాడు

విజయవాడ 3-8-2025 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 355

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 16+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అతికితే ఇలా... తలకట్టు భళా!



కాలుష్యం, ఒత్తిడితో పాటు జన్యుకారణాలతో పట్టుమని పాతికేళ్లకే నెత్తిపై జుట్టు పల్చబడుతోంది. అందాన్నే కాదు ఆత్మవిశ్వాసాన్నీ తగ్గించే బట్టతల సమస్యకు హెయిర్ ప్యాచ్‌లు వరంలా కనిపిస్తున్నాయి. వాటి ఎంపిక, వాడకం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే శిరో సౌందర్యం ఇనుమడించడం ఖాయమని అంటున్నారు నిపుణులు...

ఎలా కావాలంటే అలా!

- కొన్నేళ్ల క్రితం వరకు తల మొత్తం కవర్ చేసే విగ్గులుండేవి. వాటి నిర్వహణా కష్టంగా ఉండేది.
- కానీ ఎంత వరకు జుట్టు ఊడిపోతే... అంత వరకే హెయిర్ ప్యాచ్‌లు అంటించుకోవడం ఇప్పటి ట్రెండ్!
- సర్జికల్ పద్ధతుల్లో తలపై జుట్టు మొలిపించే ప్రక్రియల్లో సక్సెస్ రేట్ తక్కువగా ఉండటం, ఖర్చు కారణంగా ఎక్కువమంది హెయిర్ ప్యాచ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు.
- వీటిలో రెండు రకాలున్నాయి. క్లిప్‌లతో అమర్చుకునేవారు ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసేసుకుని, మళ్లీ పెట్టుకోవచ్చు. (మిగతా 2లో)

ఏఐపైనే ఆధారం... సృజనకు రాంరాం!

హోం వర్క్ అయినా..
స్కూల్ వర్క్ అయినా..
'హలో ఏఐ.. అన్నీ నువ్వే చెయ్'
అంటూ ఆదేశాలు! ప్రాజెక్ట్ అయినా..
ఎసైన్‌మెంట్స్ అయినా..
'చేసెయ్' అంటూ సందేశాలు..!
ఏఐని ఇలా వాడుతూ పోతే పిల్లల
ఆలోచనా శక్తి నిర్వీర్యం
అవుతుందని.. సృజనాత్మకత
దెబ్బతింటుందని
చెబుతున్నారు నిపుణులు.



పూర్తి కథనం లోపలి పేజీలో

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- నేను బతికున్నంత వరకు రైతులను నిలబెట్టే బాధ్యత నాదే
- సీఎం చంద్రబాబు భరోసా
- ప్రకాశం జిల్లా దర్శిలో 'అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్' ప్రారంభం



తూర్పువీరాయపాలెం వద్ద పొలంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో అచ్చెన్నాయుడు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మహిళా రైతులు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, గొట్టిపాటి లక్ష్మి తదితరులు

ఈనాడు, ఒంగోలు – న్యూస్‌టుడే, దర్శి, ముండ్లమూరు: 'పంటలు పండినా.. పండకున్నా.. తుపాన్లు వచ్చినా.. ప్రకృతి సహకరించకున్నా.. రైతు వ్యవసాయం మానడు. కరోనా సమయంలో కూడా నాగలి భుజాన వేసుకొని దేశానికి అన్నం పెట్టాలనే తపనతో ముందుకు కదిలాడు.. నేను బతికున్నంత వరకు అలాంటి అన్నదాతను నిలబెట్టే బాధ్యత మా ప్రభుత్వానిదే' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతే రాజు కావాలని, ఎన్ని కష్టాలున్నా.. ఎన్నికల ముందు వారికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో 'అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్' కార్యక్రమాన్ని శనివారం సీఎం ప్రారంభించారు. అన్నదాతా సుఖీభవకు సంబంధించి తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇస్తున్న రూ.3174,42,90,000 చెక్కు నమూనాను మహిళా రైతులు నాగలక్ష్మి, షేక్ మున్నాలకు సీఎం అందించారు. దర్శి నియోజకవర్గ రైతులకు సంబంధించిన రూ.29,06,55,000 నమూనా చెక్కును రైతులు సుబ్బరత్నమ్మ, తేళ్ల పేరయ్యలకు ఇచ్చారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో 46,85,838 మంది రైతులకు (మిగతా 2లో)

చేను గట్టే వేదిక.. నులక మంచమే ఆసనం

పచ్చటి పొలాల మధ్య రైతులతో మమేకం

ఆర్భాటాలకు భిన్నంగా కార్యక్రమం

2లో



జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు చేస్తున్న గడ్కరీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్. చిత్రంలో బీసీ జనార్దన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు

విజయవాడ-హైదరాబాద్ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

పూర్తయితే రెండు గంటల ప్రయాణమే..

ఏపీలో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం

విజన్ అంటే ఏంటో దేశానికి చెప్పింది చంద్రబాబే

మంగళగిరిలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

ఈనాడు, అమరావతి: విజయవాడ-హైదరాబాద్ మధ్య కొత్త గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మిస్తామని.. దీనికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రెండు గంటల్లోనే చేరుకోవచ్చని తెలిపారు. 'హైదరాబాద్-విజయవాడ మధ్య ఇప్పుడున్న రహదారిని ఆరు లేన్లకు విస్తరించే పనులు మొదలయ్యాయి. దీంతో ప్రస్తుతం ఉన్న ప్రయాణ సమయం ఐదు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గుతుంది' అని పేర్కొన్నారు. శనివారం మంగళగిరిలో ఆయన జాతీయ రహదారుల (మిగతా 3లో)

మద్యం డెన్‌లో నోట్ల కట్టలు

- ఆరేడు వరుసల్లో అంతెత్తున డబ్బు
- ముడుపులు లెక్కిస్తూ కనిపించిన వెంకటేశ్‌నాయుడు
- అట్టపెట్టెల్లో నింపి పంపిణీకి సిద్ధం చేస్తున్న వైనం
- వెలుగులోకి వచ్చిన సంచలన వీడియో
- సిట్‌కు చిక్కిన కీలక ఆధారాలు
- చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అత్యంత సన్నిహితుడు వెంకటేశ్



మద్యం ముడుపులు దాచిన ఓ డెన్‌లోని కొంత నగదును లెక్కిస్తున్న వెంకటేశ్ నాయుడు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో వైకాపా పెద్దల ప్రమేయానికి సంబంధించి అత్యంత కీలకమైన మరో ఆధారం బయటపడింది. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడైన సీహెచ్ వెంకటేశ్‌నాయుడు (ఏ34) ఓ డెన్‌లో రూ.కోట్ల నోట్ల కట్టల్ని లెక్కిస్తున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. వైకాపా అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడు, ఈ కేసులో నిందితుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డికి వెంకటేశ్‌నాయుడు ప్రధాన అనుచరుడు. మద్యం సొమ్మును తాను ఏనాడూ ముట్టనేలేదంటూ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మద్యం కుంభకోణం అనేదే జరగలేదని వైకాపా నాయకులు చెబుతున్న మాటలన్నీ బుకాయింపేనని (మిగతా 2లో)

ఆ రూ.11 కోట్లను వేరుగా ఉంచండి లోపలి పేజీలో

ఇదీ సంగతి!



ప్రజ్వల్‌కు యావజ్జీవ ఖైదు



అత్యాచారం కేసులో కోర్టు తీర్పు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ (34) జీవితాంతం కారాగారంలో ఉండాలని బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే శనివారం సాయంత్రం తీర్పు ఇచ్చారు. రూ.11.35 లక్షల జరిమానా విధించి, అందులో బాధితురాలికి రూ.11 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రజ్వల్‌పై నాలుగు అత్యాచారం కేసులు నమోదు కాగా, ఇది మొదటి కేసులో తీర్పు. ఆయన తాత మాజీ ప్రధాని, పినతండ్రి కేంద్రమంత్రి. తండ్రి ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ, తల్లి భవాని గతంలో కార్పొరేటర్. సోదరుడు సూరజ్ ఎమ్మెల్సీ. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాక ప్రజ్వల్ పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు తలపెట్టారు. ఈలోపే కేసు బయటపడి, జైలు పాలయ్యాడు.

రాజకీయ కుట్ర

ప్రజ్వల్‌ది చిన్నవయసని, రాజకీయ కుట్రకు బలయ్యాడని అతని తరఫు న్యాయవాది జి.అరుణ్ వాదనలు వినిపించారు. 'మెకానికల్ ఇంజినీరింగ్ చదివి, రాజకీయాలపై ఆసక్తితో ఎన్నికల్లో పోటీచేసి ఎంపీగా గెలిచారు. రెండోసారి పోటీచేసినప్పుడు ఓడించేందుకు ప్రత్యర్థులు కుట్ర పన్నారు. ప్రజ్వల్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, తప్పును సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించి తక్కువ శిక్షను (మిగతా 2లో)

మద్యం డెన్‌లో నోట్ల కట్టలు



2022 జనవరిలో తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో వెంకటేశ్ నాయుడిని ఆత్మీయంగా పలకరిస్తున్న జగన్. చిత్రంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఈ వీడియోతో మరోసారి తేటతెల్లమైంది. మద్యం కుంభకోణంలో ఒక్క ముడుపుల ద్వారానే రూ.3,500 కోట్లకు పైగా కొల్లగొట్టినట్లు సిట్ ఇప్పటికే ప్రాథమిక అభియోగపత్రంలో పేర్కొంది. ఇటీవల హైదరాబాద్ శివారులోని ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్ల నగదు డంప్ స్వాధీనం చేసుకుంది. తాజాగా బయటపడిన వీడియో పరిశీలిస్తే అప్పట్లో ఎంత పెద్ద ఎత్తున దోచుకున్నారో స్పష్టమవుతోంది. ఇటీవల కాలంలో అరెస్టైన నిందితుల సెల్‌ఫోన్లలోని డేటాను రిట్రైవ్ చేసిన సిట్ అధికారులు ఈ వీడియోలు స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి అనేక వీడియోలు సిట్‌కు లభ్యమైనట్లు తెలిసింది. నేరనిరూపణలో ఇవి తిరుగులేని ఆధారాలు.

ఆరేడు వరుసల్లో రూ.500 నోట్ల కట్టలు

ఓ గదిలో నల్లటి టీపాయ్‌పై నిలువుగా, అడ్డంగా ఆరేడు వరుసల్లో రూ.500, రూ.100 నోట్లు కట్టలు కట్టి ఉన్నాయి. వాటిని వెంకటేశ్‌నాయుడు లెక్కిస్తున్నారు. కొన్ని కట్టల్ని చూపిస్తూ.. ఇక్కడి వరకూ 4 అని చెబుతుంటారు. మరికొన్ని నోట్లకట్టల్ని చూపించి మొత్తం 5 అని వివరిస్తుంటారు. ఆయన అలా లెక్క చెబుతుంటే మరో వ్యక్తి ఆ నోట్ల కట్టల్ని అట్టపెట్టెల్లో నింపుతున్నారు. అక్కడున్న నోట్ల కట్టలు, వెంకటేశ్‌నాయుడు చెప్పిన మాటల్ని బట్టి చూస్తే.. ఆ మొత్తం రూ.5 కోట్లని అర్థమవుతోంది. ఈ డబ్బును అప్పట్లో ఎక్కడికి తరలించారు? ఎవరికి చేర్చారనేదానిపై సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ వీడియో 2021 నాటిదని సిట్ అధికారులు భావిస్తున్నారు.

హైదరాబాద్‌లోని నివాసాన్నే డెన్‌గా మార్చేసుకుని..

మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రాజ్ కెసిరెడ్డి బృందం ముడుపులు వసూలు చేసి వాటిని ఎప్పటికప్పుడు హైదరాబాద్, తాడేపల్లిల్లోని పలు డెన్‌లకు చేర్చి భద్రపరిచేది. అక్కడి నుంచి ఆ సొత్తును నాటి ప్రభుత్వ పెద్దలకు చేర్చేది. ఈ డెన్‌ల్లో దాచిన సొమ్మునే గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లోని క్రిషి వ్యాలీ అపార్ట్‌మెంట్‌లోని తన నివాసాన్నే ఓ డెన్‌గా మార్చేసిన వెంకటేశ్‌నాయుడు అందులోని సొత్తుకు క్యాష్ హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. అక్కడి నుంచే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బృందం ఈ సొమ్మును సేకరించి, ఏపీకి తీసుకొచ్చేది. ఇలా దాదాపు రూ.50-60 కోట్ల సొమ్మును ఏపీకి తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆ డెన్‌తో పాటు మరికొన్ని డెన్‌లకు సంబంధించి వీడియోలు తీసుకుని వెంకటేశ్‌నాయుడు తన సెల్‌ఫోన్‌లో పెట్టుకున్నారు. జూన్‌లో వెంకటేశ్‌ను అరెస్టు చేసిన సిట్ అధికారులు ఆయన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అందులోని డేటా రిట్రైవ్ చేయగా ఈ వీడియోలు వెలుగుచూసినట్లు సమాచారం.

చెవిరెడ్డితో కలిసి మాల్దీవులకు పారిపోతుండగా అరెస్ట్

హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం చేసుకునే వెంకటేశ్‌నాయుడు.. చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అత్యంత సన్నిహితుడు. బాల్య స్నేహితుడు. మద్యం ముడుపుల సొమ్మును డెన్‌లో భద్రపరచటం, ఆ సొత్తును గత ప్రభుత్వ పెద్దలకు చేరవేయటంలో చెవిరెడ్డి, వెంకటేశ్‌ల పాత్ర ఉన్నట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. తమ ప్రమేయంపై విచారణ జరుగుతోందని తెలిసిన వెంటనే వీరిద్దరూ శ్రీలంక మీదుగా మాల్దీవులు, మాలే దేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారు బెంగళూరు విమానాశ్రయంలో ఉండగా సిట్ అధికారులు గుర్తించి, జూన్ 18న అరెస్టు చేశారు.

మిథున్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీలతో తరచూ భేటీలు

■ ఈ కేసులో కీలక నిందితులైన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వి.విజయసాయిరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలతో వెంకటేశ్‌నాయుడు తరచూ భేటీ అయ్యేవారు. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డితో 2023 జూన్ 18, జులై 27, అక్టోబరు 1వ తేదీల్లో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రి సమీపంలో, జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి వద్ద, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీలతో 2023 ఆగస్టు 6న హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ వద్ద, విజయసాయిరెడ్డితో 2023 జూన్ 6న హైదరాబాద్‌లోని జర్నలిస్ట్ కాలనీలో పలుమార్లు వెంకటేశ్‌నాయుడు భేటీ అయినట్లు సిట్ ఇప్పటికే గుర్తించింది.

■ మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రాజ్ కెసిరెడ్డి (ఏ1), ఆయన అనుచరగణం ప్రతి నెలా రూ.50-60 కోట్లు ముడుపులు వసూలు చేసి.. ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలకు అందజేసేవారని, వారు ఈ సొత్తును అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చేర్చేవారని సిట్ అభియోగపత్రంలో వెల్లడించింది. అందులో భాగంగానే మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలు వెంకటేశ్‌నాయుడితో భేటీ అయ్యారని సిట్ అనుమానిస్తోంది. ఆ కోణంలో దర్యాప్తు చేస్తోంది.

అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనూ..

2022 జనవరి 15న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం సెట్ వేసి.. సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సెట్‌ను వెంకటేశ్‌నాయుడే దగ్గరుండి వేయించినట్లు సిట్ గుర్తించింది. అప్పట్లో ఈ వేడుకల్లో జగన్‌కు అత్యంత సన్నిహితులే పాల్గొన్నారు. అలాంటిచోట జగన్‌తో కరచాలనం చేస్తూ, వెంకటేశ్ ఆత్మీయంగా మెలిగారు. వారి పక్కనే చెవిరెడ్డి కూడా ఉన్నారు. దీన్ని బట్టి వీరి సంబంధాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

అతికితే ఇలా... తలకట్టు భళా!

(మొదటి పేజీ తరువాయి)

● గమ్, టేప్‌తో అతికించేవాటిలో ఒక వ్యక్తికి జుట్టుకు ఎంత వరకు ఉండో అంతే సైజులో ప్యాచ్‌ను అంటిస్తారు.

● హెయిర్ ప్యాచ్‌లో జుట్టు పొడవు 7 అంగుళాలు ఉంటుంది. దాన్ని కావాల్సినట్టు అమర్చుతారు.

● హెయిర్ ప్యాచ్‌ల నాణ్యత, రకం, నిర్వహణను బట్టి ఏడాదిన్నర వరకు మన్నుతాయి. తర్వాత వాటిని తీసేసి కొత్తవి వేసుకోవాలి.

రకరకాలు..!

హెయిర్ ప్యాచ్‌లను వాటిని అమర్చే విధానం, వాడే పదార్థాలను బట్టి కొన్ని రకాలుగా చెబుతారు.

మోనోఫిలమెంట్: ఈ ప్రాథమిక స్థాయి ప్యాచ్‌ల ధర తక్కువ... ఎక్కువకాలం మన్నుతాయి. కాకపోతే అన్ని రకాల హెయిర్‌స్టైల్స్‌కి నప్పవు. బరువూ ఎక్కువే.

లేస్: తేలికగా ఉండే ఇవి చాలా సహజంగా ఉంటాయి. వీటితో అన్ని రకాల హెయిర్ స్టైల్స్‌ను తీర్చిదిద్దవచ్చు. వీటి మన్నిక గరిష్ఠంగా ఏడెనిమిది నెలలే ఉంటుంది.


సిల్క్ హెయిర్: వీటినే మిరేక్ ప్యాచ్‌లంటారు. ఇవి సహజసిద్ధంగా ఉంటాయి. వీటి మన్నిక 8 నెలల నుంచి ఒకటిన్నర సంవత్సరాలు.

పాలీ హెయిర్ ప్యాచ్‌లు: వీటిని పలుచనైన సింగిల్ లేయర్ పాలియురేథిన్ మెటీరియల్‌తో తయారు చేస్తారు. తేలిగ్గా, సహజసిద్ధమైన స్కాల్ప్ కలర్‌లోనే ఉంటాయి. మన్నిక 3 నుంచి ఆరు నెలలు మాత్రమే.

ఆస్ట్రేలియన్ ప్యాచ్: నాణ్యమైన జుట్టు వాడతారు. బేస్ చాలా పలుచగా, చర్మంలో కలిసిపోయి నట్టుగా కనిపిస్తుంది. బరువూ తక్కువ.

మిరాజ్ ప్యాచ్‌లు: సెలబ్రిటీలు వాడతారు. జుట్టు చాలా మెత్తగా, సహజసిద్ధంగా కనిపిస్తుంది.

● వాడే జుట్టు, తయారీ విధానం, మన్నిక, సహజత్వం వంటివాటి ఆధారంగా ప్యాచ్‌ల ధరలు రూ.6 వేల నుంచి రూ.లక్షల వరకు ఉంటాయి.



నిర్వహణ తప్పనిసరి..!

● క్లిప్పింగ్ విధానంలో అమర్చుకునే హెయిర్‌ప్యాచ్‌లకు నిర్వహణ ఖర్చేమీ ఉండదు. ఎవరికి వాళ్లు సొంతంగా శుభ్రం చేసుకోవచ్చు.


● బాండింగ్ విధానంలో... గమ్‌తో హెయిర్‌ప్యాచ్‌లు అతికించుకున్నవారు 25-30 రోజులకు ఒకసారి నిర్వహణ కోసం సెలూన్‌కు వెళ్లాలి.

● అక్కడ హెయిర్ ప్యాచ్‌లను తీసేసి ప్రత్యేక రసాయనాలతో శుభ్రం చేస్తారు. అవసరమైతే రంగువేసి సహజసిద్ధంగా తీర్చిదిద్దుతారు.

● టేపింగ్ విధానంలో ప్యాచ్‌లు అమర్చుకున్నవారు ప్రతి నెలా సెలూన్‌కి వెళ్లాల్సిన అవసరం ఉండదు. వాళ్లు సొంతంగా ఎలా మెయిన్‌టెయిన్ చేసుకోవచ్చో శిక్షణ ఇస్తారు.

● రెండు, మూడు నెలలకు ఒకసారి వెళ్లి హెయిర్ ప్యాచ్‌కి కెమికల్ వాష్ చేయించుకుంటే మన్నిక పెరుగుతుంది.

● వీటి నిర్వహణకు ప్రతి నెలా రూ.500 నుంచి రూ.1,200 వరకు వసూలు చేస్తున్నారు.



సహజసిద్ధమైన జుట్టున్నట్టే...!

● హెయిర్‌ప్యాచ్‌లు అమర్చుకున్నవారు ద్విచక్రవాహనంపై 80 కి.మీ. వేగంతో వెళ్లినా ఊడిపోవు. వాటితోనే స్విమ్మింగ్, నడక, ఆటలాడటం చేయొచ్చు.

● బాండింగ్, టేపింగ్ విధానంలో హెయిర్‌ప్యాచ్‌లు అమర్చుకున్నవారు... సహజసిద్ధమైన జుట్టున్నవారిలానే వారానికి ఒకటి రెండుసార్లు తలస్నానం చేయొచ్చు.


● షాంపూతో తల రుద్దుకున్నాక, తప్పనిసరిగా కండిషనర్ అప్లై చేయాలి. మార్కెట్‌లో దొరికే షాంపూ, కండిషనర్లను వాడుకోవచ్చు. హెర్బల్ షాంపూలు వాడకూడదు.

● తలస్నానం చేశాక హెయిర్ డ్రయర్‌తో ఆరబెట్టుకోవాలి. ప్రత్యేకమైన దువ్వెన వాడాలి. అయితే వీటికి నూనె పెట్టకూడదు.

● హెయిర్‌ప్యాచ్‌ల వినియోగం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. విదేశాల్లో స్థిరపడ్డ తెలుగువారు కూడా తక్కువ ఖర్చులో దొరుకుతాయన్న ఉద్దేశంతో ఇక్కడి నిపుణుల్ని సంప్రదిస్తున్నారని విజయవాడకు చెందిన గౌతమ్స్ హెయిర్ బ్యూటీ సెలూన్ యజమాని రాజేశ్ తెలిపారు.

-ఈనాడు, అమరావతి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం



నిధుల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు



నాట్లు వేయడానికి వచ్చి సీఎం చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు

(మొదటి పేజీ తరువాయి)

తొలి విడత రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం ఇచ్చే రూ.2 వేలు సాయం అందిస్తున్నాం. వైకాపా ప్రభుత్వం బిందు సేద్యం రద్దు చేసింది. మేం రాగానే 1.17 లక్షల ఎకరాలకు అందించాం. కరవు జిల్లాలైన రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో బిందుసేద్యం పరికరాలకు 90 శాతం రాయితీ ఇస్తున్నాం. రైతు రథం కింద 23 వేల ట్రాక్టర్లు పంపిణీ చేశాం. సాగులో పురుగుల మందు పిచికారీకి 875 డ్రోన్లు కేటాయించాం. ఓర్వకల్లు డ్రోన్ సిటీలో వీటి వినియోగంపై నిరంతరం పరిశోధనలు జరుగుతాయి' అని చెప్పారు.

ప్రకృతి సేద్యం, సేంద్రియ సాగు మేలు

రైతులు ప్రకృతి సేద్యం, రసాయనాలు లేని బయో, సేంద్రియ సాగు వైపు మళ్లాల్సి ఉందని సీఎం సూచించారు. 'వరి పండిస్తే గిట్టుబాటు కావడం లేదు. పొగాకు పండిస్తే ఆరోగ్యానికి హానికరమని కొనడం లేదు. శనగలు పండిస్తే గిట్టుబాటు ధర దక్కట్లేదు. ఈ పరిస్థితుల్లో రాయలసీమలో ఉద్యాన పంటలు పండించాలి. కోస్తాలో ఆక్వా సాగు, మిగతా ప్రాంతాల్లో వాణిజ్య పంటల వైపు వెళ్లాలి. ట్రంప్ 25 శాతం సుంకాల విధింపు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ఏ ప్రాంతంలో ఏ పంట వేయాలి, ఎక్కడ ఎప్పుడు నీళ్లిస్తామో ప్రభుత్వం తరఫున మీకు ఎప్పటికప్పుడు చెబుతాం. అంతర్జాతీయంగా ఇబ్బందులు ఉంటే పంటను మేమే కొంటాం' అని చెప్పారు.

ఆక్వాకు ఏం వేయాలనేదానిపై కార్యాచరణ

అమెరికా 25 శాతం సుంకాల నేపథ్యంలో ఆక్వా రంగానికి ఏం చేయాలనే దానిపై రేపో, ఎల్లుండో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'రాష్ట్రంలో 20 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుకు రూ.273 కోట్లు ఖర్చుపెడుతున్నాం. ధాన్యం రైతులకు గత ప్రభుత్వం రూ.1,700 కోట్లు బకాయిలు పెడితే అవి తీర్చాం. గత ప్రభుత్వం గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోతే గాలికొదిలేసింది. మేం అధికారంలోకి వచ్చాక గేటు పెట్టి నీరు నిలిపాం. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం. వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేసి, వచ్చే సీజన్‌కు నీళ్లు అందిస్తాం. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో మొత్తం 1000 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించడంతో ప్రస్తుతం 750 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి' అని సీఎం పేర్కొన్నారు.

ఎన్ని కష్టాలున్నా సూపర్ సిక్స్ అమలు

గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసి వెళ్లిపోయిందని, ఎన్ని కష్టాలున్నా సూపర్ సిక్స్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. 1.10 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇచ్చామని, ఇందుకోసం ఏడాదికి అదనంగా రూ.520 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు.

మా వాళ్లను లేపేస్తానంటే చూస్తూ ఊరుకుంటానా..

'పొదిలిలో మహిళలపై వైకాపా నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఇష్టానుసారం మాట్లాడిన వ్యక్తి మనిషా, పశువా'.. అని చంద్రబాబు మండిపడ్డారు. 'సంస్కారం ఉంటే ఇటువంటివి ప్రోత్సహించరు. కానీ అటువంటి వ్యక్తిని జగన్ ఇంటికెళ్లి పరామర్శించారు. గుంటూరులో వాళ్ల పార్టీ కార్యకర్త కాన్వాయ్ కింద పడితే పొదల్లో పడేశారు. బంగారుపాళ్యంలో మామిడికాయలు రోడ్డుపై పోసి నానా హంగామా చేశారు. అవే దృశ్యాలు ఇప్పుడు నెల్లూరు పర్యటనలోనూ ప్రదర్శిస్తున్నారు. అతను మనిషేనా' అని జగన్‌ను దుయ్యబట్టారు. వైకాపా నాయకులు మా వారి ఇళ్లకు వచ్చి లేపేస్తామని అంటున్నారు.. మీరు లేపేస్తే చూస్తూ ఊరుకుంటామా.. ఇక్కడ ఉన్నది సీబీఎన్' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేను గట్టే వేదిక.. నులక మంచమే ఆసనం

ఈనాడు, ఒంగోలు: పరదాల అడ్డుగోడలు.. వందల మంది పోలీసులతో భద్రత.. పచ్చటి చెట్లు కొట్టేయడం.. రెండు రోజుల ముందు నుంచే దుకాణాలు మూసేయించడం.. స్కూళ్లకు సెలవులిచ్చేసి ఆ బస్సుల్లో జనాన్ని తరలించడం.. ఫ్లెక్సీల హంగామా.. ఇదంతా వైకాపా హయాంలో సీఎం జనంలోకి వస్తున్నారంటే కనిపించిన హడావుడి, హంగామా. నిప్పులు చెరుగుతున్న ఎండ.. అయినా ఏసీల్లేవు, కూలర్లూ లేవు. భారీ వేదికలు, షామియానాలు లేవు. బారికేడ్లు లేవు. కార్పెట్లు లేవు. భద్రత పేరుతో అడ్డుగోడలు అసలే లేవు. సజ్జ చేను గట్టే వేదిక.. నులక మంచమే ఆసనం.. గ్రామానికి చెందిన మహిళలు, రైతులే ముఖ్య అతిథులు.. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించిన తీరు ఇది!

అచ్చమైన పల్లెదనానికి ప్రతీకగా, రైతులకే పెద్దపీట వేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆద్యంతం మండుటెండలో కూర్చుని, అన్నదాతలతో మమేకమయ్యారు. గ్రామంలోని 478 మంది లబ్ధిదారులతోపాటు, చుట్టుపక్కల గ్రామాల రైతుల్ని, పాడి రైతుల్ని ఆహ్వానించారు. పచ్చటి పంట చేల మధ్యలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో పాటు హాజరైన రైతులు, ప్రజలకు కుర్చీలకు బదులు నులక మంచాలు వేశారు. తొలుత వారణాసిలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని డిజిటల్ తెరపై ప్రత్యక్షప్రసారం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు,



పథకం ప్రారంభించి మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన మహిళా రైతులు

రైతులతో పాటు నులక మంచాలపై కూర్చుని 50 నిమిషాలపాటు ఆ కార్యక్రమాన్ని తిలకించారు. కనీసం గొడుగు కూడా లేకుండా ఎండలో కూర్చునే ముఖ్యమంత్రి విన్నారు. అనంతరం చేను గట్టుపైకి చేరుకుని నులక మంచాలపై కూర్చుని లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన బియ్యం, కాయగూరలు, పళ్లు, కందిపప్పును రైతులు ముఖ్యమంత్రికి బహుమతిగా అందజేశారు. రైతుల్ని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. ఒకపక్క పొలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుండగా.. పక్కనున్న రహదారిపై ఆర్టీసీ బస్సులు, జనం రాకపోకలు ఎలాంటి ఆంక్షలు లేకుండా యథావిధిగా సాగాయి. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి చేయూతనివ్వాలి



అనూష: మాది ముండ్లమూరు మండలం శంకరాపురం. కూటమి ప్రభుత్వం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, మా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం కింద రూ.30 వేలు, మా మామకు పింఛను రూ.4వేలు, ప్రస్తుతం పీఎం కిసాన్- అన్నదాతా సుఖీభవ మొదటి విడత రూ.7 వేలు అందాయి. మూడెకరాల్లో బొప్పాయి సాగు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. ప్రకృతి వ్యవసాయానికి చేయూతనిస్తే ప్రతి ఒక్కరూ ఉపాధి పొందొచ్చు.

సీఎం: ఇన్ని పథకాలు అమలు చేస్తున్నా విధ్వంసం సృష్టించే నాయకుల మాటలు విని నన్ను మరచిపోతున్నారు. రైతుల గురించి ఆలోచించే ప్రభుత్వం మనది. అన్నీ శాశ్వతంగా రావాలంటే మళ్లీ మళ్లీ ఎన్డీయే, తెదేపా గెలవాలి.



అనిల్‌కుమార్: మాది దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామం. కోళ్ల పరిశ్రమ నిర్వహిస్తున్నా. బ్యాంకుల ద్వారా కోళ్ల పరిశ్రమకు రుణాలివ్వాలి. వీరాయపాలెం- ఉల్లగల్లు రోడ్డులో గత తెదేపా హయాంలో వంతెన నిర్మించగా, అనుసంధానంగా రహదారి వేయలేదు. దీంతో 10 కి.మీ. అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

సీఎం: రహదారి నిర్మాణం పూర్తి చేస్తాం. యువత ఖాళీగా ఉండకుండా గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లు, ఎంఎస్ఎంఈ ద్వారా కనీసం ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం.



అచ్చిరెడ్డి: మాది దర్శి మండలం బొట్లపాలెం గ్రామం. ఇటీవల పంట పెట్టుబడి పెరగడంతో పాటు సాగులో కూలీల కొరత అధికంగా ఉంది. దీన్ని అధిగమించే చర్యలు తీసుకోవాలి.

సీఎం: వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని రైతుకు చేరవయ్యేలా చేస్తున్నాం. ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు, డ్రోన్ ద్వారా వ్యవసాయ పనులు చేయడం ద్వారా సాగులో ఖర్చులు తగ్గించేందుకు సూచనలిస్తున్నాం.

ప్రజ్వల్‌కు యావజ్జీవ ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

విధించాలి' అని చేసుకున్న విన్నపాలను న్యాయమూర్తి తోసిపుచ్చారు. చట్టసభ ప్రతినిధిగా ఉన్నప్పుడే అత్యాచారాలకు పాల్పడ్డాడని, గరిష్ఠ శిక్ష విధించాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ఎన్.జగదీశ్, అశోక్‌నాయక్ వాదనలు వినిపించారు.

వరుస అత్యాచారాలు.. పలు సాక్ష్యాలు

మైసూరు జిల్లా కేఆర్ నగరకు చెందిన బాధితురాలు (47) ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఆమెపై ప్రజ్వల్ వరుస అత్యాచారాలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఆమెకు కొడుకు, కోడలు, మనవడు ఉన్నారు. ఈ కేసు విచారణకు ప్రభుత్వం సిట్‌ను నియమించింది. అధికారులు పలు ప్రాంతాల్లో 123 సాక్ష్యాలను, వేర్వేరు మహిళలపై చేసిన లైంగికదాడులకు సంబంధించి 2వేల పైచిలుకు వీడియోలను సేకరించారు. న్యాయస్థానంలో 2వేల పేజీల ఛార్జిషీటు దాఖలుచేశారు.

కేసు బయట పడగానే..

ప్రజ్వల్ రెండోసారి లోక్‌సభకు పోటీచేసినప్పుడు.. ఎన్నికలకు నెల ముందునుంచే అతని అశ్లీల వీడియోలున్న పెన్‌డ్రైవ్‌లను ప్రత్యర్థులు పంచిపెట్టారు. ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వగానే ఆయన జర్మనీకి పరారయ్యాడు. రెడ్‌కార్నర్ నోటీసు ఇవ్వడంతో 2024 మే 31న బెంగళూరుకు తిరిగి వచ్చిన ప్రజ్వల్‌ను విమానాశ్రయంలో అరెస్టుచేశారు. అప్పటి నుంచి గత 14 నెలలుగా పరప్పన అగ్రహార జైల్లోనే ప్రజ్వల్ ఉన్నాడు. బెయిల్ దరఖాస్తులను దిగువ న్యాయస్థానం నుంచి సుప్రీంకోర్టు వరకు తోసిపుచ్చాయి.

ఎందరో బాధితులు..

ఎంపీగా పనిచేసినప్పుడు సమస్యలతో వచ్చే యువతులు, గృహిణులతో ప్రజ్వల్ పరిచయం పెట్టుకుని, వారితో శారీరక సంబంధాన్ని కొనసాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు బయటకు రావడంతోనే అతనితో సంబంధాలు ఉన్న యువతులు, మహిళలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. శృంగార దృశ్యాలను సెల్‌ఫోన్లో రికార్డు చేసుకునేవాడు. వాటిని చూపించి బెదిరిస్తూ, మళ్లీ వాంఛను తీర్చుకునేవాడని సిట్ అధికారులు గుర్తించారు. ప్రజ్వల్ ఫోన్, పెన్‌డ్రైవ్‌లో 2,296 వీడియోలు, ఫొటోలను గుర్తించారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరిశీలించగా, నిజమైనవేనని తేలింది.

డ్రైవర్ రట్టు చేసిన గుట్టు

సభలు, సమావేశాలకు వెళ్లినప్పుడు తన ఐ ఫోన్‌ను డ్రైవరు కార్తిక్ చేతికే ఇచ్చేవాడు. అతడికీ ఐఫోన్ కొనిచ్చాడు. ప్రజ్వల్ ఫోన్ పిన్ తెలియడంతో వీడియోలు, ఫొటోలను తన ఫోన్‌కు ఐ డ్రాప్ ద్వారా కార్తిక్ బదిలీ చేసుకున్నాడు. కార్తిక్‌ను 2023 చివర్లో రేవణ్ణ కుటుంబం పనినుంచి తీసేసింది. తన పేరిట ఉన్న ఫాంహౌస్‌ను బదిలీ చేయాలంటూ తీవ్రంగా కొట్టారని, ఖాళీ కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని అతడు ఆరోపించాడు. తర్వాత దేవరాజేగౌడ అనే న్యాయవాదికి ఫిర్యాదు చేసి, పెన్‌డ్రైవ్ ఇచ్చాడు. అతను దానిలోని వీడియోలను బయటపెట్టడం, కాంగ్రెస్ నేతల చేతికి అందించడంతో ప్రజ్వల్ ఉచ్చులో చిక్కుకుపోయాడు.

ఆధునిక సాంకేతికతతో ప్రజ్వల్‌కు ఉచ్చు

● విచారణలో అనేక ప్రయోగాలు

ఈనాడు, బెంగళూరు: నేరాల్లో వీడియో సాక్ష్యాలు బయటపడిన తర్వాత నిందితులంతా చెప్పేది.. అది మార్ఫింగ్ వీడియో అని. ప్రజ్వల్ సైతం ఇదే చెప్పాడు. కానీ, పోలీసులు అత్యాధునిక సాంకేతికను వినియోగించడంతో ఇక నోరు మెదపలేకపోయాడు. అత్యాచారం చేసినప్పుడల్లా వీడియో తీయడమనే అలవాటు అతడి మెడకు ఉచ్చులా బిగుసుకుంది. ఈ కేసులో పోలీసులు విదేశీ సాంకేతికతను ఉపయోగించారు.

పట్టించిన పుట్టుమచ్చలు.. లైంగికదాడి చేసినప్పుడల్లా ప్రజ్వల్ కుడిచేత్తో వీడియో తీసేవాడు. ఆ సమయంలో వీడియోలో ఎడమచేయి కనిపించేది. ఆ చేతిపై ఉన్న మచ్చలు, గాట్లు విచారణలో కీలక సాక్ష్యాలుగా మారాయి. వాటిని సరిపోల్చేందుకు సిట్ అధికారులు జపాన్, టర్కీకి చెందిన విచారణ విధానాలు పాటించి, చర్మశాస్త్ర నిపుణుల సాయం తీసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన అతిథిగృహం గదిలో గతంలో ఉన్న కొన్ని చిత్రపటాలను తర్వాత తొలగించగా ఆ గోడలపై ఉన్న ఫొటో మరకలను సరిపోల్చారు. అత్యాచార సమయంలో ప్రజ్వల్, బాధిత మహిళ స్వరాలను జపాన్ ఫోరెన్సిక్‌ల్యాబ్‌లో నిగ్గుతేల్చారు. వీడియోలో కనిపించిన వ్యక్తి శరీర ఆకారాలను ఖరారుచేసేందుకు ఎముకల శాస్త్ర నిపుణులను సంప్రదించారు. ఇలా ఒక కేసులో ఇన్ని రకాల విచారణ విధానాలను అమలు చేయడం ఇదే తొలిసారి. వీటితో ప్రజ్వల్‌ను నేరస్థుడిగా తేల్చారు.

గ్రహం అనుగ్రహం

3-8-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం

నవమి: ఉ. 7-52 తదుపరి దశమి

విశాఖ: ఉ. 6-00 తదుపరి అనూరాధ

వర్జ్యం: ఉ. 10-26 నుంచి 12-12 వరకు

అమృత ఘడియలు: రా. 9-02 నుంచి 10-48 వరకు

దుర్ముహూర్తం: సా. 4-46 నుంచి 5-37 వరకు

రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు


సూర్యోదయం: ఉ.5.42; సూర్యాస్తమయం: సా.6.29

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	42.0	26.5
నెల్లూరు	38.7	29.5
ఒంగోలు	38.1	28.5
గుంటూరు	37.0	28.0
విశాఖపట్నం	37.0	27.0
విజయవాడ	36.8	27.4
నరసాపురం	36.5	26.9
తిరుపతి	36.2	27.5
విజయనగరం	36.0	26.0
తాడేపల్లిగూడెం	35.9	27.8
కడప	35.0	26.0
కర్నూలు	34.5	25.5
అనంతపురం	34.2	24.5
శ్రీకాకుళం	34.0	28.0

చాలా ఉత్పత్తుల్లో అమెరికా పోటీదారు కాదు

- వస్తువులు, సేవలు మనం ఎగుమతి చేసే వాటి కన్నా తక్కువ ధరకు అక్కడ దొరకవు
- ట్రంప్ సుంకాలతో ఆ దేశ ప్రజలపైనే భారం!
- క్రిస్మస్ నాటికి తేలిపోతుంది..
- యూఎస్ మార్కెట్‌ను పూర్తిగా విస్మరించలేం


'ఈనాడు' ఇంటర్వ్యూలో ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

ఈనాడు, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వివిధ దేశాలకు చెందిన వస్తువుల మీద విధిస్తున్న సుంకాల వల్ల అమెరికా ప్రజల మీదే భారం పడుతుందని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. సుంకాల ప్రభావం కనపడటానికి మరో మూడు నాలుగు నెలలు పడుతుందని అన్నారు. మనదేశంతో అమెరికాకు వర్తక లోటు ఉండటం, రష్యాతో మైత్రి, అమెరికా వస్తువులపై మనదేశం అధిక పన్నులు విధించటం తదితర అంశాలు ట్రంప్ మనదేశం పట్ల కఠినంగా వ్యవహరించటానికి కారణమవుతున్నాయని వివరించారు. అమెరికాను పూర్తిగా పక్కన పెట్టడం కూడా మన దేశానికి సాధ్యం కాదని, భారత్‌కు సేవల రంగంలో అమెరికా అతిపెద్ద వినియోగదారుగా ఉన్న విషయాన్ని విస్మరించలేమని అన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో ఓపికగా, తెలివిగా ముందుకు వెళ్లాల్సి ఉందని వివరించారు. ట్రంప్ విధిస్తున్న సుంకాలు, మనదేశంపై ప్రభావం తదితర అంశాలపై దువ్వూరి సుబ్బారావు 'ఈనాడు' ఇంటర్వ్యూలో మాట్లాడారు. వివరాలిలా ఉన్నాయి...

? సుంకాల యుద్ధంలో డోనాల్డ్ ట్రంప్ గెలుస్తున్నట్లేనా..

జవాబు: ట్రంప్ సుంకాలు పెంచారు సరే. ఈ సుంకాల భారాన్ని ఎవరు భరించాలి? సుంకాల మూలంగా ఎగుమతిదారులు ఆ మేరకు తమ వస్తువుల ధరలు తగ్గిస్తారా? ఎప్పుడు ధర తగ్గిస్తారంటే అమెరికా మార్కెట్‌లో పోటీ ఉంటేనే. మనదేశం నుంచి యూఎస్‌కు ఎగుమతి చేసే ఒక చొక్కా ధర పది డాలర్లు అనుకోండి. సుంకాలు పెంచడం వల్ల 12 డాలర్లు అయిందనుకుందాం. అమెరికాలో ఎవరైనా 11 డాలర్లకు ఆ వస్తువును ఉత్పత్తి చేసి అందిస్తే, మనం 12 డాలర్లకు అమ్మలేం. కాబట్టి మనం ధరను తగ్గించాలి. ఇది జరిగితే మనకు నష్టం వాటిల్లుతుంది. అమెరికా 13 డాలర్లకు ఉత్పత్తి చేస్తుంటే సుంకాలు పెంచిన తర్వాత కూడా మనం మన వస్తువులను అమ్ముకోగలం. ఆ పరిస్థితుల్లో సుంకాల కారణంగా పెరిగిన ధరను యూఎస్‌లో వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. అదే జరిగితే మనకేం నష్టం జరగదు. అమెరికాలోని వినియోగదారులే భారం మోయాల్సి ఉంటుంది.

? పూర్తిగా ఇలాగే జరుగుతుందా..

జ: పూర్తిగా ఇలాగే జరుగుతుందా లేదా అనే విషయం తేలాల్సి ఉంది. నా అభిప్రాయం ప్రకారం అమెరికా చాలా ఉత్పత్తుల్లో పోటీదారు కాదు. వాళ్లు ఉత్పత్తి చేయడం లేదు. వస్తువులు, సేవలు మనం ఎగుమతి చేసే దాని కన్నా తక్కువకు అక్కడ దొరకవు. కాబట్టి ట్రంప్ విధించే సుంకం, పెనాల్టీల భారం అమెరికా వినియోగదారులపైనే పడుతుంది. అమెరికాలో క్రిస్మస్ కొనుగోళ్లు నవంబరు, డిసెంబరులలో జరుగుతాయి. ఆ సమయంలో సుంకాల ప్రభావం స్పష్టంగా తెలుస్తుంది.

? అమెరికా మనతో వర్తక ఒప్పందం కుదుర్చుకోకుండా విస్మరించే అవకాశం ఉందా

జ: రెండు నెలల వ్యవధిలో ఎన్నో దేశాలు ఇప్పటికే అమెరికాతో వర్తక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మన దేశంతోనూ ఒప్పందం కుదురుతుందని అనుకున్నారు. ఇంకా ఈ వ్యవహారం కొలిక్కిరాలేదు. అది కూడా ట్రంప్‌నకు కంటగింపుగా ఉన్నట్లు కనిపిస్తోంది. వ్యవసాయ రంగానికి సంబంధించి అమెరికా విధిస్తున్న నిబంధనలు మనదేశానికి ఇబ్బందికరంగా ఉండటంతో వాటిని అంగీకరించే పరిస్థితి లేదు. మనదేశానికి ఉన్న పరిమితులు ట్రంప్‌నకు తెలుసు. అందుకే ఆయన తీవ్రమైన ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఐటీ, ఇతర రకాలైన సేవల పరంగా అమెరికా మనదేశానికి అతిపెద్ద మార్కెట్. సేవలపై పన్ను వేస్తానని ట్రంప్ అంటే, మనదేశానికి ఎంతో ఎక్కువ నష్టం జరుగుతుంది. వస్తువులపై పన్నుల కంటే సేవలపై పన్నులు మనకు అనుకోని నష్టం తెచ్చిపెడతాయి. మరోపక్క టెక్నాలజీ, సెక్యూరిటీ, ఇతర అంశాల పరంగా మనం అమెరికాపై ఎక్కువగానే ఆధారపడి ఉన్నాం. అందువల్ల పూర్తిగా అమెరికాను విస్మరించి ముందుకు సాగటం అనేది మన దేశానికి సాధ్యం కాదు. అలాగని అమెరికా నిబంధనలకు లొంగిపోవాలని నేను అనటం లేదు. ఏదోవిధమైన అవగాహన కుదుర్చుకోవటమే మనకు మేలు.

? మనదేశంపై ఒంటికాలుపై లేస్తున్న ట్రంప్, చైనాను పల్లెత్తు మాట అనడం లేదు ఎందుకని..

జ: ఇతర దేశాలతో పోల్చితే అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒప్పందానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. చైనా వాణిజ్య పరంగా పెద్ద భాగస్వామే కాదు, అమెరికాకు భౌగోళిక- రాజకీయ ప్రత్యర్థి కూడా. చైనా వస్తువులను అమెరికా కొనుగోలు చేయకపోతే చైనా... అమెరికాకు సాంకేతికత తయారీని నిలిపివేసే అవకాశం ఉంది. కృత్రిమ మేధ (ఏఐ), మిలిటరీ రంగాల్లో ఈ సాంకేతికతను అమెరికా వినియోగించుకుంటోంది. చైనాతో అమెరికా చేసుకొనే వాణిజ్య ఒప్పందాన్ని భారతదేశం, వియత్నాం, కొరియా, జపాన్ తదితర దేశాల కంటే భిన్నంగా చూడాల్సి ఉంటుంది. చైనాకు ట్రంప్ ఎక్కువ రాయితీలు ఇచ్చే అవకాశం ఉంది. ఇతర దేశాల గురించి మాట్లాడినంతగా ఆయన చైనా విషయంలో మాట్లాడటం లేదు. సుంకాలు మొదట 140 శాతమని ఇప్పుడు 30 శాతానికి దిగొచ్చారు.

? అమెరికాతో ఒప్పందం కుదరని పక్షంలో మన ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడుతుందా

జ: రెండు దేశాల మధ్య దాదాపు 80 బిలియన్ డాలర్ల వాణిజ్యం నమోదవుతోంది. ఇది మన జీడీపీలో 2 శాతం. ఒకవేళ అమెరికాతో వర్తకం దెబ్బ తింటే మన వార్షిక వృద్ధి రేటు 0.2 శాతం తగ్గుతుందని అంచనా. ఇప్పుడు 6.4 శాతం వృద్ధి రేటు అంచనా కాగా.. అది 6.2 శాతానికి తగ్గిపోవచ్చు.

? వృద్ధి రేటు, జీడీపీలే కాకుండా మరిన్ని కోణాలను ఎలా విశ్లేషిస్తారు

జ: నిజమే. ఈ అంశాన్ని కేవలం వృద్ధి రేటు, జీడీపీ కోణంలోనే చూడలేం. ఎన్నో అంశాల పరంగా అమెరికా మన దేశానికి ఎంతో ముఖ్యం. టెక్నాలజీ, డిఫెన్స్, సెక్యూరిటీ అంశాల పరంగా మనదేశం అమెరికాతో కలిసి ముందుకు సాగాల్సిందే. దీనికి అదనంగా యూఎస్ సేవల మార్కెట్ ఉండనే ఉంది. అందువల్ల రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరే వరకూ దీనిపై సంప్రదింపులు కొనసాగించాలి. ఈ నెలలో యూఎస్ నుంచి వర్తక బృందం వస్తోందని అంటున్నారు. ఆ సమయంలో ఏదైనా అంగీకారం కుదురుతుందేమో చూడాలి.



మీకు గౌరవం దక్కాలంటే..

గౌరవం అనేది ఒకరిచ్చేది కాదు.. మనకు మనం సాధించుకోవాలి. అందుకు ఏం చేయాలో తెలుసా..?

- ఇచ్చిన మాట తప్పకండి
- తక్కువ మాట్లాడుతూ, ఎక్కువ పని చేయండి
- మీ తప్పులను నిర్మొహమాటంగా అంగీకరించండి
- మీకంటూ సరిహద్దులు నిర్దేశించుకోండి

– బ్రాడ్ లీ, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఏడాదిలో వెయ్యి కి.మీ. జాతీయ రహదారులు నిర్మిస్తాం

- రాబోయే రోజుల్లో 20 పోర్టులు, 9 విమానాశ్రయాల అభివృద్ధి
- జాతీయ రహదారుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఈ ఏడాది రూ.15వేల కోట్లతో వెయ్యి కిలోమీటర్ల జాతీయ రహదారులు వేయనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరిలో శనివారం జరిగిన జాతీయ రహదారుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "సంపద సృష్టికి మార్గాలు రహదారులే. గత ఐదేళ్లలో రోడ్లు వేయని సమస్యపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.70వేల కోట్ల విలువైన ఎన్‌హెచ్ పనులు జరుగుతున్నాయి. ఒక్క ఏడాదిలో సుమారు రూ.11వేల కోట్లతో 760 కిలోమీటర్ల రోడ్లను పూర్తి చేశాం. రహదారుల భూసేకరణకు ఎలాంటి సమస్య ఉండదని గడ్కరీకి ఏపీ తరఫున హామీ ఇస్తున్నా" అని పేర్కొన్నారు.

"గతంలో ఇద్దరం కలిసి ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్‌లలో భాగంగా ప్రకాశం బ్యారేజీ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రణాళికలు రూపొందించాం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం నిలిపివేసింది. ఏపీలో ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్‌ను భవిష్యత్తులో అభివృద్ధి చేస్తాం. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు కట్టుకోవాలి. రాబోయే రోజుల్లో 20 పోర్టులను తయారు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు విమానాశ్రయాలు ఉన్నాయి. భోగాపురం వచ్చే ఆగస్టు నాటికి ప్రారంభమవుతుంది. కొత్తగా మరో తొమ్మిది విమానాశ్రయాలు రావాలని కోరుకుంటున్నాను. గంటలో విమానాశ్రయానికి, పోర్టుకు వెళ్లే రోడ్ నెట్‌వర్క్ ఉండాలి. ఈ రెండు జరిగితే ఏపీ లాజిస్టిక్ హబ్‌గా మారుతుంది" అని పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై ఎంపీలు కృష్ణప్రసాద్, సీఎం రమేష్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

అమరావతికి బుల్లెట్ రైలు..

"ప్రధాని నాయకత్వంలో అహ్మదాబాద్ నుంచి ముంబయికి బుల్లెట్ రైలు వస్తోంది. దక్షిణ భారతంలో అమరావతి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు కవర్ చేస్తే 5కోట్ల మందికి అనుసంధానమవుతుంది. అతి పెద్ద ఆర్థిక కారిడార్‌గా తయారవుతుంది. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు స్ఫూర్తితో అమరావతికి 189 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్డు వేయాలని కోరాను. గడ్కరీ ఇస్తామన్నారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులను త్వరలో మంజూరు చేసి, వారి విభాగంలో ఏమి ఉన్నాయో చేయాలని అభ్యర్థిస్తున్నాను" అని తెలిపారు.

ఏపీని సొంత రాష్ట్రంగా..

"మహారాష్ట్రతో పాటు ఏపీనీ సొంత రాష్ట్రంగా భావించాలి. ఎంపీలు అడిగిన ప్రాజెక్టులన్నీ ఇచ్చారు. జాతీయ రహదారుల పక్కన మొక్కలు నాటేందుకు సరిపడా నిధులు ఇవ్వాలి. గడ్కరీ రెండు లాజిస్టిక్ పార్కులు ఇచ్చారు. ఇంకా ఎక్కువ కోరుతున్నాం. రోప్‌వేస్ రెండు మంజూరు చేశారు. మరో రెండు చేస్తామంటున్నారు. రూ.5,233 కోట్ల విలువ చేసే 27 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, రెండు ప్రాజెక్టులు ప్రారంభించాం. రూ.25వేల కోట్ల విలువ చేసే సుమారు 8ప్రాజెక్టులను గడ్కరీ ప్రకటించారు. వచ్చే రెండేళ్లలో రూ.లక్ష కోట్ల విలువ చేసే జాతీయ రహదారుల పనులకు గడ్కరీ హామీ ఇచ్చారు" అని తెలిపారు.

విజయవాడ-హైదరాబాద్ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే



(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన, ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి చంద్రబాబు కోరినట్లుగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరిస్తాం. నాయకత్వం బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందడుగేస్తోంది. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఇది' అని ప్రశంసించారు.

చంద్రబాబు ప్రేరణ, ఆదర్శం: విజన్ అంటే ఏంటో దేశానికి చూపించిన వ్యక్తి చంద్రబాబు అని గడ్కరీ కొనియాడారు. 'భవిష్యత్తు అభివృద్ధి, ఆవిష్కరణలకు దార్శనికత ముఖ్యం. సరైన సాంకేతికత, విజన్ అనేది నాయకత్వ సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటుంది. ఎప్పుడూ భవిష్యత్తు గురించి ఆలోచించే చంద్రబాబు ఆలోచన, దార్శనికతను నేను అభినందిస్తున్నా' అని ప్రశంసించారు.

వచ్చే రెండేళ్లలో అమెరికాకు సమానంగా ఏపీ రోడ్లు :'ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో రూ.2.5 లక్షల కోట్ల రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగియక ముందే.. రూ.లక్ష కోట్ల కొత్త పనులు ప్రారంభించబోతున్నాం. వచ్చే రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు అమెరికాకు సమానంగా ఉంటాయి' అని గడ్కరీ హామీ ఇచ్చారు. 'నీరు, విద్యుత్తు, రవాణా, కమ్యూనికేషన్ రంగాల్లో ఇక్కడి అభివృద్ధి చూస్తే.. కచ్చితంగా దేశంలోనే ఒకటి, రెండో స్థానాల్లో నిలుస్తుందనడంలో సందేహం లేదు' అని పేర్కొన్నారు. 'ప్రధాని మోదీ నేతృత్వంలో మన రైతులు అన్నదాతలే కారు.. విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు.. ఇంధన దాతలయ్యారు' అని గడ్కరీ చెప్పారు. 'రైతు బిటుమిన్ దాత కూడా కాబోతున్నాడు. వరిగడ్డితో తయారయ్యే బిటుమిన్ ద్వారా నాగపుర్-జబల్పూర్ జాతీయ రహదారిలో కిలోమీటరు రహదారిని నిర్మించాం' అని తెలిపారు.

సముద్రంలోకి పోయే నీటిపై గొడవలెందుకు?: 'ఏటా 1,400 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వృథాగా వెళ్తోంది. అయినా నీటి కోసం గొడవలు జరుగుతున్నాయి. జలజగడాల పరిష్కారానికి ముఖ్యమంత్రుల్ని ఆహ్వానించాను. సమస్య పరిష్కారం కాకుంటే తలుపులు తెరవనని చెప్పాను. అలా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల మధ్య 14 గొడవలు పరిష్కరించాను. గోదావరి నుంచి సముద్రంలోకి నీరు వృథాగా పోతుంటే. . ఛత్తీస్‌గఢ్, ఒడిశా ముఖ్యమంత్రులను పిలిచి మాట్లాడాను. వృథాగా పోవడం మీకు ఇష్టమా? అని అడిగాను. ఎందుకు గొడవలని చెప్పా' అని గడ్కరీ పేర్కొన్నారు.

ఏపీలో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఎక్కువ: 'ఏపీలోనూ ప్రమాదాల సంఖ్య ఎక్కువగా ఉంది. 100 హైవేలను ఆడిట్ చేసి కారణాలు పరిశీలించాం. వాటిని మెరుగుపరిచేందుకు ఏం చేయాలో నివేదిక తయారు చేశాం. చంద్రబాబుకూ అందిస్తాను. రాబోయే కాలంలో ప్రమాదాలు తగ్గించడంపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు దృష్టిపెట్టాలి' అని గడ్కరీ కోరారు. 'మోదీ ప్రధాని అయ్యాక ఏపీలో జాతీయ రహదారులు పదేళ్లలో 120% పెరిగి 8,700 కి.మీ.కి చేరాయి. హైడ్రోజన్‌పై ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం నుంచి బయ్యవరం వరకు ప్రాజెక్టును వోల్వోకు ఇచ్చాం' అని వివరించారు.

వాళ్లది విధ్వంసం.. మనది అభివృద్ధి మంత్రం

వైకాపా నాయకత్వంపై కేంద్ర, రాష్ట్ర మంత్రుల ధ్వజం


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా నాయకత్వం విధ్వంస ఎజెండాతో సాగిందని.. ఈ కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. జాతీయ రహదారుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు మాట్లాడారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఓ నాయకుడు బండితీస్తే మామిడి కాయలు, మనుషుల తలకాయలు, రాష్ట్ర భవిష్యత్‌ను తొక్కుకుంటూ వెళ్తున్నాడని, రాష్ట్రంలో మంచిపని జరగకుండా చూడటానికి ఆలోచిస్తున్నాడని విమర్శించారు. మొక్కనాటి చెట్టు అయ్యాక కాయలు కాసే సమయంలో కసాయివాడికి అప్పగిస్తే చెట్టే కొట్టేస్తాడని పేర్కొన్నారు. పాజిటివ్, ప్రోయాక్టివ్, ప్రాక్టికాలిటీ, పీస్‌ఫుల్.. అనే పీ-4 మంత్రి గడ్కరీ అని అభివర్ణించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు గత ఐదేళ్లలో మంచి సమయం కోల్పోయారని, మళ్లీ అటువంటి అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. చంద్రబాబు హార్డ్‌వర్క్ ఎవరికీ సాధ్యం కాదన్నారు. మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ అమరావతి ఓఆర్‌ఆర్‌కు 140 మీటర్ల వెడల్పుతో అనుమతి కావాలని సీఎం చంద్రబాబు పట్టుబట్టారని తెలిపారు. ఎన్‌హెచ్ అధికారులు మాత్రం దేశంలో 120 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుతో ఎక్కడా ఓఆర్‌ఆర్‌కు అనుమతులు ఇవ్వలేదన్నారు. కానీ సీఎం పట్టుదల చూసి, గడ్కరీ వెంటనే మంజూరు చేశారని తెలిపారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చేలా కూటమి నాయకత్వం కృషిచేస్తుంటే.. ఇంకోవైపు మా మనుషులను పంపించి మీ ఎమ్మెల్యేలను హత్యచేయిస్తే ఏమంటారు అనే వికృత నాయకత్వం ఉందని మండిపడ్డారు. ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 5,073 కి.మీ. మేర 55 రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా ఉన్నతీకరించే ప్రతిపాదనలు పంపామని, వాటిని పరిగణనలోకి తీసుకొని దశలవారీగా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు పురందేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని చిన్ని, సీఎం రమేశ్, కృష్ణప్రసాద్, బాలశౌరి, కలిశెట్టి అప్పలనాయుడు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా హయాంలో.. రోడ్డు గుంతలూ పూడ్చలేదు

- మారుమూల గిరిజన ప్రాంతాల్ని రహదారులతో అనుసంధానిస్తున్నాం
- రాష్ట్రాభివృద్ధి ఇలానే సాగాలంటే మరో 15 ఏళ్లు కూటమి బలంగా ఉండాలి
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: "కూల్చివేతలతో మొదలైన వైకాపా ప్రభుత్వం రోడ్లు వేయలేదు. కనీసం గుంతలూ పూడ్చలేదు. కేంద్రసాయం వచ్చినా వాటి అభివృద్ధిపై సరైన శ్రద్ధ చూపలేదు" అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో గ్రామగ్రామాన రహదారి గుంతల్ని పూడుస్తున్నామని, రోడ్లు వేస్తున్నామని తెలిపారు. కేంద్రం సహకారంతో జాతీయ రహదారుల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. రాష్ట్రంలో రూ.5,233 కోట్ల విలువైన జాతీయ రహదారులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో అభివృద్ధి ఇలానే సాగాలంటే మరో 15 ఏళ్లు కూటమి బలంగా ఉండాలన్నారు.



జాతీయ రహదారుల్లా 'అడవితల్లి బాట'

జాతీయ రహదారుల నిర్మాణం తరహాలో 'అడవి తల్లిబాట' పేరిట రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రవాణా సదుపాయాలు కల్పిస్తున్నట్టు పవన్‌కల్యాణ్ తెలిపారు. "ఇందుకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు. నరేగా నుంచి రూ.500 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.50 కోట్లతో వీటిని అభివృద్ధి చేస్తున్నాం. డోలీ మోతల ఇబ్బందులు తొలగిస్తూ గ్రామాలను రహదారులతో అనుసంధానిస్తున్నాం" అని పవన్‌కల్యాణ్ వివరించారు. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతల గురించి వివరించగానే పెద్ద మనసుతో చంద్రబాబు స్పందించి రూ.50 కోట్లు విడుదల చేయించారని కొనియాడారు.

పర్యావరణ సమతౌల్యం కాపాడుతూ..

"గిరిజన ప్రాంత రహదారులు రాష్ట్రాభివృద్ధికి గర్వకారణంగా నిలుస్తున్నాయి. పర్యావరణ సమతౌల్యానికి భంగం కలగకుండా అటవీ అనుమతులతో జాగ్రత్తగా రోడ్లు వేస్తున్నాం. దీంతో ఎకో టూరిజం అభివృద్ధి చెందుతుంది. రహదారుల వల్ల పరిశ్రమలు వస్తాయి. ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది" అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. "రాష్ట్రఖ్యాతిని అందరికీ తెలియజేయాలి. కూటమి విషయంలో నేను చేసిన ప్రయత్నం సఫలమై పెట్టుబడులు వస్తున్నాయి. మోదీ, చంద్రబాబు, గడ్కరీ నేతృత్వంలో రాష్ట్రం, దేశం అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి" అని పవన్ వివరించారు.

'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' నితిన్‌గడ్కరీ

చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని పవన్‌కల్యాణ్ వివరించారు. "2014లో దేశంలో 91వేల కి.మీ. జాతీయ రహదారులుండగా.. ఇప్పుడు 1.46 లక్షలకు పెరిగాయి. నిర్మాణవేగం మూడు రెట్లు పెరిగింది. మౌలిక వసతులకు కేటాయింపులు ఆరు రెట్లు పెరిగాయి. ఇది గడ్కరీ ఘనత. ఆయన హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా" అని కొనియాడారు.

చంద్రబాబు అడిగారు.. గడ్కరీ ఆమోదించారు

- రూ.25,987 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం
- విజయవాడ-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకి గ్రీన్‌సిగ్నల్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిందే తడవు... రాష్ట్రంలో పలు రహదారుల విస్తరణ ప్రాజెక్టులను కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ ప్రకటించారు. గడ్కరీ తొమ్మిది జాతీయ రహదారుల ప్రాజెక్టులు ప్రకటించగా, వాటిలో 8 ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.25,987 కోట్లు. హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టుకూ గడ్కరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీనికిముందు రాష్ట్రంలోని జాతీయ రహదారులపై గంటన్నర పాటు జరిగిన సమీక్ష సమావేశంలో ఈ తొమ్మిది ప్రాజెక్టుల గురించి చంద్రబాబు ప్రస్తావించి, వాటికి ఆమోదం తెలపాలని కోరారు. వాటికి అక్కడికక్కడే ఆమోదం తెలిపిన గడ్కరీ... అనంతరం జరిగిన సభలో వేదికపై ప్రసంగం ముగించి వెళ్లబోతూ... మళ్లీ మైకు ముందుకొచ్చి ఆ ప్రాజెక్టుల్ని ప్రకటించారు. వీటితోపాటు ఏడాదిలో మరో రూ.లక్ష కోట్ల హైవే ప్రాజెక్టులు మంజూరు చేసేందుకు అంగీకారం తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు గడ్కరీకి ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం ఉదయం అన్నదాతా సుఖీభవతో సంక్షేమ కార్యక్రమంలోను, సాయంత్రం సంపద సృష్టించే అభివృద్ధి కార్యక్రమంలోను భాగస్వామి కావడం మర్చిపోలేని అనుభవమని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రాజెక్టు	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
హైదరాబాద్-విజయవాడ (6వరుసలు)	6,700
విజయవాడ-మచిలీపట్నం (6వరుసలు)	2,600
వినుకొండ-గుంటూరు (4వరుసలు)	2,605
గుంటూరు-నిజాంపట్నం (4వరుసలు)	2,000
బుగ్గ-కైప-గిద్దలూరు (4వరుసలు)	4,200
ఆకివీడు-దిగమర్రు (4వరుసలు)	2,500
పెడన-లక్ష్మీపురం (4వరుసలు)	4,200
ముద్దనూరు-కడప (4వరుసలు)	1,182
హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే	అంచనాలు సిద్ధం చేయాలి

రహదారి భద్రతపై గీతం విడుదల

ఈనాడు, అమరావతి: రహదార్లపై భద్రతకు సంబంధించి వాహనదారుల కోసం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) తెలుగులో రూపొందించిన గీతాన్ని జాతీయ రహదారుల ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో విడుదల చేశారు. 'బాగోగులు చూస్తాం.. సురక్షితంగా ఉంటాం' అంటూ శంకర్ మహదేవన్ ఆలపించిన గీతాన్ని ఆవిష్కరించారు. ద్విచక్రవాహనం నడిపేవారితోపాటు వెనుక కూర్చున్నవాళ్లు, పిల్లలుసైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, కార్లలో ముందు, వెనుక సీట్లలో కూర్చున్నవారూ సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, వాహనం నడిపే సమయంలో ఫోన్లు మాట్లాడకపోవడం.. వంటివి వివరిస్తూ ఈ గీతం సాగింది.

సోము వీర్రాజుని వేదికపైకి పిలిపించిన సీఎం

సభ ప్రారంభమయ్యాక.. భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు వేదిక ఎదురుగా సీట్లలో కూర్చొని ఉండటాన్ని సీఎం చంద్రబాబు గమనించారు. వెంటనే కార్యదర్శి ప్రద్యుమ్నను పిలిచి.. వీర్రాజును స్టేజిపైకి రప్పించాలని ఆదేశించారు. ఆయన వీర్రాజును వేదికపైకి రప్పించి, ముందు వరుసలో కూర్చొనే ఏర్పాటు చేశారు.

దేశానికి సేవ చేయడం గౌరవం

- ప్రధాని ఫోన్ చేసినప్పుడు ఇదే చెప్పా
- గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు

ఈనాడు, దిల్లీ: 'గవర్నర్ పదవి ఇవ్వడానికి ముందు ప్రధానమంత్రి ఫోన్ చేశారు. అయితే ఆయన గవర్నర్ పదవి అని చెప్పకుండా మీ సేవలను ఉపయోగించుకుంటున్నామన్నారు. నా దేశం కోసం పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా సర్ అని చెప్పా. ఆ సేవలు ఎందుకోసం అని అడగలేదు. ఏమొచ్చినా నా దేశం కోసమే, అందుకు ఏం చేయాలన్నా చేస్తా అన్నది నా భావన' అని గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు పేర్కొన్నారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడినట్లు ప్రధానమంత్రి చెప్పారన్నారు. రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదలైన వెంటనే చంద్రబాబుకు ఫోన్ చేసి నా పేరు సిఫార్సు చేసినందుకు ధన్యవాదాలు చెప్పా. అంతకు ముందే ఈ విషయం బయటికొస్తే బాగుండదని తాము నిశ్శబ్దంగా ఉన్నామని అశోక్ గజపతిరాజు తెలిపారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోం మంత్రులను కలవడానికి దిల్లీకొచ్చిన ఆయన ఇక్కడి గోవాసదన్‌లో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

నాణేనికి రెండోవైపు ఇది: 'గవర్నర్ పదవి ఆసక్తికరంగా ఉంది. నాణేనికి రెండోవైపు దశాబ్దాలుగా పనిచేసిన మాలాంటి వాళ్లకు ఇది కొత్త. నేను తెలుగువాడినైనా గవర్నర్‌గా చేసిన ప్రమాణం ప్రకారం గోవా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ పనిచేయకపోతే నేను చేసిన ప్రమాణానికి అర్థం ఉండదు. మంత్రిగా ఉన్నా, గవర్నర్‌గా ఉన్నా స్వతంత్ర భావాలతో పనిచేయడం ముఖ్యం. విద్యుక్త ధర్మాన్ని నిలబెట్టుకున్నప్పుడే ఏ వ్యక్తికైనా సంతృప్తి దక్కుతుంది' అని పేర్కొన్నారు.

ఈనాడు

తిరిగి మూలాల్లోకి...

బాబూ రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా ఉండే రోజుల్లో నికోబార్ దీవుల్లోని ఆదివాసీ తెగల ప్రియతమ నాయకుడు- బిషప్ రిచర్డ్‌సన్‌ను దిగువసభకు ఎంపిక చేశారు. ఆయనకు దిల్లీలోని రాజకీయాలు, ప్రజల జీవనశైలి సరిపడలేదు. ఆయన తనతో మాట్లాడుతూ 'నాగరికత మహమ్మారి పరిచయం కాని రోజుల్లో- మా దీవిలో దొంగతనాలు ఉండేవి కావు. ప్రజలకు అబద్ధాలు ఆడటం తెలియదు' అన్నారని 'సేతుస్వర్ణం' పుస్తకానికి ముందు మాటలో నార్ల వెల్లడించారు. మనమంతా గర్వపడే ఆధునిక నాగరికత నిజంగా మహమ్మారి. దాని ప్రగతిని కవి రసరాజు మాటల్లో చెప్పాలంటే 'వానర చిహ్నంబులతో తిరోగమన దైన్యంబుడు వర్ధిల్లుతోంది. అంతెందుకు- మన చిన్నతనంలో ఊరవతలుండే సారా దుకాణాలు ఇప్పుడు బడి గుడి పరిసరాల్లోనే కొలువుతీరలేదా? విందు వినోదాల్లో మద్యం తప్పనిసరి కాలేదా? నాగరికతకు చెందిన అనేకానేక వికృత కోణాల్లో ఇదో ప్రముఖమైనది కాదూ?

'తొలుత మద్యాన్ని మనిషి స్వాగతిస్తాడు. తదుపరి మద్యాన్ని మద్యం ఆహ్వానిస్తుంది. తుదకు మనిషిని మద్యం బలితీసుకొంటుంది' అనే ఆంగ్లసూక్తి పాతబడింది. దాని తలదన్నే మాదక ద్రవ్యాలు విరివిగా ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. ఇది పచ్చి నిజమని తెలిసినా మనం ఉష్ట్రపక్షి లక్షణాన్ని ప్రదర్శిస్తున్నాం. దాన్ని సైకాలజిస్ట్‌లు ఆస్ట్రిచ్ మెకానిజం లేదా ఆస్ట్రిచ్ అంటారు. ఉష్ట్రపక్షి భారీగా ఉంటుంది. ఎగరలేదు, వేగంగా పరిగెత్తనూ లేదు. కాబట్టి ప్రమాదాన్ని శంకించినప్పుడు ఇసుకలో తలదూర్చేసి 'హమ్మయ్య! ప్రమాదం లేదిక' అనుకుంటుందట. మనమూ అంతే! మనదాకా రాలేదు, సురక్షితంగా ఉన్నామని భ్రమపడుతున్నాం. కానీ, పాఠశాలల వరకు ఆ విషం చేరిపోయింది. మనం మాత్రం కళ్లు మూసుకుని పాలుతాగే పిల్లి మాదిరి ప్రవర్తిస్తున్నాం. ఇదీ మన నాగరికత! ఇదీ మన ఎదుగుదల! పైగా ఆ చీడను ఆదివాసీలకు సైతం అంటించాం. అచ్చమైన అమాయకత్వంతో స్వచ్ఛమైన నవ్వులతో ముచ్చటగొలిపే మునుల వాకిళ్లలో... ఆ తులసి వనాల్లో క్రమంగా గంజాయి సాగుబడి పెరిగిపోయి, వారి పచ్చని బతుకుల్లో చిచ్చు రేపింది.

'వేరుపురుగు చేరి వెన్ను చెరచు' అన్నాడు వేమన. నాగరిక కీటకం మన్యం వెన్నును తొలిచేసింది. స్వేచ్ఛను హరించి, మనుగడకు భయాన్ని పులిమింది. అయితే గిరిజనుల మూలాలు బలమైనవి. విలువైనవి. వారి సంస్కారాలు మలినం కానివి. కాబట్టే నగర జీవులకన్నా ముందే కళ్లు తెరిచారు. 'భయం అంతరించిన చోటునుంచే జీవితం ఆరంభం అవుతుంది' అన్నారు ఓషో. భయం భయంగా గంజాయి పండించిన మన్యంలో రాజసంగా వారిప్పుడు రాజ్మాను సాగుచేస్తున్నారు. అల్లూరి జిల్లాలోని 11 మండలాల్లో ఈ ఏడాది 23వేల ఎకరాల్లో ఫ్రెంచి చిక్కుడు(రాజ్మా)ను పండించి 57కోట్ల రూపాయలు ఆర్జించారు. 'గంప తలతో వొంపుల్లోకి, కూరుచున్నవు గుండుమీద. దొంగ గొడ్డను అడ్డగించేవా' అని 'పల్లెటూరి పిల్లగాణ్ణి' అడిగారు సుద్దాల హనుమంతు. అవును! దుక్కి చేసిన దొంగ గొడ్డను గిరిజనులు అడ్డుకొన్నారు. కొత్త ప్రయాణం ప్రారంభించారు- భయంలోంచి నిశ్చింతలోకి.. చీకట్లోంచి వెలుగుల్లోకి.. నిర్మలమైన మూలాల్లోకి.. మూలుగుల్లోకి! ఇప్పుడు వారి వెనుక రామా చంద్రమౌళి చెప్పిన 'కొత్త చరిత్రను ధరిస్తున్న విశాల భూమి' రాజ్మా 'ఎరుపురంగు పంట'తో మెరిసిపోతోంది- శ్రమతో కందిన వారి మొహాల్లా!

నిండుమనసుతో ప్రేమించిన వ్యక్తి గురించి ఆందోళన చెందడం మానవ సహజం. ఉద్వేగాలూ ప్రేమా లేని హృదయం రాయితో సమానం. ఎవరికోసం వారు బతికితే మనిషికీ పశువుకీ తేడా ఏముంది? సాటివారి గురించి పట్టించుకోవడమే మనిషి గుణం.

– మైథిలీశరణ్ గుప్త్

కవి, 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత



తీయని బంధం

మనిషికి లభించిన గొప్ప వరం స్నేహం. సృష్టిలో ఒక్క స్నేహం తప్ప మిగిలిన అన్ని బంధాలనూ దేవుడే సృష్టిస్తాడు. కేవలం స్నేహితులను ఎంపిక చేసుకునే అవకాశం మాత్రం ఆయన మనకే ఇచ్చాడు. మంచి స్నేహానికి ఎలాంటి భేషజాలు, ఎల్లలు ఉండవు. కోపతాపాలు, అలకలు, అసూయలు తలెత్తవు. ఒకవేళ ఏర్పడినా అవి అద్దం మీద ఆవగింజల్లాంటివి. ఎంత త్వరగా వస్తాయో అంత త్వరగా జారిపోతాయి.

ఎప్పుడైనా ఎవరైనా ఒక్క స్నేహితుడు మోసం చేస్తే మొత్తం స్నేహాన్ని తప్పు పట్టకూడదు. స్నేహం చేసేటప్పుడు ఆ వ్యక్తి తాలూకు తప్పుల్నీ, ఒప్పుల్నీ రెండింటినీ స్వీకరించాలి. జీవితాన్ని పుస్తకంగా భావిస్తే అందులో తప్పు అనేది ఒక పేజీ మాత్రమే. కానీ, బంధాలు మాత్రం పుస్తకం నిండా ఉంటాయి. అవసరమనుకుంటే ఆ ఒక్క పేజీని చించేయొచ్చు కానీ మొత్తం పుస్తకాన్ని విసిరికొట్టకూడదు! మహాభారతంలో స్నేహానికి ప్రతీకగా కర్ణుడు, దుర్యోధనుడు నిలుస్తారు. కుంతీదేవి కురుక్షేత్ర యుద్ధానికి ముందు కర్ణుణ్ని కలుసుకుని అతడి జన్మ రహస్యం చెప్పి 'నీ తమ్ముళ్ల పక్షానికి వస్తే నీకే పాండవ అగ్రజుడిగా పట్టాభిషేకం చేయిస్తాను. నీ తమ్ముళ్ల ప్రాణం కాపాడు' అని అర్థిస్తుంది. కర్ణుడు తల్లి మాటను సున్నితంగా తిరస్కరించి స్నేహితుడి వైపే నిలబడతాడు. అలాగే కురుక్షేత్ర సంగ్రామం జరుగుతున్న ఒకనాటి రాత్రి శ్రీకృష్ణపరమాత్మ కర్ణుడి శిబిరానికి వస్తాడు. కర్ణుడికి అతడి జన్మ వృత్తాంతం చెప్పి పాండవుల పక్షంలోకి రమ్మని కోరతాడు. అప్పుడు కర్ణుడు చిన్నగా నవ్వి 'కృష్ణా, నేనెవరన్నది నాకు తెలుసు. ధర్మం పాండవుల పక్షాన ఉండటం వల్ల నువ్వు అటువైపున చేరి ధర్మ సంరక్షణ చేస్తున్నావనీ తెలుసు. అధర్మవర్తనులైన కౌరవులు ఎన్నటికీ గెలవరని కూడా నాకు తెలుసు' అంటాడు. 'ఇంత తెలిసినవాడివి కౌరవులను ఎందుకు వదలడం లేద'ని శ్రీకృష్ణుడు ప్రశ్నిస్తాడు. అందుకు కర్ణుడు 'నన్ను నమ్మి స్నేహం చేసిన దుర్యోధనుణ్ని ఒంటరిని చేసి పాండవులతో చేరడం మిత్రద్రోహం అనిపించుకోదా?' అని బదులిస్తాడు. స్నేహం కోసం ప్రాణాలు కోల్పోయిన కర్ణుణ్ని మించిన మంచి మిత్రుడెవరుంటారు!



అంతర్యామి

విడిపోయి ఏళ్లు గడిచినా స్నేహితుల మధ్య ప్రేమ ఎంతమాత్రం చెక్కు చెదరదనడానికి కృష్ణ, కుచేలుల స్నేహమే గొప్ప ఉదాహరణ. ముల్లోకాలకు అధిపతి అయిన శ్రీకృష్ణుడు నిరుపేద అయిన కుచేలుడికి బాల్యమిత్రుడు. నిస్సహాయ పరిస్థితుల్లో భార్య సలహాతో సాయం అడగడానికి వచ్చిన స్నేహితుణ్ని సాదరంగా ఆహ్వానించి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటాడు కృష్ణుడు. అడగకుండానే అతడి పేదరికాన్ని పోగొడతాడు. స్నేహానికి బీద, గొప్ప తారతమ్యాలు అడ్డురాకూడదని ప్రపంచానికి చాటుతాడు!

సజ్జనులతో చేసే స్నేహం మంచి గంధం చెక్కలా కడవరకూ సువాసన వెదజల్లుతూనే ఉంటుంది. నువ్వేంటో తెలియాలంటే నీ స్నేహితులను చూడాలి... నేనేంటో తెలియాలంటే నువ్వు నేనై పుట్టాలి అన్నది మంచి స్నేహానికి నిర్వచనం! ఆప్తమిత్రులు చెంతనుంటే అపారమైన నిధి ఉన్నట్లే!

– సుమలత



సత్యం వధ!

ప్రస్తుత రాజకీయ, సాంస్కృతిక వాతావరణంలో నకిలీ వార్తలు, అబద్ధాలు అసంఖ్యాకంగా ప్రచారంలోకి వస్తున్నాయి. ఈ స్థితిలో సగటు మనిషి సొంత భావనలను, వాస్తవాల ఆధారంగా మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు. తిమ్మిని బమ్మిని చేసే పరిస్థితులూ వైఖరులకు లొంగిపోతున్నాడు. అలా మనుషులు వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం, హేతుబద్ధత స్థానాన్ని భావోద్వేగాలు ఆక్రమించడం వల్ల సత్యానికి విలువ లేకుండా పోయింది. వర్తమానంలోని ఈ దుస్థితిని 'పోస్ట్-ట్రూత్' స్థితి లేదా 'సత్యానంతర ప్రపంచం' అంటున్నారు.

ఇరవయ్యో శతాబ్దంలో మానవ చరిత్రలో అత్యంత దారుణమైన రెండు అంశాలు ముందుకు వచ్చాయి. అవి... సత్యాన్ని ఉల్లంఘించడం, వాస్తవాలను కలుషితం చేయడం. హన్నా ఆరెంట్ తన 'ది ఆరిజిన్స్ ఆఫ్ టోటలిటేరియనిజం' పుస్తకంలో- నిజానికి, అబద్ధానికి తేడా తెలుసుకోలేని వ్యక్తులే నిరంకుశత్వానికి ఆదర్శవంతులంటారు. ఈ ప్రకటన నేటి కాలానికి మరింతగా వర్తిస్తుంది. జార్జ్ ఆర్వెల్ చెప్పినట్లు- సర్వత్రా మోసం ఆవరించిన రోజుల్లో సత్యాన్ని చెప్పడమే ఒక విప్లవాత్మక చర్య అవుతోంది.

'పోస్ట్-ట్రూత్' స్థితిలో వాస్తవాలకంటే వ్యక్తిగత భావోద్వేగాలు, అభిప్రాయాలు ప్రజాభిప్రాయాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. అంటే ప్రజలు తమకు నచ్చినట్టు ఉండే వాటినే నిజాలని నమ్ముతారు. దాంతో వారి నిర్ణయాలు తప్పుదారి పడతాయి. దానివల్ల అంతిమంగా సమాజమే నష్టపోతుంది. ప్రస్తుతం వాస్తవాల కంటే భావోద్వేగాలు, నమ్మకాలు లేదా వ్యక్తిగత కథనాలు ప్రజాభిప్రాయాలను రూపొందించడంలో ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ఉద్ధృత ప్రచారం, తప్పుడు సమాచారం లేదా భావోద్వేగ కథనాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల సందర్భంలో ఈ 'పోస్ట్-ట్రూత్' భావన మరింత స్పష్టంగా కనిపిస్తోంది.



పశ్చిమాసియా యుద్ధంలో...

ఇజ్రాయెల్, ఇరాన్, వాటి మిత్రులు సమాచార యుద్ధంలో తలమునకలయ్యాయి. వార్తా కథనాలను నియంత్రిస్తూ ప్రపంచ దృష్టిని తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. భయం, కోపం, సానుభూతిని రేకెత్తించే కథనాలు తయారవుతున్నాయి. వాస్తవాలు మరుగునపడుతున్నాయి. బూటకపు, భావోద్వేగ అంశాలను సామాజిక మాధ్యమాలు వేగంగా వ్యాప్తి చేస్తున్నాయి. సత్యాన్ని గుర్తించడం కష్టతరం చేస్తున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ రెండు దేశాలూ తమకు అనుకూలమైన కథనాలను రూపొందించి ఉద్ధృతంగా ప్రచారంలోకి తెచ్చాయి. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడానికి సన్నాహాలు చేస్తోందని, అది తన అస్తిత్వానికి ప్రమాదమని ఇజ్రాయెల్ తన దాడులను సమర్థించుకుంది. స్వదేశీయుల్లో భయాన్ని రేకెత్తించి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తనకు మద్దతు పెంచుకుంటున్నారు. ఇజ్రాయెల్ వాదనలకు కొన్ని పాశ్చాత్య ఇంటెలిజెన్స్ నివేదికలు విరుద్ధంగా ఉన్నాయి. ఇరాన్ అణు బాంబులను సిద్ధం చేయట్లేదని అవి చెబుతున్నాయి. ఇరాన్ అనుకూల వర్గాలేమో ఇజ్రాయెల్ నగరాలపై తమ క్షిపణి దాడులను అతిశయోక్తులతో వర్ణిస్తూ- ధ్రువీకరించని వీడియోలు, ఫొటోలను ప్రచారంలోకి తెచ్చాయి. ఇజ్రాయెల్ సైతం నకిలీ దృశ్యాలను సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏఐ సాయంతో తయారుచేసిన, మార్చిన వీడియోలూ సోషల్ మీడియా పోస్టులు సమాచార యుద్ధాన్ని తీవ్రస్థాయికి తీసుకెళ్తున్నాయి. సమాచారంలో సత్యం కంటే కూడా దాని ప్రభావమే ముఖ్యమవుతోంది. అంతర్జాతీయ ప్రతిస్పందనలను అది మార్చేస్తోంది. ప్రజలు తమ విధేయతకు సరిపోయే విషయాలను వాటి వాస్తవికతతో సంబంధం లేకుండా నమ్ముతున్నారు. దాంతో ఎవరు బాధితులు, ఎవరు ఆక్రమణదారులనే నిజానిజాలు చీకటిలోకి జారిపోతున్నాయి.

ట్రంపే అతిపెద్ద ఉదాహరణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు 'పోస్ట్-ట్రూత్' భావనకు బలమైన నిదర్శనాలు. అందుకే పోస్ట్-ట్రూత్ గురించి వెలువడిన చాలా పుస్తకాలలో ట్రంప్ మాటలే ఎక్కువసార్లు ఉదాహరణలుగా కనపడతాయి. అమెరికా 45వ అధ్యక్షుడిగా 2017-2021 మధ్యకాలంలో డొనాల్డ్ ట్రంప్ అసాధారణ వేగంతో, అత్యధిక స్థాయిలో అబద్ధాలు చెప్పారు. వాషింగ్టన్ పోస్ట్ విశ్లేషణ ప్రకారం- ఆయన అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2,140 తప్పుడు లేదా తప్పుదారి పట్టించే వాదనలు చేశారు. ట్రంప్ రోజూ సగటున ఆరు అవాస్తవాలను ప్రచారంలోకి తెచ్చారని మిచికో కాకుటాని అనే రచయిత 'ది డెత్ ఆఫ్ ట్రూత్' పుస్తకంలో రాశారు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' విషయంలో ట్రంప్ చెప్పుకొన్న గొప్పలన్నీ ఇలాంటివే. అలాగే ఇరాన్ విషయంలోనూ ఇజ్రాయెల్ కథనాల్లాంటి వాటినే అమెరికా అధ్యక్షుడు వల్లెవేశారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిరోధించడమనే భావోద్వేగ ఆకర్షణలను ట్రంప్ ఉపయోగించుకున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడం వెనుక తన పాత్రను తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేశారు. ఇది సత్యాన్ని వక్రీకరించడమే. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ కథనాలన్నీ 'పోస్ట్-ట్రూత్' స్థితిని స్పష్టం చేశాయి. జనాన్ని ఉద్వేగపరిచే తప్పుడు సమాచారం వెల్లువ కారణంగా సత్యం సాపేక్షమవుతోంది. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి మూలాలను విమర్శనాత్మకంగా పరిశీలించడం, నిజానిజాలను ధ్రువీకరించుకోవడం అత్యవసరం.

నాశనమయ్యే వ్యక్తిత్వాలు

జార్జ్ ఆర్వెల్ రచించిన '1984' నవలలో విన్‌స్టన్ స్మిత్ ఒక ప్రధాన పాత్ర. తను ఒక సామాన్య వ్యక్తి. నియంతృత్వ సమాజంలో సత్యం, స్వేచ్ఛల కోసం పోరాడుతాడు. 39 ఏళ్ల అతను ఓషియానియా అనే దేశంలో మినిస్ట్రీ ఆఫ్ ట్రూత్‌లో పనిచేస్తుంటాడు. అందులో చరిత్ర రికార్డులను మార్చి, పార్టీ ప్రచారానికి అనుగుణంగా వాస్తవాలను వక్రీకరిస్తుంటారు. పార్టీ నియంత్రణ, అబద్ధాలను స్మిత్ రహస్యంగా ద్వేషిస్తాడు. ఆ వ్యవస్థలో భాగంగా ఉంటూనే, సత్యం కోసం ఆరాటపడతాడు. పార్టీ చెప్పే '2+2=5' వంటి అసత్య నినాదాలను ప్రశ్నిస్తాడు. నిరంకుశాధికారం, భయంకర నియంత్రణల చీకటి రూపాన్ని విన్‌స్టన్ జీవితం వెల్లడిస్తుంది. విన్‌స్టన్ అరెస్టు అయ్యి, బ్రెయిన్‌వాష్‌కు గురవుతాడు. చివరికి '2+2=5' అని నమ్మే స్థితికి వస్తాడు. అతని వ్యక్తిత్వం నాశనమవుతుంది. నేటి 'పోస్ట్-ట్రూత్' స్థితిలో సగటు మనుషుల్లో చాలామంది ఆర్వెల్ పాత్ర విన్‌స్టన్‌లా మారిపోయే ప్రమాదం మరెంతో దూరంలో లేదు.



ప్రొఫెసర్ బి.తిరుపతి రావు


ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ఇరవై రెండేళ్ల అమ్మాయిని నక్సలైట్ అన్న అనుమానంతో పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆమె వస్తువులన్నీ స్వాధీనం చేసుకుని అర్థంలేని ఆరోపణలు మోపారు. ఆ తరవాత అయిదేళ్లపాటు సరైన విచారణ లేకుండా హజారీబాగ్, జంషెడ్‌పూర్ జైళ్లలో మగ్గిపోయిందామె. ఆ అభాగ్య బ్రిటిష్ యువతి పేరు... మేరీ టైలర్.

తండ్రి ఓడరేవులో పనిచేస్తుండటంతో మేరీకి చిన్నప్పటి నుంచి విదేశీయుల పట్ల ఆసక్తి ఎక్కువ. వేర్వేరు జాతుల గురించి తెలుసుకునేది. ఆ అలవాటు ఆమెకు తమ దేశాన్ని బాగా అర్థం చేసుకోవడానికి పనికొచ్చింది. స్కూల్లో తమకు నేర్పిన బ్రిటిష్ సామ్రాజ్య ఘనచరిత్ర నిజానికి గర్వించదగ్గది కాదని గ్రహించింది. భారతదేశంలో పేదరికానికి అదెలా

చూడటానికి వచ్చి...

కారణమైందో అర్థం చేసుకుంది. ఒకసారి జర్మనీ వెళ్లినప్పుడు అక్కడ ఇంజినీరింగ్ చదువుతున్న అమలేందు సేన్‌తో పరిచయమైంది. వామపక్ష భావాలు కలిగిన అమలేందు మంచి స్నేహితుడయ్యాడు. అతడి ఆహ్వానంతో కలకత్తా చేరుకుంది మేరీ. అమలేందు ఇంట్లోనే ఉంటూ భారతదేశంలోని వివిధ ప్రాంతాలనూ సందర్శించింది. ఇక్కడి పేదరికం ఆమెను కదిలించింది. ఆ పరిస్థితిని మెరుగుపరచడానికి తాము ఏం చేయగలమా అని తరచూ అమలేందుతో చర్చించేది. ఇద్దరి ఆశయాలు, ఆదర్శాలు ఒకటేనని తెలిశాక పెళ్లి చేసుకున్నారు. ఇక్కడి పరిస్థితులను క్షుణ్నంగా తెలుసుకోవాలనుకున్న మేరీ అమలేందుతో కలిసి పల్లెల్లో పర్యటించేది. ఆ క్రమంలో అలసిపోయి ఒక రైతు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మేరీని ఉన్నపళాన అరెస్టు చేసి హజారీబాగ్‌కు తరలించారు. అమలేందుతోసహా మొత్తం 51 మందిని అరెస్టు చేసి పురుషుల జైలుకు పంపారు. ఆ తరవాత ఆమె అమలేందును చూడలేదు.



అయిదేళ్ల నరకం తరవాత 1975లో ఒకవైపు ఎమర్జెన్సీ ప్రకటించి యావద్దేశాన్నీ జైలుగా మార్చేస్తున్న రోజుల్లోనే మేరీ టైలర్‌ను నిర్దోషిగా విడుదల చేసి గుట్టుచప్పుడు కాకుండా స్వదేశం పంపేసింది ప్రభుత్వం. అక్కడికి వెళ్లాక జైలులో తాను రాసుకున్న డైరీల ఆధారంగా 'మై ఇయర్స్ ఇన్ యాన్ ఇండియన్ ప్రిజన్' అనే పుస్తకం రాశారు మేరీ. 130 మంది పట్టే జైల్లో 700 మందిని కుక్కితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహకందనిది కాదు. జైల్లో మూడొంతుల మంది విచారణ ఖైదీలే కానీ ఏళ్ల తరబడి విచారణే ఉండేది కాదు. ఇరుకు గదులు, అపరిశుభ్రత, ఈగలు, దోమలు, అంటురోగాలు, కటిక నేలమీద నిద్ర... వీటన్నిటికీ తోడు గత్యంతరం లేక తిన్న ఉడికీ ఉడకని అన్నం, పురుగుల కూరల వల్ల తరచూ రక్తవిరోచనాలయ్యేవి. ఆఖరికి మహిళలకు ఒంటినిండా కట్టుకోవడానికి సరైన దుస్తులూ ఉండేవి కావు. చాలామందికి అసలు తమను ఎందుకు అరెస్టు చేశారో తెలియదు. మేట్రన్‌ల అకృత్యాలు, ఖైదీల రేషన్ కాజేసి అమ్ముకునే సిబ్బంది, కుల వివక్ష... అవినీతి మురికి కూపాల్లాంటి ఆ జైళ్లలో కష్టాలను తట్టుకోలేక కొందరికి ఏకంగా మతి చలించేది. అయినా వారికి ఎలాంటి వైద్యం ఉండేది కాదు. ఒళ్లు గగుర్పొడిచే ఇలాంటి దారుణమైన అనుభవాలతో పాటు ఆనాటి దేశ రాజకీయ, సామాజిక పరిస్థితుల్నీ చక్కగా విశ్లేషించారు మేరీ ఈ పుస్తకంలో. 1970ల నాటి ఇండియాను తన అక్షరాల అద్దంలో చూపిస్తారామె.

– మిహిర

కొత్త నైపుణ్యాలే రక్ష

మారుతున్న కాలానికి అనుగుణంగా తమ సిబ్బంది కృత్రిమ మేధ(ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని చాలా సంస్థలు కోరుకుంటున్నాయి. వీటి విషయంలో వెనుకంజలో ఉన్నవారిని తొలగించడానికీ అవి సిద్ధమవుతున్నాయి. మరికొన్ని సంస్థలేమో ఏఐ వినియోగాన్ని పెంచి సిబ్బందిని తగ్గించినా, అందులో నిష్ణాతులకు ప్రోత్సాహకాలు అందించడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీనికి సంబంధించి ఒక సర్వేలో ఆయా సంస్థలు, బృందాలు వెలిబుచ్చిన అభిప్రాయాలు... (శాతాల్లో)

ఏఐ నైపుణ్యాలు ఉన్న సిబ్బందికే ప్రాధాన్యం	47
సిబ్బందిని తొలగించకున్నా, విధుల్లో ఏఐ వినియోగం పెంపు	45
శ్రామికశక్తిలో ధైర్యం, నైతికత పెంచడం	44
దీర్ఘకాలిక ప్రోత్సాహకాలు, బోనస్‌లతో సిబ్బందిని నిలుపుకోవడం	40
ఏఐ వాడకం ద్వారా సిబ్బంది సంఖ్యను తగ్గించడం	33
వ్యాపార అవసరాల కోసం సిబ్బందిని పెంచడం	32
ఏఐని అందిపుచ్చుకుని సిబ్బందిని తగ్గిస్తూనే ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలివ్వడం	32
శ్రామిక శక్తి వ్యూహంలో ఎలాంటి మార్పూ ఉండదు	28

(ఆధారం: వర్క్ ట్రెండ్ ఇండెక్స్ యాన్యువల్ రిపోర్ట్-2025)

ప్రాణాలతోనా పందేలు..?

'దురాశ దుఃఖానికి చేటు' అని చిన్నప్పుడు చదువుకోనివారు దాదాపుగా ఉండరు. అయితేనేం, పేరాశల ప్రపంచంలో కళ్లు మూసుకుని విహరించే పాడు అలవాటును చాలామంది మానుకోలేరు. పావలా పెట్టుబడితో పావుగంటలో లక్షాధికారి అయిపోవాలి... కూర్చున్న చోట నుంచి కాలు కదపకుండా కష్టపడకుండా కోట్లు సంపాదించాలనే ఆశలను వదులుకోరు. అలాంటివారే ఆన్‌లైన్ బెట్టింగ్‌లనే ఎండమావుల చుట్టూ పరుగులు తీస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. 'ఆశకు పోతే గోచీ కూడా మిగలదు' అంటూ చెవినిల్లు కట్టుకుని పోరుతుంటారు పెద్దవారు. వాళ్లెందుకు చెబుతున్నారో అర్థం చేసుకోవడం మానేసి, డబ్బులు ఊరికే వచ్చేస్తాయనే పిచ్చి భ్రమల్లో మునిగిపోతున్న వారు అయినకాడికి అప్పులుచేసి మరీ పందేలు కాస్తున్నారు. అయినవారిని నానా తిప్పలు పెడుతూ బెట్టింగ్ యాప్‌ల్లో డబ్బులు గుమ్మరిస్తున్నారు. రూపాయి వెనక్కిరాక, బాకీలు తీర్చే దారి దొరక్క ఆఖరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇంకొందరైతే ఆన్‌లైన్ జూదక్రీడలకు కావాల్సిన సొమ్ములకోసం సొంతవారినే చంపేస్తున్నారు. ఆ విధంగా బెట్టింగ్ భూతం ఇప్పుడు పొగాకు, మద్యం, మత్తుమందులను మించి యువతరం బతుకులను చితిమంటల్లోకి తోసేస్తోంది. ఇంతటి సమస్యను మీరు సీరియస్‌గా తీసుకుంటున్నట్లు లేరంటూ సర్కారును ఉద్దేశించి సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్య- చంపుడు పందేలను చూస్తూ కూర్చుంటున్న ప్రభుత్వాల తీరు పట్ల తీవ్రమైన అభిశంసనే!

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వరంగల్లు కుర్రాడి ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ముప్పై లక్షల రూపాయలను మింగేసింది. హైదరాబాద్‌లో చక్కగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన మరో యువకుణ్ని అంటుకున్న అదే మాయరోగం రూ.85 లక్షలను మాయంచేసేసింది. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మరో పిల్లాడు డిగ్రీ వరకు చదివాడు. నెట్‌లో జూదానికి అలవాటుపడి ఆరులక్షల రూపాయలను నష్టపోయాడు. కృష్ణా జిల్లాలో పుట్టిపెరిగిన ఇంకో అబ్బాయి ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకుని కుటుంబ వ్యాపారంలోకి వచ్చాడు. ఎలా చిక్కుకున్నాడో ఏమో క్రికెట్, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వలలో పడి నాలుగు లక్షల రూపాయల దాకా కోల్పోయాడు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఈ నలుగురూ ఇప్పుడీ లోకంలోనే లేరు. వారు



కాసిన పందేలే వాళ్ల నిండు జీవితాలకు ఉరితాళ్లు బిగించాయి. ఇలా తెలుగు రాష్ట్రాల్లోనే ఎన్నో బలవన్మరణాలు నమోదయ్యాయి... అవుతూనే ఉన్నాయి! ఏట్లో పిసికిన చింతపండు లాంటిది బెట్టింగ్ యాప్‌లకు తగలేసే సొమ్ము... పోవడమే తప్ప తిరిగి రావడమంటూ ఉండదు. బెట్టింగ్ బాధితులకు ఆ విషయం అర్థమయ్యేసరికి బాకీలు తప్ప బతుకులో మరేమీ మిగలట్లేదు. ఇలాంటి వాళ్లందరినీ నిలువునా దోచుకుంటున్న అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ముఠాలు ఏటా మన దేశంలోంచి తన్నుకుపోతున్న సొమ్ము మొత్తం అక్షరాలా ఎనిమిది లక్షల కోట్ల రూపాయలకు పైమాటే! పైపెచ్చు ఆ రాక్షస వ్యాపారం విలువ ఏడాదికి ముప్పైశాతం చొప్పున పెరుగుతోంది. మన గడ్డ మీద ఆ విషవృక్షం వేళ్లు ఎంత లోతులకు పాకిపోతున్నాయో... ఎన్నెన్ని కుటుంబాల కలలను అవి ఛిద్రం చేస్తున్నాయో ఈ గణాంకాలను బట్టే గమనించవచ్చు. బెట్టింగ్ యాప్‌లు ఆ విధంగా విధ్వంస దశను దాటించి వినాశనం వైపు సమాజాన్ని నెట్టుకుపోతుంటే సర్కారీ యంత్రాంగానికి సోయి ఉండట్లేదా అని ఎవరికైనా అనిపించవచ్చు. ఫిర్యాదులొచ్చినప్పుడు నిద్రలేచి ఒళ్లు విరుచుకుని కొన్నాళ్లు హడావుడి చేయడం, ఆపై మళ్లీ మొద్దునిద్రలోకి జారుకోవడం దానికి మామూలైపోతోంది. అదే అసలు సమస్య!

పుణ్యభూమి


ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై పేరుకు విధిస్తున్న నిషేధం... కోరల్లేని పామవుతోంది. టెలిగ్రామ్ ఛానెళ్లు, ఏపీకే ఫైళ్ల ద్వారా విస్తృతంగా బట్వాడా అవుతున్న జూద యాప్‌లు- యువతకు ఎరవేసి ఉచ్చులోకి లాగుతున్నాయి. కొంతమంది సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ యాప్‌లకు విపరీతంగా ప్రచారం కల్పిస్తూ, నెత్తుటికూడులో వాటాలు పంచుకుంటున్నారు. సినిమా తారలు, ఇతర సెలబ్రిటీలు కూడా కాసులయావలో పడి బెట్టింగ్ యాప్‌లకు బ్రాండ్ అంబాసిడర్లవుతున్నారు. వీళ్లకు తోడు సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు ఇంకెంతో మందిని జూదక్రీడల జైలులోకి తోసేస్తున్నాయి. నిరుడు అక్టోబరు నుంచి డిసెంబరు మధ్యకాలంలోనే నాలుగు పెద్ద బెట్టింగ్ వెబ్‌సైట్లకు 160 కోట్ల విజిట్స్ వచ్చాయంటే- తేరగా డబ్బులొచ్చేస్తాయన్న ఆశ ఎంతమందిని కుదురుగా ఉండనివ్వట్లేదో అర్థం చేసుకోవచ్చు. సోషల్ మీడియాలో వచ్చే బెట్టింగ్ ప్రకటనలను ఆధునిక సాంకేతికత సాయంతో నిరోధించగలిగితే- చాలామంది ఆ ముప్పు బారినపడకుండా ఉంటారు. పాపిష్టి డబ్బులకోసం ఎలాంటి అక్రమాలకైనా ప్రచారం చేసిపెట్టే ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీలను కటకటాల్లోకి తోస్తే- మరెంతో మంది అమాయకులను రక్షించినవారవుతారు. కేంద్రం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే- బెట్టింగ్ రక్కసిని తరిమికొట్టడం అసాధ్యం కాదు. అందుకు కావాల్సిందల్లా సంకల్పం మాత్రమే.

– శైలేష్ నిమ్మగడ్డ

స్నేహం అంటే ధైర్యం

హాయ్ ఫ్రెండ్స్..! ఎలా ఉన్నారు? నేనైతే చాలా బాగున్నా.. ఎంచక్కా స్కూల్‌కి కూడా వెళ్తున్నాను. కొత్త క్లాస్ భలేగా ఉంది తెలుసా? ఇంతకీ నేనెవరో గుర్తుపట్టారు కదా..! మీ ఛోటూని. 'సమ్మర్‌లో కదా రావాల్సింది. ఇప్పుడొచ్చాడేంటి?' అనుకుంటున్నారా. ఈ రోజు ఫ్రెండ్‌షిప్ డే కదా. మరి మీరేగా నా స్నేహితులు. అందుకే కాసేపు కబుర్లు చెబుదామని ఇలా వచ్చాను. ఇదిగో నేను పట్టుకొచ్చిన గిఫ్ట్‌లు అన్నీ మీకే. నేను వెళ్లేటప్పుడు ఇచ్చేసి వెళ్తానే!

ఇంతకీ విషయం ఏంటంటే.. మనకు అందరికీ బోలెడు మంది ఫ్రెండ్స్ ఉన్నా అందులో ఒకరో ఇద్దరో బెస్ట్ ఫ్రెండ్స్ ఉంటారు. అలా ప్రతి ఒక్కరికీ ఉంటారు కదా! అలాగే అందరిలోనూ ఏదో బెస్ట్ థింగ్ ఉంటుంది. డాన్స్ చేయడం, పాటలు పాడటం,



బొమ్మలు గీయడం, కథలు చెప్పడం, చిన్నచిన్న బొమ్మలు తయారు చేయడం.. ఇలా ఏదైనా కావచ్చు. కొన్నిసార్లు అది వాళ్లు ప్రదర్శించడానికి ప్రయత్నించినా మనం నవ్వేసరికి ఆ ప్రయత్నాన్ని అక్కడే ఆపేస్తారు. కానీ అలా మనం ఎప్పుడూ చేయకూడదు. కొన్నిసార్లు వీలు చేసుకుని మరీ మనమే మన మిత్రులకు సాయం చేయాలి. అందులో వాళ్లు ఎలా రాణించగలరో మనకు తెలిసిన విధంగా చెప్పాలి. అప్పుడు వాళ్లకు నచ్చిన పనిని చక్కగా చేయగలుగుతారు. ఎప్పుడైనా సరే.. మన స్నేహితులకు మనం ధైర్యం అవ్వాలి. ఇలాగే ధైర్యాన్నిచ్చి తన మిత్రుడు మంచిపేరు తెచ్చుకోవడానికి కారణమయ్యారట సైంటిస్ట్ థామస్ ఎడిసన్. 'నాలోని బెస్ట్‌ని గుర్తించి, దాన్ని బయటికి తీసుకొచ్చింది నా మిత్రుడే' అని హెన్రీ ఫోర్డ్.. థామస్ గురించి చాలాసార్లు చెప్పారు తెలుసా. మరీ మీరూ మీ మిత్రులకు ధైర్యం అవుతారు కదూ! అయితే వెంటనే వెళ్లి.. అమ్మ ఇచ్చిన పాకెట్ మనీతో చాక్లెట్ కొని మీ ఫ్రెండ్‌కి ఇచ్చి.. అదే విషయం చెప్పేయండి. మీ అందరికీ 'హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే'. ఈ గిఫ్ట్‌లు అన్నీ పోస్ట్‌లో పంపిస్తాలే!

హాయ్! బుజ్జీ!!

★

నేనెవర్ని?

1. మూడు అక్షరాల పదాన్ని నేను. 'కారం'లో ఉంటాను కానీ 'భారం'లో లేను. 'నువ్వు'లో ఉంటాను కానీ 'నవ్వు'లో లేను. 'కవి'లో ఉంటాను కానీ 'బావి'లో లేను. నేనెవర్ని?
2. నేనో నాలుగు అక్షరాల పదాన్ని. 'జ్ఞానం'లో ఉంటాను కానీ 'వనం'లో లేను. 'పత్రం'లో ఉంటాను కానీ 'చిత్రం'లో లేను. 'కాలం'లో ఉంటాను కానీ 'పాలం'లో లేను. 'వేలు'లో ఉంటాను కానీ 'వేళ'లో లేను. నేనెవర్ని?

[illegible]


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
విజయ్ సేల్స్
ఓపెన్ బాక్స్
సేల్
ఓపెన్ బాక్స్ స్టాక్ క్లియరెన్స్
మరియు మరెన్నో
డిస్‌ప్లే • ఆఖరి పీస్
60%* వరకు తగ్గింపు
నేడే చివరి రోజు
DEAL OF DAY
SANSUI 55 (139 cm) 4K UHD Google TV
PRICE ₹59,990 OFFER PRICE ₹29,990
DOWN PAYMENT ₹5,998 | EMI ₹2,999 x 8 Months
VISE 65 (164 cm) 4K QLED Google TV
PRICE ₹1,20,000 OFFER PRICE ₹47,990
ZERO DOWN PAYMENT | EMI ₹5,999 x 8 Months
SAVINGS 37% OFF
SONY 5.1 CH SOUNDBAR HT-S20R
PRICE ₹23,990 OFFER PRICE ₹14,990
SAVINGS 26% OFF
IFB FRONT LOAD WASHING MACHINE 8 Kg
PRICE ₹47,080 OFFER PRICE ₹34,990
SAVINGS 45% OFF
Godrej TOP LOAD WASHING MACHINE 8 Kg
PRICE ₹34,400 OFFER PRICE ₹18,990
UPTO 59% OFF AIR CONDITIONER
1.5T 3 STAR INVERTER STARTING AT ₹28,990
1.5T 5 STAR INVERTER STARTING AT ₹33,990
LG Godrej LLOYD VOLTAS HITACHI
SAVINGS 33% OFF
LG FROST FREE REFRIGERATOR 272 Litres
CASHBACK ₹2,500
PRICE ₹41,899 OFFER PRICE ₹27,990*
UPTO 60% OFF UPGRADE YOUR KITCHEN
UPTO 60% OFF IT & MOBILE ACCESSORIES
boAt Marshall noise PORTRONICS BOSE JBL
SAVINGS 38% OFF
BLUE STAR NORMAL AND COLD WATER DISPENSER
PRICE ₹14,600 OFFER PRICE ₹8,990
మళ్ళీ స్కూల్‌కి
మొబైల్ | ల్యాప్‌టాప్ | యాక్సెసరీస్
iPhone 16 (128 GB)
10% OFF* DISCOUNT ₹8,000*
CASHBACK ₹4,000*
PRICE ₹79,900
EMI Starting at ₹3,038
realme
realme 15 Pro | 15 5G
Ai Party Phone
From ₹25,999* Available Now
180 days OTSR (One time Screen Replacement) Offer
Up to ₹2,500* Instant Discount HDFC BANK one YES BANK
*T&C Apply.
SAMSUNG
Galaxy Z Fold7 | Z Flip7
Galaxy AI
Available Now
Get benefits worth ₹ 12000*
Buy 256GB. Get 512GB.
*T&C apply. Image simulated.
OnePlus Nord 5
Light Speed. Night Legend.
Starting from ₹29,749*
Available Now
₹2,250 Instant Discount
SBI card RBL BANK
Powered by OxygenOS
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback Upto ₹ 15,000/-*
• Fossil Watch @ ₹ 999/-*
• 1st Year ADP @ ₹ 999/-*
MacBook Air
Sky high performance with
M4 Starting from ₹82,907*
M2 Starting from ₹69,310*
STUDENT GET UPTO 10% OFF*
Exchange bonus Up to ₹10,000*
Available at stores only.
SBI card | ICICI Bank
Lenovo
LENOVO GAMING, SLIM 5 & FLEX 5, YOGA SERIES, LOQ
• Cashback Upto ₹ 10,000/-*
• Exchange Bonus Upto ₹ 15,000/-*
• 2 Year Warranty + 2 Year Premium Care + 1 Year ADP @ ₹ 1,999/-*
• Upto 24 Months EMI Option*
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
UPTO ₹10,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE ON
HDFC BANK | AMERICAN EXPRESS | ONECARD | IDFC FIRST BANK
YES BANK | DBS BANK | AU BANK
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
విజయవాడ - ఎం జి రోడ్ రజనీ కుమార్ - 96665 03755 ప్రసన్న - 70362 15153
విజయవాడ - ఎన్‌టిఆర్ సర్కిల్ ఈశ్వర్ - 88866 53042 చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్ గౌతం - 91549 03693 కిరణ్ - 87120 32657
రాజమండ్రి - ఇన్నీస్‌పేట్ సతీష్ - 88866 74548 నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర్ పల్లి కిరణ్ - 99482 28111 విజయ్ కుమార్ - 87126 35822
తిరుపతి - లీలా మహల్ వేణు - 73373 76215 వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హస్పిటల్ ప్రక్కన శివ గంగాధర్ - 91543 16627 నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి రమేష్ - 99482 41112 కిరణ్ కుమార్ - 91549 03528
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. Upto 60% off on select brands and models only. *Cashback Applicable Select Banks & Cards

మీ స్నేహం బలమెంత?



అమ్మా నాన్నలను మనం ఎంచుకోలేము.. బంధువులను ఎంచుకోలేము.. కానీ.. స్నేహితులను ఏరికోరి ఎంచుకోవచ్చు..! మన ఆనందాలను, బాధలను పంచుకోవచ్చు..! అంతా కోల్పోయినప్పుడు.. నేనున్నాను అనేది స్నేహం జీవితం బరువైనప్పుడు.. భరోసానిచ్చే బంధం స్నేహం

నేడు 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా

మన నేస్తాలతో మనమెలా ఉంటున్నామో ఓసారి తనిఖీ చేసుకుందామా..!

సారీ చెబుతున్నారా?

జీవితం మనకు ఎన్నో బంధాలను అందిస్తుంది. కానీ వాటిని కాపాడుకునే బాధ్యతను మాత్రం మన చేతుల్లోనే పెడుతుంది. బంధాలు అద్దాల్లాంటివి. ఒక్కసారి పగిలితే తిరిగి అతుక్కోవు. అందుకే వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. 'తప్పులు చేయడం మానవ సహజం' అంటుంటారు. అలాంటి సందర్భాల్లో కొన్నిసార్లు మన స్నేహితులు 'హర్ట్' అవుతూ ఉంటారు. విషయం చిన్నదా..పెద్దదా అని ఆలోచించకుండా.. రెండక్షరాల 'సారీ' చెప్పేస్తే..అటు బంధం వీగిపోకుండా ఉంటుంది. ఇటు మనసులోని భారమూ దిగినట్లవుతుంది.

క్షమాపణలు స్వీకరిస్తేనే...


పొరపాటు చేసినప్పుడు ఎదుటివారిని క్షమాపణ అడగడమే కాదు. వారు క్షమాపణ చెప్పినప్పుడు మన్నించగలిగే మనస్తత్వమూ ఉండాలి. వాళ్ల తప్పులను క్షమించడం వాళ్లకెంత అవసరమో మనకూ అంతే అవసరం. లేకపోతే ఆ వివాదానికి సంబంధించిన ఆలోచనలు మన మనసులోనే నాటుకుపోతాయి. తీవ్రంగా బాధిస్తాయి. స్నేహితులు తప్పు చేసినప్పుడు వారేం చెప్పదల్చుకున్నారో ఒకసారి పూర్తిగా వినండి. వారు చెప్పే కారణాలు నిజాయతీగా అనిపిస్తే మనసారా క్షమించండి.

నమ్మకంతో..

స్నేహానికి మూలం నమ్మకమే. స్నేహితుల రహస్యాలను గౌరవంతో కాపాడాలి. వారి నమ్మకాన్ని దెబ్బతీయకూడదు. మిమ్మల్ని నమ్మి.. తన వ్యక్తిగత విషయాలను పంచుకుంటున్నారంటే.. మీరంటే వారికి ఎంత నమ్మకమో అర్థం చేసుకోవాలి. వాటిని స్వలాభం కోసమో.. వారిని కించపరిచేందుకో ఉపయోగిస్తే.. ఓ స్నేహితుడిగా మీరు విఫలమైనట్లే!



మీరిచ్చే భరోసా ఎంత?



సవాళ్లు ఎదురైన సమయాల్లో మీ స్నేహితులకు అండగా ఉండండి. వారికి ఆపద వస్తే మద్దతు ఇవ్వడానికి ఎల్లప్పుడూ మీరు ముందుంటారనే నమ్మకాన్ని కలిగించండి. కష్టసమయాల్లో మీరు చూపించే చొరవ వారి సగం సమస్యను పరిష్కరిస్తుందని గుర్తుంచుకోండి. ఇది మీ స్నేహబంధాన్ని పది కాలాలపాటు పదిలంగా ఉంచేందుకు తోడ్పడుతుంది.

సమయమిస్తున్నారా?

బంధం ఎంత బలమైనదైనా.. సమయం ఇవ్వకుంటే దూరం పెరుగుతుంది. ఈక్రమంలోనే స్నేహితుల మధ్యలో మరొకరు వచ్చిచేరుతుంటారు. తర్వాత, 'నువ్వు చాలా మారిపోయావ్' అనో..'మునిపటిలా లేవనో' వారిని నిందించడం ద్వారా ఫలితం శూన్యం. వీలైనప్పుడల్లా స్నేహితులను కలవడం.. కుదరని సందర్భంలో ఫోన్‌చేసి, నాలుగు మాటలు మాట్లాడడం.. ఎలాంటి పనుల వల్ల బిజీగా ఉన్నారో వారికి అర్థమయ్యేట్లు చెప్పడం బంధాన్ని కాపాడడమే కాకుండా, వారికి మీరెంత గౌరవమిస్తున్నారో తెలుస్తుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం



పరిస్థితులు మళ్లీ మీ నియంత్రణలోకి రావాలంటే..

వ్యాయామం.. పరుగు.. జీవితం.. ఇలా ఏదైనాసరే మీకు భారంగా అనిపిస్తోందా? అలాంటప్పుడు ముగింపుపై కాకుండా మీ తదుపరి అడుగుపై మాత్రమే దృష్టి పెట్టండి. ఇంకొక్కసారి బరువు ఎత్తడం.. ఇంకొక్క ల్యాప్ పరిగెత్తడం వంటి చిన్న చిన్న చర్యలుగా మీ పనిని విభజించుకొని చేస్తూ వెళ్లండి. దానివల్ల పరిస్థితులు క్రమంగా తిరిగి మీ నియంత్రణలోకి వస్తాయి.

– స్టీవ్ మ్యాగ్నెస్, రచయిత

మీ ఎంపిక.. 'సహజ' గణేశుడేగా!



బంతిపూలు, మోదుగ పూలు, కాసు, జిగురు, దానిమ్మ ఎండు తొక్కలు, సుద్ద తదితరాలను వినియోగించి సహజ రంగులను తయారు చేస్తున్నారు. వాటితో మట్టి వినాయకులను వర్ణ రంజితం చేసి.. విక్రయిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని గృహవిజ్ఞాన కళాశాల 2016 నుంచి ఈ విగ్రహాలను రూపొందిస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి సహకారం తీసుకుంటోంది. ప్రజల్లో అవగాహన దృష్ట్యా ఈ ఏడాది ఎక్కువ విగ్రహాలను ఇలా సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది. 'తయారీదారుల నుంచి మట్టి వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి.. సహజ రంగులు అద్ది విక్రయిస్తున్నాం. ఈ రంగుల వాడకంతో విగ్రహాల తయారీ కార్మికులకు, నిమజ్జనంతో జలాలకు ఎలాంటి హాని జరగదు. జలచరాలకు ప్రమాదం ఉండదు. ఇవి నీటిలో త్వరగా కరిగిపోతాయి" అని వివరించారు ఈ కేంద్రం ఇన్‌ఛార్జి, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీప్రసన్న.

– ఈనాడు హైదరాబాద్; న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

మీ స్నేహం పదికాలాలు పచ్చగుండాలె!



మొక్కలతో స్నేహం చేస్తే మనసు ప్రశాంతంగా, పరిసరాలు పచ్చగా కళకళలాడుతాయంటున్నారు విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులు. ఎందుకంటే.. వాళ్లు ఏళ్లుగా మొక్కలతో స్నేహం చేస్తున్నారు. ఆ బంధం చిగురించి తొడిగి నేడు కళాశాల ఆవరణ అంతా నీడై పరుచుకుంది. కొత్త విద్యార్థులు వచ్చినా మొక్కలు నాటుతూ మైత్రి బంధం కొనసాగిస్తున్నారు. ప్రతి విద్యార్థి చదువు పూర్తి చేసుకొని వెళ్లేలోపు ఒక్క మొక్కైనా నాటుతున్నారు. ఉన్నన్ని నాళ్లు వాటిని వారే పరిరక్షిస్తున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా శనివారం కొందరు విద్యార్థులు మొక్కలకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టి.. పచ్చటి బంధానికి పాదుకొల్పారు.

– ఈనాడు అమరావతి

ఇంటికి తోడూనీడ!






ఎవరైనా ఇల్లు కట్టే ముందు ఆ స్థలంలో చెట్లు, పుట్టలు తొలగించి నిర్మాణం మొదలుపెడతారు. నంద్యాలలోని తెలుగుపేటకు చెందిన చిలుక సాల్మన్ రాజు, ప్రసన్నకుమారి దంపతులు మాత్రం ఏళ్లుగా ఉన్న వేప చెట్టును తొలగించడానికి మనసొప్పక అలాగే ఉంచి ఇల్లు కట్టుకున్నారు. గోడలు, పైకప్పులో చెట్టు కాండానికి సరిపోయేంత స్థలం వదిలారు. వేప చెట్టు కావడంతో ఎలాంటి పురుగుల బెడద లేదని, వేసవిలో ఇంట్లో చల్లగా ఉంటోందని యజమానులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ఏఐపైనే ఆధారం... సృజనకు రాంరాం!

విద్యార్థులపై ఇన్నాళ్లూ ఎలక్ట్రానిక్ తెరల ప్రభావం అమితంగా ఉంటోందని కలవరపడిన వారు ఇప్పుడు కృత్రిమ మేధ వినియోగాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. చిన్నారుల మేధస్సు కృశించి పోయే పరిస్థితి ఉండటమే దీనికి కారణం. పాఠశాల దశలోనే ఏఐ యాప్స్‌ను విద్యార్థులు వినియోగిస్తుండటం, పరిధి దాటుతుండటం ఆందోళనలకు దారితీస్తోంది. ఇప్పటికిప్పుడే ఎటువంటి ప్రభావం కనిపించకపోయినా దీర్ఘకాలంలో ఆలోచనల స్థాయిని, సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



మెస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నేతృత్వంలో జరిగిన తాజా పరిశోధనలో, చాట్‌జీపీటీ వాడకం వల్ల విద్యార్థుల మెదడు పనితీరు తగ్గినట్లు, సృజనాత్మకతకు భంగం కలిగినట్లు వెల్లడైంది..



అధ్యయనం వివరాలు..

రచనలకు సంబంధించి విద్యార్థులపై నాలుగు సెషన్‌లలో ఎలెక్ట్రోఎన్సెఫలోగ్రామ్(ఈఈజీ) టెస్టు నిర్వహించారు. వారు మూడు విధాలుగా రచనలు చేశారు.

1. ఎలాంటి టూల్స్ వాడకుండా.. (సొంత ఆలోచనలతో)
2. గూగుల్‌లో శోధించి..
3. చాట్ జీపీటీ సాయంతో..

ఫలితాలు..

- ఎలాంటి టూల్స్ లేకుండా, రచన ప్రారంభించిన విద్యార్థుల మెదడు ఎక్కువగా పనిచేసిందని, వారి ఆలోచనా శక్తి బాగా పెరిగిందని తేలింది.
- చాట్ జీపీటీతో మొదలు పెట్టిన వారి మెదడు తక్కువగా పనిచేసినట్లు పేర్కొంది.
- ఏఐతో మొదలు పెట్టి.. తర్వాత స్వయంగా రాసిన వారు తాము రాసిన విషయాన్ని గుర్తుంచుకోలేకపోయారు.
- ఏఐ ఆధారంగా రచనలు సమర్థంగా ఉన్నా, అవి తక్కువ సృజనతో ఉండేవి. అవి అంత సంతృప్తికరంగానూ అనిపించలేదు.

అధ్యయనం సూచన



విద్యార్థులు ముందుగా తమ ఆలోచనలను స్వయంగా రాసి, తర్వాత ఏఐ సహాయంతో ఆ రచనను మెరుగుపరచడం ఉత్తమం. ఇలా చేయడం వల్ల మెదడు మరింత సజీవంగా, సృజనాత్మకంగా పనిచేస్తుంది.

- ఈనాడు, హైదరాబాద్


ఇదీ ముప్పు...

- 1-5, 6-9, 10-12 తరగతులకు ప్రత్యేకంగా యాప్స్ ఉన్నాయి. ఆస్క్ ఏఐ, ఏఐ క్లాస్‌రూం, ఏఐ హెల్పర్ తదితర పేర్లతోపాటు అనేక రకాలు అందుబాటులో ఉన్నాయి.
- గేమ్స్, కామిక్స్, కార్టూన్ల స్థాయికే పరిమితమైనవారు ఇప్పుడు పాఠ్యాంశాల్లో సహకారం కోసం ఏఐ ఆధారిత యాప్‌లపై దృష్టి పెడుతున్నారు.
- గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు, అనలైటిక్స్ కోసం అనేక యాప్స్ ఉన్నాయి. పరిమితికి మించి వాటిపై ఆధారపడుతున్నారు.
- సృజనాత్మకమైన పోటీ పరీక్షల్లో సబ్జెక్టు, ప్రశ్నజవాబుల కోసం కృత్రిమ మేధను వినియోగిస్తున్నారు.
- అసైన్‌మెంట్స్ విద్యార్థుల ఆలోచన, పఠనా స్థాయిని పెంచాల్సి ఉండగా, ఒత్తిడిని కూడా పెంచుతుండడంతో సులువైన మార్గాల కోసం ఏఐపై ఆధార పడుతున్నారు.

తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి

విద్యార్థి దశలో ఏఐ వినియోగం అంత మంచిది కాదు. అది వారిని కృత్రిమంగా తయారుచేస్తుంది. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి. ఉపాధ్యాయులు, విద్యా సంస్థలు కూడా విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూడాలి. స్వతంత్రంగా నేర్చుకునే శక్తిని ఇచ్చినప్పుడే మానసికంగా, భావోద్వేగాల పరంగా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు. ఏఐ వినియోగం, కట్టడిలో ప్రభుత్వ బాధ్యత కూడా ఉంటుంది.

– అనూరాధారావు, బాలల హక్కుల సంఘం



ఏమీ చేతకాని వారిలా...

పరిధి దాటి వినియోగిస్తే ఏఐ ఏమీ చేతకాని వారిలా మార్చుతుంది. మానవ సంబంధాలు, టైం మేనేజ్‌మెంట్, షేరింగ్, కేరింగ్‌లాంటివి కోల్పోయేలా చేస్తుంది. మెదడుకు పని తగ్గుతుంది. మార్కులు, రిపోర్టు కార్డుల కోసం విద్య వల్ల ప్రయోజనం లేదు.

– చొక్కాపు వెంకట రమణ, బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత

సున్నితత్వాన్ని కోల్పోతారు

హోంవర్క్ పూర్తి చేయడానికి చాలామంది విద్యార్థులు కృత్రిమ మేధపై ఆధారపడుతున్నారు. దీనివల్ల సృజనాత్మకత దెబ్బతింటుంది. ఆలోచనాశక్తి, పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోతుంది. మానవ సంబంధాలు, సామాజిక సంబంధాలపై ప్రభావం పడి సహానుభూతి వంటి సున్నితత్వాన్ని కోల్పోతారు.

– ఎ.నాగరాజ శేఖర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి, భద్రాద్రి జిల్లా

70 ఏళ్ల వయసులో సైకిల్‌పై తీర్థయాత్ర



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఈయన పేరు జయ్‌వీర్ సింగ్(70). వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆయనకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న శివుడి, ఆంజనేయుడి ఆలయాలను దర్శించుకోవాలని అనిపించింది. దీంతో ఆలస్యం చేయకుండా సైకిల్‌పై యాత్రకు శ్రీకారం చుట్టారు. ప్రయాగ్‌రాజ్ నుంచి రామేశ్వరం, జైపుర్, హరిద్వార్ వెళ్లి అక్కడికి సమీపంలోని ఆలయాలను దర్శించుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. జులై 9న యాత్ర మొదలుపెట్టిన ఆయన ప్రస్తుతం అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని రామినేపల్లి గ్రామానికి చేరుకున్నారు. నాలుగు నెలల పాటు యాత్ర కొనసాగనున్నట్లు జయ్‌వీర్ సింగ్ తెలిపారు.

– ఈనాడు అనంతపురం

సాలై అరుణ్ విత్తన యాత్రికుడు



నాటు విత్తనాలపై మక్కువతో తమిళనాడుకు చెందిన యువరైతు 300 రకాలకుపైగా సేకరించారు. ఇందుకోసం వేల కిలోమీటర్లు పయనించారు. తిరుప్పూరు జిల్లా మంగళానికి చెందిన అరుణ్.. సేంద్రియ వ్యవసాయానికి స్థానిక విత్తనాలు (నాటు విత్తనాలు) కీలకమని తెలుసుకుని వాటి సేకరణకు నడుం బిగించారు. స్నేహితుల ఆర్థిక సహాయంతో 2021లో ద్విచక్ర వాహనం కొన్న ఈ యువరైతు.. విత్తనాల కోసం 15 రాష్ట్రాల్లో 17 వేల కిలోమీటర్లకుపైగా పయనించారు. కర్పగతారు పేరిట విత్తన బ్యాంకు ఏర్పాటు చేశారు. ఇందులో 300 రకాల స్థానిక విత్తనాలు ఉన్నాయి. వాటిలో 55 రకాల వంకాయలు, 30 రకాల టమోటా, 100 రకాల బీన్స్ విత్తనాలు ఉన్నాయి. మిరియాల పరిమాణంలో పండే టమోటా విత్తనాలు కూడా ఉన్నాయి. సిలిగురి అని పిలిచే వంకాయ రకాన్ని దోసకాయలా పచ్చిగానే తినవచ్చు. ఆ విత్తనమూ అరుణ్ దగ్గర ఉంది. 2023లో నామమాత్రపు ధరకు విత్తనాల అమ్మకం ప్రారంభించారు. ఈ విత్తన సేకరణ కారణంగా అరుణ్‌ను అందరూ సాలై అరుణ్ అని పిలుస్తున్నారు.

–న్యూస్‌టుడే, చెన్నై (విల్లివాక్కం)

18 కి.మీ. ఎత్తుకు బూడిద



ఇండోనేసియాలోని మౌంట్ లెవోటోబి లకిలకి అగ్నిపర్వతం వరుసగా రెండో రోజైన శనివారమూ బద్దలైంది. దాదాపు 18 కి.మీ. ఎత్తుకు బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసింది. –జకార్తా

'ఏఐ మోడలింగ్'రంగా!





మోడలింగ్‌కు కేరాఫ్ అడ్రస్ అందమైన అమ్మాయిలు.. కండలు తిరిగిన అబ్బాయిలు.. ప్రపంచవ్యాప్తంగా వారికున్న క్రేజ్ అంతా ఇంతా కాదు.. వారికి కోట్ల మంది అభిమానులుంటారు. కానీ ఇప్పుడా మోడళ్లకు కష్టకాలం వచ్చినట్లే కనిపిస్తోంది. దీనికి కారణం.. ఏఐ జనరేటెడ్ మోడళ్లు రంగ ప్రవేశం చేయడమే.. అమెరికాలో ప్రముఖ దుస్తుల తయారీ బ్రాండు ఒకటి ఏఐ మోడళ్లతో రూపొందించిన ప్రచార ప్రకటనలను ప్రముఖ పత్రిక తాజా సంచికలో ప్రచురించింది. ఏఐ ఆధారిత మార్కెటింగ్ సంస్థ ఈ చిత్రాలను రూపొందించింది. ఈ చిత్రాలు అచ్చం నిజమైన అబ్బాయి, అమ్మాయిల్లాగానే ఉన్నాయి. బంగారు వర్ణపు జుట్టుతో శ్వేతజాతీయురాలిగా ఏఐ చిత్రాన్ని రూపొందించారు. ఎరుపెక్కిన బుగ్గలు, అందమైన పలువరుస, చక్కనైన చిరునవ్వుతో ఉండేలా తయారు చేశారు. ఈ చిత్రానికి అందమైన డ్రెస్ వేసి చేతిలో హ్యాండ్‌బ్యాగ్ ఉంచి ప్రచారానికి వాడుకున్నారు. ఆఫ్రో అమెరికన్ యువకుడినీ ఏఐ ఉపయోగించి సృష్టించారు. ఆ దుస్తుల సంస్థ అతడిని మోడల్‌గా వినియోగించుకుంది.

–న్యూయార్క్

నూలు దండలే.. వేయి దండాలు!





జాతి నేతల విగ్రహాలకు పూల దండలు వేయడం సాధారణంగా చూస్తుంటాం. తూర్పు గోదావరి జిల్లా సీతానగరంలో కస్తూర్బాగాంధీ ఆశ్రమంలోని మహాత్ముడు, కస్తూర్బా విగ్రహాలకు మాత్రం నూలు దండలే వేస్తారు. దశాబ్దాలుగా ఎంతోమంది ముఖ్యమంత్రులు, దేశ విదేశాల నుంచి వచ్చే ప్రముఖులూ ఇదే సంప్రదాయంలో నివాళులర్పిస్తున్నారు. ఇందుకు చిలుపలుగా పిలిచే నూలు దండలను ఆశ్రమ నిర్వాహకులు మధ్యప్రదేశ్‌లోని కస్తూర్బా ప్రధాన సేవాగ్రామ్ నుంచి తెప్పిస్తుంటారు. సీతానగరంలోని ఆశ్రమాన్ని స్వాతంత్ర్య సమర యోధులు బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం 1924లో ఏర్పాటు చేశారు. 1929 మేలో మహాత్మాగాంధీ ఇక్కడికి వచ్చి స్వాతంత్ర్య సమరయోధులకు శిక్షణ ఇచ్చారు. అప్పట్లో మహాత్ముడు నూలు వడికిన టేకు రాట్నం ఇప్పటికీ 'బాపూ కుటీరం' పేరుతో ఆశ్రమంలో భద్రంగా ఉంది.

– న్యూస్‌టుడే, సీతానగరం

అమ్మను బతికించాలని.. ఆయువు అందించాలని

8 కి.మీ. వీపునకు కట్టుకుని ఆసుపత్రికి నడిచి వెళ్లిన కుమార్తె



తల్లిని పాము కాటేసింది.. అంబులెన్సు రావడానికి రోడ్డు లేదు. ఇక అమ్మను కాపాడుకోవడానికి తానే సాహసం చేయాలని కుమార్తె సంకల్పం తీసుకుంది. ఆలస్యం చేయకుండా ఆమెను వీపునకు కట్టుకుని 8 కి.మీ. నడిచి ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఒడిశాలోని కొంధమాల్ జిల్లా బలుమాడు గ్రామంలో శుక్రవారం ఉదయం పాలమాడు అనే మహిళను విష సర్పం కాటేసింది. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో అంబులెన్స్ చేరుకోలేకపోయింది. ఆరోగ్యం వేగంగా క్షీణిస్తుండటంతో ఆమె కుమార్తె తల్లిని వీపుపై వస్త్రంతో కట్టుకుని కాలినడకన 8 కి.మీ. దూరంలో ఉన్న తుమిడిబొంధొలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లింది. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బలిగుడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పాలమాడు కన్నుమూసింది. ప్రాణం నిలవకపోయినప్పటికీ.. అమ్మ బతకాలని ఆ కుమార్తె చూపిన తెగువ, తపన అందరినీ కదిలించాయి.

– న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

దబ్బ నిమ్మ.. @ 3.3 కిలోలు



ఎర్రగడ్డ రైతుబజారులో శనివారం 3.3 కిలోల బరువున్న దబ్బ నిమ్మకాయ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లికి చెందిన రైతు శ్రీనివాస్ ఈ నిమ్మకాయను రైతుబజారుకు తీసుకొచ్చి అమ్మకానికి ఉంచారు. ఔషధాల తయారీలో దీనిని వినియోగిస్తుంటారు. జనవరిలోనూ శ్రీనివాస్ తన పెరట్లోని చెట్టుకు కాసిన 3.8 కిలోల బరువున్న దబ్బ నిమ్మను తీసుకువచ్చి రూ.600కు విక్రయించారు. మళ్లీ అదే చెట్టుకు ఈ కాయ కాసిందని తెలిపారు.

– న్యూస్‌టుడే, అమీర్‌పేట

నా కనులు నీవై.. నీ కలలు నావై..



ఈ చిత్రంలో ల్యాప్‌టాప్‌లు పట్టుకుని తోటి స్నేహితుల సాయంతో నవ్వుకుంటూ ఆనందంగా కళాశాలకు నడుస్తూ వెళ్తున్న ఈ ముగ్గురు విద్యార్థినులు పుట్టుకతోనే అంధులు. నిత్యం మరొకరి సాయం లేనిదే ఎక్కడికీ వెళ్లలేరు. అంధులైన విద్యార్థినులు ఎస్.లోకేశ్వరి, ఆర్.భవ్య (కొత్తూరు తాడేపల్లి), జె.తేజశ్విని (గూడూరు-తిరుపతి) ప్రస్తుత విద్యా సంవత్సరంలో విజయవాడలోని ఆంధ్రా లయోల కళాశాల జూనియర్ ఇంటర్మీడియట్‌లో చేరారు. తోటి వారికి సాయం చేయాలనే తాపత్రయం ఉన్న మరో ముగ్గురు విద్యార్థినులు ఆర్.వర్షిణి, జె.ప్రణీత, దివ్యలు వీరికి పరిచయమయ్యారు. కళాశాల ఆవరణంలో ఉన్న జేవియర్ హాస్టల్‌లోనే వీరంతా ఉంటారు. ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకోవడంతో మొదలు.. భోజనం పెట్టడం, కళాశాలకు, కంప్యూటర్ తరగతులకు తీసుకొచ్చి మరలా హాస్టల్‌కి తీసుకెళ్లి నిద్రపోయే వరకు ఈ ముగ్గురు అంధ విద్యార్థినులకు తోడుగా తోటి స్నేహితులు వారితోనే ఉంటారు. తమకు కళ్లు లేవని, ఈ లోకాన్ని చూడలేకపోతున్నామనే బాధ కనుమరుగయ్యేలా అన్నిటికీ అమ్మానాన్నలా దగ్గర ఉండి సంతోషంగా ఉండేలా చూసుకుంటున్న ఈ స్నేహ బంధాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని చెమర్చిన కళ్లతో చెబుతున్నారీ అంధ విద్యార్థినులు. డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా వీరి సాయంతో నేర్చుకుని భవిష్యత్తులో మంచి ఉద్యోగాల్లో స్థిరపడి తోటివారికి సాయపడతామని చెబుతున్నారు.

- ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే, కరెన్సీనగర్

1,18,629 మందికి అన్నదాత సుఖీభవ

- ఎంపీ కేశినేని చిన్ని



స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే వసంత



కవులూరులో రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కవులూరులో నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000, కేంద్ర ప్రభుత్వం రూ.6000 కలిపి ప్రతి రైతు కుటుంబానికి మూడు విడతల్లో రూ.20,000 చెల్లిస్తుందని..దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 46.86 లక్షల రైతుల కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ హాజరై మాట్లాడుతూ..సమాజంలో రైతుల పాత్ర కీలకమని, రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందిస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 'అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్' నిధులు మొదటి విడతలో 1,18,629 మంది రైతులకు రూ.80.77 కోట్లు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత రైతులు, తెదేపా నాయకులు ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లను పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అక్కల రామ్మోహన్ రావు, నూతలపాటి బాల కోటేశ్వరరావు, ఏవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరో 129 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : హేతుబద్ధీకరణ కింద జిల్లాలో నూతనంగా 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినట్టు డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 4వ తేదీలోగా జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. 5వ తేదీన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు. నగరంలోని కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 1,792 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీటిలోని 295 కేంద్రాల్లో 1200 మందికి మించి ఓటర్లు ఉన్నట్టు చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 మంది ఓటర్లు దాటితే.. నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం లేదా సమీప కేంద్రంలో విలీనం చేయాల్సి ఉందన్నారు. ప్రతిపాదిత కేంద్రాలు 129తో సహా జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,921కు చేరే వీలుందని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సగటు ఓటర్ల సంఖ్య 889గా నమోదైనట్టు పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,07,589 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు.

ప్రతిపాదనలు..	
తిరువూరు	12
వి. పశ్చిమ	01
వి. సెంట్రల్	51
వి. తూర్పు	23
మైలవరం	27
నందిగామ	12
జగ్గయ్యపేట	03

స్నేహసారథి.. సేవావారధి..!

ఒకరికి ఒకరై.. నలుగురికి వెలుగై ✧ సమష్టిగా సమాజహిత కార్యక్రమాలు


ఈనాడు, అమరావతి

'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం'..

ఓ మంచి మిత్రుడు ఉంటే.. ఈ మాటకు నిజమైన అర్థం తెలుస్తుంది. ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో మంచి స్నేహితులు దొరకడం.. దానిని కొనసాగించడం చాలా కష్టమై పోయింది. అందరూ స్మార్ట్‌ఫోన్లలో మునిగిపోతూ.. జీవితాలు సాఫీగా సాగిపోతున్నా ఎంతో మంది ఒంటరిగా ఉంటున్నారు. ఏదైనా కష్టం వస్తే.. మన కోసం నిలబడే స్నేహితుని బలమేంటో తెలుస్తుంది. చాలామంది ప్రస్తుతం కష్టమొచ్చినా.. చెప్పుకొనే మిత్రులు లేక ఒంటరిగా మిగిలిపోతూ.. తమలో తాము కుమిలిపోతున్నారు. ఇదే సమయంలో మంచి మిత్రులు ఉన్న చాలామంది.. కష్టాల్లో.. విజయాల్లో.. చేదోడువాదోడుగా ఉంటూ.. జీవితంలోని ప్రతి దశనూ తేలికగా దాటేస్తున్నారు. సమాజానికి సైతం తాము తోడ్పాటు అందిస్తున్నారు.

ఊపిరి నిలిపిన స్నేహం..

విజయవాడ, బందరులో చాలామంది మిత్రులు కలిసి.. సంఘాలుగా ఏర్పడి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకున్న కొంతమంది మిత్రులు విదేశాల్లో గొప్ప వైద్యులుగా స్థిరపడినా.. ఇప్పటికీ కలిసికట్టుగా సమాజహిత కార్యక్రమాలు చేపడుతున్నారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.2 కోట్లకు పైగా వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్లు పెట్టించారు.



విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జి.పవన్‌కుమార్

అక్షర సేవలో.. నీవున్నావ్ నేస్తమా..

విద్యాధరపురం: ఏపూరి పవన్ కుమార్.. తెనాలిలో జడ్పీ.. ఈయన విద్యాభ్యాసం దశవాయు సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్లో చదివారు. పవన్ కుమార్, పింగళి వెంకయ్య మునిమనవడు.. మునిపల్లి వెంకటేశ్వరరావు (పండు), కుప్పాబాల సుబ్రహ్మణ్య శ్రీనివాస్ స్నేహితులు. వేర్వేరు చోట్ల స్థిరపడినా సెలవుల్లో ఒక్కచోటుకు కలిసేవారు. 2021లో కొవిడ్ వేళ ఓ రోజు వేకువన పండు ఫోను చేసి ఆక్సిజన్ లేకపోతే చనిపోతానురా అని దీనంగా మాట్లాడటంతో పవన్‌కుమార్ ఒళ్లు జలదరించింది. తెల్లవారే దాక స్నేహితుడిని బతికించమని దేవుళ్లకు మొక్కారు. సహచర న్యాయమూర్తుల సహకారంతో ఆక్సిజన్ సమకూర్చినా బతికించుకోలేక పోయారు. అందుకే ఏటా స్నేహితుడి జయంతి రోజున తాము చదివిన పాఠశాలలోనే చైతన్య, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మిత్రుల కుటుంబాల్లో వెలుగులు...



స్నేహానికి ప్రతీకగా ఈ మిత్ర బృందం

మూడు దశాబ్దాల కిందట చదువులమ్మ నీడలో అక్షరసుమాలు నేర్చారు. ఇంతింతై ఎదిగి.. దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కృష్ణా సిమెంట్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఎడ్యుకేషన్ సొసైటీ.. ఉన్నత పాఠశాలలో 1986-87 పదో తరగతి మిత్రబృందం వీరంతా.. వీరిలో ఒకరైన నున్న గ్రామవాసి లక్ష్మారెడ్డి చొరవతో దశాబ్దం పైగా మళ్లీ అందరూ ఏకతాటి మీదకు వచ్చి.. దీనులకు ఆపన్నహస్తం అందిస్తూ ఆత్మీయ సేవాపథంలో సాగుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా ఇతర దేశాల్లో వివిధ కొలువులు, వ్యాపారాల్లో ఉన్న వీరు.. సోషల్ మీడియా వేదికగా స్నేహానికి, సేవలకు ప్రాణం పోస్తున్నారు. పేద మిత్రుల పిల్లల ఉన్నత చదువులకు సాయం, ఉద్యోగ అవకాశాల కల్పన, కెరీర్ గైడెన్స్ అవగాహన, మిత్రులు ఎవరైనా అనారోగ్యానికి గురైనా లేదా చనిపోయినా ఆర్థిక సాయం చేస్తున్నారు. స్నేహ బంధంతో ఒకరికి ఒకరు అండగా నిలవడమే అసలైన దోస్తీ అని మిత్రబృందంలో ఒకరైన కొత్తపేట కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. – చిట్టినగర్, న్యూస్‌టుడే



అపూర్వ స్నేహం.. ఆధ్యాత్మిక పరిమళం

పెడన జ్ఞాన కోటయ్య జడ్పీ హైస్కూలు 1975-76 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అరుపదుల వయసులోనూ తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన 60 మంది వృత్తి, ఉద్యోగరీత్యా వివిధ రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. తమ స్నేహానికి గుర్తుగా పెడనలో గత 14 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిధులు సమకూర్చుతూ ప్రతి నెలా రెండో శనివారం 300 మంది పేదలకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నారు. అలాగే పేద విద్యార్థులు, అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. వీళ్లంతా ఏటా పెడన గ్రామదేవత పైడమ్మ ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో సంప్రదాయ పద్ధతిలో హాజరై ఐక్యత చాటుతున్నారు. -న్యూస్‌టుడే, పెడన

నిలకడగా కృష్ణా నది వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువున ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం శనివారం నిలకడగా ఉంది. మధ్యాహ్నం 3 గంటలకు ఎగువ నుంచి 2,07,604 క్యూసెక్కులు రాగా, 5 గేట్లను 5 అడుగులు, మిగతా 65 గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,89,625 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇదే పరిస్థితి సాయంత్రం వరకు కొనసాగింది. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 17,979 క్యూసెక్కుల సాగునీటిని ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు(కేఈ) 10,271, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు(కెడబ్ల్యూ) 7,508, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 5,017, బందరు 1,911, కేఈబీ 1,832, ఏలూరు కాల్వలకు 1,511 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

తనిఖీలకు వెళ్లలేదని ఆగిన పింఛను

నందిగామ, న్యూస్‌టుడే: తనిఖీలకు వెళ్లలేకపోయిన దివ్యాంగులకు జులై నెల పింఛనును అధికారులు నిలిపివేశారు. జనవరి నుంచి వైద్య బృందాలు దివ్యాంగుల పింఛనుదారుల ధ్రువపత్రాలను తనిఖీ చేస్తున్నారు. తనిఖీకి రావాలని రెండు కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు సెర్ప్ నుంచి సమాచారం వచ్చింది. వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. ప్రక్రియ వాయిదా వేసినట్లు నందిగామలో కొందరు వార్డు సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఆగిపోయారు. ఫలితంగా ఒక్క నందిగామలోనే 119 మంది దివ్యాంగులకు పింఛను ఆగిపోయింది. వారిలో ఎనిమిదో వార్డుకు చెందిన శనగవరపు సాయి సాకేత్ ఉన్నాడు. నూరు శాతం వైకల్యంతో పుట్టినప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. వాస్తవంగా అతనికి రూ.15 వేలు పింఛను రావాలి కానీ రూ.6 వేలే ఇస్తున్నారు. ఈ సారి అది కూడా ఆగిపోవడంతో మందులకు ఇబ్బందిగా ఉందని తల్లి సౌజన్య వాపోయారు. రైతుపేట డౌన్‌కు చెందిన అంధ యువకుడికి కూడా పింఛను రాలేదు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూడా బాధితులు ఉన్నారు. కమిషనర్ లోవరాజు మాట్లాడుతూ... పింఛను ఆగిపోయినవారి వివరాలు పంపించామని, పరిశీలించి అందరికీ ఇస్తారని చెప్పారు.



మంచానికే పరిమితమైన సాయిసాకేత్

డీఎస్సీ క్రీడా కోటా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

విజయవాడ క్రీడలు: మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన విజయవాడలో శనివారం చేపట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి 1221 మంది ఐజీఎంసీ స్టేడియం డీఎస్ఏ కార్యాలయం వద్ద పరిశీలనకు వచ్చారు. ఇది రెండు రోజులు కొనసాగుతుందని చెప్పినా అభ్యర్థులంతా ఒకే రోజు వచ్చారు. ఒక్కో అభ్యర్థి అకడమిక్, క్రీడా ధ్రువపత్రాల పరిశీలనకు ఎక్కువ సమయం పట్టింది. దీంతో శనివారం ప్రక్రియ పూర్తయ్యేలా లేకపోవడంతో అందరి ధ్రువపత్రాలు పరిశీలించాలని అభ్యర్థులు నినాదాలు చేయగా ఉద్రిక్తత నెలకొంది. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 8 గంటల వరకు సుమారు 600 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు సరిచూశారు. ఆదివారం కూడా పరిశీలన కొనసాగుతుందని అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చారు. శాప్ పరిపాలనాధికారి ఆర్.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ.. పత్రాల పరిశీలన పూర్తయ్యాక ప్రాధాన్య క్రమంలో జాబితా వెల్లడిస్తాం. అభ్యంతరాలు ఉంటే వారంలోగా చెబితే.. అభ్యంతరాలు పరిశీలించి.. తుది జాబితాను రాష్ట్ర విద్యాశాఖకు సమర్పిస్తామన్నారు.



పత్రాలు సరిచూస్తున్న అధికారులు

జయంతిపురంలో.. బ్రహ్మోస్ మిసైల్స్!

జగ్గయ్యపేట డిఫెన్స్ క్లస్టర్‌లో తయారీ యూనిట్ ◆ రెండుసార్లు వచ్చి పరిశీలించిన కేంద్ర బృందాలు

ఈనాడు, అమరావతి

జగ్గయ్యపేట నియోజకవర్గంలో డిఫెన్స్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల బ్రహ్మోస్ క్షిపణుల తయారీ సంస్థ ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ డిఫెన్స్ కార్పొరేషన్ సీఎండీ ఆధ్వర్యంలోని బృందం వచ్చింది. కొద్దికాలం కిందట తొలిసారి ఈ బృందం జగ్గయ్యపేటలో పర్యటించింది. తాజాగా రెండోసారి వచ్చి వెళ్లారు. దీంతో బ్రహ్మోస్ క్షిపణుల తయారీ యూనిట్‌ను ఇక్కడ నెలకొల్పేందుకు మార్గం సుగమమైందని తెలుస్తోంది.

అంతేకాదు.. మరికొన్ని కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలు కూడా ఇక్కడ తమ యూనిట్లను ఏర్పాటు చేసే పనిలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు 2025 మే 19న కేంద్రానికి రాసిన లేఖలోనూ.. ఇదే విషయం ప్రస్తావించారు. జగ్గయ్యపేట పరిధిలో ఉన్న భూముల్లో మిసైల్స్, ఆయుధ తయారీ పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. ఈ నేపథ్యంలోనే వరుసగా రెండుసార్లు బ్రహ్మోస్ ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని సందర్శించడంతో.. తమ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతమంతా పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైంది. రైలు, విమానం, రహదారి కనెక్టివిటీ పుష్కలంగా ఉన్న ప్రాంతం. హైదరాబాద్ నుంచి గంటల వ్యవధిలో చేరుకోవచ్చు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ఏపీఐఐసీ ఖాళీ భూములు వేల ఎకరాల్లో ఉన్నాయి. అందుకే డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు ఇక్కడ అత్యంత అనుకూలమని గుర్తించి.. కేంద్రానికి నివేదిక సమర్పించింది. తాజాగా తెదేపా ఎంపీల బృందం కూడా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

దేశీయంగా ప్రత్యేక గుర్తింపు... జగ్గయ్యపేట పరిధిలోని జయంతిపురంలో 800 ఎకరాలు, పెద్దవరంలో 1200 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న ఈ భూముల్లోనే ఇప్పుడు రక్షణ రంగ పరిశ్రమలను నెలకొల్పబోతున్నారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ సంస్థ ఇక్కడ ఏర్పాటైతే.. దేశీయంగా జగ్గయ్యపేటకు ప్రత్యేక గుర్తింపు రాబోతోంది.



రక్షణ రంగ పరిశ్రమలు కొలువుదీరే ప్రాంతమిదే..

భారీగా ఉపాధి అవకాశాలు...

ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటికే రూ.400 కోట్లతో లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌క్యాప్) ఆధ్వర్యంలో తోళ్ల ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది. దీంతోపాటు తాజాగా డిఫెన్స్ క్లస్టర్ రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. మరోవైపు జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్ సిటీ)లోనూ మొదటి టవర్‌ను రెండు నెలల్లో పూర్తిచేసి.. ఆరంభించాలనేది లక్ష్యం. వెరసి ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా అందుబాటులోకి రాబోతున్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం..

జయంతిపురం, పెద్దవరం పరిధిలో ప్రభుత్వ, ఏపీఐఐసీ భూములు వేల ఎకరాల్లో ఉన్నాయి. ఇక్కడ డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు కానుంది. ఇప్పటికే బ్రహ్మోస్ క్షిపణుల బృందం రెండుసార్లు ఇక్కడికి వచ్చి పరిశీలించి వెళ్లింది. మరికొన్ని సంస్థలు కూడా రాబోతున్నాయి. రవాణా, రాకపోకలకు అత్యంత అనుకూల ప్రాంతం కావడంతో.. పరిశ్రమల ఏర్పాటుకు ఎక్కువ మంది సుముఖత చూపిస్తున్నారు.

- జి.లక్ష్మీశ, కలెక్టర్

ఎన్‌హెచ్-65... పున్నమిఘాట్ వరకు విస్తరణ

ఆరు వరసలుగా మరో నాలుగు కిలోమీటర్లు ★ డీపీఆర్ తయారీకి కేంద్ర మంత్రి గడ్కరీ ఆదేశం

ఈనాడు, అమరావతి: ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా భవానీపురంలోని పున్నమిఘాట్ వరకు విస్తరించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరం నడిబొడ్డు వరకు వస్తున్నందున రహదారి మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలనీ.. అవసరమైన నిధులు ఇస్తానని మంత్రి.. ఎంపీ చిన్నికి చెప్పడంతో మార్గం సుగమమైంది.

అవాంతరాల నుంచి అద్భుతాల వైపు... ఎన్‌హెచ్-65 హైదరాబాద్ నుంచి మల్కాపురం వరకు 40 కి.మీ మేర ఆరు వరసలుగా ఉంది. మల్కాపురం నుంచి గొల్లపూడి పశ్చిమ బైపాస్ వరకు 226 కిమీ నాలుగు నుంచి ఆరు వరసలకు విస్తరించాలని గతంలో ప్రతిపాదనలు ఉన్నాయి. ఇదేసమయంలో గొల్లపూడి వరకు కాకుండా ఓఆర్ఆర్ క్రాస్ అయ్యే కంచికచర్ల వరకే విస్తరించే ప్రతిపాదనను ఎన్‌హెచ్ అధికారులు తెర మీదకు తెచ్చారు. దీనిపై ఎంపీ చిన్ని.. సీఎం చంద్రబాబు, కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం సైతం గొల్లపూడి వరకు ఆరు వరసలు విస్తరించాలని లేఖ రాయగా కేంద్రం ఆమోదించింది. ఎంపీ శివనాథ్ మరో అడుగు ముందుకేసి ఆరు వరుసల విస్తరణ విజయవాడ వెలుపలకే పరిమితం చేయకుండా భవానీపురంలోని పున్నమిఘాట్ వరకు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. శనివారం మంగళగిరిలో జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గడ్కరీ ఆ ప్రతిపాదనకు మౌఖికంగా ఆమోదం తెలిపారు. దీంతో రహదారి విస్తరణ నగరంలోకి రావడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.



గడ్కరీకి జ్ఞాపిక ఇస్తున్న ఎంపీ శివనాథ్


ట్రాఫిక్ కష్టాలకు మోక్షం.... తాజా నిర్ణయంతో ఆరు వరసల విస్తరణ మరో నాలుగు కిలోమీటర్ల మేర పెరగనుంది. గొల్లపూడి నుంచి దుర్గగుడి వంతెన వరకు విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ప్రయాణికులు, వాహనదారులకు నరకం కన్పిస్తోంది. ప్రస్తుత నిర్ణయంతో భవానీపురం వరకు ఆరు వరసలు వస్తుంది. అక్కడ నుంచి దుర్గగుడి పై వంతెన మొదలవుతుంది. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చే వారికి, దర్శనానికి వచ్చేవారికి, నగరంలో ప్రయాణించేవారి ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దొరికినట్లయింది. ఎన్టీఆర్ జిల్లా... వివిధ శాఖల కార్యాలయాలు గొల్లపూడిలో ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వెళ్లి వచ్చే కష్టాలు తీరనున్నాయి. నగరంలో నాలుగు కిమీ విస్తరణలో సుందరీకరణ పనులతో ఆహ్లాద ప్రయాణం దరిచేరి... కాలుష్యానికి చెక్ పడనుంది.

వివిధ పనులకు శంకుస్థాపన

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు మంగళగిరిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శనివారం శంకుస్థాపనలు చేశారు. * ఇబ్రహీంపట్నం-చంద్రగూడెం మార్గంలో కిలోమీటరు మేర రూ.36 కోట్లతో రెండు వరసల ఆర్వోబీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ★ ఎన్‌హెచ్-216, 65 జాతీయ రహదారుల్లోని యెండపల్లి, పెందూరు, యాజిలి, చదలవాడ, బందరుల్లో ఏర్పాటైన బైపాస్‌ల పరిధిలో అక్కడక్కడ మెరుగుకు 3 కిమీలకు రూ.6 కోట్లు కేటాయించగా... దీనికి కూడా శంకుస్థాపన చేశారు. ★ పామర్రు పట్టణంలో ఏడు కిలోమీటర్ల బైపాస్‌ను రూ.7 కోట్లతో అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. ★ రూ.6,700 కోట్లతో విజయవాడ-హైదరాబాద్, రహదారి ఆరు వరసల విస్తరణ, రూ.2,600 కోట్లతో విజయవాడ-మచిలీపట్నం రహదారి ఆరు వరసల విస్తరణ, పెడన-లక్ష్మీపురం రహదారి రూ.4,200 కోట్లతో నాలుగు వరసల విస్తరణ తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల్సిందే

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధనకు ఆటంకంగా ఉన్న అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, 12వ పీఆర్సీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే 'చలో డైరెక్టరేట్' కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. మరో బీఆర్టీఎస్ రోడ్డు ఉద్యమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్టీయూ నాయకుడు కె.ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పీఆర్సీ వేస్తామని, డీఏలు ఇస్తామని.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాండురంగ వరప్రసాద్, పి.కృష్ణయ్య, ఆర్.రాంబాబు, వి.రాధిక, మనోహర్‌కుమార్, సయ్యద్ ఖాసీం, జి.రామారావు, ఆర్.రాంబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం నాయకులు కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతి పత్రం సమర్పించారు.



ధర్నాలో ఫ్యాప్టో నాయకులు తదితరులు

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

BUSINESS OFFER

Learn, Earn Money Online & Offline. Investment: 22K-5L, Affiliate/ Refer, Franchise. 96521 38542, 99089 81464, 9515214921. www.IndiaStudent.Com

FURNITURE

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001 : 2015 Certified CO. House Hold Goods Shifting any time any where. ✆ 97043 64389, 92900 87673.

TENDER

SCRAP ITEMS FOR DISPOSAL

Scrap items like Mixed Assorted Iron, Aluminium Cable Scrap, Manganese, HRCS, Used Fork Lift, Conveyor Belt, Electrical, Electrical Motor Scrap, SS Scrap, Cast Iron, Bearing Scrap, GI Scrap, Tyres, Light Scrap, Automobile Scrap, Refractory Bricks, Empty Plastic Barrels etc. are available at our Units located at Ramapuram Village, Kodad Taluq, Nalgonda Dist & Sreepuram, Boincheruvupalli Village, Peapully Mandal, Kurnool Dist. Interested parties may participate in the sale. You may collect tender form on payment of Rs.1,000/- (non refundable) by DD in favour of "Rain Cements Limited, Hyderabad" on or before 08.08.2025

For further details you may contact : K.SAMBASIVA RAO General Manager (M.M.)

RAIN CEMENTS LIMITED
34, Rain Center, Srinagar Colony, Hyd'bad- 500073 Ph.040-4040 1217/1234 Mobile: 9705807711

SOLAR PRODUCTS

WEBSITES

Basic Website 999/- Franchise available Call: 9700106956

BUILDING CONSTRUCTION

APLRS-2025 ... Anclsoon Infra Tech, Architects & Engineers (AP & TG). ✆ +91-94917 55466.

గమనిక

TDR
AP & TELANGANA BONDS BUY & SALE
KAMESH
92 92 15 15 15

Raghava Constructions. We do Building Contracts on Turn key Basis for VMC/ APCRDA Approvals, Vasthu plans Elevations & Structural Designs. ✆ 98851 12999.

BPS ... LRS ...
✆ 74161 78777

V.S. బిల్డర్స్ ... ✆ 95818 26633.

PAINTING

... 92905 78544.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504.

COMPUTER EDUCATION

English Document Typing for Bulk Works, Data Entry, Project Reports, Online Applications. Contact ✆ 99665 38885.

EDUCATION

➤ లిక్విడ్ డైట్స్, ఫాస్టింగ్ డైట్స్ వంటివి అస్సలు చేయకూడదు.

➤ మన శరీరానికి కావాల్సిన శక్తి ఆహారం ద్వారానే లభిస్తుంది. అలాంటిది మీల్‌గ్యాప్ పేరుచెప్పి 16 గంటలు, 20 గంటలు తినకుండా ఉంటున్నారు. అది సరైన పద్ధతి కాదు.

➤ ఏ డైట్ అయినా సరే రోజుకు 3 సార్లు ఆహారం తీసుకోవాల్సిందే. అది ఏం తింటాం, ఎలా తింటాం, ఎంత తింటాం అనేది తర్వాత విషయం.

➤ ప్లేట్‌లో పావుశాతం ధాన్యాలు, పావుశాతం ప్రొటీన్ ఇచ్చే ఫుడ్, సగం కూరగాయలు - పండ్లు ఉండటం అనేది అత్యంత అనుసరణీయం.

➤ ఎలా తిన్నా బ్రేక్‌ఫాస్ట్ ఉదయం 7-9.30, లంచ్ మధ్యాహ్నం 1-2, డిన్నర్ సాయంత్రం 7-9 గంటల్లోపు తినాలి. టైమ్‌కి తినడం కూడా చాలా అవసరం. ఇంతకంటే మరీ ముందు, వెనక తినాల్సిన అవసరం లేదు.

➤ తినే ఆహారం మోతాదు మాత్రమే తగ్గించాలి, ఏ మీల్‌నూ పూర్తిగా మానేయకూడదు.

➤ ఒకవేళ తిండి తినకుండా తగ్గిపోయినా.. మళ్లీ వెంటనే బరువు పెరిగిపోతారు.

➤ నట్స్ కూడా చాలా పరిమితంగా తీసుకోవాలి. రోజుకు ఐదారు పలుకులు మాత్రమే.

➤ వయసు, చేసే పని, స్త్రీలా పురుషులా అన్నదాన్నిబట్టి ఒక్కో శరీరం ఒక్కోలా స్పందిస్తుంది. పక్కవారిని చూసి ఎప్పుడూ ఫాలో అవ్వొద్దు.

➤ కొందరు ఫ్రూట్ డైట్ అని కేవలం పండ్లు తింటుంటారు. ఇది కూడా సరికాదు.

➤ మిల్లెట్స్ ఒకరోజు మొత్తంలో మనం తీసుకునే ఆహారంలో మూడోవంతు మాత్రమే ఉండాలి. అంతకంటే ఎక్కువ తింటే దాన్ని జీర్ణించుకోవడానికి శరీరం ఇబ్బంది పడుతుంది.

➤ ప్రత్యేకంగా అవసరాలు లేకుండా ప్రొటీన్ ఎక్కువ తినాల్సిన పని లేదు. రోజూ తినే ఆహారంలో ఉండే ప్రొటీన్ సరిపోతుంది.




➤ ఏదీ అతి ఎక్కువగా చేయకూడదు. అధిక బరువు ఉన్నాం అని భావిస్తే.. రోజూ తినే ఆహారం కాస్త మోతాదు తగ్గించడం, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం, నడక వంటి తేలికపాటి వ్యాయామాలు చేయడం, నెమ్మదిగా తగ్గడం మాత్రమే సరైన పద్ధతి. వేరే ఏ షార్ట్‌కట్స్ పాటించినా అవి శరీరానికి చేటే చేస్తాయి.



- డా.అవుల లక్ష్మయ్య, పూర్వ సీనియర్ సైంటిస్ట్, ఐసీఎంఆర్ - ఎన్ఐఎన్.

గోంగూర కారప్పూస!




తెలుగువారికి గోంగూరతో ఉన్న అనుబంధం నేటిది కాదు. స్వచ్ఛమైన తాజా గోంగూర కనిపిస్తే పచ్చడి నూరేయాలనో, పొడి దంచేయాలనో మనసు తహతహలాడిపోతుంది. కానీ మనకు ఇంతగా నచ్చే గోంగూరను ఇతర రాష్ట్రాల్లో వాడేది కాస్త తక్కువే!

ఇదే సమయంలో సేవ్ పేరుతో కారప్పూస దేశమంతా వాడుకలో ఉంది. కానీ అంతగా నూనెలో వేగే కారప్పూస కరకరలాడుతూ ఉంటుందే తప్ప ప్రత్యేకమైన ఫ్లేవర్ అంటూ ఏం ఉండదు. ఈ రెండింటినీ కలిపితే 'గోంగూర కారప్పూస' సిద్ధమవుతుంది.

బియ్యంపిండి, శనగపప్పు, మినప్పప్పు, కొత్తిమీర, జీలకర్ర, వెల్లుల్లి, గోంగూర ఆకులు, ఎండుమిర్చి, ఉప్పు, కరివేపాకు, ఆవాలు, మెంతులు, ఇంగువ, నూనె ఉంటే చాలు.. పుల్లపుల్లగా, కారంకారంగా కరకరలాడే గోంగూర కారప్పూస రెడీ. మామూలుగా పూస చేసి దానిమీద గోంగూర పొడి చల్లడం ఒక పద్ధతి. అయితే కొత్త రెసిపీ కదా.. ఇంకా కొత్తగా, సులభంగా ఎలా చేయొచ్చో మనమూ ప్రయోగాలు చేసేయొచ్చు. ఇలా మరిన్ని పొడులతో వచ్చే ఫ్లేవర్లు ఏం ఉన్నాయో కూడా కనిపెట్టవచ్చు.'

– నేహా అల్లూరి, కో-ఫౌండర్, ది మండువా ప్రాజెక్ట్

వంట-ఫన్‌టా



'అరె పాయసంలో కాస్త పెరుగు ఎక్కువైంది, అంతేకదా! దానికే అన్ని మాటలు అనేస్తారా? ఏంటో ఈ ఇంట్లోవాళ్లు. మొన్న కూడా అలాగే, జ్యూస్‌లో జాపత్రి వేశానని ఒక్కటే గోల. ఏదైతే ఏం, గుటక వేస్తే అదే లోపలికి పోతుందంటే వినరు. అయినా వంట ఎప్పుడూ ఒకేలా ఎందుకు చేయాలి చెప్పండి? ఇప్పుడూ... చారులో కరివేపాకు లేదనుకోండి, పెరట్లో ఉన్న వేపాకు రెబ్బలు రెండు దూసి వేసేయడమే. కూరలో కారం ఎక్కువైందనుకోండి, దానికి పోటీపడేలా ఉప్పు కూడా తట్టెడు తగిలిస్తే సరిపోతుంది కదా, దానికి ఎందుకు బెంగ?

అయినా వంట చేయడం కూడా ఒక కళ అంటారు కదా.. అందుకే మొన్న పక్కింటి శశికళను కలిశా. తనేమో.. బెండకాయ స్టైల్లో బంగాళదుంప కుర్మా కలిపి బెంబ్రాస్టై అనే ఓ కొత్త వంటకాన్ని కొలంబస్ అంత గొప్పగా కనిపెట్టింది. ఆ అపురూప సృష్టికి ఆశ్చర్యపోయి ఆమెనే ఆదర్శంగా తీసుకుని పక్కనున్న ఆదర్శనగర్ కాలనీలో ఆరుకిలోల ఆలు అర్జెంటుగా కొనితెచ్చేశా తెలుసా! ఇలాంటి మేటి ప్రయోగాలు ప్రతి కిచెన్‌లోనూ జరిగినప్పుడే కదా భవిష్యత్తు తరాలకు బంగాళా భౌభౌ వంటి అద్భుతమైన రెసిపీలు దొరికేదంటే ఒక్కరూ నమ్మరే.

సర్లెండి... నాకు ఫ్రూట్ కేక్‌కి పోపు పెట్టే టైమ్ అయ్యింది, మళ్లీ వస్తా బై బై'

– వెరైటీ వంటలవల్లి

ఊరించే ఉగ్గాని దోశ

దోశ పేరు చెప్పగానే దేహానికి కొత్త ఉత్సాహం వచ్చేస్తుంది. అందునా దానిమీద ఉల్లిపాయ తరుగు అలా అలా చల్లి ఇస్తే.. దాన్ని తుంచి నోట్లో వేసుకుంటే.. ఇది కదా స్వర్గం అనిపించకమానదు. కారందోశ, ఎగ్‌దోశ, పులిహోర దోశ అంటూ ఇందులో ఎన్ని వెరైటీలో! కానీ రాయలసీమ రుచి ఉగ్గానిదోశ మాత్రం మరింత స్పెషల్ అనే చెప్పాలి.



● అనంతపురం నగరంలోని రెండు, మూడు టిఫిన్ సెంటర్లలో దొరికే ఈ దోశను ఆస్వాదించడానికి ఉదయం వేళల్లో జనం పోటీ పడుతుంటారు. టిఫిన్లలో రాయలసీమ జిల్లాల్లో దోశ, ఉగ్గాని ఎక్కువగా లభిస్తాయి. ఈ రెండింటినీ కలిపి ఓ కొత్త వెరైటీని తయారుచేయాలని అనంతపురం నగరానికే చెందిన ఆదిమూర్తి ఆలోచించారు. ఆయన 25 ఏళ్ల క్రితం నుంచి ఈ దోశ అమ్ముతున్నారు. క్రమేణా నగరంలోని పలు టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఈ దోశ వెరైటీని తమ మెనూల్లో చేర్చారు. హైదరాబాద్‌లోని కొన్ని హోటళ్లలో ఉగ్గాని దోశ రుచి నగరవాసులకు దొరుకుతోంది.

– అంజప్ప, ఈనాడు-అనంతపురం

తెలుసుకోండి.. మలుచుకోండి!


రేపటి నుంచి ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం

కానూరు, తాడిగడప, పోరంకి, న్యూస్‌టుడే

కృష్ణా జిల్లాలో కళాశాలలు: 30
సీట్లు: 19,200

ఇంజినీరింగ్ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తవడంతో ఈ నెల 4 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభంకానున్నాయి. విద్యార్థులు తొలి ఏడాది నుంచే తగిన ప్రణాళికతో చదవడంతోపాటు స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, సృజనాత్మకంగా వ్యవహరిస్తే ఉత్తమ మార్కులతో ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా అందుకోవడం ఖాయం. తద్వారా మంచి కొలువు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

స్వీయ సముపార్జన ముఖ్యం



మొదటి సంవత్సరం నుంచి విద్యార్థులు స్వీయ సముపార్జనకు ప్రాధాన్యం ఇవ్వాలి. బేసిక్స్‌పై పట్టు సాధించాలి. ఏఐ టెక్నాలజీ, కోడింగ్‌పై అవగాహన పెంచుకోవాలి. నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. **- కొండపల్లి శివాజీ బాబు, ప్రిన్సిపల్, పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ**

ప్రాంగణ ఎంపికల శిక్షణ అవసరం



ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తయ్యే సరికి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. అంతర్జాతీయ పత్ర సమర్పణలు, పరిశోధనలు గమనించాలి. ప్రఖ్యాత సంస్థలు 80 శాతం వారినే తీసుకుంటున్నాయి. రెండో సంవత్సరం నుంచి ప్రాంగణ ఎంపికల శిక్షణ తీసుకోవాలి. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **- డి.రాజేశ్వరరావు, సీఎస్ఈ విభాగాధిపతి, వీఆర్ సిద్ధార్థ విశ్వవిద్యాలయం**

కొలువులపై దృష్టి సారించాలి



నైపుణ్యం ఉన్న విద్యార్థులకే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. కోడింగ్‌పై పట్టు సాధించాలి. ఏ బ్రాంచి చదివినా సాఫ్ట్‌వేర్ కొలువులు వస్తాయి. అందుకు తగినట్లు సర్టిఫికేషన్ కోర్సులు చేయాలి. సీనియర్ విద్యార్థులు, అధ్యాపకుల సూచనలు పాటించి, అనుమానాలు నివృత్తి చేసుకోవాలి. **- ఎన్వీ సురేంద్రబాబు, రాష్ట్ర ప్రాంగణ ఉపాధి అధికారుల సమాఖ్య అధ్యక్షుడు**

లక్ష్య సాధనపై స్పష్టత ఉండాలి



మొదటి సంవత్సరం నుంచే లక్ష్య సాధనపై స్పష్టత ఉండాలి. ఏ మాత్రం అలసత్వం చూపినా పోటీలో వెనుకబడతారు. రెండు, మూడో సంవత్సరాల్లో కోర్ సబ్జెక్టులపై పట్టు సాధించాలి. ఇంటర్నల్స్, ల్యాబ్స్‌లో మొదటి నుంచే మంచి స్కోరు సాధించాలి. **- కొర్రెపాటి సాయి రోహిత్, ఎండీ, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల**

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా..



మొదటి సంవత్సరం నుంచే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి. కోడింగ్‌పై ఎంత పట్టు ఉంటే అంత మంచిది. బృందంతో కలిసి పనిచేసేలా అలవాటు చేసుకోవాలి. **- కె.ఆనంద్ నారాయణన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఫ్లింట్రాన్, చెన్నై**

విలువలకు అద్దంపట్టిన 'మట్టి మనిషి'



నాటికలో ఓ సన్నివేశం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : తెలుగునాట సుప్రసిద్ధ రచయిత వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచిన 'మట్టి మనిషి' నవలను నాటిక రూపంలో మలిచామని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ వెల్లడించారు. శనివారం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో అరసం ఆధ్వర్యంలో జాషువా సాంస్కృతిక వేదిక, కృష్ణవేణి క్రియేషన్స్, ఫొటో ఇండియా, అరవింద ఆర్ట్స్ తదితర సాహిత్య, సాంస్కృతిక సంఘాల సమన్వయంతో ఈ నాటికను ప్రదర్శించారు. 'మాస్టర్ పీస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ కాలమ్‌లో ప్రస్తావించిన ఈ రచన.. నన్నయ్య నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో అగ్రగణ్యమైన రచనల్లో 13వ స్థానాన్ని సంపాదించిందని నిర్వాహకులు తెలిపారు. రైతు, భూమి మధ్య ఉన్న పేగు బంధం తెగిపోతే, ఉత్పత్తి సాధనం అయిన భూమి.. వ్యాపార సాధనంగా మారిపోతుందని, సమాజంలో విలువలు ఎలా దెబ్బతింటాయో వివరించారు. హైదరాబాదుకు చెందిన మిత్రా క్రియేషన్స్ కళాకారులు చక్కగా నటించారు. ఎస్.ఎం. బాషా దర్శకత్వం వహించారు. సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, సాహిత్య రంగ ప్రతినిధులు చుక్కపల్లి అరుణ్ కుమార్, పి.మధు, పిన్నమనేని మురళీ కృష్ణ, కొప్పర్తి రాంబాబు, పరుచూరి అజయ్‌కుమార్, గుండు నారాయణ, ఎం.సి.దాసు, బి.జయప్రకాశ్, పి.చంద్ర నాయక్, బి.జమీందారు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 'ఆజాదీ కా ఆఫర్'


చుట్టుగుంట, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు నెలలో బీఎస్ఎన్ఎల్ 'ఆజాదీ కా ఆఫర్'ను ప్రవేశపెట్టిందని ఏజీఎం పి.రాజు తెలిపారు. ఈ నెలలో బీఎస్ఎన్ఎల్ కొత్త సిమ్ పూర్తిగా ఉచితమని, రూ.1తో రీఛార్జి చేసుకుంటే 30 రోజుల పాటు అపరిమిత కాల్స్, ప్రతి రోజూ 2 జీబీ డేటా వర్తిస్తుందని చెప్పారు. ఇతర ఆపరేటర్ నుంచి పోర్ట్ అయిన వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందన్నారు. వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రం లేదా రిటైలర్‌ను సందర్శించి ఉచిత ఆఫర్‌ను పొందవచ్చన్నారు. 4జీను ప్రారంభించిన తర్వాత.. డేటా స్పీడ్‌లో మెరుగైన వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. ఇది వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుందని చీఫ్ జనరల్ మేనేజర్ బుంగా రవికుమార్ తెలిపారు.

అసహజ లైంగిక వేధింపులు.. భర్తపై కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతిని శారీరకంగా, మానసికంగా వేధించటమే కాకుండా సభ్యసమాజం సిగ్గుపడేలా లైంగికంగా వేధిస్తున్న భర్తపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయోధ్యనగర్‌కు చెందిన యువతి.. న్యూగిరిపురానికి చెందిన అనిల్‌కుమార్‌ను 2008లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈమె.. ఓ ప్రైవేట్ కంపెనీలో హెచ్ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. భర్త పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. కొంతకాలం బాగానే చూసుకున్నాడు. తర్వాత కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో రూ.20లక్షల వరకు తెచ్చారు. అయినా ప్రవర్తన మార్చుకోకుండా వేధిస్తున్నాడు. వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటికే తీసుకువచ్చే వాడని భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అసహజ లైంగిక ప్రవర్తనతో వేధించేవాడని, నిరాకరించడంతో ఒక రోజు ఇంట్లో గ్యాస్ వదిలేసి చంపుతానని బెదిరించాడు. మామ కూడా వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించేవాడంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల శిక్షల్లో ప్రాసిక్యూషన్‌దే కీలకపాత్ర

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ బాధితుల హక్కుల పరిరక్షణతో పాటు నిందితులకు కఠిన శిక్షలు పడడంలో ప్రాసిక్యూషన్ కీలకపాత్ర పోషించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతి కేసులో బాధితుడికి గౌరవనీయమైన న్యాయం కల్పించడం, నిందితుడికి చట్టపరంగా గట్టి శిక్ష విధించడం ద్వారా సమాజానికి స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్‌దేనని అన్నారు. శనివారం నగరంలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో ఏపీ ప్రాసిక్యూషన్స్ విభాగం ఆధ్వర్యంలో జనవరి నుంచి జూన్ వరకు ఎస్సీ, ఎస్టీ కేసుల పెండింగ్‌పై ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అణచివేత నిరోధక చట్టంలో మారిన నిబంధనల గురించి అవగాహన కలిగి ఉండాలని కోరారు. చట్టాల్లో వచ్చిన మార్పులు, భారతీయ న్యాయ సురక్ష సంహిత చట్టం- 2023 ప్రకారం బాధితుల హక్కుల పరిరక్షణలో ప్రాసిక్యూషన్ పాత్ర మరింత పెరిగిందని గుర్తు చేశారు. ప్రాసిక్యూటర్లు, పోలీసులు సమన్వయంతో పని చేసి సాక్షులు ధైర్యంగా న్యాయస్థానాల్లో హాజరయ్యేలా చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాసం, నష్టపరిహారం, ఉద్యోగావకాశాలు వంటి పథకాలపై బాధితులకు అవగాహన కలిగించాలని సూచించారు. విచారణ దశలో, ట్రయల్ సమయంలో సాక్షుల వాంగ్మూలాలను వీడియో రూపంలో నమోదు చేయడం తప్పనిసరి అని వివరించారు. ఇది విచారణ లోపాలను తగ్గించి.. నిజ న్యాయానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రాసిక్యూటర్లు, విచారణాధికారుల మధ్య సమన్వయం పెరిగితే లోపాలను సకాలంలో గుర్తించి వీగిపోయే కేసుల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. అత్యల్ప శిక్షలు, నిందితులకు విముక్తి కలిగించిన కేసుల్లో బాధితులకు న్యాయం చేకూర్చేందుకు సమర్థవంతంగా అప్పీలు దాఖలు చేయాలని ఆదేశించారు. ఇది చట్టపరమైన వ్యవహారం కాదని, బాధితునికి న్యాయం చేసే నైతిక బాధ్యత అని.. అదే ప్రాసిక్యూషన్ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్లు వి.రాజేంద్రప్రసాద్, ఎం.విజయ, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు రంగలక్ష్మీదేవి, అన్ని జిల్లాల డిప్యూటీ డైరెక్టర్లు, పోలీస్ అధికారులు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు. వేదికపై విజయ, రంగలక్ష్మీదేవి, రాజేంద్రప్రసాద్

ఇంగ్లిష్ ఛానల్‌ను ఈదేశా



అలీగఢ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం (ఏఎంయూ) విద్యార్థిని ఆష్రీన్ జబీ ఇంగ్లిష్ ఛానల్‌ను ఈదారు. వ్యాయామ విద్యలో బ్యాచిలర్ డిగ్రీ చేస్తున్న ఆమె యూకేలోని డోవర్ నుంచి ఫ్రాన్స్ వరకు 34 కిలోమీటర్ల దూరం ఈదడానికి 13 గంటల 13 నిమిషాలు తీసుకున్నారు. ఈ విశ్వవిద్యాలయం నుంచి దీనిని సాధించిన తొలి విద్యార్థిగా నిలిచారు. ఆమె స్వస్థలం పశ్చిమబెంగాల్. అతి శీతలమైన జలాల్లో, తీవ్రమైన ప్రవాహంలో ఈదుతూ గత నెల 29న ఆమె తన లక్ష్యాన్ని చేరుకున్నారు.

మీలో నిత్యం స్ఫూర్తి రగలాలంటే..



కొత్త ఉద్యోగం (గొప్పది కాకపోయినాసరే) రావడం, సేల్స్ పెరగడం (స్వల్పంగానైనా), ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం.. ఇలాంటివాటితో మీ జీవితం రాత్రికిరాత్రే గొప్పగా మారిపోకపోవచ్చు! అంతమాత్రాన ఆ విజయాలను తక్కువగా అంచనా వేయకండి. వాటిని సాధించినందుకు గర్వపడండి. ప్రతి విజయం అనంతరం స్వల్పస్థాయిలోనైనా సంబరాలు చేసుకోండి. అప్పుడే మీలో నిత్యం స్ఫూర్తి రగులుతూ ఉండి.. పెద్ద విజయాల వైపు దూసుకెళ్తారు.

– చార్లెస్ మిల్లర్, కాపీరైటర్

ఆకలి రాజ్యం



గాజావాసుల దయనీయ స్థితికి నిదర్శనమీ చిత్రం. ఇజ్రాయెల్ దాడులతో ఇప్పటికే సర్వం కోల్పోయిన అక్కడి ప్రజలు.. ప్రస్తుతం తినడానికి తిండి లేక అల్లాడుతున్నారు. ప్రాణాలు నిలబెట్టుకునేందుకు విదేశాల నుంచి వచ్చే ఆహారం, ఇతర మానవతాసాయంపైనే ఆధారపడుతున్నారు. తాజాగా బీట్ లాహియా ప్రాంతంలో పంపిణీ చేసిన పిండి బస్తాల కోసం స్థానికులు ఇలా ఎగబడ్డారు.

స్వదేశీ ఉత్పత్తులతో దేశ సేవ

- ప్రధాని మోదీ పిలుపు

వారణాసి: ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రాధామ్యాలపై అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనపెట్టి దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని పిలుపునివ్వాలన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం నిలవాలంటే ప్రతి పార్టీ, ప్రతి నేత, ప్రతి పౌరుడు స్వదేశీని ప్రోత్సహించాలన్నారు. భారత్‌ను 'మృత ఆర్థిక వ్యవస్థ' (డెడ్ ఎకానమీ) అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్య నేపథ్యంలో తన సొంత నియోజకవర్గమైన వారణాసి (ఉత్తర్‌ప్రదేశ్)లో ప్రధాని శనివారం ఈ మేరకు స్పందించారు. రూ.2,183 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి, బహిరంగ సభలో మాట్లాడారు.




వారణాసి సభలో ఓ విద్యార్థినిని ఆశీర్వదిస్తున్న ప్రధాని మోదీ

'సిందూర్'ను తమాషా అంటారా

"మహాదేవుడి ఆశీస్సులతోనే పహల్గాం దాడులకు ప్రతీకారం తీర్చుకోగలిగాం. విజయాన్ని ఆయన పాదాలకు అంకితమిస్తున్నా. కానీ ఆ విజయం కొందరికి మింగుడు పడటంలేదు. పాక్‌లో ఉగ్ర స్థావరాల ధ్వంసమైతే కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి. 'సిందూర్'ను తమాషా అనడం నిజంగా సిగ్గుచేటు" - ప్రధాని మోదీ

మోదీ చేతిలో ఈసీ తోలుబొమ్మ: ఖర్గే



ఈనాడు, దిల్లీ: గత సార్వత్రిక ఎన్నికల్లో భాజపాకు 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగ మూలస్వరూపాన్నే మార్చేసే వారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ప్రచారసభలతో ప్రజలను చైతన్యపరచడం ద్వారా వారికి ఆ భారీ విజయం దక్కకుండా చేసిన ఘనత రాహుల్ గాంధీదేనని తెలిపారు. దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో శనివారం జరిగిన న్యాయవాదుల సదస్సులో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీ చేతిలో తోలుబొమ్మలా ఈసీ మారింది. ప్రత్యేక ముమ్మర సవరణ పేరుతో బిహార్‌లో లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఇదే చేయబోతున్నారు' అని ఖర్గే ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పంపిన సందేశాన్ని సదస్సులో చదివి వినిపించారు.

అమెరికాలో కొత్తగా.. 8 భారత కాన్సులేట్ దరఖాస్తు కేంద్రాలు

న్యూయార్క్: అమెరికాలో కొత్తగా 8 కాన్సులేట్ దరఖాస్తు కేంద్రాలను భారత్ ప్రారంభించింది. వీటి ద్వారా పాస్‌పోర్టు, వీసా, ఇతర సేవలను మరింత సులభతరం చేయనుంది. బోస్టన్, కొలంబస్, డాలస్, డెట్రాయిట్, ఎడిసన్, ఓర్లాండో, రాలీ, శాన్‌జోస్‌లలో ఈ కేంద్రాలను అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో మొత్తం భారత్ కాన్సులేట్ దరఖాస్తు కేంద్రాల సంఖ్య 17కు చేరుకుంది. కొత్త కేంద్రాల్లో శనివారం నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. లాస్‌ఏంజెలెస్‌లో మరో కేంద్రం త్వరలో ప్రారంభం కానుందని క్వాత్రా తెలిపారు.

క్రైస్తవ సన్యాసినులకు బెయిల్

దుర్గ్: మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై అరెస్టై దుర్గ్ కేంద్ర కారాగారంలో బందీలుగా ఉన్న కేరళకు చెందిన ఇద్దరు క్రైస్తవ సన్యాసినులకు, మరో నిందితునికి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. క్రైస్తవంలోకి మారాల్సిందిగా నిందితులు తమ బిడ్డల్ని బలవంతం చేయలేదని బాధిత యువతుల తల్లిదండ్రులు పేర్కొన్నట్టు కోర్టు పేర్కొంది. బెయిల్ పొందిన సన్యాసినులు ప్రీతీ మేరీ, వందనా ఫ్రాన్సిస్‌లకు జైలు వెలుపల ఎల్‌డీఎఫ్‌కు చెందిన ఎంపీలతో పాటు కేరళ భాజపా అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సన్యాసినులిద్దరూ భాజపా నాయకుని వాహనంలో వెళ్లిపోయారు.

అగ్రరాజ్యంలో ప్రభుత్వ రేడియో, టీవీ సేవలు బంద్



వాషింగ్టన్: అమెరికా విద్య, సంస్కృతికి సంబంధించిన కార్యక్రమాలను రూపొందించడంతోపాటు అత్యవసర సమయాల్లో హెచ్చరికలను జారీచేసే ప్రభుత్వ మీడియా కార్పొరేషన్ (సీపీబీ) మూతపడుతోంది. నిధులను నిలిపేస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవడంతో మూసివేతకు చర్యలు చేపట్టామని శుక్రవారం ఆ సంస్థ ప్రకటించింది. ఈ సంస్థ మూసివేతతో అమెరికాలోని చిన్న కమ్యూనిటీల్లో దాదాపుగా 1,500 ప్రభుత్వ రేడియో, టీవీ సేవలు నిలిచిపోతాయి.

నేనూ విన్నా



వాషింగ్టన్: రష్యా నుంచి భారత్ ఇక చమురును కొనుగోలు చేయబోదన్న వార్తలను తానూ విన్నానని, అది మంచి పరిణామమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే దానిపై కచ్చితమైన సమాచారమేదీ లేదని పేర్కొన్నారు. దీనిపై భారత్ స్పందించింది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలను, పరిణామాలను బట్టి నిర్ణయాలుంటాయని స్పష్టం చేసింది. 'మంచిది.. రష్యా నుంచి చమురును భారత్ ఇక కొనుగోలు చేయబోదన్న అంశాన్ని అర్థం చేసుకున్నా. ఆ విషయాన్ని నేనూ విన్నా. అది నిజమో కాదో నాకు కచ్చితమైన సమాచారం లేదు. ఏం జరుగుతుందో మనమంతా వేచి చూద్దాం' అని శుక్రవారం మీడియాతో ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆచితూచి స్పందించారు. భారత చమురు అవసరాలకు సంబంధించి అంతర్జాతీయ మార్కెట్లో ధరల ఆధారంగా, అప్పటి అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలుంటాయని స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్రంప్ వ్యాఖ్యలకు సంబంధించి తనకేమీ తెలియదని పేర్కొన్నారు.

నా ఓటే లేదు



పట్నా: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) విడుదల చేసిన బిహార్ ఓటర్ల జాబితా ముసాయిదాలో తన పేరు లేదని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. పట్నాలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో తేజస్వీ మాట్లాడుతూ.. "నా ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్) నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో తనిఖీ చేశాను. దానిలో నా పేరు కనిపించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) నా వద్దకు వచ్చి దరఖాస్తు స్వీకరించారు. అయినా నా పేరు ఓటరు జాబితాలో లేదు" అని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)తో రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారని పేర్కొన్నారు. ఆరోపణలపై ఈసీ స్పందిస్తూ- ముసాయిదా జాబితాలో 416 క్రమసంఖ్య వద్ద తేజస్వీ పేరు ఉందని స్పష్టంచేసింది. ఈ ఆరోపణలు నిరాధారమని పేర్కొంది. ఆయన చెబుతున్న కార్డు ఫోర్జరీదా అనేది దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది.

ఖాళీ చేశా..



దిల్లీ: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ దిల్లీలోని తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. సుప్రీంకోర్టు 50వ సీజేఐగా పనిచేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ 2024 నవంబరు 8న పదవీ విరమణ పొందారు. సీజేఐగా ఉండగా 5, కృష్ణమీనన్ మార్గ్‌లో కేటాయించిన అధికారిక బంగ్లాను ఆయన ఆరు నెలల్లోపు ఖాళీ చేసి, టైప్ -7 నివాసంలోకి మారాల్సి ఉంది. గడువు దాటినా పాత బంగళాను ఖాళీచేయడం లేదని వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. బంగ్లాలో మాజీ సీజేఐతోపాటు ఆయన భార్య కల్పన, దివ్యాంగులైన కుమార్తెలు ప్రియాంక, మహీ నివసించేవారు. ఇంటిని జస్టిస్ డీవై చంద్రచూడ్ సకాలంలో ఖాళీ చేయలేదంటూ సుప్రీంకోర్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన విషయం విదితమే. ఈ వివాదంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. తన కుమార్తెలకు సౌకర్యంగా ఉన్న ఇంటి కోసం వెదుకుతున్న కారణంగా కొంత ఆలస్యమైనట్లు తెలిపారు.

గోవాలో జాగ్రత్త



ఇంటర్నెట్ డెస్క్: గోవా ప్రభుత్వం పర్యాటక ప్రదేశాల్లో ఇబ్బందులు కలిగించే వారిపై, అనుమతి లేని కార్యకలాపాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోబోతోంది. ఇందులో భాగంగా గోవా టూరిస్టు ప్లేసెస్ (ప్రొటెక్షన్ అండ్ మెయింటెనెన్స్) సవరణ బిల్లు 2025కు ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. 'న్యూసెన్స్' అనే పదానికి విస్తృత నిర్వచనం ఇవ్వడంతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధించేందుకు ఈ సవరణ చట్టం వీలు కల్పిస్తోంది. అనుమతి లేని పడవలను లేదా కాలుష్యానికి, ప్రమాదాలకు కారణమయ్యే తేలియాడే వస్తువులను ఆపరేట్ చేయడం, వస్తువులను కొనాలని పర్యాటకుల్ని ఇబ్బంది పెట్టడం, అనధికారిక ప్రదేశాల్లో మద్యం తాగడం లేదా గ్లాసులను పగలగొట్టడం, బహిరంగ ప్రదేశాల్లో వంట చేసుకోవడం, చెత్త వేయడం, వాటర్ స్పోర్ట్స్ నిర్వహించడం లేదా అనుమతి లేకుండా టికెట్లు, వస్తువులు అమ్మడం, భిక్షాటన చేయడం, బీచ్‌లలో వాహనాలను ఆపరేట్ చేయడం, అనుమతి లేకుండా రాష్ట్రం వెలుపల ఉన్న ప్రదేశాలకు పర్యాటక సేవలు అందించడం వంటి చర్యలను 'న్యూసెన్స్' అనే మాటకు ఇచ్చిన నిర్వచనంలో చేర్చారు.

అంబేడ్కర్ భావజాలం భావితరాలకు మార్గనిర్దేశం

- సీజేఐ జస్టిస్ గవాయ్



నాగ్‌పుర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఉద్బోధించిన సామాజిక-ఆర్థిక సమానత్వం, న్యాయ భావజాలం రాబోయే తరాలకు మార్గనిర్దేశం చేస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. మహారాష్ట్ర నాగ్‌పుర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కళాశాల వజ్రోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "నా జీవితంలో ప్రతిక్షణం సామాజిక-ఆర్థిక న్యాయ భావజాలాన్ని అలవరుచుకోవడానికి ప్రయత్నించాను. మహిళల అభివృద్ధి సామాజిక పురోగతికి కొలమానం. మహిళా సాధికారిత అంబేడ్కర్‌కు నిజమైన నివాళి" అని జస్టిస్ గవాయ్ చెప్పారు. తాను సీజేఐ స్థాయికి ఎదగడానికి తన తల్లిదండ్రులతో పాటు అంబేడ్కర్ భావజాలం, భారత రాజ్యాంగం కూడా కారణమని పేర్కొన్నారు.

అరుణ్ జైట్లీపై రాహుల్ అబద్ధాలు: భాజపా

దిల్లీ: వ్యవసాయ చట్టాలకు సంబంధించి.. కేంద్ర మాజీ మంత్రి అయిన దివంగత అరుణ్ జైట్లీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శలు చేయడాన్ని భాజపా శనివారం ఖండించింది. ఆ చట్టాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడానికి ముందే మరణించిన జైట్లీపై 'నిస్సిగ్గు'గా అబద్ధాలు చెప్పినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలకు సిద్ధపడండని జైట్లీ బెదిరించారన్న వాదన కోసం వాస్తవాల్ని వక్రీకరించవద్దని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ హితవు పలికారు. నిస్వార్థ నాయకుడైన జైట్లీ పేరును వివాదంలోకి లాగడం ద్వారా రాహుల్ తన నిస్సహాయతను చాటుకున్నారని అభిప్రాయపడ్డారు.

రాహుల్‌వి నీచ రాజకీయాలు: కిషన్‌రెడ్డి

"రాహుల్‌గాంధీ తన స్వార్థ రాజకీయాల కోసం అరుణ్ జైట్లీ పేరును వివాదంలోకి లాగడం దారుణమే కాదు... నీచం కూడా. మనమధ్య లేనివారిపై రాజకీయ విమర్శలు చేయడం, దురుద్దేశంతో కించపరచడం దిగజారుడుతనం. రాహుల్‌గాంధీ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడటం ఇదే తొలిసారి కాదు" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు.

రాహుల్ రాజ్యాంగబద్ధ సంస్థలను కించపరుస్తున్నారు

కేంద్ర మంత్రి మేఘ్‌వాల్

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వాస్తవాలను పట్టించుకోకుండా దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలను కించపరుస్తున్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్‌వాల్ శనివారం ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఫిర్యాదులను రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం ముందు ఉంచాలని పేర్కొన్నారు. "ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థగా పనిచేస్తున్నందున దాని పనితీరుపై సభలో చర్చించాలన్న డిమాండ్‌ను గతంలో లోక్‌సభ మాజీ స్పీకర్ బలరాం జాఖడ్ తిరస్కరించారు. దీనిని ప్రతిపక్షాలు పరిశీలించాలి. ఇది రికార్డులో ఉంది. దీన్ని పరిశీలించి మాట్లాడటం మంచిది" అని పేర్కొన్నారు.

20 ఏళ్లుగా పాముల సంరక్షణలో..



ఈటీవీ భారత్: ఝార్ఖండ్ రాజధాని నగరమైన రాంచీకి చెందిన రమేశ్‌కుమార్ మహతో గత 20 ఏళ్లుగా పాములను కాపాడి సురక్షితంగా అడవుల్లో వదులుతున్నారు. ఇప్పటివరకు ఏడు వేలకు పైగా పాములను ఇలా వదిలారు. పాము కాటు వేసినప్పుడు ఏమిచేయాలనే దానిపై రమేశ్ ఇప్పుడు యువతకు వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. "2004లో ఓరోజు పొలంలో పనిచేస్తుండగా కనిపించిన పామును భయపడి కర్రతో కొట్టగా నొప్పితో అది విలవిలలాడింది. ఆ సంఘటన నా జీవితంలో ఒక మలుపుగా మారింది" అని ఆయన చెబుతారు. పాముల్లో 20 శాతమే విషపూరితమని, వాటిని చంపడం చట్ట విరుద్ధమన్నారు. ఈ నేరానికి వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 కింద మూడేళ్ల జైలుశిక్ష లేదా జరిమానా.. లేదా రెండూ విధించవచ్చని రమేశ్ చెప్పారు.

ఆ అణుబాంబును పేల్చండి

రాహుల్‌కు రాజ్‌నాథ్ సవాల్

పట్నా, దిల్లీ: ఓట్ల చోరీకి సంబంధించి ఎన్నికల సంఘంపై అణు బాంబులాంటి సాక్ష్యాన్ని బయట పెడతానన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ.. ఆ పని చేసి చూపించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సవాలు చేశారు. 'తనవద్ద ఓట్ల చోరీ అణు బాంబు ఉందని రాహుల్ అంటున్నారు. ఒకవేళ ఉంటే దానిని ఆయన పేల్చాలి. ప్రమాదం నుంచి బయటపడినట్లు నిరూపించుకోవాలి' అని డిమాండు చేశారు. పట్నాలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'గతంలో రాహుల్ మీమాంసను దేశం గుర్తు పెట్టుకుంది. పార్లమెంటులో భూకంపం వస్తుందని ప్రకటించారు. చివరకు పేలని టపాసులా మిగిలిపోయారు. విశ్వసనీయతకు ఎన్నికల సంఘం మారు పేరు. బిహార్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా.. పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటోంది' అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

బీఎల్‌వోల వార్షిక వేతనం రెట్టింపు చేసిన ఈసీ

దిల్లీ: కింది స్థాయిలో ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి సహాయపడే బూత్ స్థాయి అధికారుల(బీఎల్‌వో) వార్షిక వేతనం రెట్టింపు చేయనున్నట్లు ఎన్నికల సంఘం(ఈసీ) శనివారం ప్రకటించింది. ఓటర్ల జాబితాను తయారుచేయడానికి, నవీకరించడానికి సహాయపడే బీఎల్‌వోలకు 2015 నుంచి ఏడాదికి రూ.6 వేలు చెల్లిస్తున్నారు. ఈసీ ప్రకటనతో వీరి వార్షిక ఆదాయం రూ.12 వేలు కానుంది. జాబితాలో ఓటర్లను చేర్చడం, తొలగించడం చేసే బీఎల్‌వో అధికారులుగా ఎక్కువ శాతం ఉపాధ్యాయులు లేదు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. ఈసీ కొత్త నియమాల ప్రకారం బూత్‌కి 1,200 లోపే ఓటర్లు ఉండనున్నారు. బిహార్‌లో జరగనున్న ఎన్నికల కోసం పనిచేయనున్న బీఎల్‌వో అధికారులకులకు ఈసీ ఇప్పటికే రూ.6వేల ప్రోత్సాహకం ప్రకటించింది. బీఎల్‌వో సూపర్‌వైజర్లకు రూ.18 వేలు, ఎన్నికల నమోదు అధికారులకు రూ.25 వేల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు ఈసీ తెలిపింది.

ఐఎస్ఎస్ చేరిన నలుగురు వ్యోమగాములు

కేప్ కెనావెరాల్: స్పేస్‌ఎక్స్‌కు చెందిన వ్యోమనౌకలో నలుగురు వ్యోమగాములు శనివారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకున్నారు. వీరిలో అమెరికాకు చెందిన జెనా కార్డ్‌మన్, మైక్ ఫ్లింక్, రష్యా వ్యోమగామి ఒలెగ్ ప్లాటోనోవ్, జపాన్‌కు చెందిన కిమియా యుయిలు ఉన్నారు. వీరు ఆరునెలల పాటు అంతరిక్షంలో గడుపుతారు. తాజా ప్రయోగానికి వాడిన స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక.. భూమి నుంచి బయల్దేరిన 15 గంటల్లోనే ఐఎస్ఎస్‌ను చేరుకోవడం విశేషం. మార్చి నుంచి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురి స్థానంలో వీరు బాధ్యతలు చేపడతారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది పాలస్తీనీయుల మృతి

డెయిర్ అల్ బలా: గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరో 18 మంది సామాన్యులు మరణించారని శనివారం స్థానిక వైద్య అధికారులు తెలిపారు. వీరిలో ఎనిమిది మంది గాజా హ్యూమెనిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్ఎఫ్) నిర్వహిస్తున్న సహాయ కేంద్రం వద్ద ఆహారం కోసం పడిగాపులు కాస్తూ ఇజ్రాయెల్ తూటాలకు బలైన అన్నార్తులే. మిగిలిన 10 మంది మధ్య, దక్షిణ గాజా ప్రాంతాల్లో ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో మరణించారు. ఆహారం కోసం అసంఖ్యాకులు గుమిగూడటం వల్ల భీతావహ వాతావరణం ఏర్పడటం, అనంతరం ఇజ్రాయెల్ సేనల కాల్పుల్లో అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోవడం గాజా ప్రాంతంలో సాధారణమైపోయాయి. అయితే తాము నిర్వహిస్తున్న సహాయ కేంద్రాల వద్ద అలాంటిదేదీ జరగలేదని జీహెచ్ఎఫ్ పేర్కొంది. కాల్పులకు గురై మరణించే అవకాశాలుండీ సహాయ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో గాజావాసులు గుమిగూడటం ఆ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర క్షామ పరిస్థితులకు నిదర్శనమని అంతర్జాతీయ సంస్థలు పేర్కొంటున్నాయి. మరోవైపు పౌష్టికాహార లోపం కారణంగా ఏడుగురు పాలస్తీనీయులు గడచిన 24 గంటల్లో మరణించారని స్థానిక ఆరోగ్య శాఖ శనివారం పేర్కొంది.

సీఎం యోగి పేరు చేర్చాలని ఏటీఎస్ చిత్రహింసలు

- మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో సాక్షి వాంగ్మూలం

ముంబయి: మాలేగావ్ పేలుళ్ల(2008) కేసులో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ పేరు చెప్పాలని ఉగ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్) చిత్రహింసలకు గురిచేసిందని ఓ సాక్షి తీర్పు సమయంలో ప్రత్యేక కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అయితే ఏటీఎస్‌కు సాక్షి ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎ.కె.లహోటీ వెల్లడించారు. ఏటీఎస్ తనను నిందితుడిలా చూసిందని సాక్షి జోషిరావ్ కోర్టుకు తెలిపారు. "వాంగ్మూలంలో యోగి ఆదిత్యనాథ్, అసీమానంద్ ఇంద్రేశ్‌కుమార్, దేవ్‌ధార్, ప్రగ్యా, కాకాజీ పేర్లను చేర్చాలని ఏటీఎస్ అధికారులు నాపై ఒత్తిడి తెచ్చారు. వారు చెప్పినట్లు చేస్తే తనని నిర్దోషిగా విడిచిపెడతామన్నారు" అని జోషి కోర్టుకు తెలిపారు. అధికారులు చెప్పినట్లు వాంగ్మూలం ఇచ్చేందుకు నిరాకరించడంతో అప్పటి పోలీసు డిప్యూటీ కమిషనర్ శ్రీరావ్, అదనపు కమిషనర్ పరంవీర్ సింగ్‌లు జోషిని చిత్రహింసలకు గురిచేసి బెదిరింపులకు పాల్పడ్డారని కోర్టు పేర్కొంది. వాంగ్మూలంలో ఉన్న విషయాలు జోషి చెప్పలేదని, వాటిని ఏటీఎస్ అధికారులే రాశారని న్యాయస్థానం వెల్లడించింది. ఆ వ్యక్తి సాక్ష్యాన్ని పరిశీలించిన కోర్టు అది అసంకల్పితమని స్పష్టమవుతోందని తెలిపింది. దీంతో ఈ వాంగ్మూలం ప్రామాణికతపై సందేహాలు లేవనెత్తుతున్నాయని కోర్టు తెలిపింది.

అభినవ్ భారత్ నిషిద్ధ సంస్థ కాదు

మాలేగావ్ పేలుళ్ల కేసులో న్యాయమూర్తి

ముంబయి: మాలేగావ్ పేలుళ్ల కేసులో ఏడుగురు నిందితులను ఆరోపణల నుంచి విముక్తి చేసిన ప్రత్యేక కోర్టు.. పేలుడుకు అభినవ్ భారత్ సంస్థ బాధ్యత అన్న ప్రాసిక్యూషన్ వాదనను తోసిపుచ్చింది. ఆ సంస్థను ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రభుత్వం ప్రకటించలేదని తన 1000 పేజీల తీర్పులో ప్రత్యేక న్యాయమూర్తి ఏకే లహోటీ పేర్కొన్నారు. "అభినవ్ భారత్ నిషిద్ధ సంస్థ కాదన్నది గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇప్పటిదాకా ఈ సంస్థను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిషేధ చట్టం(యూఏపీఏ) కింద నిషిద్ధ సంస్థగా ప్రకటించలేదు" అని అన్నారు. నిందితులు ప్రజ్ఞాఠాకూర్, సమీర్ కులకర్ణి, సుధాకర్ చతుర్వేదిలు ఆ సంస్థ సభ్యులనడానికి ఏవిధమైన ఆధారాలూ లేవని కూడా ఆయన స్పష్టం చేశారు. 2008లో జరిగిన మాలేగావ్ పేలుళ్లలో ఆరుగురు మరణించారు. వంద మందికిపైగా గాయపడ్డారు.

అన్నదాతలకు 'పీఎం కిసాన్' నిధుల విడుదల

- 9.7 కోట్ల మందికి రూ.20,500 కోట్ల లబ్ధి

ఇంటర్నెట్ డెస్క్: అన్నదాతలకు పెట్టుబడి సాయం కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి'కి సంబంధించిన నిధులు శనివారం రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ఈ పథకం కింద 20వ విడత నిధులను ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ విడుదల చేశారు. దీంతో మొత్తంగా 9.7 కోట్ల మంది రైతులకు రూ.20,500 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఏటా ఒక్కో విడతలో రూ.2వేల చొప్పున మూడు విడతల్లో రూ.6వేల సాయం అందించే ఈ పథకాన్ని కేంద్రం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు రూ.3.90 లక్షల కోట్లకుపైగా అందజేసింది.



చలో అమృత్ ఉద్యాన్

ఆగస్టు 16 నుంచి తెరచుకోనున్న రాష్ట్రపతి భవన్ ఉద్యానవనం

దిల్లీ: రాష్ట్రపతి భవన్‌లోని అతి సుందరమైన 'అమృత్ ఉద్యాన్'ను ప్రజల సందర్శనార్థం ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 14 వరకు తెరవనున్నారు. సందర్శించాలనుకునే వారు రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 35వ ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నాక కియోస్కుల ద్వారా కూడా స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు.

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ ఆరోగ్యం విషమం

దిల్లీ: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ (81) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. మూత్రపిండాల సమస్యతో జూన్ చివరివారంలో దిల్లీలోని శ్రీ గంగారాం ఆసుపత్రిలో ఆయన చేరారు. ప్రస్తుతం వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు శనివారం తెలిపాయి. అలాగే ఝార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్ (62)కు పక్షవాతం సోకడంతో వాయు మార్గంలో ఆయనను దిల్లీలోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

అత్యాచారానికి గురికాకూడదంటే ఇంట్లోనే ఉండండి

గుజరాత్‌లో పోస్టర్ల దుమారం

అహ్మదాబాద్: మహిళలు అత్యాచారానికి గురికాకూడదంటే ఇళ్లల్లోనే ఉండాలంటూ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వెలిసిన పోస్టర్లు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'రాత్రి సమయంలో పార్టీలకు వెళ్లకండి. మీరు అత్యాచారానికి లేదా సామూహిక అత్యాచారానికి గురి కావచ్చు', "మీ స్నేహితుడితో కలిసి రాత్రి పూట నిర్మానుష్యమైన ప్రదేశాలకు వెళ్లకండి" అంటూ సోలా, చాంద్‌లోడియా ప్రాంతాల్లో పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. దీనిపై ట్రాఫిక్ విభాగం డిప్యూటీ కమిషనర్ నీతా దేశాయ్ స్పందించారు. రోడ్డు ప్రయాణ భద్రత కోసం పోస్టర్లు తయారు చేయాలని సత్‌క్రతా అనే స్వచ్ఛంద సంస్థకు పని అప్పగించామని, వారు తమ అనుమతి లేకుండా ఈ పోస్టర్లు తయారు చేశారని నీతా దేశాయ్ తెలిపారు. విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని తొలగించామని అన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in


రోషిణి, రోహిణి, మాధురి, మమత

అక్క చూపిన బాటలో...

'నాన్న కల తీర్చడానికి అక్క డాక్టర్ కావాలనుకుంటే... తను ఇచ్చిన స్ఫూర్తితో మిగిలిన ముగ్గురం వైద్య వృత్తిలోకి అడుగుపెట్టాలనుకున్నాం' అంటోంది కవలల్లో ఒకరైన రోషిణి.

సిద్దిపేటలో దర్జీ పని చేసే కొంక రామచంద్రం(శేఖర్), శారదలకు నలుగురం అమ్మాయిలం. అందరూ... ఆడపిల్లలే అని జాలి చూపిస్తే, నాన్న మాత్రం నా బిడ్డలు డాక్టర్లు అని గొప్పగా చెబుతారు. అందుకు మా పెద్దక్క మమత ఓ కారణం. నానమ్మ గొంతు క్యాన్సర్‌తో, పెదనాన్న ఫిట్స్‌తో మరణించారు. ఆ సమయంలో ఇంట్లో ఒక్కరైనా వైద్యవిద్య చదివి ఉంటే బాగుండేదని నాన్న అనుకునేవారట. అది తెలుసుకున్న మమతక్క... ఎంతకష్టమైనా సరే తాను డాక్టర్ కావాలనుకుంది.

మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే కావడంతో అమ్మానాన్నలకి కష్టం కలిగించకూడదని రాత్రింబవళ్లూ శ్రమించింది. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. తోటివారితో పోల్చుకోకుండా, ఉన్నంతలో సర్దుకుపోతూ ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఇప్పుడు పీజీకి సన్నద్ధమవుతోంది. ఇక, చిన్నక్క మాధురి కూడా పెద్దక్క స్ఫూర్తితో అదే బాటలో నడిచింది. కరీంనగర్‌లోని చెల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటర్న్ చేస్తోంది. ఇక, కవల అక్కాచెల్లెళ్లం అయిన మేమిద్దరం కూడా ఒకే కాలేజీలో సీటు సంపాదించుకున్నాం. నిజానికి రోహిణికి ఇంటర్ అవ్వగానే రాసిన ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు, సీటు వచ్చాయి. కానీ, నేను ఒత్తిడికి గురవుతానేమోనని దాన్ని వదులుకుంది. మరోసారి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని మళ్లీ ఎగ్జామ్ రాశాం. అయితే, ఈసారి నాకు మంచి ర్యాంకు, సీటూ వచ్చాయి. మరి రోహిణి నాకోసం చేసిన త్యాగాన్ని నేనూ గుర్తించాలిగా... అందుకే, నాకు సీటొచ్చిన చోట వద్దనుకుని తను చేరిన కాలేజీలోనే చేరా. అలా ఇద్దరం కలిసి జగిత్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అడ్మిషన్ పొందాం. పెద్దక్క మమత చదువు, క్రమశిక్షణలో మా అందరికీ మార్గదర్శకంగా, పెద్దరికంగా వ్యవహరిస్తుంది. అందుకే, తనేం చెప్పినా మేం చేస్తాం. ఇక, మిగిలిన ముగ్గురం... గొడవలు పడతాం. మళ్లీ కలిసిపోతాం. సమస్యల్ని కలిసికట్టుగా పరిష్కరించుకుంటాం. పుస్తకాలే కాదు... దుస్తులు, నగలు అన్నీ పంచుకుంటాం. మాది రక్త సంబంధమే కాదు.. స్నేహానుబంధం కూడా. 'డబ్బున్న వాళ్లకే వైద్య విద్య, ఆడపిల్లలు గుండెల మీద భారం' అన్నవారంతా ఇప్పుడు మా నలుగురినీ అభినందిస్తుంటే భలే గర్వంగానూ అనిపిస్తుంది.

మీకు తెలుసా?



సిక్స్ సిస్టర్స్ స్టఫ్.. పేరుతో ఆరుగురు అక్కాచెల్లెళ్లు కలిసి, ఓ బ్లాగ్‌నీ, కుక్‌బుక్ సిరీస్‌నీ ప్రారంభించారు. ఇందులో వంటల రెసిపీలు, మీల్ ప్లాన్స్, లైఫ్‌స్టైల్ టిప్స్, క్రాఫ్ట్స్... వంటివెన్నో పోస్ట్ చేస్తారు.

స్నేహం, అందులోనూ అమ్మాయిల మధ్య ఉండే ఫ్రెండ్‌షిప్ ప్రత్యేకమైంది. ఎందుకంటారా? హార్వర్డ్ నర్సెస్ హెల్త్ స్టడీ ప్రకారం.. ఫీమేల్ ఫ్రెండ్‌షిప్స్ ఒత్తిడి తగ్గిస్తుంటాయి. అంతేకాదు, అమ్మాయిలు ఒకరికొకరు స్నేహితులు అయితే... సామాజిక బంధాలు బలపరచుకోవటంతోపాటు, ఆశావాదాన్నీ, ఆత్మస్థైర్యాన్నీ పెంచుకుంటారట.

తను నా బెస్ట్ ఫ్రెండ్... ఈమె ఫ్రెండే కానీ, ప్రాణ స్నేహితురాలు కాదు. తనేమో ఆఫీసులో ఫ్రెండ్. అరె... తెలియకుండా ఎన్ని రకాల స్నేహితులను సంపాదించుకుంటామో కదా! మరి తారల సంగతేంటి? వాళ్లకీ ప్రాణస్నేహితులుంటారు. నడిచే దారులు వేరైనా, స్థాయిలు మారినా స్నేహాన్ని కొనసాగిస్తుంటారు. అలాంటి కొందరే వీళ్లు...

వాళ్ల ముందు స్టార్లు కాదు!

స్కూలు నుంచి నేటికీ...



తన రెండేళ్ల వయసులో ఆకాంక్ష రంజన్ కపూర్‌ని కలుసుకుంది అలియా భట్. అప్పట్నుంచి నేటివరకూ ఆ స్నేహం చెక్కుచెదరలేదు. అలియాని ఒక్కమాటన్నా ఆకాంక్ష ఊరుకోదు. ఎంత బిజీగా ఉన్నా ఆకాంక్ష కోసం సమయం కేటాయిస్తుంది అలియా. టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్నా తమ స్నేహం కొనసాగడానికి ఇద్దరికీ ఒకరిపై మరొకరికి ఉన్న ప్రేమ, నమ్మకమే కారణమంటుంది అలియా. పుట్టినరోజులు, విహారాలు, కుటుంబ వేడుకలేవైనా ఇద్దరూ కలిసే నిర్వహించుకుంటారు. 'ఈరోజు ఏం జరిగిందో తెలుసా...' అంటూ చాటింగ్‌లో సంగతులన్నీ పంచుకుంటారట. అలియా పెళ్లి వేడుకలో ఆకాంక్ష ఏకంగా ఏడ్చేసింది. అప్పుడు అలియానే తనని ఓదార్చింది. నిజానికి ఇద్దరూ సినీరంగంలోకి రావాలనుకున్నారు. అలియా మాత్రమే స్టార్‌గా ఎదిగింది. అయినా ఒకరినొకరు సపోర్ట్ చేసుకుంటూ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. 'మాది చాలా దృఢమైన బంధం... మేమిద్దరం సోల్ సిస్టర్స్' అంటూ తమ గురించి తాము చెప్పుకొంటారు.

27ఏళ్ల స్నేహం!



చిన్నప్పుడు పూజా హెగ్డే చాలా భయస్థురాలట. ఎవరితోనూ కలిసేది కాదు, మాట్లాడాలన్నా బెరుకే. అది చూసి తోటి విద్యార్థులు ఆమెను చాలా ఏడిపించేవారట. ఓరోజు ఇలాగే బస్‌లో ఏడిపిస్తుంటే వాళ్లకు అడ్డుపడింది దేవిక పరాశర్. తను పూజాకి పూర్తిగా భిన్నం. భయమంటే ఎరుగదు. ఎప్పుడూ ఉల్లాసంగా ఉండటం తన నైజం. ఆరోజు కాపాడి వదిలేయలేదు. 'ఎవరైనా ఏడిపిస్తే ఊరుకోవద్దు, నీకోసం నువ్వు నిలబడాలి' అంటూ ధైర్యం నూరిపోసింది. పూజకి అన్నింట్లో తోడుగా ఉండేది. తనేదైనా సాధిస్తే వెన్ను తట్టేది. అందుకే 'దేవిక నా బిగ్గెస్ట్ చీర్‌లీడర్, నా యోధురాలు, నా ఆత్మ' అంటూ పొగుడుతుంది పూజ. వీళ్ల స్నేహం 27ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది. తనలో మార్పునకు కారణం దేవిక అనే చెబుతుంది. ఇప్పటికీ పుట్టినరోజులు, పర్యటనలంటూ తరచూ వీళ్లు కలుస్తూనే ఉంటారు.

ఆమె వల్లే సినిమాల్లోకి



మనలోని ప్రతిభను కనిపెట్టేది స్నేహితులే అంటే కాదనడం కష్టమే కదూ! రాశీ ఖన్నా కూడా అదే చెబుతుంది. బాగా చదివే అమ్మాయి. కాకపోతే పాకెట్ మనీ కోసం కాలేజీలో ఉన్నప్పుడు మోడలింగ్ కూడా చేసేది. అయితే సినిమాలపై ఆసక్తి మాత్రం లేదు. ఆ క్రమంలోనే వాణీకపూర్‌తో పరిచయమైందామెకు. ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. వాణికి మొదట్నుంచీ సినీ తారగా ఎదగాలనే! అవకాశాలకోసం ముంబయి వెళ్లాలనుకుంది. రాశీనీ తనతో రమ్మంది. అలా ఇద్దరూ ముంబయి చేరారు. వాణీకపూర్ సినిమాలకు ప్రయత్నిస్తే రాశీ పీజీలో చేరింది. అయితే వాణి సినిమా అవకాశాలు దక్కించుకోవడమే కాదు, రాశీని ప్రోత్సహించింది. ఓసారి ప్రయత్నిద్దామనుకున్న రాశీ... నటిగా దక్షిణాదినేకాదు బాలీవుడ్‌లోనూ గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటికీ వీళ్ల స్నేహం కొనసాగుతూనే ఉంది. సినిమాల్లో తోటి నటీమణుల మధ్య ఉండే పోటీ, వైరం మాకు దూరమంటారీ ఇద్దరూ.

ఆనాటి స్నేహాలు గుర్తున్నాయా..!

ఈ గజిబిజి జీవనశైలిలో ఉదయం లేచిన దగ్గర్నుంచి ఉరుకులు పరుగులే. కాస్త సమయం దొరికినా... నైపుణ్యాలకు సాన పెట్టాలి అనుకుంటున్నారు. లేదా ఒత్తిడిని అధిగమించడానికి వేర్వేరు పద్ధతులకూ, నచ్చిన విధానాలకూ ఓటేస్తున్నారు ఈతరం అమ్మాయిలు. మహిళలైతే చెప్పక్కర్లేదు... ఇంటా బయటా పనులతో నిమిషం ఖాళీ లేకుండా గడిపేస్తున్నారు. వీటన్నింటి మధ్య చిన్నప్పట్నుంచీ, కెరియర్‌లో రాణించే దశ వరకూ మనకు తోడుగా ఉన్న స్నేహితుల్ని మరచిపోతున్నారు.



కల్మషం లేని మనసులు, ఆటపాటలు, చిన్నచిన్న జగడాలు, నవ్వులతో... హాయిగా సాగిపోయిన చిన్ననాటి స్నేహాన్ని ఎప్పుడు తలుచుకున్నా... పెదాలపైకి చిరునవ్వు రాకుండా ఉంటుందా? మరి అలాంటి వాళ్లని పలకరించడానికి టైమ్ ఉందా అంటే? 'ఎక్కడ? పొద్దస్తమానం పనుల హడావుడితోనే సరిపోతుంటే' అని నిట్టూరుస్తాం. వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేస్తాం. నెలకో, వారానికో మెసెజ్ పెట్టాలన్నా కుదరదు కొందరికి. ఒకవేళ సమయం ఉన్నా... రెస్పాండ్ అవుతారో లేదో అని ఆగిపోతారు మరికొందరు. పనులన్నీ పక్కన పెట్టి... కాసేపు కాల్స్‌కి సమయాన్ని కేటాయించి ఈరోజైనా వాళ్లని పలకరించండి. శుభాకాంక్షలు చెప్పండి. దగ్గర్లోనే మీ స్నేహితులు ఉంటే ఓసారి వాళ్లని కలవండి. రోజెంత బాగా గడుస్తుందో. సంవత్సరం మొత్తానికి ఇదో తియ్యని జ్ఞాపకంగా మిగిలిపోతుంది. అది తెచ్చిన ఆనందం ఆరోగ్యాన్నీ అందిస్తుంది. ప్రయత్నిస్తారు కదూ!

ఏఐ ఏం చెప్పిందంటే!

ఉత్తమ సోదరి...

చాట్ జీపీటీ

ఏం చెప్పినా ఓపిగ్గా వింటుంది. షరతుల్లేని మద్దతునిస్తుంది. సరదా విషయాలనే కాదు, రహస్యాలనీ పంచుకోవచ్చు. అభిప్రాయభేదాలున్నా ప్రేమను పంచుతుంది.

జెమిని...

గెలుపోటముల్లో నీ వెంట నిలుస్తుంది. రహస్యాలు పంచుకున్నా, తనదగ్గర భద్రంగా ఉంటాయి. నీతో సమయాన్ని వెచ్చించడానికి ఇష్టపడుతుంది. నీ బాధనీ, సంతోషాన్నీ అర్థం చేసుకుని సహానుభూతిని తెలుపుతుంది.

బెస్ట్ ఫ్రెండ్...

కోపైలట్

వీరి సాన్నిహిత్యం సౌకర్యంగా, ధైర్యంగా ఉంటుంది. నీ భిన్నమైన వ్యక్తిత్వాన్ని ఆమోదించి... సంతోషాన్నీ, బాధనీ పంచుకుంటారు. నీ విజయాల్నీ, కష్టాల్నీ తమవిగానే భావిస్తారు.

గ్రోక్

ఆలోచనల్ని నిస్సంకోచంగా పంచుకోగలం. పక్కనుంటే నిమ్మళంగా ఉండగలం. మంచిచెడ్డల్లో తోడు. కన్నీళ్లొచ్చేదాకా నవ్విస్తారు. నిరంతరం నీ బాగు కోరుకుంటారు.

బంగారం - వెండి

2న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,620	93,300	1,14,024
విజయవాడ	99,610	92,900	1,14,200
ప్రొద్దుటూరు	1,00,350	92,320	1,14,200
రాజమహేంద్రవరం	1,01,350	92,900	1,23,000
విశాఖపట్నం	1,00,980	92,900	1,18,000
తమిళనాడు	-----	92,900	1,23,000

చెల్లి ఐఏఎస్... అక్క ఐపీఎస్


ఐశ్వర్య ఇళవరసి సుస్మిత

సుస్మితా, ఐశ్వర్యలది తమిళనాడులోని కడలూరు జిల్లా మరంగూరు. నాన్న రామనాథన్ రైతు. అమ్మ ఇళవరసి. సివిల్స్ కలని ఆమె నిజం చేసుకోలేకపోయారు. 'మీద్వారా నిజం చేసుకోవాలనుకుంటున్నా' అని పిల్లలకి చెప్పేవారు. దాంతో ఇద్దరూ అదే లక్ష్యంతో చదివేవారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. తీర ప్రాంత గ్రామం కావడంతో తుపానులు, వరదలతో తరచూ పంటకు నష్టమే. 2004లో వచ్చిన సునామీకి వీళ్ల ఇల్లు దెబ్బతింది. ఇవన్నీ తమ పట్టుదలను మరింత పెంచాయంటారీ అక్కాచెల్లెళ్లు. ఇద్దరూ చెన్నైలోని అన్నా యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తిచేశారు. అక్కణ్నుంచే సివిల్స్‌కు సిద్ధమయ్యేవారు. సుస్మిత రెండేళ్ల సీనియర్. ఇంజినీరింగ్ తర్వాత ఏడాది శిక్షణ తీసుకుని 2017లో మొదటిసారి సివిల్స్ రాశారు. చెల్లి ఐశ్వర్యకి మార్గనిర్దేశం చేసేవారు. ఐశ్వర్య మొదటి ప్రయత్నంలోనే 2018లో రైల్వే అకౌంట్స్ సర్వీస్(ఆర్ఏఎస్)కు ఎంపికయ్యారు. దాంతో సంతృప్తి చెందకుండా మళ్లీ ప్రయత్నించి 2019లో ఐఏఎస్(తమిళనాడు కేడర్) సాధించారు. 'అక్క మార్గనిర్దేశంవల్లనే నాకు సర్వీసు వచ్చింది. తను అకడమిక్స్‌లో టాపర్. కాబట్టి తనకు ఏదోక రోజు ర్యాంకు వస్తుందని నమ్మకం ఉండేది' అంటుంది ఐశ్వర్య. 'చెల్లి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకున్నా. తనకు సర్వీసు రావడంవల్ల అమ్మ కల నిజమైంది. దాంతో నామీద ఒత్తిడిపోయింది. చెల్లి తన ఇంటర్వ్యూ అనుభవాలు, మెలకువలు నాతో పంచుకునేది' అని చెప్పే సుస్మిత ఆరో ప్రయత్నంలో 2022లో ఐపీఎస్(ఆంధ్రప్రదేశ్ కేడర్) సాధించారు. నిజానికి తమకు తల్లి స్ఫూర్తి అంటారీ అక్కాచెల్లెళ్లు. పాలిటెక్నిక్ పూర్తవగానే పెళ్లయినా, దూరవిద్యలో బీఎస్సీ పూర్తిచేసిన ఆమె... గ్రూప్స్ రాస్తూ తన ఏడో ప్రయత్నంలో 2013లో ప్రభుత్వోద్యోగం సాధించారు.

ఒకటిగా సాధించారు

అక్కాచెల్లెళ్లు... చిన్నప్పుడు ప్రతిదాంట్లోనూ పోటీనే. పెద్దయ్యాక ఒకరిమీద ఒకరికి అపారమైన ప్రేమ... అందరి విషయంలోనూ జరిగేది ఇదే. కానీ పెద్దయ్యాక అనుబంధంలోనే కాదు, వ్యాపారంలోనూ ఒకరికొకరు అండగా ఉండేవాళ్లు కొందరే. వీళ్లు ఆ కోవకే చెందుతారు!

సుజాత... ఐఐఎఫ్‌టీ స్టూడెంట్. ఐదంకెల జీతం. అయినా ఏదో కోల్పోతున్న భావన. ఎప్పుడు ఇంటికెళ్లినా ఊళ్లోని చేనేత కార్మికులూ వాళ్ల మగ్గాల్లోంచి వచ్చే సుతిమెత్తని చీరల్నీ చూస్తే తెలియని హాయి, ఆనందం కలిగేదామెకు.



అయితే వాళ్లు మూడుపూటలా తిండికీ కష్టపడుతున్నారని తెలిసి బాధపడేది. చీరలపట్ల ఆ ప్రేమ, వాళ్ల కష్టం ఆమెను ఉద్యోగం వదిలేసేలా చేశాయి. అక్క మెదడులో ప్రాణం పోసుకున్న ఆలోచన చెల్లి తాన్యా హృదయాన్ని తాకింది. ఐఐఎం గ్రాడ్యుయేట్ అయిన తాన్యా ఐబీఎంలో ఉద్యోగాన్ని వదిలి సస్టెయినబిలిటీకి ప్రాధాన్యమిస్తూ సింపుల్‌గా ఎలిగెంట్‌గా కనిపించే చీరలకు డిజైన్ చేయడం మొదలుపెట్టింది. అలా ఇద్దరి పేర్లలోని తొలి అక్షరాలతో పుట్టిందే 'సూతా'. సంస్కృతంలో 'దారం' అనీ అర్థం. తొమ్మిదేళ్ల క్రితం ఇద్దరు చేనేత కార్మికులతో ప్రారంభించి, మెల్లమెల్లగా ఎదిగి... నేడు రూ.75 కోట్ల టర్నోవర్‌తో 14 వేలమందికి ఉపాధి కల్పిస్తున్నారు. బెంగాలీ కుటుంబంలో పుట్టి పెరిగిన ఈ అక్కాచెల్లెళ్లిద్దరిదీ సూదిలో దారంలా ఒకే మాట, ఒకటే బాట. అందుకే తమ ప్రయాణంలో ఎదురైన సవాళ్లను తట్టుకుని సోదరీమణుల బంధానికి ప్రతీకగా నిలిచారు.

కయినాజ్ మెస్మాన్, టీనా మెస్మాన్ ముంబయికి చెందిన అక్కాచెల్లెళ్లు. వీళ్లమ్మ కమల్ ఆర్డర్ల ద్వారా కమ్మని బేకరీ ఉత్పత్తుల్ని తయారుచేసేది. ఆ రుచుల్ని ఆస్వాదిస్తూ పెరిగిన కయినాజ్ షెఫ్ కావాలనుకుంది. అనుకున్నట్లే హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేసి పేస్ట్రీ షెఫ్‌గా చేరింది కూడా. ఓసారి కిచెన్‌లో జారిపడటంతో వెన్నెముకకి గాయమై ఎలాగో కోలుకుంది, కానీ నిలబడలేని స్థితి. దాంతో ఉద్యోగాన్ని వీడక తప్పలేదు. అప్పుడు తమకున్న కెఫె కమ్ బేకరీని చూసుకోమన్నారు తండ్రి.



డిప్రెషన్‌లో ఉన్న అక్కని ఓదార్చి ధైర్యం చెప్పింది చెల్లి టీనా. ఆర్థిక సాయం అందించి అండగానూ నిలిచింది. ఈమె చార్టర్డ్ అకౌంటెంట్ కావడంతో మార్కెటింగ్ కార్యకలాపాలన్నీ తనే చూసుకుంది. అలా ఇరవయ్యేళ్ల కిందట థియోబ్రోమా(కోకో చెట్టు శాస్త్రీయనామం) పేరుతో చిన్న గదిలో మొదలైన వీళ్ల వ్యాపారం నేడు వేల కోట్లకు చేరింది. వీళ్లు తయారుచేసే బ్రౌనీలూ పేస్ట్రీలూ కేకుల్లో... కోకోలో చక్కెరలా వాళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలూ మిక్స్ అయ్యాయి. అందుకే... ఆ రుచులు అందరి మనసునీ దోచుకుని, దాదాపు 225 ఫ్రాంఛైజీలతో పాన్ ఇండియా పేస్ట్రీ చెయిన్‌గా పేరొందేలా చేశాయి. తమ కంపెనీలో 90 శాతం వాటాను క్రిస్ క్యాపిటల్‌కు రూ.2410 కోట్లకు విక్రయించి తాజా వార్తల్లో నిలిచారీ సోదరీమణులు!

అన్నీ తానై!



ఇసుకలో ఆటకి వెళ్తోంటే... నా వెనకే వచ్చింది. గూడు కట్టబోతే... తనూ ఓ చెయ్యి వేసింది.

ఏనాడైనా నన్ను వీడితేనా..

స్కూల్లో మాస్టారు కొట్టినా తిట్టినా... కన్నీళ్లు తుడిచి, ఓదార్చింది.

తోటిపిల్లల వెక్కిరింతల్ని తిప్పికొట్టింది.

టీనేజ్‌లో టీజింగ్ నుంచీ కాపాడింది.

నాకే డ్రెస్సు నప్పుతుందో, దానికేది మ్యాచవుతుందో...

నచ్చిన ఫుడ్, రంగు, వ్యక్తులు.. నా గురించి నాకే తెలియనివెన్నో తనకే తెలుసు.

నాన్న కసిరినా అమ్మ కోప్పడినా తన భుజమే నాకు ఓదార్పు.

కాలేజ్ ఎంపికలో గందరగోళం లేదు... తనెక్కడ చేరితే నేనక్కడే.

స్నేహాల మోసంలో చిక్కుకోకూడదన్నా... తన సలహాలూ సూచనలే.

మంచి ర్యాంకు వస్తే తనకే వచ్చినంత సంతోషం.

'నీవల్ల కాదు, వేరేది చేసుకో' అని అందరంటే... 'నీ వల్లే అవుతుంది, ప్రయత్నించు' అంటూ వెన్ను తట్టింది.

పెళ్లి, కొత్త వ్యక్తి... ఎలా ఉంటారోనన్న భయంలోనూ తనే భరోసా.

భర్తతో గొడవొస్తే సర్దిచెప్పేదీ పిల్లల పాలనలో సలహాలిచ్చేదీ... ఇలా జీవితాంతం అనుక్షణం నా వెంటే ఉండే తనని ఏమని పిలవాలి... ప్రాణంలో ప్రాణమనా... స్నేహానికి నిర్వచనమనా.. రక్తసంబంధమనా... అంతకుమించిన అపూర్వ బంధమనా..!

స్నేహం, అనుబంధం... రెండింటికీ తనే చిరునామా..!

– స్నేహితుల, సోదరీమణుల దినోత్సవ శుభాకాంక్షలు



చెట్టాపట్టాల్!

ఇదో ట్రెండ్



'జీవితం ఓ రైలు ప్రయాణం. ఎవరి గమ్యం వచ్చినప్పుడు వాళ్లు దిగి వెళ్లిపోవాల్సిందే' అని చెబుతుంటారు కదా! జీవితం సంగతేమో కానీ.. . ఇలా ప్రయాణాల్లో పరిచయమయ్యే వారితో మాటామాటా కలిసి స్నేహం కుదిరితే... అక్కడితో ఆ బంధం ఆగిపోకూడదు అనుకుంటున్నారు ఇప్పటితరం అమ్మాయిలు. 'అసలు ఇద్దరి వ్యక్తుల మధ్య అలవాట్లు, అభిరుచులు కలవడమే ఎక్కువ. అది లేకే ఇప్పుడు బంధాలన్నీ దెబ్బతింటున్నాయి. అలాంటిది అనుకోకుండా ఇలా అన్నీ కలిసిన స్నేహితుల్ని ఎందుకు వదులుకోవాలి' అంటున్నారట. పైగా, ఇలా కలిసిన వాళ్లు పరిస్థితుల్ని జడ్జ్ చేయకుండా, అన్నీ వింటూ అవతలి వాళ్లకి సాంత్వన ఇస్తున్నారట. అందుకే వారితో దోస్తీ గాఢమవుతోంది అంటున్నాయి అధ్యయనాలు. ఇదివరకు అయితే జర్నీ చేసినంత సేపూ కాలక్షేపంగానో, మంచి చెడుల్ని పంచుకోవాలనో, అవతలి వారితో పరిచయం కోసమో పలకరింపులు ఉండేవి. అవి ట్రైన్ లేదా బస్ దిగిన వెంటనే ముగిసిపోయేవి కూడా. కానీ ఈతరం అమ్మాయిలు వీటన్నింటికీ అతీతంగా ట్రావెల్ ఫ్రెండ్స్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. కష్టసుఖాల్ని పంచుకుంటున్నారు. దీన్నో ట్రెండ్‌గానూ ఫాలో అయిపోతున్నారు.



గెలిచారిద్దరూ!

బెస్టీస్ ఇద్దరూ కాలేజ్ టాపర్లుగా వస్తే... వాళ్ల ఆనందం మామూలుగా ఉంటుందా... సరిగ్గా అలాంటి సందడే బాలీవుడ్‌లో నెలకొందిప్పుడు. రాణీ ముఖర్జీ, వైభవీ మర్చంట్... ప్రాణస్నేహితులు. తాజాగా ఇద్దరూ జాతీయ అవార్డుని గెలుచుకున్నారు. రాణి నటి అయితే, వైభవి కొరియోగ్రాఫర్. అనేక ప్రాజెక్టుల్లో కలిసి పనిచేశారు. అలా మొదలైన వాళ్ల స్నేహం క్రమేణా గాఢంగా అల్లుకుంది. ఒకరింటికి ఒకరు వెళ్లడం, కలిసి ఫంక్షన్లకు హాజరవ్వడంతో బాగా దగ్గరైపోయారు. 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే'లో తన పిల్లలకోసం రెండు దేశాలతో పోరాడిన ఓ తల్లి పాత్రలో రాణి ముఖర్జీ నటన అద్భుతం. 'రాకీ ఔర్ రాణీకీ ప్రేమ్ కహానీ' సినిమాలోని 'ఢింఢోరా బాజే రే' పాటకి వైభవి కొరియోగ్రఫీ కళ్లను కట్టిపడేస్తుంది. అలా ఒకేసారి ఇద్దరినీ జాతీయ అవార్డు వరించడంతో ఆ స్నేహితుల సంతోషం అంబరాన్ని తాకింది. 'తన ప్రాణ స్నేహితురాలు రాణి ముఖర్జీ తొలిసారి ఉత్తమ నటిగా జాతీయ అవార్డును గెలుచుకున్న ఏడాదే తానూ రెండోసారి... పాతికేళ్ల తరవాత మళ్లీ ఈ అవార్డును గెలవడం ఎంతో సంతోషాన్నిచ్చింది' అంటోంది వైభవి. ఆ బెస్టీలిద్దరికీ మనమూ కంగ్రాట్స్ చెప్పేద్దామా

ఎక్కడున్నావ్?

నా పుట్టినరోజుకు ఒక్కరోజు ముందే తన బర్త్‌డే. ఇద్దరికీ ఏడాది తేడా అయినా ఒకే తరగతి వల్లేమో ఆ భేదం ఎప్పుడూ తెలిసేది కాదు. ఉండేదీ ఒకేచోట కావడంతో తనే నా లోకంగా ఉండేదాన్ని. మొదట దూరంగా ఇల్లు మారారు. అయితేనేం పండుగలు, పుట్టినరోజులు ఏవొచ్చినా తప్పక కలిసేవాళ్లం. తనకోసం స్కూళ్లూ మారా. మామూలుగా బిడియస్థురాలినే! తనని ఏమైనా అంటే మాత్రం కాళీమాతని అయ్యేదాన్ని. మా స్నేహానికి కన్ను కుట్టిందేమో! ఈసారి స్కూలు కాదు. ఊరే మారింది తను. నిజం చెప్పొద్దూ... ప్రాణం అల్లాడింది. ఫోన్లు లేవు, నాన్న ఎప్పుడైనా తన గురించి మోసుకొచ్చే సమాచారమే. ఆ మాత్రానికే సంబరపడేదాన్ని. ఓసారి తనొచ్చిందన్న కబురు. అప్పటికే కలుసుకుని చానాళ్లు అవుతోంది. ఆనందంగా వెళ్తే... ఎప్పుడూ 'అక్కా' అంటూ మాట్లాడే వాళ్ల చెల్లి కొత్తగా చూసింది. అంతే.. గుండె జల్లుమంది. అయినా లోపలికెళ్లా. తను మారలేదు. ఎప్పట్లాగే బోలెడు కబుర్లు. నాన్ననడిగి నేనూ తనతోపాటు హాస్టల్లో చేరాలనుకున్నా. ఈసారి ఊరు.. జిల్లా కాదు... రాష్ట్రాల దూరం. దాటిందీ తను కాదు, నేనే. అయితేనేం తన గురించి వాకబు ఆపలేదు. వాళ్ల నాన్న చనిపోయాక ఆ సమాచారమూ లేదు. ఆర్కుట్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్... ఎక్కడ జల్లెడ పట్టినా తన జాడ దొరకలేదు. ఉద్యోగంలో చేరా. పెళ్లయ్యి పిల్లలు కూడా. అరచేతిలోకి ప్రపంచం వచ్చినా తన చిరునామా ఇప్పటికీ దొరకట్లేదు. ఏమైపోయావు రూపా?

– చిన్ని, భూపాలపల్లి

ఆమే నాకు అమ్మ..!


వేళంగిని, చిన్నారి

14ఏళ్ల వయసు... బాధ్యతలు మరచిన నాన్న ఎప్పుడూ అమ్మతో గొడవలు పడుతూనే ఉండేవారు. వీళ్లెందుకు ఇలా ఉన్నారని బాధపడేదాన్ని. ఏడ్చేదాన్ని కూడా... కొన్ని రోజులకి నాన్న మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయారు. మూల కూర్చుని ఏడుస్తున్న నన్ను చూసి... నిన్ను చూసుకోవడానికి నేనున్నాగా అని భరోసా ఇచ్చింది అక్క వేళంగిని.

అప్పటికి తనకు 15 ఏళ్లే... అమ్మకే కష్టం రాకుండా ఇంటి బాధ్యతను తీసుకుంది. తను చదువుకుంటూనే ట్యూషన్లు చెప్పేది. నేనూ ఉద్యోగం చేస్తా అంటే... 'చిన్నదానివి, నీకెందుకు ఇవన్నీ నేనున్నాగా' అనేది. అలా సంపాదించిన డబ్బులతోనే నాకు పెళ్లి చేసింది. అక్కడితో తన బాధ్యత తీరిపోయింది అనుకోలేదు. ఏ రోజూ పరిస్థితులతో సర్దుకుపో అన్న మాటా చెప్పలేదు. అడుగడుగునా వాటిని ఎదుర్కొని ఎలా నిలబడాలో వివరిస్తూనే ఉండేది. నేను అమ్మ అయినప్పుడు నాకు అమ్మగా మారి సీమంతం చేసింది. కాన్పునకు ఇంటికి వెళ్తే తల్లిలా అన్నీ దగ్గరుండి చూసుకుంది. బాగోక మంచాన పడితే... నా బిడ్డలకు పాలు పట్టడం దగ్గర్నుంచీ నిద్రపుచ్చడం దాకా ప్రతిదీ చేసింది. నాకు ఇద్దరు పిల్లలు పుట్టాక, తను పెళ్లి చేసుకుంది. అదీ ఎవరి మీదా ఆధారపడకుండా...

చిన్నప్పుడు నన్ను ఓదార్చడానికి ఆమె చెప్పిన మాటలూ ఇచ్చిన భరోసా నేటికీ కొనసాగిస్తోంది. అమ్మానాన్న అన్నీ తానై నా జీవితంలో వచ్చే ప్రతి సంతోషంలోనూ దుఃఖంలోనూ తోడుగా ఉంది. ఇంకో జన్మంటూ ఉంటే అక్కకి అమ్మని అవ్వాలనేదే నా ఆశ.

– అలమండ చిన్నారి, విజయనగరం

చిరకాల బంధానికి... చిరు కానుక!

జీవితంలో కొన్ని బంధాలు పుట్టుకతో వస్తే... కొన్ని మనసుకు నచ్చి మనకు మనంగా నిర్మించుకున్నవి. అందులో మొదటిది అక్కాచెల్లెళ్ల బంధం అయితే... రెండోది స్నేహం. రెండింటికీ ప్రత్యామ్నాయాలని ఊహించలేం. అసలు వీరిద్దరూ లేకపోతే... జీవితంలో కొన్ని ఘట్టాలు వెలితిగా, శూన్యంగా అనిపిస్తాయి. మరి అలాంటి బంధాలకి సంబంధించిన ప్రత్యేక వేడుకలు వచ్చినప్పుడు... వారికోసం మరింత ప్రత్యేకమైన బహుమతులు అందించాలి అనుకుంటాం కదా. వాటిలో కొన్ని...

ఏడాదంతా నవ్విస్తుంది...

బహుమతి విలువ ఖరీదుని బట్టి కాదు... ఇచ్చే వ్యక్తిని బట్టి ఉంటుంది. ఈ స్మైలీ జార్స్ ఆ కోవకు చెందినవే. మీకు మీ అక్క, చెల్లి లేదా స్నేహితురాలితో ఉన్న జ్ఞాపకాలన్నీ నోట్‌లుగా రాసి, ఒక గాజు సీసాలో వేయండి. సీసాను మీకు నచ్చినట్లుగా అలంకరించి... వాళ్లకు ఇస్తే సరి. చదివిన ప్రతిసారి మీ మధ్య జరిగిన హ్యాపీ మూమెంట్స్ తలుచుకుని... నవ్వుకుంటారు. వీటి తయారీకి కాస్త సమయం కేటాయిస్తే చాలు. గుర్తుండిపోయే బహుమతిని అందించొచ్చు.



ఓర్పుకి నిదర్శనంగా...

శాంతి, నేర్పు, భావోద్వేగాల నియంత్రణకు గుర్తుగా విల్లో చెట్లను చెబుతారు. వాటి కలప నుంచి తయారు చేసినవే ఈ బాక్సులు కూడా. నచ్చిన వస్తువులూ, గ్రీటింగ్ కార్డ్ లాంటివి పెట్టి ఇవ్వొచ్చు. వ్యక్తుల్ని పోలినట్లు బాక్సుపై స్కల్ప్చర్లూ చెక్కి ఉంటాయి. డ్రెస్సింగ్ టేబుల్, టీపాయ్... ఎక్కడ పెట్టినా అలంకరణ వస్తువులుగానూ బాగుంటాయివి.





మలేసియాలోని పుత్రజయ సర్కిల్ వద్ద మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు

అమరావతి నిర్మాణంలో భాగస్వాములుకండి

మలేసియాలో మంత్రి నారాయణ పిలుపు

ఈనాడు, అమరావతి: అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని మలేసియాలోని తెలుగు అసోసియేషన్ ప్రతినిధులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా శనివారం పుత్రజయ పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి, మలేసియా తెలుగు అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుత్రజయ వెట్‌ల్యాండ్‌లో 138 హెక్టార్లలో అక్కడ నిర్మించిన వెట్‌ల్యాండ్ పార్కును పరిశీలించారు. మలేసియా పర్యాటకంలో కీలకమైన వెట్‌ల్యాండ్ పార్కు ప్రాధాన్యాన్ని అక్కడి అధికారులు వివరించారు. అమరావతిలో భారీ పార్కులు ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పేర్కొన్నారు.

ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఈనాడు, అమరావతి: పర్యాటక, ఆతిథ్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వార్షికోత్సవంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఏపీటీడీసీ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలితో కలిసి ఈవెంట్ మేనేజర్లతో మంత్రి చర్చించారు. స్వర్ణాంధ్ర పర్యాటక విజన్-2029, ఏపీలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలను వివరించారు. సరికొత్త ఆలోచనలు, సృజనాత్మక కార్యక్రమాలతో పర్యాటకులను ఆకర్షించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏపీలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, పీపీపీ విధానంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే భరోసా కల్పించే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. ఏపీ టూరిజం అథారిటీ 21 ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలను రెండు కేటగిరీల కింద గుర్తించిందని చెప్పారు. కేటగిరీ-ఏ లో మెగా, కేటగిరీ-బీ లో జిల్లా స్థాయి ఈవెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. క్యూరేటెడ్ సెలవులు, హోటళ్లు, కల్చరల్ హబ్‌లు, రిసార్ట్‌ల్లో పర్యాటకులు ఎక్కువ కాలం ఉండేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి వివరించారు.

డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి షెడ్యూల్

ఈ నెల 18 నుంచి రిజిస్ట్రేషన్

ఈనాడు, అమరావతి: డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ ఖరారు చేసింది. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలోకి మారేందుకు కళాశాలలకు ఈ నెల 4 వరకు అవకాశం కల్పించింది. విశ్వవిద్యాలయాల అనుబంధ గుర్తింపును 9 నుంచి 16 వరకు నిర్వహించనుంది. ప్రవేశాల కౌన్సెలింగ్‌కు సంబంధించిన వివరాల ప్రకటనను 18న విడుదల చేస్తుంది. డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ ఈ నెల 18-20, ప్రత్యేక కేటగిరి పత్రాల పరిశీలన 21-23, కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు 21-24, వెబ్ ఆప్షన్ల మార్పునకు 25 వరకు అవకాశం కల్పించింది. డిగ్రీ సీట్లను 27న కేటాయించి, విద్యార్థులకు తరగతులను 28 నుంచి ప్రారంభించనుంది.

హోసూర్‌లో 44 వేల ఇళ్లు నిర్మించనున్న టాటా సంస్థ

వలస కార్మికుల కోసం

రూ.1,341 కోట్ల వ్యయంతో నిర్మాణం

చెన్నై (డిల్లీవాక్కం), న్యూస్‌టుడే: తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా హోసూర్‌లో ఇతర రాష్ట్రాల వలస కార్మికుల కోసం రూ.1,341 కోట్ల వ్యయంతో 44 వేల అద్దె గృహాలను నిర్మించే ప్రణాళికను టాటా సంస్థ చేపట్టనుంది. 2020 కరోనా లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులు ఆశ్రయం లేక అవస్థలు పడ్డారు. వేల మంది నిలువనీడ లేక స్వగ్రామాలకు వెళ్లారు. కొందరు రోడ్లపైన పడ్డారు. దీంతో తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికుల కొరత ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం వలస కార్మికుల కోసం గృహాలు నిర్మించి తక్కువ అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు గాను పలు నిర్మాణ, పారిశ్రామిక సంస్థలు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చాయి. టాటా ఎలక్ట్రానిక్ పరిశ్రమలో పనిచేస్తున్న 10 వేల మంది వలస కార్మికుల కోసం ఇప్పటికే హోసూర్‌లో గృహ వసతి కల్పించారు. ఈ నేపథ్యంలో అక్కడే 64 ఎకరాల విస్తీర్ణంలో 44 వేల మందికి గృహ సౌకర్యం కల్పించడానికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాప్టో ధర్నాలు

ఈనాడు, అమరావతి: బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఫ్యాప్టో ఛైర్మన్ సాయి శ్రీనివాస్ భీమవరం, అమలాపురం, కాకినాడల్లో నిర్వహించిన నిరసనల్లో పాల్గొన్నారు.. ప్రధాన కార్యదర్శి చిరంజీవి నిర్వహించిన ధర్నాల్లో పాల్గొన్నారు.

ఏసీబీకి హైకోర్టులో ఎదురుదెబ్బ

- నోటిఫై కాని పోలీసుస్టేషన్లో కేసుల నమోదు చెల్లదు
- 2016-20 మధ్య నమోదైన 15 కేసుల కొట్టివేత

ఈనాడు, అమరావతి: ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలతో పలువురు అధికారులపై 2016-20 మధ్య ఏసీబీ నమోదుచేసిన 15 కేసులను సాంకేతిక కారణాలను చూపుతూ హైకోర్టు కొట్టేసింది. కేసులు నమోదుచేసే నాటికి విజయవాడలోని ఏసీబీ, సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సీఐయు).. పోలీసు స్టేషన్‌గా నోటిఫై కాలేదని స్పష్టంచేసింది. సీఐయు, ఏసీబీ, విజయవాడను రాష్ట్రమంతా అధికారం ఉండే పోలీసుస్టేషన్‌గా నోటిఫై (2022 సెప్టెంబర్ 14) చేయడానికి ముందు నమోదుచేసిన కేసులు కొట్టేయడానికి అర్హమైనవని పేర్కొంది. ఏసీబీ నమోదుచేసిన 15 కేసులను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

★ ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే ఆరోపణతో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రభుత్వ అధికారులపై 15 కేసులు నమోదుచేశారు. వాటిని కొట్టేయాలని నిందితులు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. పోలీసుస్టేషన్‌గా నోటిఫై కానిచోట నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లకు చట్టబద్ధత ఉండదని నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

★ ఏసీబీ తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. సాంకేతిక కారణాల ఆధారంగా కేసులను కొట్టేయాలని కోరడానికి వీల్లేదన్నారు. రాష్ట్ర విభజన చట్టం-2014లోని సెక్షన్ 101 ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలోని చట్టాలు, సర్క్యులర్లను అన్వయించుకున్నట్లు భావించాలని చెప్పారు. కేసులు నమోదు చేసే అర్హత సీఐయుకు ఉందన్నారు.

★ ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి.. 'పిటిషనర్లపై కేసు నమోదు చేసేనాటికి సీఐయును పోలీసుస్టేషన్‌గా నోటిఫై చేయలేదు. గెజిట్ ద్వారా నోటిఫై చేయని పోలీసుస్టేషన్‌కు ఇంఛార్జి ఆఫీసరుగా పోలీసు అధికారి వ్యవహరించలేరు. ప్రాథమికంగా చేసిన తప్పును.. ఆ తర్వాత నోటిఫై చేయడం ద్వారా సరిదిద్దలేరు. జాయింట్ డైరెక్టర్ (జేడీ), సీఐయు, ఏసీబీ, విజయవాడను ఏపీ మొత్తానికి పోలీసుస్టేషన్‌గా పేర్కొంటూ సెప్టెంబరు 14న రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. పిటిషనర్లపై అంతకుముందే కేసులు నమోదయ్యాయి. అందువల్ల ఆ కేసులను కొట్టేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

13న అమరావతిలో

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి శంకుస్థాపన

- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా భూమి పూజ
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో ఈ నెల 13న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్, ప్రముఖ సినిమా నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. అనంతవరం సమీపంలో ఈ-7 రహదారి పక్కన ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన విద్యుత్ సదుపాయం, రహదారులు, అమరావతి బృహత్ ప్రణాళిక మ్యాపులను సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ బాలకృష్ణకు వివరించారు. అనంతవరం, తుళ్లూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం కేటాయించిన 21 ఎకరాల్లో ఆసుపత్రి నిర్మించనున్నారు. అమరావతిలో నిర్మిస్తున్న క్యాన్సర్ ఆసుపత్రిని దేశంలో ఉత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని బాలకృష్ణ తెలిపారు. మూడు దశల్లో అమరావతిలో ఆసుపత్రి నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని వెల్లడించారు.



బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

★ 'భగవంత్ కేసరి' చిత్రానికి జాతీయ ఉత్తమ పురస్కారం రావడం సంతోషంగా ఉందని బాలకృష్ణ అన్నారు. సినిమాలైనా, సేవా కార్యక్రమాలైనా సమాజంలో చైతన్యం తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. చిత్రాన్ని జాతీయ అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీ మెంబర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై శ్రీకాకుళం జిల్లా హిరమండలం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దువ్వాడ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'ఎన్నికల ముందు ప్రశ్నించడానికి వచ్చాను అన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. నెలకు రూ.50 కోట్ల చొప్పున సీఎం చంద్రబాబు నుంచి తీసుకుంటూ ప్రశ్నించడం లేదు' అని విమర్శలు చేశారు. దీనిపై హిరమండలం జనసేన నాయకుడు వంజరాపు సింహాచలం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎమ్మెల్సీకి టెక్కలి సమీపంలోని ఆయన నివాసంలో శనివారం నోటీసులు అందజేశారు.

99.98% రైతులకు అన్నదాతా సుఖీభవ నిధుల జమ

- సాయం అందనివారు నేటి నుంచి అర్జీలివ్వాలి
- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులైన వారిలో 99.98% రైతు కుటుంబాల ఖాతాల్లో అంటే 44.75 లక్షల ఖాతాల్లో నిధులు జమయ్యాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న ప్రాంతాలతోపాటు ఈకేవైసీ సమస్య, ఎన్‌పీసీఐలో చురుగ్గా లేని, మ్యాపింగ్ కాని సుమారు లక్ష మంది రైతుల ఖాతాల్లో మాత్రమే సుఖీభవ సొమ్ము పడలేదని ఆయన వివరించారు. వ్యవసాయశాఖ అందించిన డేటాలో కేవలం 1,067 ఖాతాలకు మాత్రమే నగదు బదిలీ కాలేదని ఆర్టీజీఎస్ ద్వారా సమాచారం అందిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరస్కరణకు గురైన రైతులు ఆదివారం నుంచి గ్రామ రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు ఇవ్వవచ్చని ఆయన సూచించారు.

తిరస్కరణకు కారణాలేంటి?


- ★ భూ యజమాని చనిపోతే.. పరిశీలన సమయంలో వారిని జాబితాల నుంచి తిరస్కరించారు. వారసులకు పాసుపుస్తకాల జారీలో జాప్యం జరుగుతోంది.
- ★ సాగు భూమికి ఆధార్ అనుసంధానంలో తప్పులు జరిగాయి. వీటిని తహసీల్దార్లకు పంపారు. అక్కడ ఇంకా సమస్య పరిష్కారం కాలేదు.
- ★ న్యాయపరమైన వివాదాలు, వెబ్‌ల్యాండ్‌లో నోషనల్ ఖాతాలు (పట్టా నంబరు ఇవ్వనివి)గా నమోదైన వాటిని తిరస్కరించారు.
- ★ ఆక్వా సాగు, వ్యవసాయేతర అవసరాలకు వాడే భూములకు పథకం వర్తింపజేయలేదు.
- ★ నెలకు రూ.20 వేల కంటే ఎక్కువ జీతం పొందే ఉద్యోగులు.. తాజా, మాజీ ప్రజాప్రతినిధులు అర్హులు కారు.
- ★ 10 సెంట్లలోపు భూమి కలిగినవారూ అనర్హులే.
- ★ భూమి ఉన్న మైనర్లు కూడా అర్హులు కాదు.
- ★ ఈకేవైసీ చేయని కేసులకు ప్రయోజనాలు అందలేదు.

సమస్య పరిష్కరించాక నగదు జమ

- ★ ఎన్‌పీసీఐలో చురుగ్గాలేని, మ్యాప్ కాని ఖాతాలను.. బ్యాంకుకు వెళ్లి యాక్టివ్ చేసుకోవాలి. అప్పుడు వీరికి నగదు జమవుతుంది
- ★ ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు కూడా పూర్తి చేసుకుంటే పెట్టుబడి సాయం అందుతుంది.

ఆగస్టు 3 నుంచి వినతులు

- ★ లబ్ధిదారులు ఆగస్టు 3 నుంచి అభ్యంతరాలు, సవరణలు నమోదు చేసుకోవచ్చు.
- ★ మే 2 నుంచి జులై 15 మధ్య కొత్తగా మ్యాప్ అయిన వారి నుంచి అర్జీలు తీసుకుంటారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి. చిత్రంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి గడ్కరీ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న కేంద్ర మంత్రికి తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం, అదనపు ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పేదలకు మంచి జరగాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆయన వెంట తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు ఉన్నారు.

'అన్నదాతా సుఖీభవ'కు అభివందనం!



పాలకొల్లులో రైతులు నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీలో మంత్రి నిమ్మల తదితరులు

పాలకొల్లు, గజపతినగరం, న్యూస్‌టుడే: 'అన్నదాతా సుఖీభవ' పథకం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నియోజకవర్గ రైతులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించి కూటమి ప్రభుత్వం పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు ట్రాక్టర్ నడిపి ఉత్సాహం నింపారు.

★ హోం మంత్రి వంగలపూడి అనిత విజయనగరం జిల్లా పురిటిపెంట గ్రామ సమీప పొలాల్లో మహిళా రైతులతో కలిసి వరినాట్లు వేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై వారితో మాట్లాడి తెలుసుకున్నారు.



విజయనగరం జిల్లా పురిటిపెంట గ్రామ సమీప పొలాల్లో మహిళా రైతులతో మాట్లాడుతున్న మంత్రి అనిత

పోలవరం ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు కేటాయించాం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు కోసం రూ.40వేల కోట్లు కేటాయించినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. తిరుపతి, తిరుమల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం కంచిపీఠాన్ని ఆయన సందర్శించారు. చాతుర్మాస దీక్షలో ఉన్న కంచి మఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, శ్రీ సత్యచంద్రశేఖర సరస్వతి స్వామీజీలతో కాసేపు మాట్లాడి వారి ఆశీస్సులు అందుకున్నారు. మఠం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడారు. నదుల అనుసంధానం కోసం కృషిచేశానని.. పవర్‌గ్రిడ్, హైవే గ్రిడ్ తరహాలో వాటర్‌గ్రిడ్ కోసం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గోదావరి నది ద్వారా 1,300 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని.. గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరిల అనుసంధానంతో తమిళనాడు చిట్టచివరికి నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించామని, దేశంలో 49 నదుల అనుసంధానం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అనధికారిక హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై ఏం చేశారు?

- ఏర్పాటుకు అనుమతులపై విధానం రూపొందించారా?
- వివరాలతో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బోర్డుల ఏర్పాటుకు అనుమతిచ్చే విషయంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంస్థలు, స్థానిక సంస్థలకు మార్గదర్శనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా విధానాన్ని రూపొందించిందా? వర్షం, బలమైన గాలులు వీచినప్పుడు వాటి వల్ల ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందులో పొందుపరిచారా? రాష్ట్రంలో అధికారికంగా ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఎన్ని.. అనధికారికంగా ఏర్పాటు చేసినవెన్ని, ఇలాంటి వాటిపై అందిన ఫిర్యాదులెన్ని, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారు' అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వివరాలతో నివేదిక ఇవ్వాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ ఉత్తర్వులిచ్చింది. తగిన సమయంలో పిల్‌పై విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారంటూ డాక్టర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి 2018లో హైకోర్టులో పిల్ వేశారు. ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. నగరాలు, పట్టణాలు ఉన్నది విచ్చలవిడిగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడానికి కాదని ఘాటుగా వ్యాఖ్యానించింది. వాటి వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వెల్లడించింది. వీటిని నియంత్రించాలని పేర్కొంది. తాజాగా జరిగిన విచారణలో అమికస్ క్యూరీ వివేక్ చంద్రశేఖర్ అనధికారిక హోర్డింగ్‌లు, ఫ్లెక్సీ బ్యానర్ల తొలగింపుపై గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కోర్టు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి నుంచి నివేదిక కోరింది.

సరోగసీ పేరుతో వసూళ్లు

యూఎస్ ఉమెన్‌కేర్, ఫెర్టిలిటీ కేంద్రానికి నోటీసులు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: సరోగసీ పేరుతో అక్రమంగా డబ్బు వసూలు చేసిన ఓ ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాకం బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని యూఎస్ ఉమెన్‌కేర్, ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకులు సరోగసీ చేస్తామంటూ పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరానికి చెందిన మహిళ నుంచి అధికంగా డబ్బు వసూలు చేశారు. తర్వాత విశాఖపట్నంలోని సృష్టి ఫెర్టిలిటీ, రీసెర్చ్ కేంద్రానికి రిఫర్ చేశారంటూ బాధితులు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా డీఎంహెచ్‌వో, డీఐవో, రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ప్రసూతి, చిన్నపిల్లలు, పెథాలజీ విభాగాధిపతులు, డీఎస్పీతో కూడిన ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. శనివారం యూఎస్ ఉమెన్‌కేర్, ఫెర్టిలిటీ కేంద్రానికి కమిటీ సభ్యులు వెళ్లగా మూసి ఉన్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో ఆ కేంద్రానికి ప్రాథమిక నోటీసు జారీ చేశామని చెప్పారు.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయాల్లో 46% వృద్ధి

నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకంగా నిలిచే స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయంలో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 46% వృద్ధి నమోదైందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగవుతోందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. "గతేడాది జులైతో పోల్చితే ప్రస్తుత ఏడాది జీఎస్టీ ఆదాయంలో 14% వృద్ధి నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.1,819.32 కోట్లుగా ఉన్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం ఈ తొలి త్రైమాసికంలో రూ.2,661.18 కోట్లకు చేరింది" అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కాగ్ ఇచ్చిన నివేదికకు వైకాపా అధినేత జగన్ తప్పుడు భాష్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. "వైకాపా ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.25 వేల కోట్ల బకాయిల్ని కూటమి ప్రభుత్వం తీర్చింది. విడతల వారీ రూ.3,400 కోట్ల ఫీజు బకాయిల్ని చెల్లిస్తోంది" అని తెలిపారు. "గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మూలధన వ్యయం కింద రూ.1,647.76 కోట్లు ఖర్చు చేస్తే, ఈ ఏడాది రూ.6,053.69 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని విజయ్‌కుమార్ తెలిపారు.

ఛాంపియన్స్


జడేజా

1 సూపర్ ఫామ్‌లో ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. ఇంగ్లాండ్‌లో ఒక టెస్టు సిరీస్‌లో ఆరో స్థానం లేదా అంతకన్నా దిగువన బ్యాటింగ్ చేస్తూ ఆరు 50+ స్కోర్లు సాధించిన తొలి బ్యాటర్‌గా అతడు ఘనత సాధించాడు. గారీ సోబర్స్‌ను అతడు అధిగమించాడు. సోబర్స్ 1966లో అలాంటి స్కోర్లు అయిదు చేశాడు.

516 ఇంగ్లాండ్‌తో ప్రస్తుత సిరీస్‌లో జడేజా చేసిన పరుగులు. ఒక టెస్టు సిరీస్‌లో ఆరో స్థానం లేదా అంతకన్నా దిగువన బ్యాటింగ్‌కు దిగి 500పై పరుగులు చేసిన భారత తొలి బ్యాటర్‌గా జడేజా నిలిచాడు.

తొలి టెస్టులో, ఆపై మూడో మ్యాచ్‌లో గెలిచేందుకు అవకాశాలు లభించినా.. ఉపయోగించుకోలేక పోయింది టీమ్‌ఇండియా. రెండో టెస్టులో మాత్రం సాధికారిక విజయంతో అదరగొట్టింది. ఓటమి ఖాయమనుకున్న నాలుగో టెస్టులో అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను డ్రాగా ముగించి, సిరీస్ చేజారకుండా కాపాడుకుంది. ఇప్పుడు సిరీస్‌ను సమం చేసేందుకు గొప్ప అవకాశం యువ భారత్ ముందు నిలిచింది. మ్యాచ్‌పై ఆశలే లేని స్థితి నుంచి గొప్పగా పుంజుకుని విజయావకాశాలు సృష్టించుకున్న భారత్.. ఆదివారం బంతితో సత్తా చాటితే సగర్వంగా సిరీస్‌ను సమం చేస్తుంది. ఈ మ్యాచ్‌లో అంచనాలను మించి రాణించిన బౌలర్లు.. ఈ ఒక్క రోజు ఇంగ్లాండ్ బ్యాటర్లకు కళ్లెం వేయగలిగితే అపురూప విజయం టీమ్‌ఇండియా సొంతమవుతుంది. మరి సిరాజ్ బృందం ఏం చేస్తుందో?

నేడే క్లైమాక్స్!


జైస్వాల్ సెంచరీ
యశస్వి జైస్వాల్ 118

- బౌలర్లు సత్తా చాటితే విజయం భారత్‌దే
- లక్ష్యం 374.. ఇంగ్లాండ్ 50/1

లండన్

భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ రసవత్తర ముగింపు ముంగిట నిలిచింది. సిరీస్ ఫలితం నాలుగో రోజైన ఆదివారమే తేలిపోయే అవకాశముంది. బౌలర్ల శ్రమకు న్యాయం చేస్తూ బ్యాటర్లూ అదరగొట్టడంతో ఇంగ్లాండ్‌కు భారత్ 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట చివరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. డకెట్ (34 బ్యాటింగ్)తో కలిసి జట్టుకు శుభారంభాన్నందించిన క్రాలీ (14)ని.. ఆఖర్లో సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆటను భారత్ సంతృప్తిగా ముగించింది. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో అంచనాలను మించి ఆడిన భారత్.. 396 పరుగులు చేసి ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (118; 164 బంతుల్లో 14×4, 2×6) కెరీర్లోనే అత్యంత విలువైనది అనదగ్గ శతకం సాధించాడు. రెండో రోజు నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్‌దీప్ (66; 94 బంతుల్లో 12×4) అర్ధశతకంతో ఇంగ్లిష్ బౌలర్లకు షాకిచ్చాడు. జడేజా (53; 77 బంతుల్లో 5×4), సుందర్ (53; 46 బంతుల్లో 4×4, 4×6) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ (5/125), అట్కిన్సన్ (3/127), ఒవర్టన్ (2/98) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లాండ్ 247 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఆకాశ్‌దీప్ అదరహో..: 75/2.. రెండో రోజు ఆట చివరికి భారత్ స్కోరిది. రెండు సెషన్లయినా నిలిస్తే.. స్కోరు 300 దాటితే మ్యాచ్ గెలిచేందుకు మెరుగైన అవకాశాలు ఉంటాయన్న అంచనా. అయితే భారత్ అంచనాలను మించిపోయింది. ఇంకో 70 ఓవర్లు బ్యాటింగ్ చేసింది. దాదాపు 400 స్కోరు చేసింది. ముందు రోజు నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్‌దీప్ స్పెషలిస్టు బ్యాటర్ తరహాలో ఆడి అర్ధశతకం సాధించడం మూడో రోజు ఆటలో అసలైన హైలైట్. యశస్వి జైస్వాల్ జోరు కొనసాగిస్తూ సెంచరీ పూర్తి చేసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వస్తే.. మధ్యలో జడేజా కీలక ఇన్నింగ్స్‌తో జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. ఆఖర్లో వాషింగ్టన్ సుందర్ ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునిచ్చాడు. ఇంగ్లాండ్ ఏ దశలోనూ వెంటవెంటనే వికెట్లు సాధించలేకపోయింది. ఒక వికెట్ పడ్డా.. వెంటనే ఒక భాగస్వామ్యం నమోదు చేయడం ద్వారా ప్రత్యర్థికి పైచేయి సాధించే అవకాశం లేకుండా చూసింది. మొత్తంగా సమష్టి కృషితో భారత్ ఇంగ్లాండ్‌కు సవాలు విసిరే లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఉదయం చకచకా కొన్ని వికెట్లు తీసి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని చూసిన ఇంగ్లాండ్‌కు ఓవర్‌నైట్ జోడీ చెక్ పెట్టింది. లాంఛనమనుకున్న ఆకాశ్‌దీప్ వికెట్‌ను పడగొట్టడానికి కూడా ఆ జట్టు బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. తాను చేసే ప్రతి పరుగూ జట్టుకు బోనస్‌గా మారే స్థితిలో ఆకాశ్‌దీప్ సాధికారికంగా ఆడి ఇంగ్లాండ్‌కు చెక్ పెట్టాడు. అతను అలవోకగా బౌండరీలు బాదుతూ ప్రత్యర్థి బౌలర్లను ఏడిపించాడు. ఆకాశ్ ఇన్నింగ్స్‌లో 12 బౌండరీలుండడం.. వాటితోనే 48 పరుగులు రావడం విశేషం. 70 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన ఆకాశ్‌దీప్.. ఆ తర్వాత కూడా జోరు కొనసాగించాడు. మరో ఎండ్‌లో జైస్వాల్ నిలకడగా ఆడడంతో భారత్ 177/2తో తిరుగులేని స్థితికి చేరుకుంది. లంచ్ విరామానికి కాస్త ముందు అతను ఔట్ కావడంతో ఇంగ్లాండ్ ఊపిరి పీల్చుకుంది. లంచ్‌కు స్కోరు 189/3. అయితే విరామానంతరం వెంటనే కెప్టెన్ శుభ్‌మన్ (11) ఔటైపోయాడు. అతణ్ని అట్కిన్సన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ స్థితిలో జైస్వాల్.. కరుణ్ నాయర్ (17), జురెల్ (34)ల సహకారంతో స్కోరును 300 దాటించాడు. ఈ క్రమంలోనే అతడి శతకం పూర్తయింది. ఆ తర్వాత అతను టంగ్ బౌలింగ్‌లో ఔటైపోయాడు. తర్వాత జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జురెల్ కూడా విలువైన పరుగులు సాధించాడు. టీ విరామానికి 304/6తో ఎంతో మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ మూడో సెషన్లో ఇంగ్లిష్ బౌలర్లు కొంచెం పుంజుకున్నారు. 24 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీశారు. జురెల్, జడేజా ఒకరి తర్వాత ఒకరు ఔటైపోయారు. సిరాజ్ డకౌటవడంతో స్కోరు 357/9కు చేరుకుంది. ఇక పెద్దగా స్కోరు పెరిగే అవకాశం లేదనే అంతా అనుకున్నారు. కానీ అవతలి ఎండ్‌లో ప్రసిద్ధ్‌ను పెట్టుకుని సుందర్.. భారీ షాట్లకు దిగాడు. సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తించాడు. 9వ వికెట్ పడేసరికి 17 పరుగులే చేసిన సుందర్.. 3 ఓవర్ల వ్యవధిలో అర్ధశతకం పూర్తి చేయడం విశేషం. అతణ్ని ఔట్ చేసి 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేసిన టంగ్.. భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.


సిరాజ్

జైస్వాల్ శతకం రోహిత్‌కు అంకితం


స్టేడియంలో రోహిత్

భారత్-ఇంగ్లాండ్ చివరి టెస్టు మూడో రోజు ఆట చూసేందుకు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రావడం విశేషం. ఓవల్ స్టేడియం స్టాండ్స్‌లో అతను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. రోహిత్‌ను ఎంతో ఆరాధించే ఓపెనర్ యశస్వి జైస్వాల్.. తన శతకాన్ని అతడికే అంకితం ఇచ్చాడు. మూడంకెల స్కోరుకు చేరుకోగానే రోహిత్ వైపు చూస్తూ అతను అభివాదం చేశాడు. అంతే కాక గ్లోవ్స్ తీసేసి లవ్ సింబల్ పెట్టి తన ఆరాధ్య ఆటగాడిపై తన ప్రేమను చాటుకున్నాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 224
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 247
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఒవర్టన్ (బి) టంగ్ 118; రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7; సుదర్శన్ ఎల్బీ (బి) అట్కిన్సన్ 11; ఆకాశ్‌దీప్ (సి) అట్కిన్సన్ (బి) ఒవర్టన్ 66; శుభ్‌మన్ ఎల్బీ (బి) అట్కిన్సన్ 11; కరుణ్ నాయర్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 17; జడేజా (సి) బ్రూక్ (బి) టంగ్ 53; జురెల్ ఎల్బీ (బి) ఒవర్టన్ 34; సుందర్ (సి) క్రాలీ (బి) టంగ్ 53; సిరాజ్ ఎల్బీ (బి) టంగ్ 0; ప్రసిద్ధ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 26 **మొత్తం:** (88 ఓవర్లలో ఆలౌట్) **396;** **వికెట్లపతనం:** 1-46, 2-70, 3-177, 4-189, 5-229, 6-273, 7-323, 8-357, 9-357; **బౌలింగ్:** అట్కిన్సన్ 27-3-127-3; టంగ్ 30-4-125-5; ఒవర్టన్ 22-2-98-2; బెతెల్ 4-0-13-0; రూట్ 5-1-15-0
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (బి) సిరాజ్ 14; డకెట్ బ్యాటింగ్ 34; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (13.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) **50;** **వికెట్ల పతనం:** 1-50; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 5-1-15-0; ప్రసిద్ధ్‌కృష్ణ 5-1-23-0; సిరాజ్ 3.5-0-11-1

సెమీస్‌లో లక్ష్య, తరుణ్ ఓటమి

మకావు ఓపెన్‌లో ముగిసిన భారత పోరాటం


లక్ష్యసేన్

మకావు: భారత షట్లర్లు లక్ష్యసేన్, తరుణ్ మన్నెపల్లి మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్ చేరలేకపోయారు. వీళ్లిద్దరూ సెమీఫైనల్లో ఓడిపోవడంతో ఈ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. శనివారం పురుషుల సింగిల్స్ సెమీస్‌లో లక్ష్య 16-21, 9-21తో అల్వి ఫర్హాన్ (ఇండొనేసియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. 39 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌ను లక్ష్య మెరుగ్గానే ఆరంభించాడు. 3-0తో పైచేయి సాధించిన అతను.. తర్వాత 7-11తో వెనుకబడ్డాడు. ఫర్హాన్ రెండో అర్ధంలో దూకుడు పెంచి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో ప్రత్యర్థిదే పూర్తి ఆధిపత్యం. మరో సెమీస్‌లో తరుణ్ 21-19, 16-21, 16-21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో పోరాడి ఓడాడు. ఈ మ్యాచ్ గంటా 21 నిమిషాలు సాగడం విశేషం. తొలి గేమ్‌లో 11-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన తరుణ్‌కు.. తర్వాత ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైంది. అయినా అతను గేమ్‌ను గెలుచుకున్నాడు. కానీ తర్వాతి రెండు గేమ్‌ల్లో తరుణ్ గట్టిగానే పోరాడినా పైచేయి సాధించలేకపోయాడు.

మళ్లీ ఒక్కటయ్యారు


కశ్యప్, సైనా

హైదరాబాద్: బ్యాడ్మింటన్ జంట సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ మళ్లీ ఒక్కటయ్యారు. "మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అంటూ సైనా శనివారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు పెట్టింది. "కొన్నిసార్లు దూరం వల్ల ఉనికి విలువ తెలుస్తుంది. బంధాన్ని కొనసాగించేందుకు మేము మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అని ఆమె పేర్కొంది. కశ్యప్, తాను విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సైనా రెండు వారాల కింద ప్రకటించిన సంగతి తెలిసిందే. సైనా, కశ్యప్ 2018లో పెళ్లి చేసుకున్నారు.

దివ్యకు రూ.3 కోట్లు

మహారాష్ట్ర ప్రభుత్వ నజరానా


దివ్య

నాగ్‌పుర్: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సత్కరించారు. ఆమెకు రూ.3 కోట్ల నగదు బహుమతిని అందించారు. నాగ్‌పుర్ (మహారాష్ట్ర)కు చెందిన అమ్మాయి దేశం గర్వపడేలా చేసినందుకు భారతీయుడిగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా గర్వపడుతున్నానని ఈ సందర్భంగా ఫడణవీస్ అన్నారు. 19 ఏళ్ల దివ్య ఇటీవలే మహిళల ప్రపంచకప్ గెలిచిన పిన్నవయస్కురాలిగా ఘనత సాధించింది. తనను సన్మానించినందుకు ముఖ్యమంత్రికి, నాగ్‌పుర్ ప్రజలకు దివ్య కృతజ్ఞతలు తెలిపింది. "ఇది నాకు చాలా ప్రత్యేక సందర్భం. పిల్లలకు కాస్తయినా ప్రేరణగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని దివ్య చెప్పింది.

రూట్‌తో గొడవ ప్రణాళికలో భాగమే


ప్రసిద్ధ్

లండన్: ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్‌తో వాగ్వాదానికి జట్టు ప్రణాళికల్లో భాగమే అని టీమ్‌ఇండియా పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ చెప్పాడు. రూట్‌తో మైదానం బయట మంచి స్నేహమే ఉందన్న ప్రసిద్ధ్.. మ్యాచ్‌లో జరిగే ఘర్షణను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నాడు. అయిదో టెస్టు రెండో రోజు ఆటలో రూట్, ప్రసిద్ధ్ మధ్య మాటల యుద్ధం జరగడం.. మధ్యలో కేఎల్ రాహుల్ సైతం జోక్యం చేసుకోవడంతో గొడవ పెద్దది కావడంతో అంపైర్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. దీనిపై ప్రసిద్ధ్ స్పందిస్తూ.. "అది చిన్న విషం. రూట్‌కు, నాకు మధ్య ఉన్న పోటీ తత్వమే వాగ్వాదంగా మారింది. మైదానం బయట మేమిద్దరం స్నేహంగానే ఉంటాం. ఆ గొడవను ఇద్దరం ఆస్వాదించాం. రూట్‌ను రెచ్చగొట్టడం మా ప్రణాళికలో భాగం. నేను తననుద్దేశించి రెండు మాటలు అన్నాను. అతడి నుంచి అంత పెద్ద స్పందన వస్తుందనుకోలేదు. రూట్‌ను నేను ఇష్టపడతా. అతను ఆటలో ఓ దిగ్గజం. బ్యాటర్‌తో వాగ్వాదం మనలోని ఉత్తమ ప్రదర్శనను బయటికి తెస్తుంది" అని ప్రసిద్ధ్ పేర్కొన్నాడు. చివరి టెస్టులో రెండో రోజు వెనుకబడ్డ భారత్.. తిరిగి పుంజుకోవడానికి ఆటగాళ్లలో ఉన్న పరస్పర నమ్మకమే కారణమని ప్రసిద్ధ్ చెప్పాడు. "మేం బౌలింగ్ చేస్తున్నపుడు ఒకరికొకరు మద్దతుగా నిలవాలని అనుకున్నాం. ఒకరి బౌలింగ్‌లో ఏదైనా మార్పు సూచించాలని అనుకుంటే వెంటనే వెళ్లి చెప్పడం, సహకారం అందించడం చేశాం. మా ప్రణాళికలను అందరం కలిసి సమర్థంగా అమలు చేయడానికి ప్రయత్నించాం. కాబట్టే ఈ మ్యాచ్‌లో పుంజుకున్నాం" అని ప్రసిద్ధ్ తెలిపాడు.

భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లు దుబాయ్‌లో..

దుబాయ్: వచ్చే ఆసియాకప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌లు దుబాయ్‌లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఏసీసీ శనివారం ప్రకటించింది. సెప్టెంబరు 9న టోర్నీ మొదలు కానుండగా.. 14న దుబాయ్‌లో పాకిస్థాన్‌తో భారత్ తలపడుతుంది. రెండు జట్లు సెప్టెంబరు 21న అదే వేదికలో పోటీ పడే అవకాశముంది. ఫైనల్‌కు కూడా దుబాయ్ (సెప్టెంబరు 28) ఆతిథ్యమిస్తుంది. దుబాయ్‌తో పాటు అబుదాబిలో ఆసియాకప్ మ్యాచ్‌లు జరుగుతాయి. టీమ్‌ఇండియా అబుదాబిలో ఒక మ్యాచ్ ఆడుతుంది. భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ జట్లు గ్రూప్-ఎలో.. అఫ్గానిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్‌లు గ్రూప్-బీలో ఉన్నాయి. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-4కు అర్హత సాధిస్తాయి. అందులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో ప్రవేశిస్తాయి.

భారత్‌లో 70 అడుగుల మెస్సి విగ్రహం


మెస్సి

కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ అభిమానులకు ఇది ఎంతో సంతోషాన్నిచ్చే విషయమే. ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సి మన దేశం వస్తున్నాడు. అంతా అనుకున్నట్లు సాగితే భారత్ పర్యటనలో ఈ అర్జెంటీనా వీరుడు మొదట కోల్‌కతాను సందర్శిస్తాడు. ఆ తర్వాత అహ్మదాబాద్, ముంబయి, దిల్లీలకు వెళ్తాడు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశంతో అతడి భారతదేశ పర్యటన ముగుస్తుంది. ముంబయిలో వాంఖడే స్టేడియం బుకింగ్ సహా మెస్సి పర్యటన కోసం ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు తెలుస్తోంది. "ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మెస్సి నుంచి అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాం. తన సోషల్ మీడియా ఖాతాలో అతడు త్వరలోనే ప్రకటన చేయొచ్చు" అని ఈ వ్యవహారాల గురించి తెలిసిన ఓ వ్యక్తి చెప్పాడు. షెడ్యూలు ప్రకారం డిసెంబరు 12న రాత్రి 10 గంటలకు మెస్సి కోల్‌కతాలో దిగుతాడు. అక్కడ అతడు రెండు రోజులు ఉంటాడు. ఈ పర్యటనలో అతడు అత్యధిక సమయం ఉండేది కోల్‌కతాలోనే.

భారీ విగ్రహం: అర్జెంటీనా కెప్టెన్ మెస్సి పర్యటన సందర్భంగా కోల్‌కతాలో డిసెంబరు 13న వీఐపీ రోడ్‌లో లేక్‌టౌన్ శ్రీభూమిలో అతడి 70 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రపంచంలోనే ఇది మొట్టమొదటి ఎత్తయిన మెస్సి విగ్రహమని నిర్వాహకులు అంటున్నారు. విగ్రహావిష్కరణ తర్వాత మెస్సి ఈడెన్ గార్డెన్స్ వెళ్తాడు. అక్కడ మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు జరిగే కార్యక్రమాలకు హాజరవుతాడు. ఈడెన్‌లో అతడు సౌరభ్ గంగూలీ, లియాండర్ పేస్, జాన్ అబ్రహం, బైచుంగ్ భుటియా, ఇతరులతో కలిసి సరదాగా సెవెన్ ఎ సైడ్ సాఫ్ట్‌బాల్ ఆడతాడు. ఈడెన్‌లో ఈ కార్యక్రమం కోసం టికెట్లు అమ్ముతున్నారు. "ఈడెన్‌లో ఈ ఈవెంట్‌కు హాజరు కావాలంటే టికెట్ కొనుక్కోవాలి. టికెట్ ధర కనీసం రూ.3500 ఉంటుంది. స్టేడియం నిండిపోతుందని ఆశిస్తున్నాం. ఇక్కడ మెస్సి గంట 20 నిమిషాలు ఉంటాడు" అని ఈ ఈవెంట్‌తో నిర్వహణతో సంబంధమున్న ఓ వ్యక్తి చెప్పాడు. ఈ ఈవెంట్లో మెస్సిని బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సన్మానిస్తారని భావిస్తున్నారు. మెస్సి డిసెంబరు 13 సాయంత్రం అహ్మదాబాద్ వెళ్తాడు. డిసెంబరు 14న ముంబయి చేరుకుంటాడు. అతడు ముంబయిలో ధోని, కోహ్లిలతో కలిసి సరదాగా సెవెన్ ఎ సైడ్ క్రికెట్ ఆడతాడని వార్తలొస్తున్నాయి. 15న మెస్సి దిల్లీ చేరుకుంటాడు. అతడు అక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలవనున్నాడు. మెస్సి చివరిసారి 2011 ఆగస్టులో భారత్‌కు వచ్చాడు.

లెడెకీ అదరహో

ప్రపంచ స్విమ్మింగ్‌లో వరుసగా ఏడో స్వర్ణం


లెడెకీ

సింగపూర్: ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ మహిళల 800 మీటర్ల విభాగంలో అమెరికా స్టార్ కేటీ లెడెకీకి ఎదురేలేదు. ఆమె వరుసగా ఏడోసారి ఈ విభాగంలో విజేతగా నిలిచింది. శనివారం రేసులో లెడెకీ, కెనడా సంచలనం సమ్మర్ మెకింతోష్ మధ్య పోరు ఉత్కంఠభరితంగా సాగింది. డిఫెండింగ్ ఛాంపియన్ లెడెకీ ఫేవరెట్‌గా బరిలో దిగినప్పటికీ 700 మీటర్ల తర్వాత మెకింతోష్ 0.14 సెకన్ల ఆధిక్యంలో నిలిచింది. అసాధారణ ప్రదర్శన చేసిన లెడెకీ (8:05.62) చివరకు విజేతగా నిలిచింది. మెకింతోష్ (8:07.29) మూడో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియా స్విమ్మర్ లాని పాలిస్టర్ (8:05.98) రజతం గెలుచుకుంది. ఒక విభాగంలో ఇలా అత్యధికసార్లు వరుస స్వర్ణాలు గెలిచిన స్విమ్మర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. మరోవైపు రిలేలో అమెరికా ప్రపంచ రికార్డు బద్దలుకొట్టింది. శనివారం 4×100మీటర్ల మిక్స్‌డ్ ఫ్రీస్టైల్ రిలేలో అలెక్సీ, ప్యాట్రిక్ సామన్, కేట్ డగ్లస్ బృందం 3 నిమిషాల 18.48 సెకన్లలో పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా (3:18.83) పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది.

సుమిత్ నగాల్ ఓటమి

దిల్లీ: ప్లాజ్‌మన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి సింగిల్స్ ఆటగాడు సుమిత్ నగాల్ కథ ముగిసింది. హగెన్ (జర్మనీ)లో జరుగుతున్న ఈ ఛాలెంజర్ ఈవెంట్ ప్రిక్వార్టర్‌ఫైనల్లో అతడు 2-6, 6-4, 4-6తో నీల్స్ మెక్‌డొనాల్డ్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు. 17 ఏళ్ల మెక్‌డొనాల్డ్ అయిదుసార్లు నగాల్ సర్వీసును బ్రేక్ చేశాడు. ప్రత్యర్థి 95 పాయింట్లు నెగ్గగా.. నగాల్ 83 పాయింట్లు గెలిచాడు. మరోవైపు అమెరికాలో లెక్సింగ్టన్ ఓపెన్‌లో భారత యువ ఆటగాడు దక్షిణేశ్వర్ సురేశ్ 6-7 (4-7), 4-6తో స్థానిక వైల్డ్‌కార్డ్ ఆటగాడు ఇలియట్ స్పిజిరి చేతిలో ఓడిపోయాడు. సురేశ్ ఇటీవలే రిజర్వ్ ఆటగాడిగా భారత డేవిస్‌కప్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇంకోవైపు కజకిస్థాన్‌లో జరుగుతున్న ప్రెసిడెంట్స్‌కప్ నుంచి కరణ్ సింగ్ నిష్క్రమించాడు. క్వార్టర్స్‌లో అతడు 4-6, 4-6తో అలెగ్జాండర్ బిందా (ఇటలీ) చేతిలో కంగుతిన్నాడు.


శనివారం హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో ఆసియా అథ్లెటిక్స్ రజత విజేత నిత్యతో భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్

స్ప్రింటర్ షకారి అరెస్ట్


షకారి

వాషింగ్టన్: వంద మీటర్ల ప్రపంచ ఛాంపియన్ షకారి రిచర్డ్‌సన్ గృహహింస కేసులో అరెస్టయింది. తన బాయ్‌ఫ్రెండ్ స్ప్రింటర్ క్రిస్టియన్ కోల్‌మ్యాన్‌పై దాడి చేసినట్లు ఆమె ఆరోపణలు ఎదుర్కొంటోంది. వాషింగ్టన్ విమానాశ్రయంలో ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. షకారి 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో మహిళల 100మీ పరుగులో విజేతగా నిలిచింది. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించింది. అమెరికా 4×100 రిలే స్వర్ణం గెలవడంలోనూ కీలక పాత్ర పోషించింది. 2021 యుఎస్ ఒలింపిక్ ట్రయల్ సందర్భంగా డోప్ పరీక్షల్లో షకారి దొరికిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో ఆమె పోటీ పడలేదు.

లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల అక్రమాలపై ఆధారాలు

- త్వరలోనే వాటిని బయటపెడతాం
- 100 స్థానాల్లో గోల్‌మాల్‌పై అనుమానాలు
- పార్టీ న్యాయ విభాగం సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ధ్వజం



ఈనాడు, దిల్లీ: ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించే సమాచారాన్ని త్వరలో తాము వెల్లడించబోతున్నామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యాయంటూ మరోసారి ఆరోపణలు సంధించారు. ఇన్నాళ్లూ ఆధారాల్లేక ఆగామని, ఇప్పుడు ఆటం బాంబులాంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, త్వరలోనే బహిర్గతం చేస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో కనీసం 10-15 లోక్‌సభ స్థానాల్లో రిగ్గింగ్ జరగకపోయినా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యేవారు కాదన్నారు. 70 నుంచి 100 నియోజకవర్గాల్లో అక్రమాలు జరిగినట్లు అనుమానిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రభుత్వం స్వల్ప ఆధిక్యంతో కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ న్యాయవాదుల విభాగం శనివారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన సదస్సులో రాహుల్‌గాంధీ కీలకోపన్యాసం చేశారు. లోక్‌సభ ఎన్నికలను ఎలా రిగ్గింగ్ చేయొచ్చో, ఎలా చేశారో అనే అంశాలకు సంబంధించిన ఆధారాలను అతిత్వరలో బయటపెట్టబోతున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. 100% ఆధారాలతో ఈ విషయం చెబుతున్నానని స్పష్టం చేశారు. తాను ఇచ్చిన ఆధారాలను చూసిన వాళ్లు కుర్చీల్లోంచి కిందపడతారని, ఇదెలా సాధ్యమని ఆశ్చర్యపోతారని రాహుల్ చెప్పారు. కర్ణాటకలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ సేకరించిన సమాచారాన్ని విశ్లేషించగా మొత్తం 6.5లక్షల ఓటర్లలో 1.5లక్షల మంది నకిలీ ఓటర్లని తేలిందన్నారు. ఓటర్ల ప్రతి పేజీని, ప్రతి ఫొటోనూ పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చామన్నారు. ఇక్కడ జరిగిన అక్రమాల తీరును ఈ నెల 5న బెంగళూరులోని ఫ్రీడంపార్కులో బహిరంగపరుస్తామని వెల్లడించారు.

ఆధారాల సేకరణకు 6 నెలలు కష్టపడ్డాను

“2014 నుంచి ఎన్నికల వ్యవస్థలో ఏదో తప్పు జరుగుతోందన్న అనుమానం కలుగుతోంది. ఇదివరకే గుజరాత్ ఎన్నికల్లో నాకు సందేహం వచ్చింది. కాంగ్రెస్‌కు రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో కనీసం ఒక్కస్థానమూ రాకపోవడం ఆశ్చర్యం కల్గించింది. దీనిపై ఎప్పుడు మాట్లాడినా ఆధారాలేవని ప్రశ్నించారు. ఇంతలోనే మహారాష్ట్రలో అనుకోనిది జరిగిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మన విజయం సాధించిన 4 నెలల్లోనే ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మేం దారుణంగా ఓడిపోయాం. మూడు బలమైన పార్టీలు అకస్మాత్తుగా తుడిచిపెట్టుకుపోయాయి. అనుమానాలు బలపడటంతో ఎన్నికల మోసాలపై లోతుగా దృష్టి సారించాం. మహారాష్ట్రలో లోక్‌సభ-అసెంబ్లీ ఎన్నికల మధ్యలో కోటి మంది కొత్త ఓటర్లు రావడం ఈ మోసానికి ప్రబల ఉదాహరణ. కొత్త ఓటర్లలో అత్యధికం భాజపాకు వెళ్లాయి. సంబంధిత ఆధారాలన్నింటినీ ఇప్పుడు ప్రపంచానికి చూపబోతున్నాం. వీటిని సంపాదించడానికి ఆరునెలలు నిరంతరం పనిచేశాను” అని రాహుల్ తెలిపారు.

పిరికివాళ్లకు భయపడను

తాను అగ్నితో ఆడుకుంటున్నట్లు సోదరి ప్రియాంకా గాంధీ హెచ్చరించారని రాహుల్ పేర్కొన్నారు. 'పిరికి వాళ్లకు భయపడవద్దని నా బలాలు నాకు చెప్పింది. అందుకే ఇంత ధైర్యంగా ఈ ప్రభుత్వం చేస్తున్న వ్యవస్థాగత విధ్వంసంపై పోరాటానికి దిగాన'ని చెప్పారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందన్నారు. దీని గురించి బయట పోరాడగలుగుతున్నా కోర్టుల్లో పోరాడలేకపోతున్నామని చెప్పారు. రఫేల్ ఒప్పందాన్ని ప్రస్తావించారు. “ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడితే ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. నేను సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు దాన్ని వెంటనే ఆపేయకపోతే మీకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అరుణ్‌జైట్లీ అప్పట్లో హెచ్చరించారు” అని ఆరోపించారు. సదస్సులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రసంగించారు.

రాజు కావాలన్న భావనకు వ్యతిరేకం

తాను రాజును కావాలని కోరుకోవడం లేదని, ఆ భావనకే వ్యతిరేకినని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆయన ప్రసంగం ప్రారంభించిన వెంటనే విజ్ఞాన్ భవన్ హాలులోని ప్రేక్షకులు “ఈ దేశ రాజు ఎలా ఉంటారు, రాహుల్ గాంధీలా ఉంటారు” అంటూ నినాదాలు చేయగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈసీ ఖండన

2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణను ఎన్నికల సంఘం(ఈసీ) శనివారం తోసిపుచ్చింది. ఎన్నికల యంత్రాంగంపై ఒత్తిడి తేవడానికి, ఎన్నికల అధికారులను బెదిరించేందుకే ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నట్లు కనిపిస్తోందని కమిషన్ పేర్కొంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రజా ప్రాతినిధ్య చట్టం మేరకు ముసాయిదా ఎన్నికల జాబితాను, తుది జాబితాను కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలతో పంచుకున్నామని కమిషన్ తెలిపింది. ఓటర్ల జాబితాపై దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కడా కాంగ్రెస్ అప్పీళ్లు దాఖలు చేయలేదని కమిషన్ పేర్కొంది.



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో సీతాపతి మోహన, రామారావు, చింతలపాటి శ్రీనివాసరాజు, వీసీ నాగభూషణ్, ఛైర్మన్ లావు రత్తయ్య, అశోక్ అట్లూరి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

టెక్-నాలెడ్జ్ రాజధానిగా అమరావతి

విజ్ఞాన్స్ వర్సిటీ 13వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి, పొన్నూరు-న్యూస్‌టుడే: అమరావతిని పరిపాలనా కేంద్రంగానే కాకుండా.. టెక్-నాలెడ్జ్ రాజధానిగా అవతరింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. స్మార్ట్ గ్రిడ్ మౌలిక వసతులు, సుస్థిరత, డిజిటల్ పాలన, ప్రజా సేవలతో అమరావతి ఆవిష్కరణల కేంద్రంగా మారుతోందని తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శనివారం వర్సిటీ 13వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరై మాట్లాడారు. 'సరికొత్త అమరావతి నిర్మించేది అధికారులు, ఇంజినీర్లే కాదు.. విద్యార్థులు, యువత నవ భారతావని నిర్మాణానికి ఆధార స్తంభాలు. ఇంజినీరింగ్ వల్ల వ్యవసాయ రంగానికి డ్రోన్లు, సెన్సర్లు అందుబాటులోకి వచ్చాయి. డేటా ఆధారిత ఫార్మింగ్ పెరిగింది. ఆరోగ్య రంగంలో డయాగ్నస్టిక్స్, డ్రగ్ డెలివరీ తదితర విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇంజినీరింగ్ అనేది ఒక శాస్త్ర విభాగం మాత్రమే కాదు.. అది మానవ అవసరాలకు జ్ఞానాన్ని అన్వయించే ఒక కళ' అని అన్నారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాంతి, సామరస్యం పెంపొందాలన్నారు. ఈ సందర్భంగా ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ కొమండూరి రామాచారిలకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. 2,122 మంది విద్యార్థులకు డిగ్రీలు, 60 మందికి బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

వారిని లోకల్‌గా పరిగణించి దరఖాస్తులు స్వీకరించండి!

తెలంగాణలో ఇంటర్ చదివిన 'ఇంజినీరింగ్ అభ్యర్థుల' విషయంలో హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివి.. ఇంటర్మీడియట్ తెలంగాణలో చదివిన విద్యార్థులను ఇంజినీరింగ్(ఈఏపీసెట్) కౌన్సెలింగ్‌లో స్థానికేతరులుగా పరిగణించడంపై ముగ్గురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లను రాష్ట్రంలో స్థానిక అభ్యర్థులుగా పరిగణించి, వారి దరఖాస్తులు స్వీకరించాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో వారు సాంకేతిక విద్యా శాఖను సంప్రదించారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో ఇప్పటికే మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తయింది. రెండో విడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సీట్ల కేటాయింపు సోమవారం చేసేందుకు ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. సీట్ల కేటాయింపును తాత్కాలికంగా నిలిపేసి, స్థానికులుగా పరిగణిస్తే కౌన్సెలింగ్‌లో ఎదురయ్యే ఇబ్బందులను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ ముగ్గురి పిటిషన్లపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈలోపు పిటిషనర్లను స్థానికులుగా పరిగణించి, దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించింది. ఈ ఆదేశాల ఆధారంగా తమకు హక్కు దఖలుపడ్డట్టు పిటిషనర్లు భావించడానికి వీలు లేదని స్పష్టత ఇచ్చింది.

కేసులెన్ని.. ఇచ్చిన కిట్లు ఎన్ని?

- మలేరియా మందుల వినియోగంలో భారీ తేడాలు
- 13 జిల్లాల అధికారులకు షోకాజ్ నోటీసులు

కుక్కునూరు, న్యూస్‌టుడే: మలేరియా నియంత్రణ మందులపై వైద్యారోగ్య శాఖ లెక్కలకు పొంతన లేదు. నమోదవుతున్న కేసులకు, అవుతున్న మందులకు మధ్య పొంతన లేదు. దీంతో మందుల దుర్వినియోగం అవుతున్నాయా అనే అనుమానాలు వస్తున్నాయి. జులై దీనిపై రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం తీవ్రంగా స్పందించింది. మలేరియా, ఇతర అంటువ్యాధుల తీవ్రత అధికంగా ఉండే జిల్లా వైద్యారోగ్యశాఖ యంత్రాంగానికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది.

తీవ్రత తగ్గించి చూపరాదంటూ..

మలేరియా నియంత్రణకు ప్రైమక్విన్, క్లోరోక్విన్, ఆర్టీసునేట్ టాబ్లెట్లతో కూడిన కిట్లను వినియోగిస్తారు. ఈ మందులు ఖరీదైనవి. పీహెచ్‌సీల్లో నమోదయ్యే కేసులకన్నా, ఈ కిట్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాస్తవ కేసులే నమోదుచేయాలని, తీవ్రత తగ్గించి చూపరాదంటూ వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నోటీసుల్లో పేర్కొంది.



మలేరియా నివారణ మందులు

లక్షణాలున్నా.. కిట్లు: మలేరియా లక్షణాలతో వచ్చే రోగులకు పరీక్షలో నెగెటివ్ వచ్చినా.. లక్షణాలుంటే కిట్లు ఇచ్చేస్తున్నారు. ప్రభుత్వం పాజిటివ్ వచ్చినవారికే కిట్ ఇవ్వాలని లెక్కిస్తోంది. దీంతో పాజిటివ్ కేసుల కంటే కిట్లు ఎక్కువగా వాడుతున్నారు. ఫలితంగా 13 జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు అందాయి. అనంతపురం, శ్రీసత్యసాయి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, గుంటూరు, బాపట్ల, నంద్యాల, కర్నూలు జిల్లాలతో పాటు మలేరియా పీడిత ప్రాంతంగా ఉన్న ఏలూరు ఏజెన్సీ అధికారులకూ తాఖీదులు ఇచ్చారు.

కొండా సురేఖపై క్రిమినల్ కేసు

కేటీఆర్ పరువు నష్టం కేసులో.. కోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశించింది. తనపై మంత్రి సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం కేసు వేసిన సంగతి తెలిసిందే. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు.. సురేఖపై ఆగస్టు 21 లోపు క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను శనివారం ఆదేశించింది.

మెగా డీఎస్సీ తుది 'కీ'పై ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ తుది 'కీ' లోనూ కొన్ని ప్రశ్నలకు జవాబులు తప్పుగా ఉన్నాయని నెల్లూరుకు చెందిన ఓ అభ్యర్థి డీఎస్సీ హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. జులై ఒకటిన ఉదయం విడతలో నిర్వహించిన ఎస్జీటీ పరీక్షలో నాలుగు ప్రశ్నలకు తుది 'కీ'లో తప్పులు దొర్లాయని పేర్కొన్నారు. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలు తెలిపిన పరిగణనలోకి తీసుకోలేదని వెల్లడించారు. వీటిని పరిశీలించాలని అభ్యర్థించారు.

గుండె సమస్యతో బాధపడుతున్న మహిళకు క్లిష్టమైన శస్త్రచికిత్స

ఆరోగ్యశ్రీ ద్వారా ప్రాణభిక్ష పెట్టిన వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ యోగి చాగంటి. చిత్రంలో వైద్యులు పి.కృష్ణశ్రవంత్, నిఖిల్ ప్రవీణ్, శస్త్రచికిత్స చేయించుకున్న ఆర్.వాణి, వైద్యులు మాధవి, రామరాజు

నగరంపాలెం (గుంటూరు), న్యూస్‌టుడే: గుండె నిర్మాణంలో నాలుగు గదులకు బదులు ఒకే గది ఉన్న మహిళకు ఆరోగ్యశ్రీ కింద క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి వైద్యులు ప్రాణాలు కాపాడారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తంగెళ్లమూడికి చెందిన ఆర్.వాణి(37) పుట్టుకతోనే గుండెలో లోపంతో జన్మించినా తల్లిదండ్రులు గుర్తించలేదు. వివాహం అయి ముగ్గురు సంతానం ఉన్న ఆమెకు ఇటీవల అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. పలు ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేదు. ఈ క్రమంలో గుంటూరువారి తోటలోని ఆదిత్య మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వాణికి పలు పరీక్షలు చేయగా.. గుండె నిర్మాణంలో నాలుగు గదులకు బదులు ఒకే గది ఉన్నట్లు వెల్లడైందని గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ యోగి చాగంటి తెలిపారు. దీనిని కంప్లీట్ ఏట్రియో వెంట్రిక్యులర్ కెనాల్ డిఫెక్ట్ అంటారని చెప్పారు. ఈ కారణంగా రక్తం తక్కువ మోతాదులో శరీర భాగాలకు వెళుతుండడంతో రోగికి ఆయాసం, తీవ్ర అలసట వస్తుందన్నారు. శస్త్రచికిత్స చేయకపోతే ఎక్కువ కాలం జీవించే అవకాశం లేదన్నారు. జూన్ 6న వాణి ఆసుపత్రిలో చేరగా.. జులై 6న ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. వైద్య నిపుణులు రామరాజు(మత్తు), నిఖిల్ ప్రవీణ్(గుండె), మాధవి(క్రిటికల్ కేర్), కాశీరాం(ఊపిరితిత్తులు)లు ఐదు గంటలు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారన్నారు. వాణిని కొన్ని రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి ఇంటికి పంపించినట్లు తెలిపారు. రూ.5 లక్షల విలువైన శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశామన్నారు.

శ్రీశైలానికి తగ్గిన నీటి ప్రవాహం

రెండు గేట్లు మూసివేత

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను మూసి, ఆరు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వీటి ద్వారా 1,61,016 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తుండడంతో 66,102 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు వెళ్తోంది. ప్రస్తుతం జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,88,791 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తోంది. శనివారం రాత్రి 9 గంటల సమయానికి ఈ జలాశయం నీటిమట్టం 882.30 అడుగులు, నీటి నిల్వ 200.6588 టీఎంసీలుగా ఉంది.


సూపర్-6 పేరుతో మోసం

సీఎం చంద్రబాబుపై జగన్ విమర్శ

ఈనాడు, అమరావతి: అధికారంలోకి రావడానికి సూపర్-6 హామీలిచ్చి.. వాటిని అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజల్ని మోసం చేస్తున్నారని వైకాపా అధ్యక్షుడు జగన్ విమర్శించారు. ఖరీఫ్ కాలం మొదలై రెండు నెలలు గడిచినా.. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో శనివారం పేర్కొన్నారు. 'రైతులు రుణాల కోసం వడ్డీ వ్యాపారుల్ని ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేని పరిస్థితి. మేం ధరల స్థిరీకరణ నిధిని పెట్టి.. రూ.7,800 కోట్లు ఖర్చు చేసి, రైతుల్ని ఆదుకున్నాం. కానీ, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది' అని వెల్లడించారు.

డెంగీ బాధితుల్లో.. గుండె వైఫల్య ముప్పు ఎక్కువే

- సీఎల్ఎస్ కారణంగా అధిక ప్రమాదం
- 350 మంది రోగులపై ప్రభుత్వ వైద్యుల అధ్యయనం



ఈనాడు, హైదరాబాద్: డెంగీ రోగుల్లో క్యాపిలరీ లీకేజ్ సిండ్రోమ్(సీఎల్ఎస్) అంటే రక్తంలోని ప్లాస్మా లీకేజీ కారణంగా గుండె వైఫల్య ముప్పు ఎక్కువ అని తేలింది. మొత్తం 350 మంది రోగులపై అధ్యయనం చేయగా...సీఎల్ఎస్ కారణంగా 44 మంది(12.5 శాతం)లో గుండె వైఫల్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ అధ్యయనం 2023 ఫిబ్రవరి నుంచి 2025 వరకు ఏపీలోని శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కాలేజీలో నిర్వహించారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ చరణ్ తేజ, డాక్టర్ సౌమ్యరెడ్డి ఎనుగోలు, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి పైడి శ్రీవత్సం, వైజాగ్ ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి పైడి పూర్ణచంద్, కర్ణాటక గడగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి డాక్టర్ అరవింద్ సాయి రెడ్డి ఈ అధ్యయనంలో పాల్గొన్నారు.

డెంగీ తగ్గుతున్న సమయంలోనే అప్రమత్తత అవసరం..: డెంగీ రోగులకు హెమటోక్రిట్, సీరమ్ ఆల్బ్యూమిన్, ఎన్-ప్రోబీఎన్‌పీ, ట్రోపోనిన్, ఈసీజీ, ఎకోకార్డియోగ్రఫీ, ఛాతీ ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించి, గుండె వైఫల్య ప్రమాదం ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. డెంగీ సోకి జ్వరం తగ్గుతున్న సమయంలోనే ఎక్కువ అప్రమత్తత అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో ప్లేట్‌లెట్లు పడిపోవడం, ప్లాస్మా లీకేజీ అయి బీపీ పడిపోయి..ఎక్కువ మందిలో మెదడు, కాలేయం, గుండె వైఫల్య ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ప్లాస్మా లీకేజీ కారణంగా రక్తం చిక్కబడి అవయవాలకు సరఫరా తగ్గిపోతుంది. ఫలితంగా వాటి పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇందులో భాగంగానే గుండెపై ఎక్కువ ముప్పు కన్పిస్తుందని తాజా అధ్యయనం ద్వారా స్పష్టమైంది. ఈ అధ్యయనంలో గుండె పంపింగ్ సామర్థ్యం 28 శాతం తగ్గినట్లు గుర్తించడమే కాకుండా...మయోకార్డిటిస్‌తో పాటు గుండె లయలో తేడాలు గుర్తించారు. ఇవి తీవ్రమైన గుండె వైఫల్యానికి సూచన అని వైద్యులు వివరించారు. ఈ నేపథ్యంలో సీఎల్ఎస్ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. డెంగీలో తీవ్రమైన కడుపు నొప్పి, కాళ్ల వాపు, కళ్ల కింద నీళ్లు చేరడం, వాంతులు లాంటి లక్షణాలు కన్పిస్తే ప్లాస్మా లీకేజీగా గుర్తించాలి. గుండె వైఫల్యాన్ని సూచించే పలు బయో మార్కర్ పరీక్షలు చేయడం ద్వారా పరిస్థితిని అంచనా వేసి ముందే చికిత్స అందించవచ్చని అధ్యయనం ద్వారా వివరించారు.

బీమా డబ్బుల కోసం.. తండ్రిపై హత్యాయత్నం

- కారుతో ఢీకొట్టి ఏమీ తెలియనట్లు పోలీసులకు ఫిర్యాదు
- వైకాపా నేత, మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడి అనుచరుడి నిర్వాకం
- కేసు వద్దన్న తండ్రి!



ఈనాడు- అమలాపురం, న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం: బీమా డబ్బులకు కక్కుర్తిపడి ఓ కుమారుడు కన్నతండ్రినే కడతేర్చేందుకు బరితెగించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ ప్రధాన అనుచరుడు విప్పర్తి హర్షవర్ధన్ చేసిన ఈ దురాగతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాకుర్రుకు చెందిన 24 ఏళ్ల హర్షవర్ధన్ డిప్లొమో చదివి ఖాళీగా ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడటంతోపాటు వైకాపా కార్యక్రమాలకు సైతం డబ్బులు ఖర్చు చేసి అప్పుల్లో కూరుకుపోయాడు. తండ్రి వెంకటరమణ పేరిట ఓ ఫైనాన్స్ సంస్థలో 2022లో రూ.13 లక్షలు రుణం తీసుకోవడంతో పాటు బీమా చేయించాడు. తండ్రి మరణిస్తే బీమా వస్తుందని, అప్పు తీర్చాల్సిన అవసరం ఉండదని భావించి హత్య చేసేందుకు పథకం వేశాడు. నిందితుడు ఏప్రిల్ 21న భట్నవిల్లి నుంచి తండ్రికి ఫోన్ చేసి తన వద్ద డబ్బులులేవని రూ.500 తీసుకురమ్మని కోరాడు. వెంకటరమణ డబ్బులు ఇచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి పయనమయ్యారు. అప్పటికే అద్దెకు తెచ్చుకున్న కారుతో సిద్ధంగా ఉన్న హర్షవర్ధన్ మార్గమధ్యంలో తండ్రిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయాడు. తర్వాత ఏమీ తెలియనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొద్ది రోజుల తర్వాత వెంకటరమణ కోలుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు, హర్షవర్ధన్ చెబుతున్న వివరాలపై అనుమానం రావడంతో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. ఇంతలో నిందితుడు స్థానిక వీఆర్వో వద్ద లొంగిపోయాడు. శనివారం అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు వద్దని, కుమారుడు జైలుకెళ్తే తట్టుకోలేనని నిందితుడి తండ్రి పోలీసులను వేడుకున్నట్లు తెలిసింది.

ఉన్నత విద్య అభ్యసించే అంధ విద్యార్థులకు ఆసరా

ఉపకారవేతనాలు అందిస్తున్న హెచ్‌టీబీఎఫ్

ఈనాడు, విశాఖపట్నం: చెన్నై కేంద్రంగా నడుస్తున్న 'హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ (హెచ్‌టీబీఎఫ్)' దేశవ్యాప్తంగా అంధ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఉపకార వేతనాలు అందిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఎక్కడ చదివినా సహకారం అందిస్తారు. శుక్రవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇంటర్, డిగ్రీ, పీజీలో మొదటి ఏడాదిలో చేరిన అంధ విద్యార్థులు అర్హులు. ఏడాదికి రూ.12 వేల చొప్పున నేరుగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేస్తారు. మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థులు.. సంస్థ ప్రతినిధులను సంప్రదిస్తే వారి కళాశాలకే వెళ్లి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వివరాలు, ధ్రువపత్రాలు పరిశీలించి, దరఖాస్తులు నింపి ప్రధాన కార్యాలయానికి పంపిస్తారు. మొదటి ఏడాది పరీక్షల్లో ఉత్తీర్ణులు కాగానే ఆ మొత్తం అందిస్తారు. 70 శాతానికిపైగా మార్కులు సాధిస్తే బహుమతులూ ఇస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి, మరిన్ని వివరాలకు 79814 83735 మొబైల్ నంబరులో సంప్రదించొచ్చు.

'నారాయణ'లో బోధనకు సాంకేతిక హంగు

గూగుల్ క్లౌడ్‌తో విద్యాసంస్థల ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: తమ విద్యావ్యవస్థను మరింత ఆధునికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో గూగుల్ క్లౌడ్ ఇండియాతో కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు నారాయణ విద్యాసంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా తమ డిజిటల్ ప్లాట్‌ఫాంలన్నిటినీ గూగుల్ క్లౌడ్‌తో అనుసంధానం చేయనుంది. గూగుల్ అప్‌డేటెడ్ లాంగ్వేజ్ మోడళ్లయిన జెమినీ 2.5 ప్రో, జెమినీ ఫ్లాష్‌లను వినియోగించుకోనుంది. దీని ద్వారా ప్రతి విద్యార్థికి అనుగుణమైన స్మార్ట్ లెర్నింగ్ టూల్స్ అందుబాటులోకి వస్తాయని సంస్థ తెలిపింది. జేఈఈ, నీట్, పాఠశాల విద్యార్థులకు తగిన సహాయం అందించడం, ఉపాధ్యాయులకు అనుగుణమైన టీచింగ్ టూల్స్, బహుభాషల విద్యార్థులకు ఉపకరించే సాంకేతికత తదితరాలు ఈ భాగస్వామ్యం లక్ష్యాలని వివరించింది. తద్వారా దేశంలోని గ్రామాలు, చిన్న పట్టణాల విద్యార్థులకు కూడా ఆధునిక బోధన వసతులను అందుబాటులోకి తెచ్చే అవకాశముందని నారాయణ గ్రూప్ ప్రెసిడెంట్ పునీత్ కొత్తప తెలిపారు.

పోషకాహారంలో కాటన్ ఆయిల్ పాత్ర కీలకం

కాటన్ సీడ్, ఆయిల్ అండ్ మీల్ కాంక్లేవ్‌లో వక్తలు



కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర. చిత్రంలో బి.వి.మెహతా, వీరనారాయణ, పొట్లూరి భాస్కరరావు తదితరులు

ఈనాడు, అమరావతి: పత్తి గింజలను ఆరోగ్యకరమైన నూనెగా, పోషకాలు కలిగిన పశువుల మేతగా మార్చేందుకు పరిశోధనలు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చినట్లవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ), ఆల్ ఇండియా కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ (ఏఐసీఓఎస్‌సీఏ)ల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే '6వ కాటన్ సీడ్, ఆయిల్ అండ్ మీల్ కాంక్లేవ్-2025' విజయవాడలో శనివారం ప్రారంభమైంది. ముంబయికి చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కాటన్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్కే శుక్లా మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతులతో నూనె సేకరణ పెంచే వీలుందని, ప్రస్తుతం 8 నుంచి 10 శాతం పత్తి గింజలను మాత్రమే అలా చేస్తున్నారని తెలిపారు. ఎస్ఈఏ ఈడీ బి.వి.మెహతా మాట్లాడుతూ.. ప్రస్తుతం కాటన్ సీడ్ ఆయిల్ ఉత్పత్తి ఏడాదికి 12 లక్షల టన్నుల వరకు ఉంటోందని.. దీన్ని 18 లక్షల టన్నులకు పెంచితే దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆలిండియా కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ ఛైర్మన్ సందీప్ బజోరియా మాట్లాడుతూ.. పత్తిగింజల నుంచి నూనె తీయగా మిగిలే చెక్క ఉత్తమ పశుగ్రాసంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, ఖాదీ గ్రామీణ ఇండస్ట్రీస్ కమిషన్ సీఈవో రూప్ రాశి, 3ఎఫ్ లిమిటెడ్ డైరెక్టర్ ఓపీ గోయెంకా, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ఎస్ఈఏ ఉపాధ్యక్షుడు అగ్షు మల్లిక్, ధనలక్ష్మి కాటన్, రైస్‌మిల్స్ డైరెక్టర్ వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆ రూ.11 కోట్లను వేరుగా ఉంచండి

- వాటిని ఇతర నోట్లతో కలపొద్దు
- విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: మద్యం ముడుపులకు సంబంధించి శంషాబాద్‌లోని ఫాంహౌస్‌లో ఇటీవల స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నోట్ల కట్టలను విడిగా ఉంచాలని, వాటిని ఇతర నోట్లతో కలపొద్దని దర్యాప్తు అధికారిని విజయవాడలోని ఏసీబీ కోర్టు శనివారం ఆదేశించింది. ఈ నగదుకు సంబంధించి ఏ1 రాజ్ కెసిరెడ్డి తరఫు న్యాయవాదులు దుష్యంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌లు.. అనిశా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ అధికారులు కొత్త నోట్లను తీసుకొచ్చి సీజ్ పేరుతో కట్టుకథలు అల్లుతున్నారని, రిజర్వు బ్యాంకు అధికారులతో ఆ నోట్ల నంబర్ల ఆధారంగా ధ్రువీకరించాలని అందులో కోరారు. నోట్ల నంబర్లు నమోదు చేయకుండానే బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు సిద్ధమయ్యారని, స్వాధీనం చేసుకున్న నగదును బ్యాంకులో ఇతర నోట్లతో కలపకుండా చూడాలని అభ్యర్థించారు. దీనిపై న్యాయాధికారి భాస్కరరావు.. దర్యాప్తు అధికారి శ్రీహరిని కోర్టుకు పిలిపించారు. రూ.11 కోట్లను డిపాజిట్ చేశారా? అని ప్రశ్నించారు. ఆ డబ్బును శుక్రవారమే మాచవరంలోని ఎస్‌బీఐలో జమ చేసినట్లు దర్యాప్తు అధికారి వివరించారు. అయితే, దీనికి సంబంధించిన కౌంటర్‌ఫాయిల్ ఇవ్వాలని నిందితుడి తరఫు న్యాయవాదులు అడిగారు. న్యాయాధికారి స్పందిస్తూ.. సీజ్ చేసిన డబ్బుకు సంబంధించి సిట్ అధికారులు గత నెల 30నే కోర్టులో మెమో దాఖలు చేశారని, ఆ మొత్తాన్ని వేరుగా ఉంచాలని పిటిషన్ వేసేందుకు ఇప్పటి వరకు ఎందుకు ఆగారని నిందితుల తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు. బ్యాంకులో డిపాజిట్ చేసిన నగదును వేరుగా ఉంచాలని, వాటి నంబర్లను నమోదు చేసి, ఆ దృశ్యాలను వీడియో తీసి సోమవారం సమర్పించాలని న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను తీసుకుని నిందితుడి తరఫు న్యాయవాదులు మాచవరం ఎస్‌బీఐ శాఖకు వెళ్లారు. అంత డబ్బు బ్యాంకులో ఉంచడం సాధ్యం కాదని, దానిని కరెన్సీ చెస్ట్‌కు పంపించామని బ్యాంకు అధికారులు సమాధానమిచ్చారు.



భవిష్యత్తు ముప్పును ఇప్పుడే గుర్తించండి

మనలో చాలామంది- సాయంకాలం షాపింగ్‌మాల్‌లకు వెళ్లి సులభంగా రూ.వెయ్యి ఖర్చు పెట్టేస్తుంటారు. థియేటర్‌లో సినిమా చూసేందుకు, అక్కడ అధిక ధరకు అమ్మే పాప్‌కార్న్ తినేందుకు రూ.1,500 వ్యయం చేస్తుంటారు. వేలకు వేల రూపాయలు పెట్టి లేటెస్టు మోడల్ ఫోన్లు కొంటుంటారు. కానీ పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ కోసం డబ్బు తీయాల్సి వస్తే మాత్రం ముడుచుకుపోతుంటారు. పిసినారుల్లా మారిపోతారు. ఆరోగ్యంపై, పోషకాహారంపై ఇప్పుడు తగినంత వ్యయం చేయకపోతే.. భవిష్యత్తులో ఆసుపత్రులకు వెళ్లేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుందని మరువకండి.

– సునీత, వైద్యురాలు

EENADU Vol: 51, Issue: 355 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ర్యాగింగ్ ఘటనపై విచారణకు మంత్రి సత్యకుమార్ ఆదేశం

ఈనాడు, అమరావతి: కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ చిట్టి నర్సమ్మతో శనివారం ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ర్యాగింగ్ జోలికి వెళ్లాలంటే భయపడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఘటనపై యాంటీ ర్యాగింగ్ కమిటీతో విచారణ జరిపించి, నివేదిక ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేమూరు వైకాపా ఇన్‌ఛార్జి అశోక్‌బాబుపై పోలీసుల దాడి తగదు: జగన్

ఈనాడు, అమరావతి: వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని సాగునీటి కాలువల్లో పూడిక తొలగించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న వేమూరు వైకాపా ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబుపై పోలీసుల దాడిని ఖండిస్తున్నానని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ తెలిపారు. శనివారం ఆయన అశోక్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు వైకాపా అండగా ఉంటుందని తెలిపిన ఆయన, ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలని అశోక్‌కుమార్‌కు సూచించారు. ఈ వివరాలను జగన్ కార్యాలయం తెలిపింది.

సమాచార మార్పిడికి ఐసీజేఎస్ 2.0

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: పోలీసు, జైళ్లు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, న్యాయస్థానాల మధ్య నిరాటంక సమాచార మార్పిడికి వీలుగా రాష్ట్రంలో ఇంటరాపరబుల్ క్రిమినల్ జస్టిస్ (ఐసీజేఎస్) 2.0ను ప్రారంభించినట్లు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. రూ.88.03 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రతి పోలీసు స్టేషన్‌కు నాలుగు చొప్పున, ప్రతి కోర్టు కాంప్లెక్స్‌కు రెండు చొప్పున అత్యాధునిక కంప్యూటర్లు అందజేశామన్నారు. నేర ఘటనా స్థలంలో పరిస్థితిని సాంకేతికంగా డాక్యుమెంటేషన్ చేయటానికి వీలుగా దర్యాప్తు అధికారుల కోసం మొబైల్ డేటా టెర్మినళ్లు, నేరగాళ్లు, అనుమానితుల వేలిముద్రలను సరిపోల్చటానికి అవసరమైన పరికరాలతో పాటు ఇతర ఉపకరణాలను కొనుగోలు చేసినట్లు వివరించారు.

ఆ సంస్థల ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు నోటీసులివ్వండి

కమిషనర్లకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ శాఖలు, సంస్థల నుంచి రావాల్సిన ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు వెంటనే నోటీసులివ్వాలని పురపాలక కమిషనర్లను ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను వసూళ్లపై లక్ష్యాలను నిర్దేశించుకుని, గడువు లోగా వసూలు చేయాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలు తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాలు, నగరాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. సమావేశంలో పురపాలక శాఖ సంచాలకుడు సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో జాప్యంపై కమిషనర్ ఆరా

ఈనాడు, అమరావతి: శ్రీశైలం పీహెచ్‌సీలో వైద్యం సరిగా అందడం లేదనే ఫిర్యాదుపై వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ స్పందించారు. నంద్యాల జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోలతో శనివారం ఫోన్లో మాట్లాడారు. అత్యవసర వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణి రెండు గంటల పాటు నిరీక్షించినా.. వైద్యం అందించకుండా, ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని సీహెచ్‌సీకి వెళ్లాలని సూచించినట్లు వచ్చిన ఆరోపణలపై విచారించి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి

- మంత్రి లోకేశ్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

ఈనాడు, అమరావతి: ఏజెన్సీ ప్రాంతాల్లో రేకులషెడ్లలో ఉన్న పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. "అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం ఓల్డా పంచాయతీ పేడిరాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను జులై 24న పరిశీలించాను. 2020-21లో నాడు-నేడు రెండో విడతలో మంజూరైన నిధులతో పాఠశాల భవనం నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక సహకారంతో సిమెంట్ రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. పనులు మధ్యలో ఆగిపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు" అని పేర్కొన్నారు.



మీ జీవితంలో ఈ సంకేతాలు కనిపిస్తున్నాయా?

- ఎప్పుడూ తీరిక లేకుండానే ఉంటున్నా.. ఎదుగుదల కనిపించకపోవడం
- పని కంటే ఫిర్యాదులే ఎక్కువగా చేస్తుండటం
- ఉదయం నిద్ర లేస్తూనే నీరసంగా అనిపించడం
- సవాళ్లతో కూడిన పనులేవీ చేయకుండా సాదాసీదాగా కాలం గడిపేస్తుండటం
- కంఫర్ట్‌జోన్ అనే బోనులో ఇరుక్కోవడం.

మీ జీవితంలో ఈ సంకేతాలు కనిపిస్తే.. వెంటనే అప్రమత్తమవండి. వాటిని అధిగమించకపోతే మీరెన్నటికీ వృద్ధి సాధించలేరు.

– సుమిత్ శర్మ, వైద్యుడు

రూ.87 లక్షలతో నమ్మించి..

రూ.3.92 కోట్లు కొల్లగొట్టారు

- హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన నయా సైబర్‌మోసం

ఈనాడు, హైదరాబాద్: తాము సూచించిన షేర్లలో పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతున్న వ్యక్తి నమ్మకాన్ని చూరగొనేందుకు ఏకంగా రూ.87 లక్షలు బదిలీ చేసిన సైబర్ నేరస్థులు.. చివరికి అతని నుంచి రూ.3.92 కోట్లు దోచుకున్న ఉదంతం తాజాగా బహిర్గతమైంది. వివరాల్లోకి వెళ్తే... హైదరాబాద్‌లోని మణికొండ ల్యాంకోహిల్స్ రోడ్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్(43) వాట్సప్‌నకు గతేడాది ఏప్రిల్‌లో స్టాక్ బ్రోకింగ్ కంపెనీ పేరిట ప్రకటన వచ్చింది. భారీగా లాభాలొస్తాయని చెప్పడంతో పెట్టుబడులకు ఆసక్తి చూపించారు. వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు ఏప్రిల్ 12-23 మధ్య సుమారు రూ.2 కోట్ల వరకు బదిలీ చేశారు. ఆ సమయంలో అతడికి కొంత అనుమానం రావడంతో అదే విషయాన్ని నేరస్థులను అడిగారు. నమ్మకం లేకుంటే మీ సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని వారు చెప్పారు. అందుకు అంగీకరించిన బాధితుడు తన తల్లి బ్యాంకు ఖాతా నంబరు ఇచ్చి తన షేర్ల సొమ్మును బదిలీ చేయాలని వారికి సూచించగా ఏకంగా రూ.87 లక్షలు జమ చేశారు. దీంతో బాధితుడికి నమ్మకం పెరిగి మళ్లీ పెట్టుబడులు పెడుతూ పోయారు. అతడి పెట్టుబడుల మొత్తం రూ.3.92 కోట్లకు చేరింది. మధ్యలో మరోసారి సొమ్మును ఉపసంహరించుకునేందుకు ప్రయత్నించగా అప్పటికే నేరస్థులు మొహం చాటేశారు. అయితే తనకు జరిగిన మోసంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఉండిపోయారు. ఇటీవలే గుజరాత్ సైబర్‌క్రైమ్ పోలీసులు బాధితుడి తల్లి బ్యాంకు ఖాతాను స్తంభింపజేశారు. దానిపై ఆరా తీయగా సైబర్‌నేరాలతో ముడిపడి ఉన్న రూ.87 లక్షలు జమ కావడంతో స్తంభింపజేసినట్లు గుజరాత్ పోలీసులు వెల్లడించారు. దీంతో చివరకు ఈ నెల 1న బాధితుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు.

400 మంది నుంచి రూ.19 కోట్ల వసూలు

అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టు

ఈనాడు– హైదరాబాద్, ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు చేస్తున్న అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టును హైదరాబాద్ మేడిపల్లి పోలీసులు ఛేదించారు. వివిధ దేశాలకు చెందిన సైబర్ ముఠాలతో కలిసి పని చేస్తున్న నిందితుడిని పట్టుకున్నారు. నగర శివారు చెంగిచెర్లలోని ఓ హోటల్‌లో ఉంటూ నిందితుడు ఒక యాప్ ద్వారా 400 మంది నుంచి రూ.19 కోట్లు వసూలు చేసినట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు కేసు వివరాలు... ముంబయికి చెందిన హిమాన్షు సింగ్(35)కు అమెరికాకు చెందిన లూయిస్ హరిడో సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యాడు. వీరిద్దరూ కలిసి ఓ యాప్ సృష్టించి తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలిస్తామని ప్రచారం మొదలుపెట్టారు. హిమాన్షు చెంగిచెర్లలోని ఓ హోటల్‌లో ఉంటూ డబ్బు జమయ్యే వ్యాలెట్‌ను నిర్వహించేవాడు. వియత్నాంకు చెందిన రిక్కీపామ్ విదేశాల్లో కోఆర్డినేటర్‌గా పనిచేస్తుండగా.. థాయ్‌లాండ్‌లో ఉండే రాజస్థాన్ వాసి అశోక్‌శర్మ, డీజే సొహైల్, మోహన్, అశోక్‌కుమార్‌సింగ్ సహకారం అందించేవారు. భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాక విత్‌డ్రా చేసుకోవడానికి వీల్లేకుండా చేసేవారు. కొట్టేసిన డబ్బును బోడుప్పల్‌లోని ట్రావెల్ మాస్టర్ కార్పొరేషన్ ఖాతాలకు బదిలీ చేసేవారు. నిందితులు గతంలోనూ కొన్ని యాప్‌లు సృష్టించి కరీంనగర్, జగిత్యాల, వరంగల్ జిల్లాలకు చెందిన వేల మందిని మోసగించినట్లు పోలీసులు గుర్తించారు.

పైన రంగుల కవర్లు.. లోపల గంజాయి చాక్లెట్లు

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పట్టుబడ్డ నిందితుడు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయితో తయారైన చాక్లెట్లు పట్టుబడ్డాయి. ఈ కేసులో ఒడిశాకు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 219 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఈగల్ సెల్, అనంతపురం మూడో పట్టణ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా శనివారం ఉదయం రైళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం వద్ద ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఒడిశాకు చెందిన సాల్మన్ వద్ద గంజాయితో తయారైన 219 చాక్లెట్లు పట్టుబడ్డాయి.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

ఇవి సాధారణ చాక్లెట్ల లాగే ఆకర్షణీయ రంగుల కాగితాల్లో ఉన్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వాటిని భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకొన్నాడు. మామూలు చాక్లెట్ల లాగే ఉన్న వీటిని పాఠశాలలు, కళాశాలల వద్ద దుకాణాల్లో విక్రయిస్తారని తెలిసింది. అనంతరం నిందితుడిని అనంతపురం జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వేసవిని తలపించేలా గరిష్ఠ ఉష్ణోగ్రతలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాకాలంలోనూ ఎండలు మండిపోతున్నాయి. కొద్దిరోజులుగా వేసవిని తలపించేలా వేడి, ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. తీర జిల్లాల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. శనివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటాయి. అత్యధికంగా నెల్లూరులో 38.7 డిగ్రీలు నమోదైంది. విశాఖపట్నం, తుని, కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు పెరిగాయి. మరో 2 రోజులపాటు ఉక్కపోత పరిస్థితులు కొనసాగొచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

ఎడారి దేశంలో..

అనారోగ్యం గుప్పిట్లో



- కఠిన పరిస్థితుల్లో వలస కార్మికుల జీవనపోరాటం
- సగం మందికి పైగా ఏదోఒక వ్యాధి
- వెన్ను, కీళ్ల నొప్పులు, రక్తపోటు సమస్యలు అధికం
- 'సెస్' బృందం సర్వేలో వెల్లడి

■ నిర్మాణ రంగంలో పనిచేస్తున్నపుడు డీహైడ్రేషన్‌తో సొమ్మసిల్లి పడిపోయాను. ప్రాజెక్టు సైట్‌లో ఉన్నది ఒకేఒక షెల్టరు. తోటి కార్మికుడు నీళ్లలో ఉప్పు కలిపి తాగించి ప్రాణాలు కాపాడాడు.

– ఓ గల్ఫ్ కార్మికుడి ఆవేదన

■ ఇక్కడి కఠిన వాతావరణం, పని పరిస్థితులను చూసి ఇంటికి తిరిగివెళ్లాలని అనుకున్నా. కానీ, మాది పేద కుటుంబం. అప్పులున్నాయి. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలంటే ఇక్కడ పనిచేయాల్సిందే.

– మరో వలస కార్మికుడి దైన్యం

ఈనాడు, హైదరాబాద్: ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ వెళ్లిన యువకులు.. అక్కడి కఠిన వాతావరణ పరిస్థితులు, కనీస వసతులు లేకపోవడం, సుదీర్ఘ పనిగంటలు, సరైన ఆహారం లభించకపోవడం తదితర కారణాలతో మానసిక, శారీరక ఒత్తిడికి, అనారోగ్యానికీ గురవుతున్నారు. అక్కడ ఇంటి పనివారుగా, పశువుల కాపర్లుగా పనిచేస్తున్న చాలామంది సొంతూరికి తిరిగొచ్చేయాలని అనుకున్నా.. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అన్నీ భరిస్తూ అక్కడే ఉంటున్నారు. 'గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న అత్యల్ప నైపుణ్యాలు కలిగిన తెలంగాణ వలస కార్మికుల ఆరోగ్య పరిస్థితుల'పై సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) సహాయ అధ్యాపకుడు విజయ్ కొర్ర ఆధ్వర్యంలోని బృందం తెలంగాణలోని పలు గ్రామాలు, యూఏఈలోని కార్మిక క్యాంపుల్లో సర్వే చేసి పరిశోధన పత్రం విడుదల చేసింది. అక్కడ పని ప్రదేశాల్లో పరిస్థితులను మెరుగుపర్చాలని, కార్మికులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు, చికిత్స అందించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది.

సర్వేలో వెల్లడైన అంశాలు...

■ గల్ఫ్‌లో అధిక ఉష్ణోగ్రతల్లో విశ్రాంతి లేకుండా పని చేయడంతో డీహైడ్రేషన్ కారణంగా సొమ్మసిల్లి పడిపోవడం, కొన్నిసార్లు అవయవాలు దెబ్బతినడం వల్ల ప్రాణాలమీదకు వస్తోంది.

■ వలస కార్మికుల్లో 57% మందికి అనారోగ్య సమస్యలున్నాయి. వీరిలో సిద్దిపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వెళ్లినవారు ఎక్కువ మంది.

■ మూడింట రెండో వంతు మంది ఒకటి లేదా ఎక్కువ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దాదాపు 72% మందిలో బీపీ, వెన్ను, కీళ్ల నొప్పులు ఉన్నాయి.

■ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సిద్దిపేట జిల్లాకు చెందిన 18.8% మంది, వికారాబాద్ 17.3, మహబూబ్‌నగర్ 15.8, మెదక్ 12.3, జగిత్యాల జిల్లా వారు 11.4% మంది సర్వేలో వెల్లడించారు.

■ వర్క్ వీసాలకు మెడికల్ కార్డును తప్పనిసరి చేయాలన్న నిబంధనను కొన్ని సంస్థలు, యాజమాన్యాలు అమలు చేయడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించుకుందామంటే బిల్లులు చెల్లించడం లేదు.

■ అనారోగ్య సమస్యలున్నా 98% మంది వైద్యుల్ని సంప్రదించడం లేదు. డబ్బులు లేకపోవడం, అనారోగ్యానికి గురైనట్లు యాజమాన్యానికి తెలిస్తే ఉపాధి పోతుందని, పనిదినాలు తగ్గుతాయని, చికిత్సకు ఎక్కువ ఖర్చు పెడితే ఇంటికి డబ్బులు పంపలేమనే ఆందోళన... ప్రధాన కారణాలు. మెడికల్ షాపుల్లో మందులు కొని వాడుతున్నారు.

■ అనారోగ్య సమస్యలున్నా సొంతూరుకు తిరిగివెళ్లేందుకు 91% మంది ఆసక్తి కనబర్చడం లేదు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చాల్సి ఉండటం, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశంతో అక్కడే కొనసాగుతున్నారు.

బనకచర్ల ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం

తెలంగాణ మంత్రి ఉత్తమ్



ఈనాడు, హైదరాబాద్: పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెలంగాణ అన్ని రకాలుగా వ్యతిరేకిస్తోందని ఆ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బనకచర్లపై ఏపీ మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు సరైనవి కావని చెప్పారు. సచివాలయంలో శనివారం మంత్రి ఉత్తమ్‌కుమార్ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'పోలవరం-బనకచర్లపై నేనే స్వయంగా కేంద్రానికి లేఖ రాశాను. బనకచర్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. భారాస నిరాధారమైన ఆరోపణలు చేస్తోంది. గత భారాస ప్రభుత్వంలో జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. 650 పేజీలతో కాళేశ్వరంపై కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆదివారం నివేదికపై అధ్యయన కమిటీతో సమావేశం నిర్వహిస్తాం. ఈ నెల 4న మంత్రివర్గంలో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చిస్తాం'' అని ఉత్తమ్ పేర్కొన్నారు.

లోకేశ్ వ్యాఖ్యలు సరికాదు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని ఆ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నదీ జలాలకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల పంచాయితీలో తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. బనకచర్లపై ఏపీ మంత్రి లోకేశ్ అవగాహన లేకుండా మాట్లాడారని విమర్శించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో పొంగులేటి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

సాంకేతికత, పరిశోధనలకు పెద్దపీట

- వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్

ఈనాడు,హైదరాబాద్: వ్యవసాయ, దాని అనుబంధ విశ్వవిద్యాలయాలు ఆధునిక సాంకేతికత, పరిశోధనలు, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. యువ పట్టభద్రులు రైతులకు నిరంతరం సేవలందిస్తూ సాగును లాభసాటిగా మార్చాలని అన్నారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 55వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ... 'దేశంలో పేదరికాన్ని రూపుమాపుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిదే ప్రధానపాత్ర. ఈ రంగం వాతావరణ మార్పులు, వర్షాభావం, నేల ఆరోగ్య క్షీణత, సాగు వ్యయం పెరగడం, అన్నదాతలకు గిట్టుబాటు ధరలు రాకపోవడం వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. వీటికి వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు పరిష్కారం చూపాలి'' అని సూచించారు. ఐకార్ డైరెక్టర్ జనరల్ మంగీలాల్ జాట్ మాట్లాడుతూ... ''స్థానిక పంటలు, తృణధాన్యాల సాగును విరివిగా ప్రోత్సహించాలి' అని వెల్లడించారు. వీసీ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రమాణాలను అత్యున్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు.



జి.భార్గవికి బంగారు పతకాలను ప్రదానం చేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐకార్ డీజీ మంగీలాల్ జాట్, వీసీ జానయ్య

30 మందికి బంగారు పతకాలు

అత్యున్నత ప్రతిభ కనబరిచిన 844 మంది పీహెచ్‌డీ, పీజీ, డిగ్రీ విద్యార్థులకు గవర్నర్, ఐకార్ డీజీ, వీసీలు పట్టాలను ప్రదానం చేశారు. వారిలో 20 మందికి 30 బంగారు పతకాలను బహూకరించారు. కంది వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థిని జి.భార్గవి ఆరు బంగారు పతకాలను, వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థిని అర్షియా తబస్సుమ్ నాలుగు బంగారు పతకాలను సాధించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యాసాగర్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

తొలితరం పత్రిక 'త్రివేణి'కి డిజిటల్ హంగులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారతదేశ తొలితరం భాష, సాంస్కృతిక, చారిత్రక, సామాజిక పత్రిక 'త్రివేణి' డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చిందని త్రివేణి ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొ.శ్రీధరమూర్తి తెలిపారు. శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 1927లో ప్రారంభమైన ఈ పత్రిక సంచికలు 97 ఏళ్లుగా దాదాపు 500కు పైగా వెలువడ్డాయన్నారు. అరవింద్ ఘోష్, డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, జవహర్‌లాల్ నెహ్రూ, జిడ్డు కృష్ణమూర్తి, పట్టాభి సీతారామయ్య, డా.బెజవాడ గోపాలరెడ్డి తదితరులు రాసిన వ్యాసాలు ఆ సంచికల్లో ఉన్నాయన్నారు. 'త్రివేణి'ని కోలవెన్ను రామకోటేశ్వరరావు ప్రారంభించారని తెలిపారు. భావరాజు నరసింహారావు, ప్రొ.ఐ.చలపతిరావు ప్రధాన సంపాదకులుగా పనిచేశారని చెప్పారు. డిజిటల్ పత్రికకు "www.triveni journal.org" గా నామకరణం చేసినట్లు ప్రకటించారు. 2027 నవంబరులో వందేళ్ల వేడుక నిర్వహిస్తామని ప్రకటించారు.



సినారె చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రవాసాంధ్రులు

వాషింగ్టన్ డీసీలో ఘనంగా సినారె జయంతి

'తానా–పాఠశాల' ఆధ్వర్యంలో నిర్వహణ

ఈనాడు, అమరావతి: ప్రముఖ కవి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి.నారాయణరెడ్డి 94వ జయంతిని అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో ఘనంగా నిర్వహించారు. తానా-పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భానుప్రకాశ్ మాగులూరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, రచయిత్రి దివాకర్ల రాజేశ్వరి హాజరయ్యారు. "తెలుగు సాహిత్యంలో మకుటం లేని మహారాజుగా సినారె వెలుగొందారు. ప్రకృతితో మమేకమై సమతాస్థితిని సాధించడమే ఆయన రచించిన విశ్వంభర మనకిచ్చే అమూల్య సందేశం" అని వక్తలు కొనియాడారు. నక్షత్రం వేణు, పయ్యావుల చక్రవర్తి, చామర్తి శ్రావ్య, కొత్తూరి కామేశ్వరరావు, బోనాల రామకృష్ణ, పునుగువారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో మాజీసైనికుల భూమికి ఎన్వోసీ జారీపై విచారణ జరిపించండి

రెవెన్యూశాఖ మంత్రికి స్పీకర్ అయ్యన్నపాత్రుడి లేఖ

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం రూరల్ మండలం ఎండాడ-2లో మాజీ సైనికులకు చెందిన 5.10 ఎకరాల భూమికి సంబంధించి ఎన్వోసీ జారీ ప్రక్రియపై విచారణ జరిపించాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం లేఖ రాశారు. ఈ వ్యవహారంలో విశాఖ కార్పొరేటర్ మూర్తి యాదవ్ చేసిన ఆరోపణలు, తన పేరు ప్రస్తావించడాన్ని లేఖలో అయ్యన్న గుర్తుచేశారు. వైకాపా ప్రభుత్వంలో విశాఖలో జరిగిన భూ కబ్జాల గురించి తాను గళమెత్తినట్టు గుర్తుచేశారు.

రైతులకు మోదీ సర్కారు ప్రాధాన్యం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: రైతాంగానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని వారణాసి నుంచి ప్రధాని విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20 వేల కోట్లు బదిలీ అయ్యాయని తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా కేంద్రం ఆదుకుంటుందని మాధవ్ వివరించారు.

చంద్రబాబు సింగపూర్ పర్యటనతో రూ.45 వేల కోట్ల పెట్టుబడులు

లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనతో ఏపీలో రూ.45 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు తెలిపారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తేకపోగా.. ..ఉన్నవారిని తరిమేసిందని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు విదేశీ పర్యటనల గురించి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శలు సిగ్గుచేటని మాణిక్యరావు పేర్కొన్నారు.

వార్డు మెంబర్‌కు ఎక్కువ.. సర్పంచికి తక్కువ

గుడివాడ అమర్‌నాథ్‌పై తెదేపా నేత ఆనంద్‌సాగర్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'గుడ్డు కబుర్లు' చెప్పే మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్.. వార్డు మెంబర్‌కు ఎక్కువ..సర్పంచికి తక్కువని తెదేపా అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్ ఎద్దేవా చేశారు. మంత్రి నారా లోకేశ్‌కు సవాలు విసిరే స్థాయి అమర్‌నాథ్‌కు లేదన్నారు. కూటమి ప్రభుత్వ 14 నెలల పాలనలో సాధించిన ప్రగతి, సింగపూర్ పర్యటన విజయాల గురించి దమ్ముంటే తనతో చర్చకు రావాలని శనివారం ఓ ప్రకటనలో సవాలు చేశారు. వైకాపా ప్రభుత్వంలో విశాఖను లూటీ చేశారని, సుమారు 3 వేల ఎకరాల భూములు కబ్జా చేశారని దుయ్యబట్టారు.

కనీస పింఛన్ కోసం చలో దిల్లీ: ఏపీఆర్‌పీఏ

ఈనాడు, అమరావతి: కనీస పింఛన్, హయ్యర్ పెన్షన్ కోసం డిసెంబరులో నిర్వహించే చలో దిల్లీ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) గౌరవాధ్యక్షుడు అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 25న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద పెన్షనర్ల సమస్యలపై ధర్నా చేయాలని, సెప్టెంబరు 13న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని, ఈ నెల 31లోపు జిల్లా సదస్సులు పూర్తి చేయాలని తీర్మానించారు. డిసెంబరు 23, 24 తేదీల్లో దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే పోరాట కార్యక్రమంలో అన్ని జిల్లాల నుంచి ఈపీఎస్ పెన్షనర్లు పాల్గొనాలని అజయ్ కుమార్ కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న 78 లక్షల మంది ఈపీఎస్-95 పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9 వేలు డీఏతో కలిపి చెల్లించాలని, హయ్యర్ వేతనం పొందిన ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ ఉత్తర్వులను విద్యాశాఖ వెనక్కి తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లోకి విద్యార్థుల తల్లిదండ్రులు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మినహా ఎవరినీ అనుమతించరాదని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్‌రావు, ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఈ ఉత్తర్వుల ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జరిగే అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛను హరించే విధంగా ఈ ఉత్తర్వులు ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఆ ప్రతులను ఆదివారం దహనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోండి

మానవహక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ డిమాండ్

ఈనాడు, అమరావతి: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి పల్నాడు జిల్లాలో ఉందని మానవహక్కుల వేదిక నిజ నిర్ధారణ కమిటీ పేర్కొంది. 2022 జూన్ నుంచి 2024 సెప్టెంబరు మధ్య బలవన్మరణాలకు పాల్పడిన 9 మంది రైతుల కుటుంబాలను పరిశీలించగా.. ఒకరికి మాత్రమే ప్రభుత్వ సాయం అందిందని తెలిపింది. అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల వద్దకు తహసీల్దారు, వ్యవసాయ అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ రావడం లేదని, మొక్కుబడిగా ప్రభుత్వానికి నివేదికలిస్తున్నారని వివరించింది. రైతు స్వరాజ్యవేదిక రాష్ట్ర కన్వీనర్ జి.బాలు, సభ్యుడు బి.కొండల్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.అనూరాధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వీఎస్ కృష్ణతో కూడిన నిజనిర్ధారణ కమిటీ జులై 29, 30 తేదీల్లో పల్నాడు జిల్లాలో పర్యటించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఈనాడు సినిమా

ఓజీ తుపాన్



పవన్ కల్యాణ్

అగ్ని తుపాను ఎంత భీకరంగా ఉంటుందో... ఓజాస్ గంభీర ధైర్యసాహసాలు ఎలాంటివో తన పాటతో చాటుతున్నారు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రం 'ఓజీ'. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ముఖ్యభూమిక పోషించారు. సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. ఈ చిత్రం వచ్చే నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రంలోని 'ఫైర్‌స్టార్మ్...' గీతాన్ని శనివారం విడుదల చేశారు. తమన్ స్వరకల్పనలోని ఈ పాటని విశ్వ, శ్రీనివాసమౌళి రచించారు. ప్రముఖ కథానాయకుడు శింబు ఆలపించడం విశేషం. ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు ఈ పాటతోనే ప్రారంభించారు. పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా సాహిత్యాన్ని ఉద్వేగం, ఉత్సాహం కలగలసిన స్వరాన్ని మేళవించి శింబు పాట పాడిన విధానం చాలా బాగుందని సామాజిక మాధ్యమాల్లో ఈ పాట సంచలనం సృష్టిస్తోందని, హాలీవుడ్ స్థాయిలో తమన్ సంగీతం ఉందని ప్రశంసలు లభిస్తున్నాయని సినీ వర్గాలు తెలిపాయి. శ్రియారెడ్డి, ప్రకాశ్‌రాజ్, అర్జున్‌దాస్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రవి కె.చంద్రన్, కూర్పు: నవీన్ నూలి.

జపాన్‌లో 'మనం'



అక్కినేని కుటుంబంలోని మూడు తరాల కథానాయకులు కలిసి చేసిన 'మనం' జపాన్‌లో ఈ నెల 8న విడుదలవుతోంది. 2014లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా తెలుగులో మంచి విజయాన్ని సొంతం చేసుకొంది. అక్కినేని కుటుంబానికి, తెలుగు సినిమాకి ఎంతో ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిపోయింది. తెలుగులో ప్రేక్షకుల ముందుకొచ్చిన పదకొండేళ్ల తర్వాత ఈ సినిమా జపాన్‌లో విడుదల అవుతుండటం విశేషం. అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య ప్రధాన పాత్రలు పోషించారు. అక్కినేని నాగేశ్వరరావు చివరి చిత్రమిది. ఇందులోనే అఖిల్ అక్కినేని ఓ అతిథి పాత్రలో సందడి చేశారు. జపాన్‌లో నాగార్జునకు మంచి అభిమాన గణం ఉంది. ఆయన్ని అక్కడ నాగ సామ అని పిలుస్తుంటారు. 'మనం' విడుదలని పురస్కరించుకుని నాగార్జున తన జపాన్ అభిమానులతో వర్చువల్‌గా ముచ్చటించనున్నారు.



ఈ దేవా గురించి తెలిసీ గేమ్స్ ఆడతారా!

'కూలీ'గా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించారు. ఆమిర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 14న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. "ఒకడు పుట్టగానే వాడు ఎవడి చేతిలో చావాలన్నది తల మీద రాసి పెట్టి ఉంటది" అంటూ నాగార్జున చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ ప్రచార చిత్రంలో కథని ఎక్కువగా బయట పెట్టకుండా సినిమాలోని ప్రధాన పాత్రలన్నింటినీ శక్తిమంతంగా పరిచయం చేసే ప్రయత్నం చేశారు. రజనీ ఇందులో పోర్టులో పని చేసే కూలీగా దేవా పాత్రలో కనిపించనున్నారు. "30ఏళ్ల నుంచి ఒక్కణ్ని ఆడిస్తున్నా.. వాడికి విషయం తెలిస్తే.." అంటూ దేవా పాత్రను ఉద్దేశిస్తూ సత్యరాజ్ చెప్పిన డైలాగ్ ఆ పాత్రపై ఆసక్తిని రెట్టింపు చేసేలా ఉంది. ప్రధాన ప్రతినాయకులుగా నాగార్జున, ఆమిర్ పాత్రల్ని తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకుంది. "ఈ దేవా గురించి తెలిసి కూడా గేమ్స్ ఆడతావారా.." అంటూ ట్రైలర్ ఆఖర్లో రజనీ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి అనిరుధ్ సంగీతమందించారు.

'కింగ్‌డమ్' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. 'జెర్సీ' విజయం తర్వాత దర్శకుడు గౌతమ్ తిన్ననూరి నుంచి వచ్చిన కొత్త సినిమా ఇది. ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు విజయ్ దేవరకొండ.



ఎన్టీఆర్ కోసం ఆ టైటిల్ వదులుకున్నాం!

ఈ 'కింగ్‌డమ్' విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు? ప్రేక్షకుల ఆదరణ చూస్తుంటే ఏమనిపిస్తోంది?

"సినిమా హిట్టయితే వేడుక చేసుకున్న సందర్భమేదీ నాకిప్పటి దాకా గుర్తులేదు. కెరీర్ ఆరంభంలో ఒక చిత్రం విజయవంతమైతే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందనే ఆశ మాత్రమే ఉండేది. 'పెళ్లి చూపులు' హిట్టయినప్పుడు.. మరికొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడలా కాదు. సినిమా విజయవంతమైతే ఆనందం కంటే మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటోంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. ఈ చిత్ర విడుదలకు ముందు కూడా నాకు అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే షో పూర్తయ్యి.. పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందో అప్పుడు చాలా ఆనందం కలిగింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, ఓవర్సీస్‌లోనూ విశేష స్పందన లభిస్తోంది. చాలా రోజుల తర్వాత అభిమానుల కళ్లలో ఆనందం చూశాను. మొదటి షో పూర్తి కాగానే చాలా మంది ఫోన్లు చేసి 'మనం హిట్ కొట్టేశాం' అని చెప్తుంటే మాటల్లో చెప్పలేనంత సంతోషం కలిగింది. దర్శకుడు సుకుమార్ ఈ సినిమా చూసి ఫోన్ చేసి మాట్లాడారు. తనకెంతో ఎంతగానో నచ్చిందని చెప్పారు. నాకెంతో ఇష్టమైన సుకుమార్ నుంచి ప్రశంస అందుకోవడం నా ఆనందాన్ని రెట్టింపు చేసింది".

ఈ చిత్ర విషయంలో మిమ్మల్ని బాగా ఆకర్షించిన అంశాలేంటి?

"కుటుంబ బంధాల్ని.. అందులోని భావోద్వేగాల్ని దర్శకుడు గౌతమ్ డీల్ చేసే తీరు నాకు చాలా ఇష్టం. మేమిద్దరం సినిమా చేయాలనుకున్నప్పుడు అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామా చేద్దామని గౌతమ్ తన ఆలోచనని పంచుకున్నాడు. అది నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఈ చిత్రంలో ఏ ఒక్క యాక్షన్ సీక్వెన్స్ కూడా బలవంతంగా ఇరికించినట్లుగా ఉండదు. ప్రతి పోరాటం చుట్టూ బలమైన భావోద్వేగాలు ఉండేలా చూసుకున్నాడు. హీరో పాత్రను చాలా కొత్తగా, ఆసక్తికరంగా తీర్చిదిద్దాడు. షాట్ కంపోజిషన్, మ్యూజిక్.. ఇలా ప్రతి దాని పైనా ఎంతో శ్రద్ధ పెట్టాడు. ఇప్పుడీ అంశాలన్నీ చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించాయి".

ఈ కథని రెండు భాగాలుగా చెప్పాలన్న ఆలోచన ఎప్పుడొచ్చింది? రెండో పార్ట్ ఎలా ఉండనుంది?

"ఈ కథలో చాలా పార్శ్వాలున్నాయి. గౌతమ్ ఈ కథను వినిపించాక దీన్ని మూడు గంటల్లో చెప్పడం కష్టమే అనిపించింది. అందుకే తొలి భాగంలో సూరి జర్నీని మాత్రమే చూపించాం. ముఖ్యంగా అన్న శివను వెతుక్కుంటూ తనెలా వెళ్లాడన్నది మాత్రమే తీశాం. అయితే చివరి 20 నిమిషాల్లో సూరి లక్ష్యం మారిపోతుంది. ఒక కానిస్టేబుల్ కథతో మొదలై తను రాజు అవ్వడంతో ఈ భాగాన్ని ముగించాం. ఇక రెండో భాగంలో దేశభక్తికి సంబంధించిన అంశముంటుంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడిగా దేవర నాయక ఎలా ఎదిగాడన్నది దాని గురించి ఉంటుంది. తొలి భాగంతో పోలిస్తే ఈ రెండో భాగం మరింత అద్భుతంగా ఉండనుంది. దీనికోసం గౌతమ్ దగ్గర గొప్ప ఆలోచనలున్నాయి. 'కింగ్‌డమ్ 2'లో కచ్చితంగా ఓ పెద్ద స్టార్ హీరో కనిపిస్తారు. అదెవరన్నది గౌతమ్ చెప్తాడు. నిజానికి ఈ సినిమాకి మేము తొలుత 'దేవర నాయక' అనే టైటిల్ అనుకున్నాం. కానీ, ఎన్టీఆర్ 'దేవర' కోసం మా టైటిల్‌ను వదులుకున్నాం".

మీ జీవితంలో అత్యంత గర్వపడిన సందర్భమేది? నెగిటివిటీని ఎలా ఎదుర్కొంటుంటారు?

"'అర్జున్ రెడ్డి'కి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకున్నప్పుడు గర్వంగా అనిపించింది. ఆ చిత్ర ఆడియో వేడుకకు వేల మంది అభిమానులొచ్చారు. మనకోసం వస్తున్న వారికి ఏదైనా చేయాలనిపించి.. నాకొచ్చిన అవార్డును వేలం వేస్తే రూ.25లక్షలొచ్చాయి. వాటిని మంచి పనులకు ఉపయోగించా. అప్పట్లో అంత పెద్ద అమౌంట్ నేను చూడలేదు. నిజానికి ఆ సినిమాకి నేను తీసుకున్న పారితోషికం రూ.5లక్షలే. ఇక నెగిటివిటీ గురించి పెద్దగా ఆలోచించను. దానిపై నాకెలాంటి కంప్లైంట్స్ లేవు. 10ఏళ్ల క్రితం నేనెవరికీ తెలియదు. ఇప్పుడు ఇంత మంది నన్ను, నా సినిమాల్ని చూడటానికి థియేటర్లకు వస్తున్నారంటే అది నా అదృష్టం".

మీ కొత్త చిత్ర విశేషాలేంటి? సుకుమార్‌తో సినిమా ఎప్పుడు ఉండొచ్చు?

"నేను ఏం చేసినా ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలనే లక్ష్యంతోనే చేస్తాను. నా తదుపరి సినిమా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో చేస్తున్నా. నేను తొలిసారి రాయలసీమ నేపథ్యంలో చేస్తున్న చిత్రమిది. దీనికోసం సీమ యాస నేర్చుకుంటున్నా. దీంతో పాటు రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నా. అది ఆంధ్రా నేపథ్యంలో ఉంటుంది. 'అర్జున్ రెడ్డి' సమయం నుంచే నేను, సుకుమార్ కలిసి సినిమా చేయాలని అనుకుంటున్నాం. భవిష్యత్తులో అది కార్యరూపం దాల్చుతుందని ఆశిస్తున్నా".

రెజాంగ్ లా యుద్ధంలో రాశీ ఖన్నా?

'ది సబర్మతీ రిపోర్ట్', 'యోధ' లాంటి చిత్రాలతో గతేడాది మంచి విజయాన్ని అందుకుంది కథానాయిక రాశీ ఖన్నా. ఇటీవలే పవన్ కల్యాణ్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటించే అవకాశాన్ని సొంతం చేసుకుందీమె. ఇప్పుడు రాశి మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ దర్శకుడు, నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం '120 బహాదుర్'. రజనీశ్ ఘాయ్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో రాశి ఓ కీలక పాత్రలో మెరవనుందట. త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. 1962లో జరిగిన ఇండో-చైనా యుద్ధంలో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందిన రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ జీవితం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాను ఎక్సెల్ ఎంటర్టైన్‌మెంట్ నిర్మిస్తోంది.


రాశీ ఖన్నా


సెప్టెంబరు 12న... 'లిటిల్ హార్ట్స్'

ఈటీవీ విన్ ఒరిజినల్స్ తెరకెక్కించిన 'లిటిల్ హార్ట్స్' సెప్టెంబరు 12న థియేటర్లలో సందడి చేయనుంది. మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా నటించిన చిత్రమిది. సాయి మార్తాండ్ దర్శకత్వం వహించారు. '#90స్ ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్' దర్శకుడు ఆదిత్య హాసన్ నిర్మించారు. ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. "హాస్యం, కుటుంబం నేపథ్యంలోని భావోద్వేగాలే ప్రధానంగా రూపొందిన చిత్రమిది. '#90స్'తో ఆకట్టుకున్న మౌళి తనూజ్, 'అంబాజీపేట మ్యారేజిబ్యాండు'తో మెప్పించిన శివానీ నాగారం, కథానాయకుడి తండ్రిగా రాజీవ్ కనకాల కలిసి చేయనున్న సందడి ఇంటిల్లిపాదినీ ఆకట్టుకునేలా ఉంటుంద"ని సినీ వర్గాలు తెలిపాయి.


శివానీ, మౌళి

బాధ్యతను రెట్టింపు చేసిందీ చిత్రం

"జాతీయ పురస్కారాన్ని కేవలం ఒక గుర్తింపుగా కాకుండా.. మరింత కృషి చేయడానికి బలంగా వినియోగించుకుంటాన"ని అంటున్నారు బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్. ఇటీవలే ఆయన 'జవాన్' చిత్రానికి గానూ ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన ఆనందాన్ని పంచుకుంటూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు షారుక్. "నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. జీవితాంతం గుర్తుండిపోయే క్షణాలు ఇవి. జ్యూరీ సభ్యులతో సహా నేను ఈ గౌరవానికి అర్హుడని భావించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. 'జవాన్' చిత్రబృందానికి, నాతో కలిసి పనిచేసిన నా టీమ్‌కు కృతజ్ఞతలు. ముఖ్యంగా అట్లీకి.. అతడు ఈ చిత్రాన్ని ఎంతో నమ్మి రూపొందించారు. నా నట జీవితం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగడానికి నా కుటుంబం ముఖ్య కారణం. నా భార్య, పిల్లలు ఎంతో సహకరిస్తారు. ఒక్కోసారి సినిమా కోసం వారిని విడిచి ఉండాల్సి వస్తుంది. అయినప్పటికీ చిరునవ్వుతో భరిస్తుంటారు. జాతీయ అవార్డు అంటే కేవలం విజయం కాదు.. అది మన బాధ్యతలను రెట్టింపు చేస్తుంది. ఇంకా కష్టపడి పనిచేసేలా ఉత్సాహాన్నిస్తుంద"ని ఆ వీడియోలో చెప్పుకొచ్చారు.


షారుక్ ఖాన్

స్వేచ్ఛ నువ్వుంటే నా లైఫే అవుట్‌స్టాండు..


'మిత్ర మండలి'

ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రధారులుగా ఎస్.విజయేందర్ తెరకెక్కించిన చిత్రం 'మిత్ర మండలి'. బన్నీ వాస్ సమర్పణలో కల్యాణ్ ఎమ్, భాను ప్రతాప, విజయేందర్ రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మించారు. నిహారిక ఎన్.ఎం కథానాయిక. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్రం నుంచి "స్వేచ్ఛయు డింట్ టుక్ స్టాండు.. నువ్వుంటే నా లైఫే అవుట్‌స్టాండు" అనే గీతాన్ని విడుదల చేశారు. దీనికి ఆర్.ఆర్.ధ్రువన్ స్వరాలు సమకూర్చడంతో పాటు విజయేందర్‌తో కలిసి స్వయంగా సాహిత్యమందించారు. ధనుంజయ్ సీపాన, ధ్రువన్ సంయుక్తంగా ఆలపించారు.

రెండేళ్ల కష్టానికి జాతీయ అవార్డుతో ఆనందం


రోహిత్, సాయి రాజేశ్, వైష్ణవి, ఆనంద్, ఎస్‌కేఎన్

"మా 'బేబి' చిత్ర పోస్టర్ మీద జాతీయ పురస్కార విజేత అనే పేరు చూడటంతో నా కల నెరవేరిన అనుభూతి కలిగింది" అన్నారు హీరో ఆనంద్ దేవరకొండ. ఆయన.. వైష్ణవి చైతన్య జంటగా నటించిన ఈ సినిమాని సాయి రాజేశ్ తెరకెక్కించారు. ఎస్‌కేఎన్ నిర్మించారు. ఈ చిత్రానికి గానూ ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్ఎస్ రోహిత్‌కు జాతీయ అవార్డులు దక్కిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. "ఈ చిత్రం కోసం మేమంతా ప్రాణం పెట్టి పని చేశాం. అందుకే రెండేళ్లయినా ఈ సినిమా గురించి అంతా మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడీ చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం చాలా ఆనందంగా ఉంది" అన్నారు. "ప్రేమిస్తున్నా..' పాటతో జాతీయ అవార్డు గెలుచుకోవడం ఆనందంగా ఉంది. నన్ను నమ్మి నాకీ అవకాశమిచ్చిన దర్శకనిర్మాతలకు థ్యాంక్స్" అన్నారు గాయకుడు పీవీఎస్ఎన్ రోహిత్. దర్శకుడు సాయి రాజేశ్ మాట్లాడుతూ.. "ఈ చిత్ర స్క్రిప్ట్ రాస్తున్నప్పుడు నేనొక మూడ్‌లో ఉండిపోయేవాణ్ని. ప్రతి సీన్‌ను అద్భుతంగా మలుచుకుంటూ రెండేళ్ల పాటు ఈ స్క్రిప్ట్‌పైనే పని చేశాను. ఇప్పుడీ చిత్రానికి గానూ స్క్రీన్‌ప్లే విభాగంలో అవార్డు గెలుచుకున్నానని తెలిసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. దీనికంటే ఎక్కువగా 'ప్రేమిస్తున్నా' పాటకు బెస్ట్ సింగర్‌గా రోహిత్‌కు పురస్కారం దక్కినందుకు మరింత సంతోషపడ్డా" అన్నారు. "ఒక మంచి చిత్రం చేస్తే అది మనకు డబ్బుతో పాటు గౌరవాన్ని కూడా ఇస్తుందని 'బేబి'తో నిరూపితమైంది. ఈ జాతీయ పురస్కారం మాపై మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే బాధ్యత పెంచింది" అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. ఈ కార్యక్రమంలో ధీరజ్ మొగిలినేని, సురేశ్ బనిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బకాసుర రెస్టారెంట్‌లో నవ్వుల వంటకం


జనార్దన్ ఆచారి, సత్యం రాజేశ్, ప్రవీణ్, సుధీర్‌బాబు, ఎస్.జె.శివ

"నవ్వుని ఎప్పుడూ వాయిదా వేయకూడదు. థియేటర్ అంతా ఓ కుటుంబంలా కలిసి నవ్వుతూ 'బకాసుర రెస్టారెంట్' సినిమాని ఆస్వాదించాల"ని కోరారు కథానాయకుడు సుధీర్ బాబు. ఆయన ముఖ్య అతిథిగా ఇటీవల 'బకాసుర రెస్టారెంట్' విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. ప్రవీణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. వైవా హర్ష, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. ఎస్.జె.శివ దర్శకుడు. లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మాతలు. ఈ చిత్రం ఈనెల 8న రానుంది. వేడుకని ఉద్దేశించి సుధీర్ బాబు మాట్లాడుతూ "ప్రవీణ్ నాకు ఇష్టమైన నటుల్లో ఒకరు. తను మంచి నటుడే కాదు, మంచి వ్యక్తి కూడా. ఏ దర్శకుడు అడిగినా తన పేరే చెబుతుంటా. ఈ సినిమాతో హీరోగా మారాడు. తనకి మంచి విజయం రావాలని కోరుకుంటున్నా. వినోదమే ధ్యేయంగా ఈ సినిమాని తీసిన దర్శకనిర్మాతలకు అభినందనలు" అన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ "మా జీవితాలకు మలుపునిచ్చిన 'ప్రేమకథా చిత్రమ్' హీరో ఈ వేడుకకి అతిథిగా రావడం ఆనందంగా ఉంది. నన్ను నమ్మి కథలో ప్రధాన వస్తువుగా సినిమాని తీశారు దర్శకనిర్మాతలు. శివ ఈ కథ చెప్పినప్పుడే తను సినిమాని బాగా తీయగలడనే నమ్మకం కలిగింది. ఇంటిల్లిపాదీ కలిసి చూసేలా హాస్యం, హత్తుకునే భావోద్వేగాలు ఉన్నాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అడుగడుగునా ఆశ్చర్యపరిచే అంశాలతో, కడుపుబ్బా నవ్వించే హంగర్ ఎంటర్‌టైనర్ ఇది. 'విరూపాక్ష' సినిమాకి దర్శకత్వశాఖలో పనిచేసిన అనుభవంతోనే ఈ చిత్రాన్ని తెరకెక్కించా. నా కోసం మా అన్నయ్య నిర్మాతగా మారి ఈ సినిమా తీశారు" అన్నారు. "మా రెస్టారెంట్‌లో మంచి నవ్వుల వంటకం సిద్ధమైంది. ప్రేక్షకులు ఆస్వాదించడమే ఆలస్యం. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు పంపిణీ సంస్థ నుంచి ఈ సినిమా విడుదల అవుతుండడం ఆనందంగా ఉంది" అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో షైనింగ్ ఫణి, సత్యం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మాస్ గీతంలో


ఉదయ భాను

సత్యరాజ్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యం రాజేశ్, వశిష్ఠ ఎన్.సింహ, సాంచిరాయ్, ఉదయ భాను ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మోహన్ శ్రీవత్స దర్శకుడు. విజయ్‌పాల్ రెడ్డి అడిదాల నిర్మిస్తున్నారు. మారుతి సమర్పకులు. ఈ చిత్రంలోని 'ఇస్కితడి ఉస్కితడి' అంటూ సాగే ప్రత్యేకమైన మాస్ గీతాన్ని శనివారం విడుదల చేశారు. ఉదయభానుపై తెరకెక్కించిన ఈ పాటని రఘురామ్ రచించగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ స్వరాలు సమకూర్చింది. పురాణాలతో ముడిపడిన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. నిర్మాణానంతర పనులు పూర్తయ్యాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని సినీ వర్గాలు తెలిపాయి. వీటీవీ గణేశ్, మొట్ట రాజేంద్రన్, మేఘన తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కుశేందర్ రమేష్‌రెడ్డి, కూర్పు: మార్తాండ్ కె.వెంకటేశ్, కళ: శ్రీనివాస్ పున్నా.

ఈనాడు బిజినెస్ వారాంతం

ఎన్‌ఎండీసీ సరికొత్త రికార్డులు

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌ఎండీసీ లిమిటెడ్ ఈ ఏడాది జులై నెలలో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. ఈ సంస్థ 3.09 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి, 3.46 మి.టన్నుల ఇనుప ఖనిజం అమ్మకాలు సాధించింది. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చితే ఉత్పత్తి 43%, అమ్మకాలు 13% పెరిగినట్లు స్పష్టమవుతోంది. ఇంతకుముందెన్నడూ ఈ స్థాయిలో ఉత్పత్తి, అమ్మకాలు నమోదు కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ కంపెనీ 15.09 మి. టన్నుల ఉత్పత్తి, 14.98 మి. టన్నుల అమ్మకాలు నమోదు చేసింది. దీని ప్రకారం చూస్తే, తమకున్న సాంకేతిక నైపుణ్యం, కార్యకలాపాల నిర్వహణ సత్తా రుజువు అవుతోందని కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ, ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధించి ఎన్‌ఎండీసీకి చెందిన నాలుగు ఇనుప ఖనిజం గనులకు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ 'ఫైవ్- స్టార్' రేటింగ్ ఇచ్చింది.

బాలాజీ అమైన్స్‌కు తగ్గిన లాభాలు

ఈనాడు, హైదరాబాద్: స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ అయిన బాలాజీ అమైన్స్ కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.367.36 కోట్ల మొత్తం ఆదాయం, రూ.36.52 కోట్ల నికరలాభం ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.392.87 కోట్లు, నికరలాభం రూ.45.55 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ప్రస్తుత మొదటి త్రైమాసికంలో ఆదాయం, నికరలాభం తగ్గినట్లు స్పష్టమవుతోంది. హోటల్స్ వ్యాపార విభాగంలో లాభాలు పెరిగినప్పటికీ, స్పెషాలిటీ కెమికల్స్ లాభాలు తగ్గాయి.

వజ్రాలపై 25 శాతం తగ్గింపు: ఓరా



హైదరాబాద్: వజ్రాభరణాలను నెలవారీ వాయిదా పద్ధతుల్లోనూ కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వజ్రాభరణాల బ్రాండ్ ఓరా ఫైన్ జ్యువెలరీ వెల్లడించింది. ప్రతి ప్రత్యేక సందర్భానికీ తగ్గట్లు డిజైన్లను అందిస్తున్నట్లు పేర్కొంది. ఏక్తా, ది వెడ్డింగ్, అస్త్ర కలెక్షన్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. వినియోగదారులకు మరింత మెరుగైన సౌకర్యాన్ని అందించేందుకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ స్టోరును విస్తరించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దీపు మెహతా తెలిపారు. ఇందులో ప్రత్యేకంగా బ్రైడల్ లాంజ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వజ్రాల విలువపై పరిమిత కాలానికి 25 శాతం తగ్గింపును అందిస్తున్నామని, సున్నా డౌన్ పేమెంట్, ఈఎంఐపై సున్నా శాతం వడ్డీతో ఆభరణాలు కొనేందుకు వీలుందని పేర్కొన్నారు. ఆభరణాలపై బీమా, జీవితకాల ఉచిత నిర్వహణ, ఏడు రోజుల్లోపు వాపసు, బైబ్యాక్‌తోపాటు, ఆరు నెలల అప్‌గ్రేడ్ సౌకర్యాన్నీ అందిస్తున్నట్లు చెప్పారు.

కోడి గుడ్లు

3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	430
వరంగల్	432
విజయవాడ	475
గోదావరి	465
విశాఖపట్నం	465
చిత్తూరు	513

రూ.32,000 కోట్ల పెట్టుబడి.. 14,500 కొత్త పడకలు



కార్పొరేట్ ఆసుపత్రుల విస్తరణ బాట

ఈనాడు, హైదరాబాద్: కార్పొరేట్ ఆసుపత్రులు విస్తరణ బాటలో సాగుతున్నాయి. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో కొత్తగా 14,500 పడకలు సమకూర్చుకోనున్నాయి. కొత్త ఆసుపత్రుల ఏర్పాటు, యంత్ర పరికరాల కొనుగోలు, ఇతర అవసరాల కోసం మొత్తం మీద ఇవి రూ.32,000 కోట్ల పెట్టుబడి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. రేటింగ్ సేవల సంస్థ ఇక్రా తాజా నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. 'ఈ ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పడకల వినియోగం (ఆక్యుపెన్సీ) 62-64 శాతంగా ఉండొచ్చు. ఒక్కో పడక మీద లభించే ఆదాయాల్లో 6-8% వృద్ధి నమోదయ్యే అవకాశం ఉంది. ఆపరేటింగ్ లాభాల శాతం 22-24% కావచ్చ'ని పేర్కొంది. స్టాక్ మార్కెట్లో నమోదైన 11 కార్పొరేట్ ఆసుపత్రులు, స్టాక్‌మార్కెట్లో నమోదు కాని 2 అతి పెద్ద ఆసుపత్రుల కార్యకలాపాలు, విస్తరణ ప్రణాళికలను విశ్లేషించి, రూపొందించిన నివేదిక ప్రకారం..

కలిసొస్తున్న అంశాలివీ..

కార్పొరేట్ ఆసుపత్రుల రంగం ఆదాయాల్లో వృద్ధికి ఎన్నో అంశాలు వీలుకల్పిస్తున్నాయి. ఆరోగ్య బీమా సదుపాయాలు విస్తరిస్తున్నాయి. జనాభా పెరుగుతుండగా, జీవనశైలి వ్యాధుల వ్యాప్తి అధికమవుతోంది. ప్రజల ఆదాయాలతో పాటు వ్యాధులపై అవగాహన పెరుగుతున్నందున ఎక్కువ మంది చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు(ప్రివెంటివ్ హెల్త్ చెకప్) చేయించుకునే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. ఈ అంశాల వల్ల వైద్య సేవలకు అధిక గిరాకీ లభిస్తోంది.

రెండో అంచె నగరాలకూ..

పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా కార్పొరేట్ ఆసుపత్రులు వైద్య పడకల సంఖ్యను పెంచుకుంటున్నాయి. కొత్త ఆసుపత్రులను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నాయి. పెద్ద నగరాలకే పరిమితం కాకుండా రెండో నగరాలైన ఒంగోలు, నాగ్‌పుర్, లఖ్‌నవూ, కోయంబత్తూరుల్లోనూ ఆసుపత్రులను కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి. పెద్ద సంస్థలు అయితే, ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న చిన్న ఆసుపత్రులను కొనుగోలు చేస్తూ.. తమ అజమాయిషీలోని పడకల సంఖ్యను ఎంతో వేగంగా పెంచుకుంటున్నాయి. వరంగల్‌లోని ప్రశాంతి హాస్పిటల్‌ను ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ కొనుగోలు చేయడం దీనికి తాజా ఉదాహరణ. తద్వారా కార్పొరేట్ ఆసుపత్రులు తమ ఆదాయాలను పెంచుకుంటున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ సంస్థల ఆర్‌ఓసీఈ (మూలధనంపై ప్రతిఫలం) 13-16% ఉంటుందని ఇక్రా అంచనా వేసింది.

ఎం అండ్ ఎం చేతికి ఎస్‌ఎంఎల్ ఇసుజు

ముంబయి: వాణిజ్య వాహన తయారీ సంస్థ ఎస్‌ఎంఎల్ ఇసుజు లిమిటెడ్‌లో నియంత్రణ వాటా (58.96%) కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్లు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) శనివారం వెల్లడించింది. కంపెనీ పేరు కూడా ఎస్‌ఎంఎల్ మహీంద్రా లిమిటెడ్ (ఎస్‌ఎంఎల్)గా మారిందని పేర్కొంది. కంపెనీ బోర్డును పునర్నిర్మించినట్లు తెలిపింది. మహీంద్రా గ్రూప్‌లో అనుభవజ్ఞుడైన వినోద్ సహాయ్‌ను కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించారు. సహాయ్ ప్రస్తుతం ఏరోస్పేస్, డిఫెన్స్, ట్రక్కులు, బస్సులు, సీఈ మహీంద్రా గ్రూప్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈ బాధ్యతతో పాటు కొత్త విధులు కూడా నిర్వర్తించనున్నారు. ఎస్‌ఎంఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓగా వెంకట్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం మహీంద్రా ట్రక్ అండ్ బస్ (ఎంటీబీ), కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ (సీఈ) బిజినెస్ హెడ్‌గా ఉన్నారు.

రెస్టారెంట్‌లో వంటకం ఎంపికకూ చాట్‌జీపీటీ

ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరిది ఇదే ధోరణి



దిల్లీ: సరదాగా రెస్టారెంట్‌కు వెళ్లి ఏ ఆహారం ఎంపిక చేసుకోవాలో, బహుమతి కొనుగోలు నిర్ణయం తీసుకోవడం వంటి అంశాల్లోనూ అతిగా ఆలోచిస్తూ చాట్‌జీపీటీ, గూగుల్ వంటి ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే వారి సంఖ్య దేశంలో పెరుగుతోందని సెంటర్ ఫ్రెష్, యూగొవ్ రూపొందించిన 'ఇండియా ఓవర్‌థింకింగ్ రిపోర్ట్' తెలిపింది. ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరు ఇదే ధోరణితో ఉన్నారని వెల్లడించింది. అతిగా ఆలోచించడం అనేది రోజువారీ జీవితంలో ఒక అలవాటుగా మారిపోతోందని పేర్కొంది. ఎటూ తేల్చుకోలేని పరిస్థితుల్లో నవతరం డిజిటల్ సాధనాలైన ఏఐ ప్లాట్‌ఫామ్ చాట్‌జీపీటీ, సెర్చ్ ఇంజిన్ గూగుల్‌లను దేశీయంగా ఎక్కువ మంది వినియోగిస్తున్నారని తేల్చింది. 2,100 మందిని సర్వే చేసి ఈ నివేదికను రూపొందించింది. 81 శాతం మంది భారతీయులు రోజులో మూడు గంటలకు పైగా అతిగా ఆలోచిస్తున్నారని తెలిపింది. ప్రతి నలుగురిలో ఒకరికి ఇది అలవాటుగా మారిందని పేర్కొంది.

✦ సంక్షోభ సమయంలోనే కాకుండా చిన్న విషయాలు, సాధారణ నిర్ణయాలు తీసుకోవడానికి కూడా రోజువారీగా అతిగా ఆలోచిస్తున్నారని సర్వేలో తేలింది.

✦ ఒక రాజకీయ నాయకుడిని ఎన్నుకోవడం కంటే రెస్టారెంట్‌లో వంటకాన్ని ఎంపిక చేసుకోవడం చాలా ఒత్తిడితో కూడిన వ్యవహారమని 63% మంది చెప్పడం గమనార్హం.

వాహన రంగానికి టారిఫ్‌లతో కష్టమే



✦ వాహన విడిభాగాల ఎగుమతులు 2024-25లో 8 శాతం పెరిగి 22.9 బి.డాలర్లు (రూ.1,92,346 కోట్లు)గా నమోదయ్యాయి. 2023-24లో ఇవి 21.2 బి.డాలర్లు (రూ.1,75,960 కోట్లు)గా ఉన్నాయి.

దిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా విధించిన 25 శాతం సుంకం దేశీయ వాహన విడిభాగాల పరిశ్రమ, టైర్ల తయారీదార్లను ప్రతికూల పరిస్థితుల్లోకి నెట్టేసే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ ఇక్రా వెల్లడించింది. మిగతా ఆసియా దేశాలైన జపాన్, వియత్నాం, ఇండోనేషియాలలో ఎగుమతి సుంకాలు తక్కువగా ఉండటంతో ఆ దేశాలతో పోలిస్తే భారత్‌కు పోటీపరంగా సవాలు ఎదురయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఆగస్టు 7 నుంచి మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే అన్ని వస్తువులపై టారిఫ్‌లను విధిస్తున్నట్లు యూఎస్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. 'భారత వాహన, టైర్ల పరిశ్రమల నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులపై 25 శాతం సుంకం విధించడం వల్ల ఈ రెండు విభాగాల నుంచి ఎక్కువగా ఎగుమతులు ఉండటంతో ఈ పరిశ్రమలపై భారం పడుతుంద'ని ఇక్రా విశ్లేషించింది. మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వాహన విడిభాగాల వాటా 27 శాతంగా ఉంది. టైర్ల ఎగుమతుల వాటా 17 శాతంగా ఉంది. తాజా టారిఫ్‌ల పెంపుతో జపాన్, వియత్నాం, ఇండోనేషియా ఎగుమతులు పెరిగి, భారత్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని ఇక్రా వివరించింది.

✦ వాహన విడిభాగాల పరిశ్రమ టర్నోవర్ 2024-25లో 80.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6.73 లక్షల కోట్లు)గా ఉంది. 2023-24తో పోలిస్తే ఇది సుమారు 10 శాతం అధికం.

పావెల్ నుంచి అధికారాలను తీసేసుకోండి

ఫెడరల్ రిజర్వ్ బోర్డుకు ట్రంప్ సూచన

వాషింగ్టన్: అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ కీలక రేట్లను తగ్గించడం లేదని విమర్శిస్తూ.. ఆయన నుంచి అధికారాలను తీసేసుకోవాల్సిందిగా ఫెడరల్ రిజర్వ్ బోర్డు గవర్నర్లకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. 'పావెల్ మొండిగా వ్యవహరిస్తున్నారు. ఆయన కీలక రేట్లను తగ్గించకుంటే.. ఫెడ్ ఛైర్‌పర్సన్ అధికారాలను బోర్డు తన చేతిలోకి తీసుకోవాలి. తద్వారా అందరికీ ఏమి చేయాలో అది చేయాల'ని ఓ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. మరోవైపు నెలవారీగా ఉద్యోగ గణాంకాలను విడుదల చేసే బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ డైరెక్టర్ ఎరికా మెక్‌ఎంటర్‌ఫెర్‌ను ట్రంప్ తొలగించారు. జులైలో నియామకాలు నెమ్మదించాయని, ఇంతకుముందు ప్రకటించిన దానితో పోలిస్తే కూడా మే, జూన్‌లో నియామకాలు బాగా తగ్గాయని ఈ సంస్థ ప్రకటించిన వెంటనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఇష్యూ రూ.3,600 కోట్లకు కుదింపు



దిల్లీ: జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా తాను సమీకరించే నిధుల పరిమాణాన్ని రూ.3,600 కోట్లకు తగ్గించుకుంది. ఇంతకుముందు రూ.4,000 కోట్లను సమీకరించాలని ప్రతిపాదించింది. దీనిని తాజాగా కుదించింది. ఇక ఐపీఓ ఆగస్టు 7న ప్రారంభమై 11న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఇష్యూ 6న ప్రారంభం అవుతుంది. ఇష్యూలో భాగంగా రూ.1,600 కోట్ల విలువ గల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. అలాగే ప్రస్తుత వాటాదార్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.2,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. సంస్థకు కర్ణాటకలోని విజయనగర్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో ప్లాంట్లు ఉన్నాయి.

పబ్లిక్ ఇష్యూకు ఆర్సిల్: తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించడానికి సెబీ అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఆర్సిల్) దాఖలు చేసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ఉంటుంది. అంటే ఐపీఓ నిధులేమీ సంస్థకు రావు.

టెస్లాపై రూ.2,100 కోట్ల జరిమానా



దిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల తయారీ సంస్థకు భారీ జరిమానా పడింది. టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే 2019 నాటి రోడ్డు ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధారించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల (సుమారు రూ.2,100 కోట్ల) పరిహారం చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డారు. 2019లో ఫ్లోరిడాలోని ఓ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించగా సుదీర్ఘ విచారణ అనంతరం తాజా తీర్పు వెలువడింది. బాధిత కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కారులోని ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి కారణమని గుర్తించిన కోర్టు పరిహారంలో 242 మి.డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని తేల్చింది. మిగిలిన పరిహారం సదరు వాహన డ్రైవర్ అందించాలని స్పష్టం చేసింది. అయితే ఈ తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.

ఫెడరల్ బ్యాంక్ లాభంలో 15% క్షీణత

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఫెడరల్ బ్యాంక్ నికర లాభం రూ.862 కోట్లకు పరిమితమైంది. కిందటేడాది ఇదే సమయంలోని లాభంతో పోలిస్తే 15% తక్కువ. మార్జిన్లు తగ్గడంతో ఆదాయంపై, మొండి బకాయిలు పెరగడంతో కేటాయింపులపై ప్రభావం చూపడం ఇందుకు నేపథ్యం. నికర వడ్డీ మార్జిన్ 3.16% నుంచి 2.94 శాతానికి తగ్గింది. తాజా బకాయిలు రూ.658 కోట్లుగా నమోదు కావడంతో మొత్తం కేటాయింపులు రూ.173 కోట్ల నుంచి రూ.437 కోట్లకు పెరిగాయి. స్థూల నికర నిరర్థక ఆస్తులు 1.84 శాతం నుంచి 1.91 శాతానికి చేరాయి. కనీస మూలధన నిష్పత్తి 16.03 శాతంగా నమోదైంది.

ఏజెంటిక్ ఏఐతో 1.8 కోట్ల ఉద్యోగాలు గల్లంతు!



2030పై సర్వీస్‌నౌ నివేదిక

ముంబయి: తయారీ, రిటెయిల్, విద్యా రంగాలు ఏజెంటిక్ కృత్రిమ మేధ కారణంగా భారీ మార్పును చూస్తాయని సర్వీస్‌నౌ నివేదిక వెల్లడించింది. కొత్త తరం సాంకేతికతలతో 2030 నాటికి ఈ రంగాల్లో 1.8 కోట్ల ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని తెలిపింది. వచ్చే అయిదేళ్లలో తయారీ రంగంలో అత్యధికంగా 80 లక్షల మందిపై ప్రభావం పడనుందని అంచనా వేసింది. రిటెయిల్‌లో 76 లక్షల మంది, విద్యా రంగంలో 25 లక్షలకు పైగా ఉద్యోగాలు గల్లంతయ్యే అవకాశం ఉందని పేర్కొంది. నివేదిక ప్రకారం..

✦ ఛేంజ్ మేనేజర్లు, పేరోల్ క్లర్క్‌లు వంటి హై-ఆటోమేషన్ ఉద్యోగాలను ఏఐ ఏజెంట్లు సాధారణ సమన్వయం ద్వారా నిర్వహించే అవకాశం ఉంది. ఇంప్లిమెంటేషన్ కన్సల్టెంట్లు, సిస్టమ్ అడ్మిన్‌లు వంటి హై-ఆగ్మెంటేషన్ ఉద్యోగాలు ఏఐతో పోటీ పడకుండా భాగస్వామ్యంగా చేయాల్సి ఉంటుంది.

✦ ఏఐ పురోగతితో పాటు ఇతర కారణాలతో ఐటీ సేవల కంపెనీ టీసీఎస్‌లో 12,000 మంది (2 శాతం) ఉద్యోగులను తొలగిస్తున్న నేపథ్యంలో, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం ఎలా ఉండబోతోందనే ఆందోళనలు పెరిగాయి.

✦ మరోవైపు, 2030 నాటికి ఏజెంటిక్ ఏఐ 30 లక్షలకు పైగా కొత్త సాంకేతిక ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని సర్వీస్‌నౌ ఇండియా టెక్నాలజీ అండ్ బిజినెస్ సెంటర్ ఎండీ సుమీత్ మాథుర్ వెల్లడించారు. 1.35 కోట్ల ఉద్యోగులను పునర్నిర్మించి ఆయా ఉద్యోగాలను పునర్నిర్వచించే అవకాశం ఉందని తెలిపారు

✦ ఏఐని తమ సంస్థల్లో స్వీకరించడంపై 500కు పైగా పరిశ్రమ దిగ్గజాలతో సర్వీస్‌నౌ సర్వే నిర్వహించింది. వీటిలో చాలా వరకు ఇప్పటికే 13.5 శాతం టెక్ బడ్జెట్ సిద్ధం చేసుకున్నట్లు తెలిపాయి. ప్రతి నాలుగు సంస్థల్లో ఒకటి ఆ దిశగా అడుగులు వేసే దశలో ఉన్నాయి.

✦ భారతీయ సంస్థల్లో 30 శాతం కంపెనీలకు డేటా భద్రత అనేది ఆందోళనకర అంశాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. 26 శాతం సంస్థలు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలపై అస్పష్టంగానే ఉన్నాయి. ఇది వ్యూహాత్మక దూరదృష్టి, నిర్మాణాత్మక క్రాస్-ఫంక్షనల్ రీస్కిల్లింగ్ మార్గాల అత్యవసరాన్ని నొక్కి చెబుతోంది.

రూ.3.5 కోట్లతో సౌకర్యవంత రిటైర్డ్ జీవితం

భారతీయులపై హెచ్‌ఎస్‌బీసీ నివేదిక



భారతీయులు తమ పదవీ విరమణ అనంతరం భద్రమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపాలంటే.. రూ.3.5 కోట్ల (4,01,000 డాలర్ల) వరకు ఆదా చేయాల్సి ఉంటుందని హెచ్‌ఎస్‌బీసీ నివేదిక పేర్కొంది. పెరుగుతున్న జీవన వ్యయాలు, ద్రవ్యోల్బణం, ఆయుర్దాయం వంటి వాటిపై భారతీయ మదుపర్లకు స్పృహ పెరుగుతోంది. అందువల్ల దేశీయంగా పదవీ విరమణ ప్రణాళికల ధోరణి మారుతోందని పేర్కొన్న నివేదికలోని ముఖ్యాంశాలు..

బంగారంపై పెట్టుబడులు పెరిగాయ్..: ప్రయాణాలు, పిల్లల విద్య, ఆస్తుల కొనుగోలు వంటి వాటికి చాలా మంది ప్రాధాన్యమిస్తున్నారు. దీర్ఘకాలిక ఆర్థిక భద్రతపై ఆసక్తి చూపుతున్న వారి సంఖ్యా క్రమంగా పెరుగుతోంది. షేర్లు, బంగారంతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పెట్టుబడుల వైపూ చూస్తున్నారు. గత 12 నెలల్లో బంగారం పెట్టుబడుల్లో వృద్ధి అధికమైంది.

30 ఏళ్ల వయసులో మొదలుపెడితేనే: పదవీ విరమణ కోసం మదుపు చేయడాన్ని 30వ సంవత్సరం నుంచే మొదలుపెట్టిన వారు. తమ లక్ష్యాలను చేరే విషయంలో ధీమాగా ఉంటున్నారు. ఆ తర్వాత వయసులో ప్రణాళికలు మొదలుపెట్టిన వారు, తమ పదవీ విరమణ అనంతర జీవితంలో రాజీ పడాల్సి వస్తుందన్న ఆందోళనతో ఉన్నారు.

ఇతర దేశాల్లో ఎంత అంటే

దేశం	పదవీ విరమణకు సగటు పొదుపు (మి. డాలర్లలో)
అమెరికా	1.57
చైనా	1.09
సింగపూర్	1.39
హాంకాంగ్	1.10

ఆతిథ్య రంగంలో ఉద్యోగాలు పెరిగాయి : నివేదిక




ముంబయి: ఐటీతో పోలిస్తే ఇతర రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయని నౌక్రి జాబ్‌స్పీక్ నివేదిక వెల్లడించింది. ప్రధానంగా ఆతిథ్య రంగంలో ఉద్యోగాలు జులైలో 26% వృద్ధి చెందాయని తెలిపింది. బీమా రంగంలో 22%, విద్యా రంగంలో 16%, ఆయిల్ అండ్ గ్యాస్‌లో 13% వృద్ధిని నమోదు చేశాయి. ఐటీ రంగంలో గతేడాదితో పోలిస్తే ఉద్యోగ నియామకాలు స్థిరంగా ఉన్నాయి. ఇందులోనూ కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ (ఏఐ-ఎంఎల్) ఉద్యోగాలు 41% పెరగడం గమనార్హం. తాజా ఉత్తీర్ణులను ఉద్యోగాల్లో నియమించుకోవడంలో ఐటీయేతర రంగాలే ప్రధానంగా ఉంటున్నాయని నౌక్రీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు 8% పెరిగాయి. అదే సమయంలో 16 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సీనియర్ నిపుణుల నియామకాల్లోనూ 13% వృద్ధి కనిపించింది. యూనికార్న్‌లు, స్టార్టప్‌లు ఉద్యోగ నియామకాల్లో వరుసగా 23%, 10% వృద్ధిని సాధించాయి. జీసీసీల నియామకాల్లో 5% పెరుగుదల నమోదయ్యింది.

'గూగుల్ ప్లే' లో రియల్ మనీ గేమ్స్!

దిల్లీ: మనదేశంలో గూగుల్ ప్లేలో రియల్ మనీ గేమ్స్ (ఆర్‌ఎంజీ) ను అనుమతించాలని గూగుల్ ప్రతిపాదించింది. యాంటీ- కాంపిటీషన్ విషయంలో ఎదురవుతున్న అభ్యంతరాలను పరిష్కరించడంలో భాగంగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు గూగుల్ వివరించింది. దీంతో పాటు గూగుల్ ప్రకటనల విధానంలోనూ మార్పులు చేపట్టింది. నైపుణ్యాలతో కూడిన గేములకు మాత్రమే ప్రకటనలు వచ్చే విధంగా చర్యలు తీసుకోనుంది. విన్జో గేమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ గూగుల్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాలో ఫిర్యాదు చేసింది. దీంతో గూగుల్ ఈ కొత్త ప్రతిపాదనలు చేసింది.

ప్రపంచంలోనే సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారత్‌కు 3వ స్థానం



దిల్లీ: సౌర విద్యుదుత్పత్తిలో జపాన్‌ను అధిగమించి మనదేశం ప్రపంచంలోనే 3వ స్థానంలో నిలిచిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. జపాన్ 96,459 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగా భారత్ 1,08,494 గిగావాట్లను ఉత్పత్తి చేసిందని అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ (ఐఆర్ఈఎన్ఏ) గణాంకాలను ఉదహరిస్తూ మంత్రి పేర్కొన్నారు. దీంతో భారత్ ప్రపంచంలోనే 3వ అతి పెద్ద సౌర విద్యుత్ ఉత్పత్తిదారుగా నిలిచిందని జోషి తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.

కొనుగోలుదార్ల కోసం వీడియోకాల్ సేవలు: యాపిల్



దిల్లీ: ఆన్‌లైన్‌లో ఫోన్ల పరిశీలన, కొనుగోలు పెరిగిన నేపథ్యంలో.. వినియోగదారులకు సహకరించేందుకు, వారి సందేహాలు తీర్చుకునేందుకు కంపెనీ నిపుణులతో వీడియోకాల్ మాట్లాడుకునే వీలు కల్పిస్తున్నట్లు యాపిల్ తెలిపింది. 'షాప్ విత్ ఏ స్పెషలిస్ట్ ఓవర్ వీడియో' పేరిట ఈ సేవను పొందుతున్న 2వ దేశం భారత్ అని సంస్థ తెలిపింది. యాపిల్ ఫోన్ కొనుగోలు చేసే ముందు వినియోగదారులు తమ సందేహాలను యాపిల్ నిపుణుడితో వీడియో కాల్ ద్వారా తీర్చుకోవచ్చు. యాపిల్ సంస్థ కొత్త ఉత్పత్తులు, వాటిల్లోని సదుపాయాలు, ఆర్థిక సహాయాల గురించి తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఈ సేవ ఆంగ్ల భాషలోనే లభించనుంది. ఇప్పటికే మనదేశంలో రిటెయిల్ స్టోర్లను యాపిల్ ప్రారంభించిన సంగతి విదితమే.

పన్ను ఆడిట్‌లు ఏడాదికి 60

నిబంధనలను జారీ చేసిన ఐసీఏఐ



దిల్లీ: వ్యక్తిగత చార్టర్డ్ అకౌంటెంట్ ఒక సంవత్సరంలో చేయాల్సిన పన్ను ఆడిట్‌ల సంఖ్యను 60కి పరిమితం చేస్తూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కొత్త నిబంధనలను జారీ చేసింది. దీనివల్ల నియంత్రణ వ్యవస్థ బలోపేతం కావడంతోపాటు, ఆడిటింగ్ పనిపై దృష్టి సారించేందుకు వీలవుతుందని ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందా బుధవారం తెలిపారు. నాలుగు లక్షల మందికి పైగా సభ్యులున్న ఐసీఏఐ వ్యక్తిగత ఆడిట్‌ల సంఖ్యను పరిమితం చేస్తూ తీసుకొచ్చిన నిబంధనలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో చరణ్‌జోత్ సింగ్ నందా మాట్లాడుతూ.. ఈ 60 అనేది.. ఒక సభ్యుడు తన వ్యక్తిగత సామర్థ్యంలో, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సంస్థల్లో భాగస్వామిగా చేసిన అన్ని పన్ను ఆడిట్‌లకు పరిమితం అని పేర్కొన్నారు. ఆడిట్ అనేది చార్టర్డ్ అకౌంటెంట్ల బలం అన్నారు.

యూపీఐ లావాదేవీల్లో 35% వృద్ధి



దిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో ఎప్పటికప్పుడు వృద్ధి కనిపిస్తోంది. ఈ ఏడాది జులైలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీల సంఖ్య రికార్డు స్థాయిలో 1,947 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇవి 35% అధికం. వీటి విలువ రూ.25.08 లక్షల కోట్లుగా నమోదయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 22% అధికం. జులైలో ఒక రోజు సగటు లావాదేవీల సంఖ్య 62.8 కోట్లుగా ఉంది. వీటి విలువ రూ.80,919 కోట్లు. యూపీఐ లావాదేవీల ఖర్చును ప్రస్తుతం ప్రభుత్వం భరిస్తోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను తిరిగి తీసుకురావాలన్న ప్రతిపాదనలు వస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీఐ లావాదేవీల ఖర్చును వినియోగదారులు లేదా భాగస్వాములు భరించాలనే సూచన చేశారు. యూపీఐ వ్యవస్థకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీల కారణంగానే డిజిటల్ చెల్లింపుల్లో గణనీయ పెరుగుదల సాధ్యమైందని మల్హోత్రా పేర్కొన్నారు.

✦ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గణాంకాల ప్రకారం యూపీఐ లావాదేవీల సంఖ్య ఈ ఏడాది మేలో 1,868 కోట్లు, జూన్‌లో 1,840 కోట్లుగా నమోదయ్యాయి.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
జేకే లక్ష్మీ సిమెంట్	149.88	56.68	1763.14	1576.96
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్	1135.91	942.23	7330.78	5828.97
మంగళం వర్ల్డ్‌వైడ్	10.13	----	279.41	230.21
బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రీట్	498.6	439.90	----	----
ఏబీబీ ఇండియా	352.00	443.00	3175.00	2831.00
కాఫీ గ్లోబల్	175.00	76.00	582.00	410.00

సరళీకరణతో సేవలు సులభం.. సమర్థం!



దేశానికి, ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ రంగం కీలకం. ఇది పొదుపును సేకరించి రుణాలను ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందిస్తుంది. ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి, ఆర్థిక సంక్షోభాల నుంచి రక్షించేందుకు ఉపకరిస్తుంది. ఇలాంటి బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలనేవి నిరంతర ప్రక్రియ. కాలానుగుణంగా బ్యాంకులు, వాటి కార్యకలాపాలు మారుతుంటేనే మెరుగైన సేవలు అందుతాయి. 1990 నుంచి బ్యాంకింగ్ రంగంలో గణనీయమైన సంస్కరణలు అమలయ్యాయి. బ్యాంకుల పునర్నిర్మాణం, సరళీకరణ, సాంకేతికత వినియోగంతో బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతమై, సేవలు సులభతరమయ్యాయి. సమూల మార్పులు తెచ్చిన ఈ సంస్కరణలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. 1991, 1998లో నరసింహం కమిటీ సిఫార్సుల్లోని ముఖ్యాంశాలతో పాటు ఇతర కమిటీల సూచనలతో కలిగిన ప్రయోజనాలనూ తెలుసుకోవాలి.

భారతదేశంలో బ్యాంకింగ్ రంగ సంస్కరణలు

(వృద్ధి పోకడలు – సవాళ్లు)

భారతదేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి, స్థిరమైన వృద్ధిని ప్రోత్సహించడానికి చేపట్టిన ముఖ్య చర్యలే బ్యాంకింగ్ సంస్కరణలు. ఇవి బ్యాంకింగ్ రంగంలో, బ్యాంకులు అందించే సేవల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చాయి.

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

సంస్కరణల లక్ష్యాలు:

ప్రైవేటీకరణ: ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం ద్వారా పోటీ పెంచి మరింత సమర్థంగా మార్చడం.

ఏకీకరణ: బ్యాంకుల విలీనం ద్వారా పరిమాణం, సామర్థ్యం పెంచడం.

సాంకేతిక పురోగతి: డిజిటల్ బ్యాంకులను ప్రోత్సహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, వివిధ సేవలను మెరుగుపరచడం.

మెరుగైన పాలన: బ్యాంకు పాలనను బలోపేతం చేయడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం.

బ్యాంకింగ్ సంస్కరణలు-అవశ్యకత: 1991లో భారతదేశం ప్రపంచీకరణను అందిపుచ్చుకున్న సమయంలో బ్యాంకులు సరిగా పనిచేయలేదు. ఆర్థిక సరళీకరణ ధోరణిలో ఆర్థికాభివృద్ధికి అవసరమైన సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థ ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఆమోదించిన బ్యాంకింగ్ ప్రమాణాలు అందుకోగలిగే విధంగా ఇక్కడి బ్యాంకుల పనితీరు, సామర్థ్యాన్ని పెంచేందుకు పలు సంస్కరణలను, చట్టాలను ప్రవేశపెట్టారు.

నరసింహం కమిటీ-I సిఫార్సులు

దేశంలో విత్తవ్యవస్థ నిర్మాణం, పనితీరును పరిశీలించి అవసరమైన సంస్కరణలను సూచించేందుకు 1991, ఆగస్టులో రిజర్వ్‌బ్యాంకు మాజీ గవర్నర్ ఎం.నరసింహం అధ్యక్షతన 9 మంది సభ్యుల కమిటీని కేంద్రం నియమించింది. ఈ కమిటీ నివేదికను 1991, డిసెంబరు 17న పార్లమెంటు ముందు ఉంచింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, అభివృద్ధి విత్తసంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకుని సమర్థంగా పనిచేయడం, వాస్తవ ఆర్థికవ్యవస్థ అవసరాలన్నీ తీర్చే విధంగా పలు సంస్కరణలను సిఫార్సు చేసింది. అవి పలు విధాలుగా ఉన్నాయి.

ఎస్ఎల్ఆర్, సీఆర్ఆర్ రేట్ల తగ్గింపు: చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి (ఎస్ఎల్ఆర్), నగదు నిల్వ నిష్పత్తి (సీఆర్ఆర్) దేశంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. బ్యాంకు ఉత్పాదకత రేట్లు పెంచడానికి ఈ అధిక నిష్పత్తులను తగ్గించాలి. ఎస్ఎల్ఆర్‌ను 38.5% నుంచి 25%కి, సీఆర్ఆర్ 15% నుంచి 3-5 శాతానికి తగ్గించాలి. (ప్రస్తుత ఎస్ఎల్ఆర్ 18%, సీఆర్ఆర్ 4.5%)

డైరెక్ట్ క్రెడిట్ ప్రోగ్రామ్ రద్దు: భారత ప్రభుత్వం అమలు చేసిన క్రెడిట్ కార్యక్రమాలతో బ్యాంకులు తక్కువ రేటుకు పేదవర్గాలకు నిధులు కేటాయించాల్సి వచ్చింది. ఈ కార్యక్రమం బ్యాంకులకు లాభదాయకం కానందున దాన్ని దశలవారీగా నిలిపివేయాలి.



వడ్డీ రేటు నిర్ణయం: వడ్డీ రేట్లపై నియంత్రణ ఎత్తివేసి మార్కెట్ శక్తుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయించాలి. వడ్డీ రేట్లలో రాయితీలు దశలవారీగా ఎత్తివేయాలి.

ఆస్తి పునర్నిర్మాణ నిధి ట్రిబ్యునల్ ఏర్పాటు (ఏఆర్ఎఫ్): ప్రభుత్వరంగ బ్యాంకులు, అభివృద్ధి సంస్థల నిరర్థక ఆస్తులు, మొండి బకాయిలు చాలా ఎక్కువగా, ఆందోళనకరంగా ఉండేవి. వీటి భారం తగ్గించే విధంగా ఆస్తి పునర్నిర్మాణ నిధి ఏర్పాటు చేయాలి.

బ్యాంకులపై ద్వంద్వ నియంత్రణ తొలగింపు: సరళీకరణ సమయంలో భారత రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ)తో పాటు కేంద్ర ఆర్థికశాఖ పరిధిలోని బ్యాంకింగ్ విభాగం బ్యాంకులను నియంత్రించింది. ఇకపై ఆర్బీఐ మాత్రమే బ్యాంకులను నియంత్రించాలి.

బ్యాంకులకు స్వేచ్ఛ: ప్రతి బ్యాంకు స్వేచ్ఛగా, స్వయంప్రతిపత్తిలో పనిచేయాలి. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా పనితీరు, సాంకేతికతను మార్చుకోవాలి.

బ్యాంకింగ్ రంగ పునర్వ్యవస్థీకరణ: విలీనాల ద్వారా ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్య తగ్గించాలి. ఎస్‌బీఐతో సహా 3 లేదా 4 పెద్ద ప్రభుత్వరంగ బ్యాంకులు అంతర్జాతీయంగా మారాలి. 8-10 బ్యాంకులు దేశవ్యాప్తంగా శాఖలను కలిగి ఉండాలి.


- కనీస ప్రారంభ మూలధనానికి అనుగుణంగా ఉండే ప్రైవేటు రంగంలో కొత్త బ్యాంకుల స్థాపనకు ఆర్‌బీఐ అనుమతివ్వాలి.
- విదేశీ బ్యాంకులు భారతదేశంలో అనుబంధ సంస్థలుగా లేదా పూర్తి యజమాన్యంలోనూ పనిచేయవచ్చు.


ఎం. నరసింహం

నరసింహం కమిటీ-2 సిఫార్సులు

రెండో తరం ఆర్థికరంగ సంస్కరణలను, బ్యాంకింగ్ సంస్కరణలను సూచించేందుకు 1998లో మరోసారి ఎం.నరసింహం అధ్యక్షతన కమిటీ ఏర్పడింది. ఆ ఏడాది ఏప్రిల్ 23న కమిటీ తన నివేదికను సమర్పించింది. ఈసారి బ్యాంకింగ్ వ్యవస్థ పునాదుల బలోపేతం, సాంకేతికత మెరుగుదల, మానవవనరుల అభివృద్ధిపై దృష్టి సారించి సిఫార్సులు చేశారు.

శక్తిమంతమైన బ్యాంకింగ్ వ్యవస్థ: భారతదేశం, విదేశాల మధ్య జరిగే మూలధన ప్రవాహాల పెరుగుదలకు అనుగుణంగా శక్తిమంతమైన బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.


ఆర్‌బీఐ

న్యారో బ్యాంకింగ్: నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 20% వరకు ఉన్న బలహీనమైన బ్యాంకులు తమ నిధులను నష్టభయం లేని స్వల్పకాలిక ఆస్తుల్లో మాత్రమే పెట్టుబడి పెట్టాలి. దానినే న్యారో బ్యాంకింగ్ అంటారు.

మూలధన పర్యాప్త నిష్పత్తి (సీఏఆర్): బ్యాంకుల అంతర్గత శక్తి, నష్టభయాన్ని భరించగల శక్తిని పెంచేందుకు సీఏఆర్ పెంచాలి.

చిన్న, స్థానిక బ్యాంకులు: రాష్ట్రస్థాయి లేదా కొన్ని జిల్లాలకు పరిమితమయ్యే చిన్న, స్థానిక బ్యాంకులు ఏర్పాటు చేయాలి.

బ్యాంకింగ్ చట్టాల సమీక్ష: రిజర్వ్ బ్యాంకు చట్టం, బ్యాంకుల క్రమబద్ధీకరణ చట్టాలు, బ్యాంకుల జాతీయీకరణ చట్టాలను తక్షణమే సమీక్షించి బ్యాంకింగ్ వ్యవస్థను సమకాలీన అవసరాలకు అనుగుణంగా సవరించాలి.

మానవ వనరులు: సమాచార సాంకేతికత, రిస్క్ నిర్వహణ, ట్రెజరీ కార్యకలాపాలలో నైపుణ్యం మానవ వనరులను సమకూర్చుకునే విధంగా ప్రభుత్వరంగ బ్యాంకులకు అనుమతి ఇచ్చారు.




రచయిత: వమరవల్లి రమణయ్య

ఇతర కమిటీలు

రఘురాం రాజన్ కమిటీ (2008): దేశంలో ఆర్థికరంగ సంస్కరణలను పరిశీలించేందుకు ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అధ్యక్షతన ఈ కమిటీని నియమించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహించేందుకు సిఫార్సులు చేసింది.


రఘురాం రాజన్

బిమల్ జలాన్ కమిటీ (2014): నూతన బ్యాంకుల ఏర్పాటుకు సంబంధించి ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటైంది. ఈ సిఫార్సుల ప్రకారమే బంధన్ సూక్ష్మ విత్త సంస్థకు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐడీఎఫ్‌సీ) ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది.


బిమల్ జలాన్


పి.జె.నాయక్ కమిటీ (2014): ఈ కమిటీ ప్రభుత్వరంగ బ్యాంకుల పాలనను పరిశీలించింది. బ్యాంకుల బోర్డులను బలోపేతం చేసి బ్యాంకులకు సాధికారత కల్పించాలని, కీలక స్థాయుల్లో అధికారుల నియామకంలో వృత్తి నైపుణ్యాలకు ప్రాధాన్యమివ్వాలని చెప్పింది.


పి.జె.నాయక్

నచికేత్‌మోర్ కమిటీ (2014): చిన్న వ్యాపారాలు, తక్కువ ఆదాయ కుటుంబాల సమగ్ర ఆర్థిక సేవలను పరిశీలించడానికి ఈ కమిటీ ఏర్పడింది. చెల్లింపు బ్యాంకులను, చిన్న బ్యాంకులను స్థాపించడం, సార్వత్రిక ఎలక్ట్రానిక్ బ్యాంకు ఖాతా (యూఈబీఏ), ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఏర్పాటు లాంటి వాటిని సిఫార్సు చేసింది. ఈ కమిటీ సూచనల ఆధారంగానే రిజర్వ్‌బ్యాంకు పేమెంట్ బ్యాంకులు ఏర్పాటు చేసింది.


నచికేత్‌మోర్

దామోదర్ కమిటీ: బ్యాంకింగ్ సేవలపై ఈ కమిటీ కీలక సిఫార్సులు చేసింది. * చెక్ బుక్, ఏటీఎం కార్డులు పొందటానికి బ్యాంకుల్లో ఎలాంటి కనీస మొత్తం ఉంచాల్సిన అవసరం లేదు. * డిపాజిట్‌దారుడి లిఖితపూర్వక అనుమతి లేకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఆటోమేటిక్‌గా రెన్యూవల్ చేయకూడదు.


దామోదర్

కరెంట్ అఫైర్స్ – మాదిరి ప్రశ్నలు



■ 7 శిఖరాలను జయించిన (7 సమ్మిట్స్ ఛాలెంజ్) అతి పిన్న వయస్కుడైన భారతీయుడిగా ఇటీవల ఎవరు ఘనత సాధించారు? (హైదరాబాద్‌కు చెందిన ఈ యువకుడు 7 సమ్మిట్స్ ఛాలెంజ్‌ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడైన భారతీయుడు, ప్రపంచంలో రెండో అతిపిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు.)
జ: విశ్వనాథ్ కార్తికే

■ డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) ఇటీవల ఏ నగరంలోని మెట్‌కాల్ఫ్ హౌస్‌లో క్వాంటం టెక్నాలజీ రిసెర్చ్ సెంటర్ (క్యూటీఆర్‌సీ)ను ప్రారంభించింది? (డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.)
జ: దిల్లీ

■ ఐక్యరాజ్య సమితి ఏటా ఎప్పుడు స్వయంపాలన లేని ప్రాంతాల ప్రజలతో అంతర్జాతీయ సంఘీభావ వారోత్సవాన్ని పాటిస్తోంది?
జ: మే 25 - 31

■ జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించిన 4వ ఈశాన్య రాజధానిగా ఇటీవల ఏది వార్తల్లో నిలిచింది? (అస్సాం, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్‌లు ఇప్పటికే జాతీయ రైల్వే నెట్ వర్క్‌తో అనుసంధానమయ్యాయి)
జ: ఐజ్వాల్ (మిజోరాం రాజధాని)

మరింత సమాచారం

లీష్మానియా డోనవానితో డండం జ్వరం!

మానవ సంక్షేమంలో జీవశాస్త్రం

మానవుల ఆరోగ్యాన్ని కాపాడటంలో జీవశాస్త్రం ముఖ్య పాత్ర పోషిస్తోంది. మనిషికి వచ్చే వివిధ రకాల వ్యాధులను గుర్తించడం నుంచి వాటి నివారణ, చికిత్సలో జీవశాస్త్ర పరిజ్ఞానం కీలకంగా మారింది. మానవులకు ప్రధానంగా సోకే సంక్రమణ, అసంక్రమణ వ్యాధులు, వాటి కారకాలు, వాహకాలు, ఏయే వ్యాధులు ఏ రకమైన జీవక్రియలు, వ్యవస్థలపై ప్రభావం చూపుతాయనే ప్రాథమిక అవగాహన పోటీ పరీక్షార్థులకు ఉండాలి. పరాన్నజీవుల రకాలు, అవి ప్రదర్శించే అనుకూలనాలు, మానవాళిని భయపెడుతున్న వైరస్‌లు, వాటి లక్షణాలు, నివారణ ఔషధాలు, నియంత్రించేందుకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల గురించి తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - బయాలజీ

1. కింది వాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) మొత్తం జంతుజాతుల్లో 3వ వంతు పరాన్నజీవులు ఉంటాయి.
   బి) గ్రీకు దేశంలో ఉచిత భోజనాన్ని ఆశించే వ్యక్తిని పరాన్నజీవిగా పేర్కొంటారు.
   సి) మానవుడు ఆతిథేయిగా 130 పరాన్న జీవులున్నాయి.
   డి) పరాన్నజీవులు వ్యాధి నిరోధక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తాయి.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) బి, డి
2. కింది వాటిలో ఏ వ్యాధిని ఉష్ణ దేశాల్లో పూర్తిగా నిర్మూలించారు?
   1) మలేరియా 2) డెంగీ
   3) పోలియో 4) మశూచి
3. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
1) కలరా, ప్లేగు	ఎ) క్షయ
2) డై ఈథైల్ కార్బమజోన్	బి) క్యాన్సర్
3) మిథో ట్రెక్సేట్	సి) టెట్రాసైక్లిన్
4) ఐసో నికోటినిక్ ఆమ్ల హైడ్రజైడ్	డి) ఫైలేరియాసిస్

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   3) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
   4) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
4. 'పరాన్న జీవనం' అనే పదం ఏ భాష నుంచి తీసుకున్నారు?
   1) లాటిన్ 2) జర్మన్
   3) గ్రీకు 4) అరబిక్
5. కింది వాటిలో బాహ్య పరాన్నజీవి కానిది?
   1) పేను 2) పాలిమార్ఫా
   3) టిక్స్ 4) కోపిపాడ్స్
6. కింది వాటిలో ఆది పరాన్నజీవిని గుర్తించండి.
   1) నోసిమా నొటాబిలిస్
   2) ఉకరేరియా బాంక్రాఫ్టి
   3) ఎంటమీబా హిస్టోలైటికా
   4) స్ఫీరో స్పోరా పాలిమార్ఫా
7. వాదన-ఎ: ఎంటమీబా హిస్టోలైటికాను ఏకాతిథేయి పరాన్న జీవి అంటారు.
   ప్రతివాదన-బి: ఇది ఒకే ఆతిథేయిలో జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటుంది.
   1) ఎ, బి రెండూ సరైనవి; అయితే రెండింటికీ సంబంధం లేదు.
   2) ఎ సరైంది, బి సరికాదు. కానీ ఎ కు బి సరైన వివరణ.
   3) ఎ, బి సరైనవి; ఎ కు బి సరైన వివరణ.
   4) ఎ, బి రెండూ సరికావు.
8. కింది ఏ ఆతిథేయిలో నివసించే పరాన్నజీవి వల్ల వ్యాధి సంక్రమణ జరగదు?
   1) ఆశయాతిథేయి 2) మాధ్యమిక ఆతిథేయి
   3) ప్రాథమిక ఆతిథేయి 4) ద్వితీయ ఆతిథేయి
9. ఎంటమీబాకు యాంత్రిక వాహకం కింది వాటిలో?




   1) ఈగలు 2) బొద్దింకలు
   3) దోమలు 4) 1, 2
10. పరాన్నజీవి అనుకూలనాలకు సంబంధించి కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   1) టీనియా సోలియం పేగు గోడలకు అంటిపెట్టుకోవడానికి చూషకాలు, కొక్కేలను కలిగి ఉంటుంది.
   2) టీనియా సోలియం యాంటీ ఎంజైములను ఉత్పత్తి చేసి ఆతిథేయి స్రవించే జీర్ణక్రియా ఎంజైముల నుంచి రక్షణ పొందుతుంది.
   3) టీనియా సోలియం - ఆక్సిజన్ లభించనప్పుడు అవాయు శ్వాసక్రియ జరుపుతుంది.
   4) టీనియా సోలియం - ఆక్సిజన్ కోసం వాయు సహిత శ్వాసక్రియ జరుపుతుంది.
11. వ్యాధి అధ్యయన శాస్త్రాన్ని ఏమంటారు?
   1) పాథాలజీ 2) ట్రామాలజీ
   3) సింప్టమాలజీ 4) నోటాలజీ
12. కింది వాటిలో ఏ వ్యాధిని 'సెగ వ్యాధి' అంటారు?
   1) డిఫ్తీరియా 2) గనేరియా
   3) బోదకాలు 4) రూబియోలా
13. టీనియా సోలియంలో ఏర్పడే ప్రోగ్లాటిడ్‌ల సంఖ్య?
   1) 900 2) 1200
   3) 15,000 4) 35,000
14. నియోప్లాసియాను కలగజేసే సూక్ష్మజీవులు?
   1) శిలీంధ్రాలు 2) బ్యాక్టీరియాలు
   3) వైరస్‌లు 4) పైవన్నీ
15. నత్తలో అతికాయతను ప్రదర్శించిన కణజాలాన్ని గమనించిన ఒక విద్యార్థి.. దానికి కారణం ఏ జీవి అని ఊహించి ఉంటాడు?




   1) ఫాసియోలా
   2) ప్లాస్మోడియం
   3) లీష్మానియా 4) 2, 3
16. కిందివాటిని జతపరచండి.

జాబితా–1	జాబితా–2
1) అతినిద్ర వ్యాధి	ఎ) ఉకరేరియా బాంక్రాఫ్టి
2) దిల్లీ బోయిల్స్	బి) ఆస్కారిస్ లుంబ్రికాయిడ్
3) ఎలిఫాంటియాసిస్	సి) ట్రిపనోసోమా గాంబియన్సి
4) ఆస్కారియాసిస్	డి) లీష్మానియా ట్రాపికా

   1) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   2) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
   3) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
   4) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
17. కిందివాటిలో డండం జ్వరానికి కారణం?
   1) ప్లాస్మోడియం 2) లీష్మానియా డోనవాని
   3) ట్రిపనోసోమా 4) 1, 3
18. ఆరోగ్యం అంటే?
   1) వ్యాధులు లేకపోవడం
   2) శారీరక దారుఢ్యం కలిగి ఉండటం
   3) మానసికంగా దృఢంగా ఉండటం
   4) పరిపూర్ణమైన, భౌతిక, మానసిక, సామాజిక స్థితిని కలిగి ఉండటం
19. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి?
   1) ఆరోగ్యస్థితి నుంచి అసౌకర్య స్థితికి చేరడం - వ్యాధి
   2) సంక్రమణ వ్యాధులకు ఉదాహరణ - మలేరియా, బోదకాలు
   3) అసంక్రమణ వ్యాధికి ఉదాహరణ - రింగ్‌వార్మ్
   4) ఎంటమీబా హిస్టోలైటికా ఉపవర్గం - సార్కో - మాస్టిగోఫోరా
20. బండి చక్రం లాంటి కేంద్రకాలను కలిగి ఉండే దశ?
   1) పోషక దశ 2) పూర్వకోశస్థ దశ
   3) కోశస్థ దశ 4) పరకోశస్థ దశ
21. ఎంటమీబా పోషక దశలో పోషణ రకం?
   1) పరాన్నజీవనం 2) సహజీవనం
   3) జాంతవ భక్షణ 4) 1, 3
22. ఎంటమీబా మానవుడిని చేరే నాటికి పిల్ల కణాల్లో కేంద్రక స్థితి?
   1) త్రయస్థితి 2) ద్వయస్థితి
   3) చతుష్కేంద్రకం 4) కేశరకం
23. కిందివాటిలో తప్పుగా ఉన్న జతను గుర్తించండి.
   1) ప్లాస్మోడియం వైవాక్స్ - బినైన్ టెర్షియన్ మలేరియా
   2) ప్లాస్మోడియం ఫాల్సిఫెరం - మైల్డ్ టెర్షియన్ మలేరియా
   3) ప్లాస్మోడియం ఒవేల్ - మైల్డ్ టెర్షియన్ మలేరియా
   4) ప్లాస్మోడియం మలేరియే - క్వార్టన్ మలేరియా
24. మలేరియాను కలిగించే ప్లాస్మోడియాన్ని మొదటిగా గుర్తించిన వ్యక్తి?


చార్లెస్ లావెరన్

   1) సర్ రొనాల్డ్ రాస్
   2) పాట్రిక్ మాన్‌సన్
   3) చార్లెస్ లావెరన్
   4) గార్న్‌హామ్
25. ప్రపంచ దోమల దినోత్సవం?
   1) ఆగస్టు 20 2) ఆగస్టు 18
   3) ఆగస్టు 19 4) ఆగస్టు 21
26. దోమల డింభకాలను తినే చేప?
   1) మాక్రోబ్రాకియం రోజన్ బర్గీ
   2) పీసినస్ మోనోడాన్
   3) గాంబూసియా 4) హిల్సా హిల్సా
27. ఆస్కారిస్ డింభకం పేరు?
   1) క్రిప్టోజాయిట్స్ 2) రాబ్డిటి ఫార్మ్
   3) మిల్ట్ 4) గ్రబ్
28. ఆస్కారిస్‌లో లైంగిక ద్విరూపకత లక్షణం పురుష జీవిలో?
   1) పీనియల్ కంటకాలు
   2) మామ్మిల్లేటెడ్ నిర్మాణం
   3) అవస్కర రంధ్రం
   4) శరీర నిర్మాణం పొడవు ఉండటం
29. నిమటోడా జీవుల్లోని పుచ్ఛ జ్ఞానాంగాలను ఏమంటారు?
   1) క్వాగ్‌మైర్ 2) ఫాస్మిడ్స్
   3) స్పారింగ్ 4) ట్రాక్విలైజర్స్
30. ప్రపంచంలో మొదటి కీటకనాశిని?
   1) డీడీటీ 2) బీహెచ్‌సీ
   3) 2, 4, డి 4) 2, 4, 5 టి
31. వ్యాక్సిన్‌ల పితామహుడు?
   1) లూయీపాశ్చర్ 2) రాబర్ట్ కోచ్
   3) ఎడ్వర్డ్ జెన్నర్ 4) హార్వే
32. మిషన్ రెయిన్‌బో అమలు జరిపిన సంవత్సరం?



   1) 2014
   2) 2015
   3) 2020
   4) 2017
33. కిందివాటిలో అతి పెద్ద వైరస్?
   1) టీఎంవీ 2) రెట్రో వైరస్
   3) వాక్సీనియా 4) ప్లావి వైరస్
34. ప్రాంటోసిల్‌ను దేని నివారణకు వాడతారు?
   1) మెనింజైటిస్ 2) గనేరియా
   3) సిఫిలిస్ 4) ఆంత్రాక్స్
35. జలభీతి (హైడ్రోఫోబియా) ఏ వ్యాధి లక్షణం?
   1) బర్డ్‌ఫ్లూ 2) ఎబోలా
   3) రేబిస్ 4) జికా
36. పోలియో వ్యాధికి గురయ్యే ప్రభావక అంగం?
   1) కేంద్ర నాడీ 2) చాలక నాడీ
   3) వేగస్ నాడీ 4) 2, 3
37. కిందివాటిలో మలేరియా నివారణకు ఉపయోగించనిది?
   1) క్వినైన్ 2) క్లోరోక్విన్ ఫాస్ఫేట్
   3) డారాప్రైమ్ 4) మార్ఫిన్
38. క్షయ వ్యాధి అధ్యయనం?
   1) మిర్మికాలజీ 2) థిసియాలజీ
   3) ఒఫియాలజీ 4) అగ్రస్టాలజీ
39. 'టీబీ హారేగా, దేశ్ జీతేగా' కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 2018 2) 2019
   3) 2020 4) 2024
40. బయోగ్యాస్ తయారీలో ఉపయోగించే బ్యాక్టీరియా?
   1) మిథనో కోకస్
   2) మిథనో బాసిల్లస్
   3) బాసిల్లస్ వల్గారిస్
   4) 1, 2



రచయిత: వట్టిగౌనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-1; 2-4; 3-2; 4-3; 5-4; 6-1; 7-3; 8-1; 9-4; 10-4; 11-1; 12-2; 13-1; 14-3; 15-1; 16-2; 17-2; 18-4; 19-3; 20-1; 21-3; 22-3; 23-2; 24-3; 25-1; 26-3; 27-2; 28-1; 29-2; 30-1; 31-3; 32-2; 33-3; 34-1; 35-3; 36-2; 37-4; 38-2; 39-2; 40-4.

ప్రజలను చైతన్యపరుస్తూ..
ఆశయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు అత్యంత కీలకమైనవి. ఇవి ప్రజలను చైతన్యపరుస్తూ, రాజకీయ ప్రక్రియలో భాగం చేస్తాయి. ప్రజల ఆకాంక్షలు, వారి ఆశయాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. జాతీయ ప్రయోజనాలను పెంపొందించేందుకు పనిచేస్తాయి. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యం సజీవంగా ఉండటానికి రక్త ప్రసరణలా పనిచేస్తూ, విధాన రూపకర్తలు, పౌరులకు మధ్య వారధిలా ఉంటాయి. 21వ శతాబ్దంలో అనేక జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఆధిపత్యం చెలాయిస్తూ దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

రాజకీయ పార్టీలు

ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాల్లో నాలుగు రకాల రాజకీయ పార్టీలు ఉన్నాయి. అవి:

నిరోధకవాద ప్రతిక్రియాత్మక పార్టీలు: ఈ పార్టీలు పూర్వపు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంస్థలను సమర్థిస్తూ ఉంటాయి.

సంప్రదాయకవాద పార్టీలు: ఇవి యథాతథ స్థితిని విశ్వసిస్తాయి.

ఉదారవాద పార్టీలు: ఈ పార్టీలు వర్తమాన వ్యవస్థలో సంస్కరణలు ప్రవేశపెట్టే లక్ష్యంతో పనిచేస్తాయి.

విప్లవాత్మక పార్టీలు: ఇవి ప్రస్తుత సంస్థలను కూలదోసి వినూత్న వ్యవస్థ స్థాపనే లక్ష్యంగా పనిచేస్తాయి.

■ రాజనీతి శాస్త్రవేత్తలు రాజకీయ పార్టీలను వాటి భావజాలాల ఆధారంగా వివిధ రకాలుగా వర్గీకరించారు. విప్లవాత్మక పార్టీలను వామపక్ష పార్టీలుగా, ఉదారవాద పార్టీలను మధ్యేమార్గ కేంద్రీయ పార్టీలుగా, నిరోధకవాద, మితవాద పార్టీలను సమాజ నిర్మితి - ఆచారాలను విశ్వసించే సంప్రదాయ పార్టీలుగా గుర్తించారు.

వ్యవస్థ - రకాలు

ఏకపార్టీ వ్యవస్థ: ఈ రకమైన వ్యవస్థలో ఒకేఒక రాజకీయ పార్టీ మనుగడలో ఉంటుంది. ఇతర రాజకీయ పార్టీలు పనిచేయడానికి అనుమతి ఉండదు. కానీ ఒకే పార్టీలో అసంతృప్తులు, వర్గాలు ఉండవచ్చు.

ఉదా: జర్మనీలో నాజీ పార్టీ; ఇటలీలో ఫాసిస్టు పార్టీ; చైనా, రష్యాలో కమ్యూనిస్టు పార్టీలు.

రెండు పార్టీల వ్యవస్థ: ఇలాంటి వ్యవస్థ రెండు ప్రధాన రాజకీయ పార్టీల ఆధారంగా పనిచేస్తుంది. వీటిలో ఒకటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, మరొకటి ప్రతిపక్ష పార్టీగా విధులను నిర్వర్తిస్తూ ఉంటుంది.

ఉదా: ఇంగ్లండ్‌లో లేబర్, కన్జర్వేటివ్ పార్టీలు; అమెరికాలో రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలు

బహుళ పార్టీ వ్యవస్థ: ఈ తరహా వ్యవస్థలో రెండు కంటే ఎక్కువ పార్టీలు ఉంటాయి. అయితే ఇవి అధికార పార్టీకి లేదా ప్రతిపక్ష పార్టీకి స్నేహ సంబంధంగా ఉంటాయి. ఈ విధమైన బహుళ పార్టీ వ్యవస్థ భారతదేశం, ఫ్రాన్స్, స్వీడన్ తదితర దేశాల్లో ఉంది.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

భారతదేశంలో పార్టీ వ్యవస్థ

దేశంలో బహుళ పార్టీ వ్యవస్థ అమల్లో ఉంది. ఇక్కడ అనేక జాతీయ, ప్రాంతీయ పార్టీల మనుగడ కొనసాగుతోంది. భారత పార్టీ వ్యవస్థ మూలాలు 1885లో ఒక రాజకీయ వేదికగా భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనతోనే మొదలయ్యాయి.

■ కుల, మత ప్రాతినిధ్య నియోజకవర్గాల ఏర్పాటు మతతత్వ పార్టీలు, సమూహాల ఆవిర్భావానికి దారితీసింది. ఈ క్రమంలో ముస్లింలీగ్, హిందూ మహాసభ, అకాలీదళ్ తదితర పార్టీలు ఏర్పడ్డాయి.

■ ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని స్వీకరించిన తర్వాత వయోజన ఓటింగ్ ఆధారంగా జరిగిన 1952 మొదటి సాధారణ ఎన్నికల నేపథ్యంలో నూతన వైవిధ్య పార్టీల వ్యవస్థ అవతరించింది.

■ స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్ పార్టీ ఒక సమాఖ్య రాజకీయ అధికార నిర్మితిగా రూపొందింది. జాతీయోద్యమ విజయ సారథిగా ఉన్న కాంగ్రెస్ భారత రాజకీయ వ్యవస్థలో ఒక ఆధిపత్య అధికార పార్టీగా మారింది.

■ దేశంలోని ఏ పార్టీ అయినా కేంద్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు కావాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం అన్ని పార్టీలను సమానంగా చూస్తుంది. పెద్ద, ప్రధాన పార్టీలకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను అందించడంతో పాటు ప్రత్యేక గుర్తును కేటాయిస్తుంది.

భారతదేశంలో ప్రధానంగా రెండు రకాల పార్టీలు ఉన్నాయి. అవి.. 1) జాతీయ పార్టీలు
2) రాష్ట్ర - ప్రాంతీయ పార్టీలు

జాతీయ పార్టీలు

లోక్‌సభ ఎన్నికల్లో లేదా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పోలై, చెల్లిన ఓట్లలో కనీసం ఆరు శాతం ఓట్లను సాధించి, లోక్‌సభలో కనీసం నాలుగు సీట్లు గెలుచుకున్న పార్టీ జాతీయ పార్టీగా గుర్తింపు పొందుతుంది.


● ఈ వర్గీకరణ ఆధారంగా ప్రస్తుతం దేశంలో జాతీయ గుర్తింపు పొందిన పార్టీలు ఆరు. అవి:



ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ): దీన్ని 1885లో ఏఓ హ్యూమ్ స్థాపించారు. స్వాతంత్ర్యమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. 1947 తర్వాత దేశ సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనే రాజకీయ సంస్థగా అవతరించింది.

◆ స్వాతంత్ర్యానంతరం జరిగిన 18 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరుసార్లు స్పష్టమైన మెజార్టీతో గెలుపొందింది. నాలుగుసార్లు అధికార సంకీర్ణానికి నాయకత్వం వహించింది. దేశంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న పార్టీ ఇదే.

◆ ఈ పార్టీ గుర్తు - హస్తం (మువ్వన్నెల జెండా మధ్యలో హస్తం), కూటమి - యూపీఏ




భారతీయ జనతా పార్టీ (బీజేపీ): ఈ పార్టీని 1980లో స్థాపించారు. జనతా పార్టీ 1951 అక్టోబరు 21న శ్యాంప్రసాద్ ముఖర్జీ అధ్యక్షతన స్థాపించిన భారతీయ జనతా సంఘ్‌కు ఒక నూతన, సవరించిన స్వరూపంగా దీన్ని పేర్కొనవచ్చు.

◆ 1984 సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కేవలం రెండు సీట్లు మాత్రమే సాధించిన ఈ పార్టీ 1996 నాటికి పార్లమెంట్‌లో అతిపెద్ద పార్టీగా మారింది.

◆ 1998 సాధారణ ఎన్నికల్లో అనేక ప్రాంతీయ పార్టీలతో కలిసి జాతీయ ప్రజాస్వామ్య కూటమి (నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్)కు నాయకత్వం వహిస్తూ అధికారంలోకి వచ్చింది.

◆ 2014, 2019, 2024 సాధారణ ఎన్నికల్లో వరుసగా గెలుపొంది ప్రస్తుతం అధికారంలో ఉంది.

◆ పార్టీ గుర్తు - కమలం, కూటమి - ఎన్‌డీఏ




బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ): కాన్షీరామ్ నాయకత్వంలో 1984లో ఏర్పడింది. ఇది ఉద్యోగుల సమాఖ్య, దళిత్ శోషిత్ సమాజ్ సమితి విలీనం ఫలితంగా రూపుదిద్దుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో వివిధ సందర్భాల్లో వివిధ పార్టీల మద్దతుతో అనేకసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ పార్టీకి మాయావతి నాయకురాలిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ గుర్తు - ఏనుగు.



నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ): ఈ పార్టీని 2012లో పీఏ సంగ్మా మేఘాలయలో స్థాపించారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి 2019లో జాతీయ పార్టీ హోదా సాధించిన మొట్టమొదటి పార్టీగా గుర్తింపు పొందింది.

◆ పార్టీ గుర్తు - పుస్తకం



ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ): 2012లో అరవింద్ కేజ్రీవాల్ ఈ పార్టీని స్థాపించారు. అవినీతికి వ్యతిరేకంగా జనలోక్‌పాల్ బిల్లు కోసం జరిగిన ప్రజా పోరాటం నుంచి ఈ పార్టీ ఏర్పడింది. ఈ పోరాటానికి అన్నా హజారే నాయకత్వం వహించారు. 2023లో ఈ పార్టీకి జాతీయ హోదా కల్పించారు.

◆ పార్టీ గుర్తు - చీపురు

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) (సీపీఐ-ఎం): సీపీఐ పార్టీని 1925లో నెలకొల్పారు. కార్మిక వర్గం, పేదల ప్రయోజనాలను ప్రోత్సహించే సాధనంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అంగీకరిస్తుంది. ఈ పార్టీలో వచ్చిన చీలిక వల్ల 1964లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్క్సిస్టు (సీపీఐ-ఎం)ను స్థాపించారు. ఈ పార్టీ మార్క్సిజం - లెనినిజం సిద్ధాంతాలను నమ్ముతుంది. లౌకికవాదం, ప్రజాస్వామ్యాలను బలపరుస్తూ ప్రజాస్వామ్య వాదాన్ని, మతతత్వాన్ని వ్యతిరేకిస్తుంది. పశ్చిమ్‌బంగా, కేరళ, త్రిపురలో పేదలు, ఫ్యాక్టరీ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మేధావుల్లో ఈ పార్టీ బలమైన మద్దతును కలిగి ఉంది. ◆ పార్టీ గుర్తు - సుత్తి, కొడవలి, నక్షత్రం



730 Word of the Day

Limber

Telugu meaning: వదులుగా, అనువైన

English meaning: The word limber (లింబర్) is an adjective that describes someone or something as flexible and able to move easily. As a verb, it means to make something more flexible.

Synonyms: Flexible, Agile

Antonyms: Stiff, Rigid

Usage: **1. (As an Adjective):** As a gymnast, she needs to stay limber through regular stretching exercises.

2. (As a Verb): He limbered up before the race by jogging and doing light stretches.

కరెంట్ అఫైర్స్ - వీడియో లెసన్

పోటీపరీక్షల్లో కీలకమైన కరెంట్ అఫైర్స్‌ను ఈనాడు ఈప్రతిభ ఇప్పుడు **వీడియో లెసన్** రూపంలోనూ మీకు అందిస్తోంది. వారంలో జరిగిన ముఖ్య సంఘటనలను అంశాలవారీగా మీ ముందుకు తీసుకువచ్చింది. ఇవేకాకుండా వీటి నుంచి ఎలాంటి ప్రశ్నలు అడగొచ్చు, ప్రశ్నా సరళి, వేటిని గుర్తుంచుకోవాలనే అంశాలను మీకు అందిస్తోంది.

2025, జులై 8 నుంచి 14 వరకు జరిగిన ముఖ్యమైన విషయాలకు సంబంధించిన వీడియో **'ఈనాడు ఈప్రతిభ' యూట్యూబ్ ఛానల్‌లో** అందుబాటులో ఉంది. చూసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Current Affairs



The 71st National Film Awards for the year 2023 were announced on 1 August 2025. The awards recognize outstanding achievements in categories ranging from acting and direction to music and production. Shah Rukh Khan won the 'Best Actor' For Jawan and he shared this with Vikrant Massey for '12th Fail'. Meanwhile, Rani Mukerji has won the 'Best Actress' for 'Mrs Chatterjee Vs Norway'. 'Kathal' has won the 'Best Film' in Hindi.

India launched the first set of four development projects under the "India-UN Global Capacity Building Initiative," aimed at supporting countries of the Global South in meeting Sustainable Development Goals. The projects were officially launched by the Secretary (West) in the Ministry of External Affairs, Tanmaya Lal.

The Indian Army signed a Rs.223.95 crore deal with Axiscades Aerospace and Technologies Private Limited for the procurement of 212 next-generation 50-ton Tank Transporter Trailers to speed up logistics in battle situations on 1 August 2025. These hi-tech trailers feature hydraulic and pneumatic loading ramps along with steerable and liftable axles.

For more Current Affairs: Scan QR code

స్నేహితుల దినోత్సవం

ఆగస్టు 3
చరిత్రలో ఈనాడు



స్నేహం అనేది ఒక అనిర్వచనీయ భావన.. ఇది ఎప్పటికీ శాశ్వతం. ప్రపంచంలో స్నేహితులు లేనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అయితే మన మనసుకు దగ్గర కాగలిగినవారే బెస్ట్ ఫ్రెండ్స్ అవుతారు. జీవిత భాగస్వామి, ఫ్రెండ్.. ఈ రెండు మాత్రమే మనం ఎంచుకునే బంధాలు. భార్య/ భర్త ఎంపిక విషయంలో వర్ణం, రూపం, వయసు, ఆస్తిపాస్తులు, గుణం, పెద్దల అభిప్రాయాలు లాంటివి పరిగణనలోకి తీసుకుంటారు. పెళ్లి విషయంలో ఇన్ని ఆలోచనలు సాగితే, ఫ్రెండ్‌షిప్‌లో వీటికే మాత్రం ప్రాధాన్యం ఉండదు. ఇద్దరు స్నేహితుల మధ్య ఒకే రకమైన ప్రేమ, సంరక్షణ, ప్రాధాన్యత ఉంటాయి. కొన్ని సందర్భాల్లో లైఫ్ పార్ట్‌నర్‌తో చర్చించలేని, చెప్పలేని విషయాలను కూడా బెస్టీతో పంచుకుంటాం.

ఈ కారణాలతోనే అన్ని బంధాల్లోకెల్లా స్నేహ బంధం విలువైంది. ముఖ్యంగా విభజనను తగ్గించి.. జాతి, మతం, సామాజిక భేదాలతో సంబంధం లేకుండా ప్రజలను ఏకం చేసే శక్తి స్నేహంలో ఉంది. నిష్కల్మషమైన స్నేహాన్ని గుర్తిస్తూ.. స్నేహ బంధాన్ని మరింత దృఢంగా మార్చే లక్ష్యంతో మన దేశంలో ఏటా ఆగస్టు మొదటి ఆదివారం నాడు 'స్నేహితుల దినోత్సవాన్ని' (Friendship Day) నిర్వహిస్తారు. 2025లో ఇది ఆగస్టు 3న వచ్చింది.

❖ మనందరికీ జీవితంలో వివిధ దశల్లో ఫ్రెండ్స్ ఉంటారు. వారిలో కొందరు కొంతకాలానికే మనతో పయనిస్తే.. మరికొందరు జీవితాంతం మన కష్టసుఖాల్లో తోడుగా, ఉన్నత స్థానాలకు చేరేలా ప్రోత్సహిస్తూ ఎప్పుడూ వెన్నంటి నిలుస్తారు. ఏవైనా కారణాల రీత్యా ఇలాంటివారు దూరంగా నివసిస్తున్నా.. మనసులు మాత్రం ఎప్పుడూ కలిసే ఉంటాయి.

చారిత్రక నేపథ్యం:


'ఫ్రెండ్‌షిప్ డే' అనే భావన 1950వ దశకంలో అమెరికాలో ప్రారంభమైంది. ఆ సమయంలో ఆగస్టులో మొదటి ఆదివారం నాడు దీన్ని నిర్వహించారు. తర్వాతి కాలంలో భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ ఇదే వారం 'స్నేహితుల దినోత్సవాన్ని' జరుపుకున్నాయి.

■ ఐక్యరాజ్య సమితి 2011లో జులై 30న 'ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే'గా ప్రకటించింది.. అయినా మన దేశంలో మాత్రం ఆగస్టు మొదటి ఆదివారం రోజే 'ఫ్రెండ్‌షిప్ డే' నిర్వహిస్తారు.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉపరితల రసాయనశాస్త్రం

ఉపరితలాలు లేదా అంతర్ తలాల వద్ద జరిగే దృగ్విషయాలను అధ్యయనం చేసే శాస్త్రమే 'ఉపరితల రసాయనశాస్త్రం' (Surface Chemistry). ఒక పదార్థం వేరొక ద్రవం లేదా ఘనపదార్థం అంతర్భాగాల్లోకి చొచ్చుకుపోకుండా ఉపరితలంపైనే ఉండటాన్ని 'అధిశోషణం' అంటారు. వాయువుల్లో భౌతిక, రసాయనిక అధిశోషణం జరుగుతుంది. వీటి తీవ్రతను ప్రభావితం చేసే అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలి.



వాయువుల అధిశోషణ తీవ్రతను ప్రభావితం చేసే అంశాలు

✦ అధిశోషకం ఉపరితల వైశాల్యం
✦ అధిశోషితం (వాయు) స్వభావం
✦ వాయువు పీడనం ✦ ఉష్ణోగ్రత

అధిశోషణం అనువర్తనాలు

- వాయు ముసుగు
- తేమను నియంత్రించడం
- జడవాయువుల మిశ్రమాన్ని వేరుచేయడం
- అధిక శూన్యస్థితిని ఏర్పర్చడం
- వ్యాధులను నయం చేసే ప్రక్రియ

అధిశోషణ క్రమం, ఫ్రాయిండ్లిష్ అధిశోషణ సమోష్ణరేఖ, ఫ్రాయిండ్లిష్ సమీకరణం, ద్రావణాల నుంచి అధిశోషణం - ఇమిడి ఉన్న సూత్రాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) థానే ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 37. అర్హులైన అభ్యర్థులు 2025 ఆగస్టు 13, 14 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో ఉద్యోగాలు

దిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన బిజినెస్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ 17 ఆగస్టు 2024.

సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 30. దరఖాస్తు ఫీజు రూ.300. అర్హులైన అభ్యర్థులు 2025 ఆగస్టు 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 3) చివరి తేదీ

■ బ్యాంక్ ఆఫ్ బరోడాలో 2,500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాలు. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

■ విశాఖపట్నం మెడికల్ కాలేజీలో 71 ఉద్యోగాలు. డిగ్రీ (బీఎస్సీ), డిప్లొమా, ఇంటర్, పదో తరగతి, పీజీ, ఎంఎస్/ఎండీ, పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Mathematical Operations

Directions (Qs. 1 - 4): *By interchanging the given two numbers (not digits), which of the following equations will be correct?*

1. 3 and 7 (interchange)
I. $210 + 7 \times 5 - 3 \div 3 = 244$
II. $168 \div 7 + 3 \times 6 - 10 = 47$
A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

2. 4 and 9 (interchange)
I. $180 + 9 \times 2 - 4 \div 2 = 197$
II. $108 \div 9 + 4 \times 5 - 6 = 66$
A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

3. 2 and 5 (interchange)
I. $150 + 2 \times 6 - 5 \div 5 = 179$
II. $100 \div 2 + 5 \times 3 - 4 = 65$
A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

4. 6 and 8 (interchange)
I. $200 + 6 \times 3 - 8 \div 2 = 217$
II. $144 \div 6 + 8 \times 2 - 4 = 26$
A) Only I B) Only II
C) Both I and II D) Neither I nor II

Directions (Qs. 5 - 6): *Which set of symbols can replace the asterisks (*) to make the equation correct?*

5. 6 * 4 * 2 * 8 * 10 * 8
A) ×, +, =, +, + B) +, ×, =, ×, +
C) ×, −, =, +, + D) +, +, =, ×, +

6. 7 * 5 * 3 * 6 * 2 * 10
A) +, ×, =, ×, + B) ×, +, =, +, +
C) +, +, =, ×, × D) ×, ×, =, +, ×

Directions (Qs. 7 - 8): *Which interchange of signs will make the following equation correct?*

7. $(12 - 4) + 6 \times 5 \div 2 = 50.5$
A) − and + B) + and ×
C) × and ÷ D) − and ×

8. $(6 \div 2) - 4 \times 8 + 2 = 10$
A) ÷ and − B) − and ×
C) ÷ and × D) × and +

9. If × means +, + means ÷, − means ×, and ÷ means −, then what is the value of the following expression?
$60 - 5 + 10 \times 2 \div 4 = ?$
A) 30 B) 60 C) 40 D) 28

10. If + means ×, × means −, and − means +, then what is the value of:
$15 \times 5 - 3 + 2 = ?$
A) 28 B) 30 C) 16 D) 24

11. If + means ×, × means −, and − means +, then what is the value of:
$20 + 2 \times 10 - 5 = ?$
A) 40 B) 35 C) 50 D) 55

12. If 'P' stands for '+', 'Q' stands for '×', 'R' stands for '÷' and 'S' stands for '−', then what is the value of the following expression (without using BODMAS)?
12 P 4 Q 2 R 4 S 1 = ?
A) 15 B) 10 C) 7 D) 8

Railway Exams
Reasoning

13. If 'P' means '+', 'Q' means '−', 'R' means '×', and 'S' means '÷', then what is the value of the following expression (evaluated left to right, not by BODMAS)?
120 R 5 P 40 Q 30 S 5 = ?
A) 115 B) 122 C) 105 D) 100

14. If 'X' means '+', 'Y' means '−', 'Z' means '×', and 'W' means '÷', then find the value of the following expression (evaluate strictly left to right):
500 Z 4 X 300 Y 200 W 10 = ?
A) 220 B) 240 C) 210 D) 280

15. If 'X' stands for '+', 'Y' stands for '−', 'Z' stands for '×', and 'W' stands for '÷', then what is the value of the following expression (solve left to right only)?
600 Z 2 X 200 Y 100 W 4 = ?
A) 240 B) 350 C) 325 D) 380

16. '#' means plus, '@' means minus, '&' means multiplied by, and '%' means divided by, then what is the value of the following expression?
60 @ 12 # 24 % 6 & 3
A) 56 B) 60 C) 72 D) 66

17. If '@' means plus, '#' means minus, '%' means multiplied by, and '&' means divided by, then what is the value of the following expression?
150 # 25 @ 60 & 5 % 2
A) 149 B) 130 C) 160 D) 129

18. If '^' means plus, '$' means minus, '@' means multiplied by, and '#' means divided by, then what is the value of:
250 $ 50 ^ 96 # 8 @ 3
A) 236 B) 260 C) 274 D) 280

19. If '+' means minus, '−' means multiplied by, '÷' means plus, and '×' means divided by, then what is the value of: (Solve left to right only)
$100 - 5 \div 20 \times 4 \div 2 = ?$
A) 96 B) 110
C) 102 D) 132

20. If 'P' means '+', 'Q' means '−', 'R' means '×', and 'S' means '÷', then what is the value of the following expression (evaluated left to right, not by BODMAS)?
80 R 4 P 60 Q 20 S 4 = ?
A) 90 B) 104
C) 108
D) 100

Scan the QR code for Key

These model questions were prepared by subject experts